భారతి

అక్టోబరు 1986
వెల:
4 రూపాయలు



భట్టిప్రోలు స్తూపము - డా. ఇంగువ కార్తికేయ శర్మ

సుందరం (చిన్న నవల) - శ్రీ ఘంటికోట బ్రహ్మాజీ రావు

ఆట వెలది - శ్రీ వజ్ఝల కాళిదాసు

సాహిత్య మాస పత్రిక

సంపుటం : 63 అక్టోబరు 1986 సంచిక 10

భారతి

సాహిత్య మాసపత్రిక

*

సంస్థాపకుడు

కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

*

సంపాదకుడు

శివలెంక శంభుప్రసాద్

(1938-1972)

*

విషయానుక్రమణిక

ముఖచిత్రం శ్రీమతి చిత్రావిశ్వేశ్వరన్

స్వవిషయం

భట్టిప్రోలు స్తూపాన్ని గురించి డా. ఇంగువ కార్తికేయశర్మగారు రాసిన వ్యాసం భారతిలో వెయ్యగలుగుతున్నందుకు సంతోషంగా ఉన్నది....

★ ★ ★ ★ ★ ★

చిన్న నవలల పోటీలో మొదటి బహుమతి పొందిన "సుందరం" రచయిత శ్రీ ఘండికోట బ్రహ్మాజీరావుగారి జీవితానికి సంబంధించిన వివరాలు కొన్ని ఇంతకిముందే వేశాము. శ్రీ బ్రహ్మాజీరావుగారు ఇంజనీరుగా అమెరికా సంయుక్త రాష్ట్రాలలో కొంతకాలం తరిఫీదు పొందిన సంగతి పొరపాటున అప్పుడు పేర్కొనటం జరగలేదు.....

★ ★ ★ ★ ★ ★

కైలాసవాసి జనమంచి వేంకటరామయ్యగారి పద్యాలు కొన్ని ప్రచురించే అవకాశం కలిగినందుకు కూడా సంతోషంగా ఉన్నది......

★ ★ ★ ★ ★ ★

ఆటవెలది రచయిత శ్రీ వజ్ఝల కాళిదాసుగారి పేరు పాఠకులకి సుపరిచితమయినదే......

విడి పత్రిక వెల : నాలుగు రూపాయలు

నాగేశ్వరరావు ఎస్టేట్స్ ప్రయివేట్ లిమిటెడ్ తరఫున ముద్రాపకుడు, ప్రచురణకర్త శివలెంక నాగేశ్వరరావు;
ముద్రణ : ఆంధ్రపత్రికప్రెస్, గాంధీనగరం, విజయవాడ-3, సంపాదకుడు : శివలెంక రాధాకృష్ణ.
ఫోన్లు - బిజినెస్ 61247, 61248, ఎడిటోరియల్ : 75667

డా. ఇంగువ కార్తికేయశర్మ

భట్టిప్రోలుస్తూపము: వాస్తువు, బ్రాహ్మీశాసనములు - ప్రాక్తెలుగు


గుంటూరు జిల్లా రేపల్లె తాలూకాలోని భట్టిప్రోలు గ్రామము బౌద్ధ స్తూపారామమునకు అచ్చోట లభ్యమయిన కరండ శాసనములకు శిల్ప కళా ఖండములకు, ప్రపంచఖ్యాతి బడసెను. ఈ గ్రామమందు మూడుగోట్ల— అనగా లంజదిబ్బ, చిన్నలంజ దిబ్బ, విక్రమార్కకోట దిబ్బ యను పేరు బడ్డ ఎత్తయిన పాటిమట్టి స్థలములందు పురావస్తు యవశేషములు మెండుగా కానవచ్చినవి.

మొదటగా బాస్వెల్ దొర యీ గ్రామమును 1870 సంవత్సరమున దర్శించెను. అ తర్వాత సర్‌వాల్టర్ యెలియట్ (1871) నారిస్ (1874) మరియు రాబర్ట్ సీవెల్ (1882) దర్శించిన నాటికి పెద్ద స్తూపములున్న లంజదిబ్బను లోకులు త్రవ్వివైచి శిల్ప శాసనములున్న రాళ్ళను,[1] యిటుక లను వంట కాలువగట్ల కుపయోగించుకొనిరి. శిథిలావస్థలోనున్న యిట్టి స్తూపమును అలెగ్జాండర్ రీ 1892 పరిశీలించి త్రవ్వకములు గావించెను.[2] పూర్తి స్తూపాకృతిని వెలికితీయుటయే గాక, లభించిన వస్తు - వాస్తు యవ శేషముల నాధారముతో రేఖా చిత్రముల గావించి ప్రచురించెను. పునాదుల యందు లభ్యమయిన పెద్ద రాతిపెట్టెలను, కరండములు, స్ఫటికపు భరిణలు, విలువైన సంచయ సామగ్రిని కడు జాగ్రత్తతో బయటపెట్టి, అప్పటి మద్రాసు ప్రభుత్వ భాండాగారమునకు తరలించెను. అంతటితో తృప్తిజెందక నీ మహనీయుడు భాషాకోవిదుడైన బ్యూలర్ యను పండితునిచే 1894 సంవత్సరములో శాసనము లన్నింటిని ప్రకటింప జేసెను.[3]

ఈ వ్యాసమునందు శాసనములను పునఃపరిశీలించుటయే గాక భట్టిప్రోలు మహాస్తూప వాస్తు - ఆగమరీతుల, కరండముల లభ్యమయిన వస్తువులగూర్చి నిదివరలో తెలియని కొన్ని యంశముల గూర్చి వివరింతును. ఈ ప్రయత్న మున తోడ్పడినవారు, యనుమతి నొసంగిన మద్రాసు మ్యూజియమ్ యధి కారులు శ్రీ హరినారాయణ, డైరెక్టరు, శ్రీ శ్రీనివాస దేశికన్ (క్యూరేటరు), యితర యధికారులు, మా పురావస్తుశాఖ ఫొటోగ్రాఫర్లు శ్రీ త్యాగరాజన్, ఖురేషి, చిత్రకారులు శ్రీమోహిందర్‌సింగ్, సుతోనేభోపేగార్లు యెన్నియోరీతుల నాతో సహకరించి యిచ్చట చూపబడిన ఛాయా, రేఖా చిత్రములు రూపొందించిరి. వారందరికి నా కృతజ్ఞతాపూర్వక వందనములు.

భట్టిప్రోలు స్తూపము చక్రాకార పథకము గల్గియున్నది. రేఖా చిత్రము 1. అండముయొక్క వ్యాసము 40.25 మీటర్లు, మేధితో చేర్చిన 45.14 మీ. వ్యాసమున్నది. యెత్తు షుమారు 9 నుంచి 12 మీటర్లు యుండ నగును. అలెగ్జాండర్ రీగారు చూచినప్పుడు యించుమించు 13 మీటర్లు యుండినటుల వ్రాశినారు. శిథిలమైన భాగము అండముపైని 3.27 మీటర్ల వరకు కానవచ్చుచున్నట్లు నారిన్ 1871లో తెలిపియుండెను.[4] స్వర్గీయ డా. రావిప్రోలు సుబ్రహ్మణ్యం గారు 1969 - 70 లో స్తూప పరిసరముల చుట్టును, మరల త్రవ్వకములు గావించెను. విహార భాగములకు చెందిన పునాదుల వెలికితీసిరి. ఈ విహార భాగములు క్రీస్తబ్దము 1-2వ శతాబ్దివి. ఒక నాగరాజు శిల్పముకూడా బయల్పడెను.

భట్టిప్రోలు న లభ్యమయిన అవశేషము లన్నింటిలోను బండరాయి పెట్టెలపైని శాసనములు ప్రపంచఖ్యాతి గాంచినవి. లిపి శాస్త్రపరంగాను, భాషా మత ప్రచారముల యెంతో ప్రశస్తమయినవిగా పలువురు పండితుల నాకర్షించినవి. ఈ శాసన సంపదను గూర్చి నిశితముగా నిచ్చట పరిశీలించు దును. అయిదు బండరాయి (గ్రానయిట్ బోల్డర్స్), పేటికలపైని, ఒక స్ఫటికపు పూసపైని నీ బ్రాహ్మీవ్రాతలోని శాసనములు అత్యంత ప్రాచీనము లుగా భావింపబడెను.




1. భట్టిప్రోలు స్తూపాకృతి

బండరాయి పెట్టెలు: (రేఖా చిత్రపటము 2.)

ఒక్కొక్క పెట్టె రెండు రాతిబండల సముదాయము. క్రిందరాయిలో పేటికనుంచుట కనువుగా సొరుగు కావింపబడెను. అ సొరుగుపైని గట్టిగా మూయుటకనువుగా పైని మూతరాయి యుండెను. మొత్తము మూడు పెట్టెలు నొకదానిక్రింద నొకటి స్తూప పునాదుల, మధ్యభాగమున విడివిడిగా నిక్షిప్తము గావింపబడినవి. (రేఖా చిత్రము - 2). అరు బండ రాతులలో నైదింటి లోపలి భాగముల శాసనములున్నవి. ఆరవ బండపై కేవలము మూతపెట్టుటకు గాను చెక్కబడి యుండెను గాని, అక్షరములు లేవు, అందువలన నునుపుగా కూడా పూర్తి చేయబడలేదు.

ఒక్కొక్క పెట్టె రెండు రాళ్ళ సముదాయమంటిమి గదా! వెలుపల తట్టు ముఖములు చెక్కబడలేదు. బండరాయిగానే వుంచిరి. లోముఖమున మాత్రము చక్కగా చెక్కి నునుపు గావించిరి. మూతరాయి (లిడ్‌స్టోన్) క్రిందరాయికన్నా పెద్దది. క్రింద (బేస్‌స్టోన్) మధ్యభాగమున దాతుపేటికల నుంచుటకు వీలుగా లోతైన యర కలదు. ఈ అరచుట్టూ బుడుపుగా గట్టు తీర్చబడి యున్నది. ఈ గుంటను పూర్తిగా కప్పుచూ మధ్యగా నిదే పరిమాణ మున నేర్పుగా గుంట చేయబడియున్నది. వీటిని నిక్షిప్తముగావించిన క్రమము స్తూప వాస్తు విన్యాస పద్ధతుల నవగాహన చేసుకొనుటకు విలువైన యాధార ములు తెలుపుచున్నది. ఈ విధముగా వాస్తు లక్షణములున్న ప్రాచీన స్తూప ములు మరికొన్ని యిదివరలో వెలికివచ్చినను, వాటినిగూర్చి పూర్తిగా వివరింప బడలేదు.[5] అట్టి స్తూపావశేషముల గూర్చి కూడా పేర్కొందును. ముఖ్యముగ పిప్రవా (బస్తి జిల్లా యు.ప.), లేరియానందన గర్హ (చంపారన్ జిల్లా, బీహార్

కుసి నగరము (దేవరియా జిల్లా, యు.పి.), మరియు నిటీవల పరిశోధింపబడిన పవని (భండార జిల్లా, మహారాష్ట్ర), స్తూప స్థలములు చెప్పుకోదగినవి.



2. ఛట్టిప్రోలు : స్తూపఖండిక : బండరాయి పేటికలుంచినతీరు.

ఈ స్తూపములన్నియు చక్రాకారమున్న వాస్తు మండలములు. ముందుగా నాభిస్థానమును(సెంటర్)నిశ్చయించినపిమ్మట దారుకంభమును ప్రతిష్ఠించినటుల తెలియుచున్నది. ఇట్టి దారు కంభములను యూపములుగా, ఇంద్ర కీలలుగా స్తూప ప్రతిష్ఠకు పూర్వము. ఆ చోట్ల ప్రసిద్ధిబడసి పూజనీయములైన వైదిక కంభములుగా శ్రీ జాన్‌ఇర్విన్ యను పండితుడు పేర్కొనియుండిరి.[7] ఆ పవిత్ర స్థానములందే బౌద్ధులు తమ స్తూప - చైత్య నిర్మాణముల గావించిరనియు, బౌద్ధము కేవలము కొన్ని ప్రాచీన యాచారము పాటించుచుండెనని పిరివాదన. నిశితముగా పరిశీలించినచో నీ కంభములు స్తూప పూర్వమున్నటుల నెచ్చటను యాధారములు లభింపలేదు. స్థల నిర్ణయమైనంతనే పునాది వేయుటకుగాను స్థల మధ్యభాగమున కొయ్య కంభమును ప్రతిష్ఠించుట మొదటి కర్తవ్యముగా స్తూప వాస్తు మండలమున విధిగాచేయు క్రమము. పైగా స్తూపము చక్రాకారపు కట్టడము గాన మధ్య నీ 'కీల' లేక 'నాభి' యత్యవసరము. నిర్మాణపరిధిని నిర్ణయించుట కనువైనది. (రేఖాచిత్రము2)

1. మొదటి పేటిక (గ్రానైట్ స్టోన్ రిలిక్ కంటెయినర్ - 1)




1 : ఛట్టిప్రోలు : జి. ఎస్. ఆర్. సి. క్రిందరాయి — 1

ఇది స్తూప పునాదుల కట్టడములో నడిమిబొడ్డున తూర్పు ముఖముగా 5.50 మీటర్ల లోతుగా గర్భన్యాసము చేయబడెను. దీనినుంచి స్తూప కట్టడము ప్రారంభమయ్యెను.

1. క్రిందిరాయి బేస్ స్టోన్ - 1 ఛాయాచిత్రములు 1-2. రేఖా చిత్రము - 3.

ఇది చతురస్రాకారము గల్గియున్నది. 74×68 సె.మీ. మందము 28 సె.మీ. మధ్య వృత్తాకారపు అరకలదు. ఈ యర చుట్టును ఖుడుపు అంచుకలదు. ఈ యర కొలతలు — వ్యాసముపైన 19 సె.మీ. అడుగున 12.7 సె.మీ. లోతు 14.6 సె.మీ శాసనమున్న పైభాగమును, బండ అంచు వరకు చక్కగా నునుపు చేయబడినది. ఈ యరలు మట్టితోపాటు ధాతు విశేషముంచబడెను. స్తూపాకారపు భరిణె (వ్యాసము 5.4 సె.మీ. అంతేయెత్తు), దీనిలో నొకచిన్న బైరైట్ రోలు కరండము (యెత్తు 1.9 సె.మీ.) అస్తికల ముక్కలు, మానవాకృతిలో మెరయుచున్న బంగారురేకు ప్రసన్నమైనవస్తువులు, విడిగా స్ఫటికపుపూసలు బంగారుపువ్వులు, ముత్యపుపూసలు హారముగాకూర్చి అమర్చబడినవి. శాసనమున పేర్కొన్నటుల ఈ బంగారు రేకుపైని యాకారము రాజు ఖుభిరకుని యాకృతికాబోలు, పునాదుల నిక్షిప్తముగావింపబడినది. శాసనమున రాజా ఖుభిరకో అంకియని చెప్పబడెను. ఈ విధముగ భూమి పాలకులైన ప్రభువులు, తాము కావించు కట్టడపు నిర్మాణమున ప్రతిష్ఠించుట యాచారము. స్తూపవాస్తు విన్యాసమున తమ రూపమును వాస్తు పురుషునికి నివేదించుట, హిరణ్మయ పురుషుని గర్భన్యాసము చేయుట ఆగమానుసారముగా నెరుంగవలయును.



3. ఛట్టిప్రోలు : జి. ఎస్. ఆర్. సి. 1, బి. ఎస్—1.

శాసన పాఠము (ఛాయాచిత్రము - 1; రేఖా చిత్రము 3).


అర్హదినుని గోష్ఠి ఈ మంజూషను (అనగా అస్తికలపెట్టెను), ఖుభిరక రాజు ప్రతిరూపమును, పెట్టెను (షముగ), కావించెను.

1- 2 మూతరాయి (లిడ్‌స్టోన్) - 2

(రేఖా చిత్రము 4, ఛాయాచిత్రము 2)

ఈ రాయి యించుమించు గుండ్రముగా చేయబడిన పెద్ద బండరాయి. 70×68 సె.మీ. పరిమాణము, 25.5 సె.మీ. మందములో, అంచులు వెలుపలి


భాగము చెక్కబడలేదు. లో వైపున మాత్రమే శోభాయమానమై నునుపు గావింపబడెను. శాసనము మూతపై, 30 సె.మీ. పరిధిలో మాత్రమే యున్నది. పైనుంచి క్రిందికి యెనిమిది పంక్తులలో చెక్కబడియున్నది.



4. భట్టిప్రోలు : జి. ఎస్. ఆర్. సి. 1, ఎల్. ఎస్.—2

అక్షరములు చిన్న పెద్ద కలయికగా గొలుసు కూర్పులోనున్నవి. పదముల మధ్యసరిగా చోటు యివ్వబడనందున చదువరులకు కొంత కష్టముగా నుండును. (ఛాయాచిత్రము - 2)

ఈ పెట్టెను వత్స, ఛఘనిగమములకు చెందినజేత (జయంత), రైవత, జంభ, తిష్య, అచినషభిక, ఖగ, కెషక, శ్రేష్ఠి, ఛదిక, ఖబుక, శ్రమణ ఉత్తర, శ్రమణ, శ్రమణదాస, శ్యామక, కాముక, చిత్రిక మున్నగువారు కావించిరి. అనగా వీరందరు కలసి నిక్షిప్తము గావించిరన్నమాట.


II : భట్టిప్రోలు : జి. ఎస్. ఆర్. సి. I మూతరాయి — 2

2 మధ్య శిలాపేటిక (జి.యస్.ఆర్.సి. - 2)

ఛాయాచిత్రములు - 2, 4.


ఇది 5.18 మీటర్ల లోతుగా స్తూప నడిమి పశ్చిమ ముఖముగా అంచు నానుకొని కట్టడమున నిక్షిప్తము గావింపబడెను.


III : భట్టిప్రోలు : జి. ఎస్. ఆర్. సి. II క్రిందరాయి—3

2 - 3 క్రిందిరాయి (బేస్‌స్టోన్ - 3) ఛాయాచిత్రము - 3


రేఖా చిత్రము -

చతురస్రాకారపు బండరాయి. కొలతలు 50.8×40.6 సె.మీ. మందము — 30.5 సె.మీ. మధ్యభాగమున గుండ్రటి అర, దానిపైని యం[…] చుట్టు నున్నటి బుడుపువలె గట్టుగలదు. అరకొలతలు — పర్తి అగ్రభాగము 19 సె.మీ. అడుగున 10 సె.మీ. లోతు 16 సె.మీ. శాసనము అరచుట్టు వెలువలగా నున్నది. స్తూపాకారపు చిన్న స్ఫటికలోని భరిణ (7 సె.మీ. యెత్తు 1.6 సె.మీ. పరిధి), 164 - బంగారు పుష్పములు, చుట్టుకొనిపో[…] వున్న వెండితాయత్తు రేకు యున్నవి. ఈ రేకుపైని సూదితో గ్రుచ్చిన […]రములు యీ నాటి యంత్రపురేకులు, పై కానగు సంకేతాక్షరముల […] యున్నది. ఒక విధముగా నాకృతిచేసి, పొడి యక్షరముల గ్రుచ్చి[…] వ్రాయుట యీ నాటికిని కొందరు మాంత్రికులు చేయుచున్నారు.


5. భట్టిప్రోలు : జి. ఎస్. ఆర్. సి. 2, బి. ఎస్.—3

శాసనము: (చూడుడు రేఖాచిత్రము - 5)

(ఈ కృతము) గోష్ఠి నిగమములకు చెందిన ముఖ్యులైన, రాజప్రముఖ షారీరషపుత్రుడు రాజాఖుబిరక, సింహగోష్ఠి ప్రముఖుడు, స్ఫటికపు భరిణ మరియు పాషాణ పెట్టెను గావించెను. శ్రమణుడైన ధనపుత్రుని కొడుకు ఉత్తర మరియు అతని కొడుకు.... .... (వీరి పేర్లు వ్రాసియుండిరి కాబోలు వివరముగా తెలుపలేదు. బహుశ వీరు శాసనమును చెక్కిన వారై యుండ వచ్చును).



IV : భట్టిప్రోలు : జి. ఎస్. ఆర్. సి. II మూతరాయి — 4

2 - 4 మూతరాయి (లిడ్‌స్టోన్ - 4) ఛాయాచిత్రము - 4 రేఖా చిత్రము - 6

ఈ రాయిపై శాసన భాగము అరపైని మూతగుంట మేరకు చెక్కబడి నునుపు చేయబడినది. బంద త్రికోణా కారముగ నున్నది. ఇంచుమించు 68×61 సె.మీ. గల్గి 25.4 సె.మీ. మందము యున్నది. మూత వ్యాసము 18 సె.మీ. శాసనములు మూతలు మూడుచోట్ల 1,2,3, మరియు కుడి-యెడమ అంచుల అడ్డముగా వ్రాయబడెను. ఇవిగాక పెద్ద యక్షరములతో పైన క్రిందుగా (4). (5), బండ అంచు చుట్టును కలవు. అనగా మొత్తము అయిదు చోట్ల శాసనములు చెక్కబడెను. (చూడుడు రేఖా చిత్రము - 6)



6. భట్టిప్రోలు : జి. ఎస్. ఆర్. సి. 2, ఎల్. ఎస్.—4

ఈ కృతమును గావించిన గోష్ఠి సముదాయములకు చెందిన వారిపేర్లు వరుసగా చెప్పబడెను. ఇదిగాక దాన మొసగిన వస్తువుల గావించినవారు, కార్యమును నిర్వహించిన ప్రముఖులు గ్రామ పెద్దలు హిరణ్యకారుడు బూబ, కుబయను దేర, గోపాలకుడైన కురవిడి విడిగా పేర్కొన బడియున్నారు. క్రింద శాసనమున బుద్ధ శరీర ధాతువును కూర్చికూడ ప్రస్తావన కానవచ్చు చున్నది.


3 మూడవ శిలాపేటిక (జి.యస్.ఆర్.సి - 4)

ఇది స్తూపపు బొడ్డున - 4.42 మీటర్ల యడుగున దక్షిణ ముఖముగా నిక్షిప్తము చేయబడినది. దీని పైననే యండభాగము కట్టబడెను. ఈ విధముగా ని పోటిక చివరగా గర్భస్థము చేయబడిన ధాతు యవశేషముల గల్గియున్నది. (ఛాయా చిత్రములు - 5, 8.

3 క్రిందరాయి బి.యస్ - 5 (రేఖా చిత్రము 7)

చతురస్రము 70×56 సె.మీ. మందము 33 సె.మీ. మధ్యగానున్న అరకుండ చతురస్రమే 27×20 సె.మీ, గల్గి, లోతు 12.5 సె.మీ. అడుగున గుండ్రముగా యుండుట-గమనింపదగినది. ఈ అరలు నల్లని సుద్దరాయితో గావింపబడిన స్తూపాకారపు కరండము కలదు. (11.4 సె.మీ. యెత్తు) దీని యందుంచబడిన వస్తు సముదాయము :—

(i) స్ఫటికపు భరిణ (6 సె.మీ. వ్యాసము 3.2 సె.మీ. యెత్తు), దాని




V : భట్టిప్రోలు : జి. ఎస్. ఆర్. సి. III క్రిందరాయి — 5

యందు చిన్న అస్తిక యున్నది. ఈ భరిణ చుట్టును క్రిందుగా తొమ్మిది బంగారు పుష్పములు, ఆరు బంగారు పూసలు, నాలుగు రాగిపూలు, 19 ముత్యపు పూసలు, ఒక నీలము, 8 చిన్న బంగారు పూలు వున్నవి. కరండము అట్టడుగున స్వస్తిక యాకృతిలో క్రమ పద్ధతిని జోడించియున్న యిరువది నాల్గు వెండి నాణెములు మహత్తరమైనవి. ఈ నాణెములపై (ఛాయాచిత్రము 7), నొకవైపున మాత్రమే మూడు చిహ్నములు ముద్రించబడియున్నవి. శ్రీపాదము, పద్మము, త్రిశూల చిహ్నములు, పాక్షికముగా కానవచ్చుచున్నవి. చిన్న కాసులను బోలి ఈ గుండ్రటి నాణెములు 0.95 నుంచి 1.3 సె.మీ. పరిధిగల్గి యున్నవి. బరువు 7 నుండి 14 గ్రైనులు. అనగా 0.47 మొదలు 0.93 గారిములు లున్నవి. ఇట్టి నాణెములు మౌర్యకాలపు పాదార్ధకార్ష పణములుగా ఉత్తర హిందూస్థానమున పలుచోట్ల లభించియున్నవి. ఇవిగాక

రాగిలా యెత్తుముక్కలు, వుంగరము, మంచి ముత్యములు, పగడములు. యీ కరండమున చుట్టును మట్టిలో కానవచ్చినవి. ఇవన్నియు నొకరీతి. అత్యంత శోభస్కరమైన స్ఫటికపు మణిపూస మరియొక చిత్రమైన ఆభరణము ఆరు పలకల నీపూస 6.8 సె.మీ. పొడవుగల్గి, 2.2 సె.మీ. మందము స్ఫటికము శోభాయమానముగ మెరయుచున్నది. (ఛాయాచిత్రము - 6) ప్రతిఫలకము పైని శాసనమున్నది. ఇన్ని విలువైన వస్తువులు, కరండములు క్రమపద్ధతిని మంత్రయుక్తముగ నిక్షిప్తము చేసిరి.

శాసన పాఠము : (రేఖాచిత్రము – 7)

ఈ రాతిపేటికను, బుద్ధ భగవానుని శరీరధాతువును (బుధసరీరాణి నిఖేతు) తదితర స్ఫటికపు భరిణ, ధాతు గర్భములు నుంచబడిన ఆభరణముల దానమొసగినవారు (చేయించినవారు) కురయొక్క తల్లిదండ్రులు, కుర, శివ,



7. భట్టిప్రోలు జి ఎస్. ఆర్. సి 3, బి. ఎస్—5

బనవపుత్రుడు పిగహ, కనిష్ఠ పుత్రుడు ఉత్తర మొదలగువారు. కురయను పేరు చాలామార్లు వచ్చినది.

3 - 6 మూతరాయి (ఛాయాచిత్రము - 7)

ఈ బండరాయి క్రిందరాయికన్న పెద్దది. 89×76 సె.మీ. 17 సె.మీ. మందము కల్గియున్నది. మూత భాగము చతురస్రము 28×20.3 సె.మీ. చుట్టునూ వులితో మలచి గరుకు చేయబడియున్నది కాని నునుపు గావింపబడలేదు. యక్షరము లేకుండుటవలన యీ విధముగానే వదలివేయుట జరిగినది.

పైన వివరింపబడిన బండరాతి పెట్టెలలో ముఖములపై శాసనమున్న చోట్లంతను తెల్లటి సున్నపుపూత వేశియుండుట మరొక ముఖ్యవిశేషము. అశోకుని శాసనముల పైనికూడ నిట్టి సున్నపుపూత పూయుట—అక్షరములు వివరముగా, తెలియుటకే యుండునని నా యభిప్రాయము.


ధవళస్ఫటిక పూస: (ఛాయాచిత్రము - 6)

ఈ ఆభరణము 6.8 సె.మీ. పొడవుగల్గి ఆరుపలకల మణిపూస. ఆరు పలకలమీద శాసనములున్నవి. మెరసిపోవుచున్న యీ స్ఫటిక తలముపై


VII · భట్టిప్రోలు : జి. ఎస్ ఆర్ సి - III మూతరాయి — 6

నెట్లు శాసనాక్షరములు చెక్కిరో ? అద్భుతమైన స్వర్ణకారుల చతురత యిందు కానవచ్చుచున్నది. మధ్యగా కానవచ్చు త్రోవదారము దూర్చుటకు చేసిన రంధ్రము. బహుశ 'లేసర్‌బీమ్' వంటి నూతన విజ్ఞాన సాధనము ద్వారా చేసిరికాబోలు !

శాసన పాఠము : 1. మాతుగామస నందపుతాహి



VI : భట్టిప్రోలు : స్ఫటికపు పూస

2. సువణమాహ
3. శమణ దేశానంచ
4. గిలాణకురన అయసక
5. స (గో) ఠీయ
6. గోహియా అతగదానం

ఈ అత్యగ్రి దానమును ఇచ్చినవారు (లేక గావించినవారు) నందపుర వాస్తవ్యులైన శ్రీ సంఘము, శమణ దేశపు సువర్ణ తరులగోష్ఠి, గోహియా యను గిల్హాణకుర గోష్ఠిలకు చెందినవారు. ఈ పూసపైని శాసనమున యక్షరము లన్నియు మౌర్యకాలపు బ్రాహ్మీలిపిలో వ్రాశియుండిరి. బండరాయి శాసనములలో కానవచ్చు కొన్ని యక్షరములందు కానము. ఈ యాభరణము బంగారు పూలతో సహా చేయించి యిచ్చినవారు ఉత్తరదేశీయులు, ఆ ప్రాంతమునుండయే యీ వస్తువు వచ్చినది.

పై శాసనము లన్నింటిని మొదటిసారిగా శ్రీ బ్యూలర్ పండితుడు 1894లో ప్రచురించిరి. వారి పరిశోధనా పటిమ, భాషా లిపి శాస్త్రములందు వారు రచించిన ప్రామాణిక గ్రంథములు సదా వందనీయములు. అట్లగుచో మీరెందుకు మరల నీ భట్టిప్రోలు శాసనములగూర్చి వివరించుట ? ఇటీవల మరల నీ శాసనముల నధ్యయనము చేయుచుండ కొన్ని నూతనాంశములు స్ఫురణకు వచ్చుటచేత.

ముఖ్యముగా పేర్కొనదగినది బండరాయి శాసనముల కానవచ్చు నునుపుదనము. వానిని చెక్కిన విధానము. ఇంత పెద్దరాయి బండలను పెట్టెలుగా తయారుచేసి స్తూప బొడ్డున నిక్షిప్తము గావించుట మరెక్కడను కానరాదు. ఈ రాతిపేటికలు క్రమముగా మూడు స్తరముల వాస్తు విన్యాస క్రమమున భూస్థాపితము చేసిరి (రేఖా చిత్రములు 1,2). ఈ శారీరక ధాతు స్థాపనము వాస్తు కోవిదులచే చక్రాకారపు పథకముతో మధ్యనాభి ఆకులు, వాని చుట్టును చుట్టును గోడగా కట్టబడెను. మధ్య ఖాళీలను మట్టితో నింపిరి. మొదటి రాతి పేటికలో (జి.ఎస్.ఆర్.సి 1), నుంచబడిన వస్తు సముదాయమున ముఖ్యమైనది మానవాకృతి గల్గియున్న బంగారు రేకు. బండరాయి పైనున్న శాసనములో, "రాజా ఖుబిరకో అంకి," యని పేర్కొనబడినది. అనగా నీ ప్రతీక (అంకము), హిరణ్యపురుషుడన్న మాట. వాస్తు విన్యాసమున రక్షగ నను చేయబడిన మొదటి వస్తువు. పాలకుడైన రాజు ఈ మహోన్నతమైన బౌద్ధ స్థాపనలో స్వయముగా క్రతువులను పాటించి శాస్త్రయుక్తముగా పాల్గొన్నాడు. రాజఖుబిరకుడు బౌద్ధ ధర్మమును పాలించి వృద్ధి గావించి నటుల తెలియుచున్నది. రెండవ పేటికలో (జి.యస్.ఆర్.సి. 2) దదితర వస్తు సామాగ్రితో సహా బుద్ధ భగవానుని శరీరముపై నుపయోగించిన కొన్ని వస్తు యవశేషముల నుంచినటుల తెలియుచున్నది.



... జి. ఎస్. ఆర్. సి. III వెండి నాణెముల పరుపు క్రిందరాయి — 5

చివరగా నుంచబడిన పేటిక (జి.యస్.ఆర్.సి - 3) సరిగా అందము క్రింద మధ్యభాగమున నిక్షిప్తమైనది. ఈ పేటిక క్రిందిరాయి సొరుగులో బుద్ధభగవానుని శరీరధాతువు గర్భస్తము చేయబడెను. స్వస్తికాకృతిని ఆ కాలపునాటి వెండి నాణెముల పరుపుపైనుంచిరి. స్వస్తిక శుభస్కార సంకేతము. అమూల్యమైన భగవానుని శరీరధాతువును స్ఫటికపు కరండములో భద్రము గావించిరి. ఈ రాతిపేటికను దక్షిణముఖముగా నుంచిరి. ఈ దిక్కు యమునిని సూచించును గదా !

వైదిక చితియే బౌద్ధమునగూడ చైత్యమైన దనుటకు భట్టిప్రోలు స్తూప వాస్తు విన్యాసము, శాసనములు నిదర్శనములు. అస్థి సంచయన విధానము ప్రత్యక్ష సాక్ష్యముగా పండితులు గ్రహింపవలయును.

బుద్ధభగవానుని శరీరధాతువుతోగూడ నిక్షిప్తము గావింపబడిన అతిశ్రేష్ఠ దానము (అత్యగ్రిదానం), ధవళస్ఫటికపు పూస. ఇందు పేర్కొన్న నంద పురము — వాహ్లికదేశమున అయిదు నదులుచేరు కూడలిగా నెరుగవలయును. అనగా పంచనదము — రావి, బియసా, సట్లెజ్, జీలమ్, చీనాబ్ నదుల సంగమ స్థానము. ఈ పవిత్రదేశము మౌర్యకాలమున ప్రసిద్ధబడసి యుండెను. మహాభాష్యమున పతంజలి[9] వాహిక గ్రామనందపుర యను పట్టణమును పేర్కొని యున్నాడు. ఈ పట్టణము సంఘోల్ యను పురావస్తు స్థలముగా (చండీఘర్ పట్టణమునకు 40 కి.మీ., లూడియానా జిల్లా), కొందరభిప్రాయపడిరి.

అట్లుగాకున్నా మధ్యప్రదేశములోని రైసను జిల్లాలోని నందూరుగా భావింపనగును. బార్హుత - సాంచి శాసనములందు కూడ యీ నంది నగరము ప్రస్తావన కలదు. ఈ పట్టణము నంద - మౌర్య చక్రవర్తుల కాలమున సుక్షేత్రముగా నుండి యున్నటుల తోచుచున్నది. ఇచ్చట శ్రీ చంద్రభాను త్రివేది[10] త్రవ్వకములు కొనసాగించి పెక్కు నాణెములు - పట్టెడముల వెలుగుకు తెచ్చిరి. కాని పోతుకూచి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు[11] నందపురము చందవోలు గ్రామమనియు, భట్టిప్రోలు చేరువగానున్న యీ గ్రామమునకు బహుశ బుద్ధుడు స్వయంగా వచ్చియుండనగుననియు, నిర్వాణానంతరము భట్టిప్రోలున భగవానుని శారీరక స్తూప నిర్మాణము గావించుటకిదియే ముఖ్య కారణమని పేర్కొనియుండిరి. ఈ గ్రామ భిక్షుణిలు స్ఫటికపు పూస దాన మొనంగుట యుచితముగా భావించిరి. చేరువగానున్న మరొక గ్రామము బుద్ధపుర (బుద్ధుని లేక బుద్ధం). బుద్ధుని ఆగమమును సూచించునట్టిదిగా శ్రీ శాస్త్రిగారు భావించిరి. ఈ సమస్య లెట్లున్నను భట్టిప్రోలు శాసనములు స్తూపారామము మౌర్య కాలకృత్యములుగా నిర్ణయించి చెప్పవీలగునట్టి కొన్ని ముఖ్యాంశములు నిచ్చోట వివరింతును.

శాసన పేటికలు : కాలనిర్ణయము

ఈ బండరాయి శాసనములపైని లిపి శైలి యటుండనిచ్చి ముఖ్యముగా గమనింపదగినది వీనిలోపలి ముఖముపై కానవచ్చు శోభాయమానమైన నునుపు దనము. అక్షరములు చెక్కినంతనే శాసనమున్న మేరకు బండ ముఖమును చక్కగా రుద్ది నునుపు గావించిరి. కొన్నిచోట్ల అద్దమునుబోలి ప్రతిబింబము కానవచ్చును. శాసనములేని మూతరాయి (ఎల్.ఎస్. 6) పై నిట్టి నునుపు దనములేదు. కాని చక్కగా ఉలితో చెక్కియున్నది.

అశోకుని కాలపు బండరాయి శాసనములందు, ధర్మస్తంభములపై యున్న శిల్పముల నిట్టి శోభస్కరమైన మెరుగుయున్నది. దక్షిణ దేశమున లభ్యమయిన అశోకుని చిన్నరాయి శాసనములపై నిట్టి శోభాయమానమైన నునుపుదనము కానవచ్చుచున్నది.[12] ఇటీవల లభించిన అమరావతి ధర్మ స్తంభ శాసన భాగముపైకూడ[13] నిట్టి నునుపుగలదు. ఈ స్తంభ శాసనములు బండరాయి శాసనములన్నియు అరు నాయల నున్నవి. ఈ విధముగా నునుపు

చేయుటవలన, వాననీరు చేరి నాచుపట్టుట, శీతోష్ణ వైపరిత్యములకు రాయి పెట్లి పగులుట మున్నగునట్టి ప్రకృతి వైపరీత్యములన్నింటిని తట్టుకొని కొన్నివేల యేండ్లు నిశ్చలముగా నిలచినవి.

పైగా కర్నూలు — రాజులమందగిరి, జొన్నగిరి చిన్నరాతి శాసనముల భట్టిప్రోలు పేటికలపైని సున్నము పూసియుండుట గమనార్హం. ఈ నలుపు రాళ్ళపై శాసనములు కొంతమేరకు దూరముగానున్నను, చదువరులకు స్పష్టముగా కానవచ్చు నుద్దేశ్యముతో బండలపైని తెల్లసున్నపు పూతనొసగుట యాచారముగా తోచుచున్నది. కర్ణాటకములో నితరచోట్లను (బళ్ళారి, చిత్రదుర్గ) నిట్టి తెల్లని సున్నపు పూత కానవచ్చుచున్నది.

కాని భట్టిప్రోలు పేటిక బండలు స్తూపాంతర్గతములు శోభస్కరమైన నునుపు అవసరములేదు. వెలికి కానరావు గాన తెల్లని సున్నపుపూతకూడ నవసరములేదు. అయినను యీ నునుపు, తెల్లని పూతతో నీ బండరాయి శాసనములు చేయబడెను. అనగా నీ పేటికలను వానిపై యక్షరముల చెక్కినవారు నిశ్చయముగ యశోకుని కాలపు శిల్పులు. మౌర్యసాంప్రదాయముల పాటించిరి. ఇంతయేల బండరాయిపై శాసనములు గావించుట శాసన భాగముల శిల్పములపైని శోభాయమానమైన మెరుపు గావించుట కేవలము అశోకుని కాలమునకే పాటింపబడినది. మరే రాజ వంశీయులు యీ విధముగా చేయలేదు.[14] రాజ ఖుబిరక మౌర్యకాలమున నీ ప్రాంతమును పాలించుచుండే మౌర్య శిల్పుల పనితనము నెరింగినందున, తాను తలపెట్టిన ఈ మహోన్నత కృతమున అట్టి శిల్పుల - రచయితలను పిలిపించి నీ శిలాశాసనము గావించి యుండెనని తెలియుచున్నది.

అమరావతి మహాస్తూప పరిసరముల త్రవ్వకము లందునగూడ, వేదిక స్తంభములపై నిట్టి శోభాయమైన నునుపు అక్షరములపైని గానవచ్చినది. ఈ మౌర్యకాలపు వేదిక ఖంభములు, గ్రానైటు రాతివి. ఇవిగాక ఒక యక్ష ప్రతిమపైనిగూడ నిట్టి నునుపుదనము కానవచ్చినది.[15] ఈ వేదిక ఖంభములు యక్షశిల్పము మౌర్యకాలమునకు చెందిన తూర్పు - పడమర ద్వారా - తోరణముల భాగములుగా చేరువగా నుంచబడెను.

అశోక చక్రవర్తి యమరావతి స్తూపమువద్ద ధర్మస్తంభమును ప్రతిష్ఠించెను గదా ! కాన తీరత్రమున, ముఖ్యముగా భట్టిప్రోలు - అమరావతి నగరము మౌర్యకాలమున బౌద్ధముండుట వలన, మగధ సామ్రాజ్యముతో సంబంధముండెడిది.

శ్రీ శంకరనారాయణ[16] గారిటీవల నొక వ్యాసమున భట్టిప్రోలు శాసనములు అశోకుని పూర్వము నాటివిగాను, రాజా ఖుబిరకుడు స్వతంత్ర రాజుగను, బుద్ధుని జీవితకాలమున నిట్టి స్వతంత్ర రాజ్యములు, గణములు, మగధ చుట్టుప్రక్కల బహుళ ప్రచారములో నుండినట్లును, అదేరీతిలో దక్షిణాపథమునగూడ చిన్నరాజ్యములు స్వతంత్ర రాజుల పరిపాలనలో నుండి యున్నవని తెలిపియున్నారు. అశోకుని కాలమునాటికి, ఈ స్వతంత్ర రాజ్యములన్నింటిని తన పరిధిలోనికి తీసుకొని వీరినే రాజుకలగా నియమించి తన సామ్రాజ్యమున కలుపుకొని పరిపాలించెను. అశోకుడు తన నాల్గవ స్తంభ శాసనములందు ఈ రాజులగూర్చి, వారి చిన్న రాజ్యముల పాలనారీతుల తెలిపియున్నాడు. శ్రీ శంకరనారాయణ చెప్పిన ప్రకారము భట్టిప్రోలు రాజు ఖుబిరకుడు అశోకుని పూర్వమున ఈ తీరమును పాలించిన స్వతంత్ర ప్రతిపత్తి గల రాజుగా నెరుగవలసియున్నది.

అక్షరశైలి: శాసనముల కాలము.

భట్టిప్రోలు స్తూపమున తప్ప, యిట్టి బండరాయి పేటికలు మరెక్కడను కానరాలేదు. ఈ పెట్టెలపైని శాసనములు మౌర్యకాలపు లిపియైన బ్రాహ్మిలో చెక్కియున్నను, అక్షరశైలిలో కొన్ని ప్రత్యేకతలు గల్గియున్నందున శాస్త్రకారులు పలువిధముల వీనిపై చర్చించి, కాలనిర్ణయము చేసిరి.

మొట్టమొదట బ్యూలర్‌గారు భట్టిప్రోలు శాసనములన్నింటిని క్రీ పూర్వము 3వ శతాబ్ది, అంతకన్న ముందువిగాను పేర్కొని యుండె శిలాపేటికలపైని వ్రాత యందలి యక్షరముల పరిశీలించి, గణితముల దక్షిణదేశపు ద్రావిడభాషోచ్చారణ కనువుగా బ్రాహ్మిలిపిని కొన్ని మార్పు గావించిరనియు, యిట్టి మార్పు కూర్పులు మరెక్కడను గాననందున ద భాషకు యిట్టి దక్షిణ బ్రాహ్మి వచ్చెనని సిద్ధాంతరీకరించిరి.


ఆ తర్వాత లిపి శాస్త్రపరిశోధకులైన డా. దినేశచంద్ర సర్కారు, డా. అహమ్మద్ హసన్‌దాని,[18] డా. ఉపాసిక[19] మరాముద్ర గోయల్ ప్రభృతులు యీ భట్టిప్రోలు శిలాపేటికలను క్రీ.పూ. రెండవ లేక మొ శతాబ్ది ప్రారంభమున గావింపబడినట్లు ప్రాచీన ద్రావిడ లేక దమిళ శాసనలకు చేరువగా నున్నవని పేర్కొనిరి. వీరి కాలనిర్ణయము ఆధార రహిత దక్షిణదేశమందు లిపి - శిల్ప శాస్త్రములు వుత్తర భారతములోని ఒక శ తర్వాత వచ్చినవనే వాదనలోనుంచి అవిర్భవించినవే కాని నిశిత పరిశో సశాస్త్రీయ దృక్పథముతో చేసిన ప్రతిపాదనలుకావు, ఆంధ్రమున శా ములు - శిల్ప కళలు అశోకుని కాలమునాటికే సుస్థిరమై తమదైన ఒక ప్రత్యే శైలి నేర్పరుచుకుని ఉత్తరదేశమునకు కూడ వ్యాప్తిజెందెను. భట్టిప్రోలు- అమరావతి మున్నగు మహత్త బౌద్ధక్షేత్రములు, ఉత్తరదేశములోని రాజగృ పాటలీపుత్రము, మగధ, శ్రావస్తి కౌశాంబి, విదిశ క్షేత్రములతో సరిస నముగ పైకి వచ్చి బౌద్ధ సంఘములకు, స్తూపారామములకు ఖ్యాతిబడసెను

ఇటీవల శ్రీ కె. వి రమేష్[21] భట్టిప్రోలు శాసనములు అశోకచక్రవ పూర్వము నాటివని, దక్షిణదేశమున భాషాపరంగా లిపిలో కొన్ని ప్రత్యేకత అనాటికే వచ్చియుండెనని తెలిపిరి.

అక్షరముల కొన్ని ప్రత్యేకతలున్నవి. ఈ ప్రత్యేకతలు బండరా శాసనములపై మాత్రమే కానవచ్చును. భట్టిప్రోలులోని స్ఫటికపు పూస కేవలము అశోకుని కాలపు లిపియే (ఛాయాచిత్రము— 6), ఈ చిన్న వును దానము చేసినవారు పంజాబు ప్రాంతమున నున్న నందపురవాసు బుద్ధ భగవానుని శరీర ధాతువు ఉత్తరదేశము నుండి తీసుకొనివచ్చిన కాని పెద్ద రాతి బండలు, భట్టిప్రోలు చేరువగా నున్న కొండలో లభ్య చున్నట్టివి. స్తూప నిర్మాణము గావించునప్పుడు ఈ బండలను పెటికలుగా చేసిరి. స్తూప పునాదులందీ విధముగ గుండ్రటి రాళ్ళనువేయ ఈ కాలమున గలదు. ఇటీవల వడ్డమాను స్తూప పునాదిని ,కూడ పునాది బయటకువచ్చెను. ఈ స్తూపారామము కూడ క్రీ. పూ. 3వ శతా చెందినదే. ఈ బండరాతిపై శాసనములు చెక్కినవారు ఉత్తరదేశీయ యుందురు. మౌర్యకాలమున శిల్పులీవిధముగా గాంధార ప్రాంతము ను కర్నూలు— బళ్ళారి— చిత్రదుర్గ ప్రాంతములకు వచ్చి శాసనమ గావించు చుండిరనుటకు ఆధారములున్నవి. అశోక శాసనములందు మ ముగా బ్రహ్మగిరి, సిద్ధపుర, జటింగ రామేశ్వర, యనుచోట్ల లిపికా "చపడ" లేక "పడ"ను గూర్చి తెలిశియున్నది. బహుశ భట్టిప్రోలు శాసన గావించినఉత్కీర్ణుడు ఈ చపడ కాబోలు.[22] అందువలననే కొన్నియక్షర తలక్రిందులుగా (మ),అర్ధముగా (ద,ధ,హ,ఎ) గుణింతముల నిచ్చ వచ్చినట్లు పంక్తులలో పెద్ద - చిన్న యక్షరముల గలగలిపి వ్రా మున్నగు పొరబాట్లను చేసెను. ఇట్టి పొరబాట్లు సర్వ సాధారణవ క్రీ.పూ.పెద్దశాసనములందు కానవచ్చు చున్నాము. భట్టిప్రోలు శాసనముల కొన్ని ప్రత్యేకతలున్నవి. ఇవి పొరపాట్లుగాదు, యక్షర వ్రాత శై ఉచ్చారణల తీరు కనుగుణముగా చేసిన లిపి మార్పు కూర్పులు. భట్టిప్ర ప్రాంతముల క్రీస్తు పూర్వము నాటి భాషోచ్చారణల కనువుగా వ్రాయ లిపి శైలిగా నెఱుంగ వలయును. పరిశోధకుల కిట్టి నూతన విషయ లెంతేని జుగుప్స గల్గించునట్టివి.

ప్రాక్తెలుగు లేఖనాశైలి: భట్టిప్రోలు శాసనములు


బండరాయి పేటికలపై వ్రాసిన బ్రాహ్మీలిపి మౌర్యకాలము నాటిది. ఈ వ్రాతలో తలకట్టులు కానరావు. కాని ప్రతీ హల్లుపై నొక అడ్డుగీత ానవచ్చుచున్నది. ఈ గీత అక్షరము కుడి ప్రక్కగా తలపై చేర్చబడినది. ఈ అడ్డగీత హ్రస్వాక్షరముల సంకేతము.



ఇట్టి సంకేతములను మౌర్య లిపిలో దీర్ఘములుగా నెఱుగుదుము. ంనగా, కా, నా, రా, భట్టిప్రోలు వ్రాతలో దీర్ఘముల తెలుపుటకు ఈ ఙ్డు గీతకు చివర మరొక నిలువు గీత చేర్చబడెను. కా = [ ], రా = [ ], నా

ఈనాడు మనము తెలుగున దీర్ఘముల నిట్లే వ్రాయుచున్నాము.

ిదాహృత చిత్రమును చూడుడు:-




అనుస్వార మిచ్చిన యక్షరముల నడ్డు గీత కానరాదు. అట్లే ఎ, ఒ లకు ేరుగా నున్న సంకేతము గానరాదు. అనగా సందర్భమును బట్టి పలుకు ుడిలోనే మార్పుచేయుచూ పుచ్చరించుట యాచారమైనది కాబోలు. అక్షరము పై నిడిన చుక్క అను స్వారమును తెల్పును. మధ్యగా రెండు చుక్కలు ేక యను స్వారములున్న విసర్గయగుచున్నది.

హ్రస్వాచ్చు చిహ్నమైన యీ అడ్డుగీతయే కాలాంతరముగా తలకట్టు ుగా తెలుగు—కన్నడ లిపిని తీర్చినట్లు తెలియుచున్నది.

ఇక సంయుక్తాక్షరముల వ్రాయుశైలి నశోకుని కాలమందే వాడుకలోనికి చ్చినది. భట్టిప్రోలు శాసనములందు సంయుక్తాక్షరముల గానము. "క్రీస్త ము 3— 4 శతాబ్దికల్ల ఇక్ష్వాకు శాసనములందు నీ సంయుక్తాక్షరములు క్కగా వాడుకలో నున్నవి. అప్పటికి శాసనములందు సంస్కృతము ాధ భాషగా వాడబడెను. తమిళమున సంయుక్తాక్షరములు లేవు. తెలుగు కు మరియు కన్నడమున నీ వ్రాతశైలికి మాతృక భట్టిప్రోలు శాసనములందు ానవచ్చు[24] చున్నది. ఈ సంయుక్తాక్షరములు వ్రాయుటలో పైగీత ని హల్లును పుచ్చారణ కనుగుణముగా, ఒక యక్షరము క్రింద మరొకటి ాయుట తెలుగు కన్నడముల ప్రత్యేకముగా నున్నది. తమిళమునలేదు.

ఇట్లుండ కొందరు భాషా కోవిలు భట్టిప్రోలు బండరాయి శాసనపు లిపిని తమిళ బ్రహ్మీశాసనముతో పోల్చి, ద్రావిడీ లేక దక్షిణ బ్రాహ్మీయని పేర్లొసగిరి. భట్టిప్రోలు వ్రాతలోని యక్షరములు :—

ఖ, గ, ఘ, చ, ఠ, ధ, థ, శ, ష, స, హ తమిళమున కానరావు. తెలుగు — కన్నడముల యనాదిగా వాడుకలోనున్నవి. తమిళమున హ్రస్వ సంకేతముగా "ప్రళి" లేక చుక్క పెట్టుట ప్రాచీనముగా నున్న పద్ధతి. ఈ చుక్క అక్షరముపైని పెట్టుదురు, ఇది మిగత భాషలందు అనుస్వారమగు చున్నది. తమిళమున అనుస్వారము విసర్గలు లేనేలేవు. అట్లే సంయుక్తాక్షరములు[25] గానరావు. తమిళమున ప్రాచీన కాలమునుండి కానవచ్చు ప్రత్యేక వర్ణములు నాల్గు:—



బ్రాహ్మీమూల యక్షరముల నుంచి వచ్చినవే. ఇందున ఱ,ళలు తెలుగున కూడ నున్నవి. తమిళనాడు ప్రాచీన గుహల శాసనములలో ఆ భాషోచ్చారణ కనువుగా బ్రాహ్మీలిపి వ్రాతలో నెట్లుమార్పు-కూర్పులు చేసిరో తెలుగునకూడ నట్లేచేసిరని భట్టిప్రోలు వ్రాతవలన తెలియుచున్నది.

దీనినిబట్టి ముఖ్యముగా గమనింప వలసినదేమన్న క్రీ. పూ. 3వ శతాబ్ది నాటికి బ్రాహ్మీవ్రాతలో, తమిళమును వ్రాయుటకు ప్రత్యేక సంకేతములు కొన్ని యక్షరముల మార్పులు చేయబడెను. అట్లే తెలుగు, కన్నడ భాషా ప్రాంతముల, భాషోచ్చారణల కనువుగా బ్రాహ్మీలిపిని ప్రత్యేకతలు వచ్చినవి. అంతేకాని, భట్టిప్రోలున తమిళము భాషగా నుండెనని యోచించుట అసందర్భమైన ప్రసంగము. అనవసరముగా తమిళము, ద్రావిడ ప్రాంతమునుండి పైకెగబ్రాకి యుండెననియు- దేశభాషలందు అత్యంత ప్రాచీనమని వాదించు తమిళ భక్తుల యూహగా నెఱుగ[26] వలెను. ఈ వాదనలు యాధార రహితములు, అశాస్త్రీయములు.

భట్టిప్రోలు వ్రాతశైలి ఒక్క బండరాయి పేటికలపైననే యెట్లు కాన వచ్చుచున్నది.[27] మరింకెన్నియో బౌద్ధ స్తూపములు, బ్రాహ్మీశాసనములు లభ్యమయినవి కదా! ఈ ప్రశ్నలకు సరియైన, సంపూర్ణ సమాధానము కావలెనన్న ఆంధ్రప్రాంతముల లభ్యమైన బ్రాహ్మీశాసనములన్నింటిని పరీక్షించవలసిన యవసరమున్నది. కడు జాగ్రత్తగా శోధించి, క్రమలో అన్ని శాసనముల చూచినగాని బ్రాహ్మీలిపి ఆంధ్రప్రాంతమున యెట్టి పరిణామముల- ప్రాంతీయతలను బొంది యుండెనో నిశితముగా చెప్పవీలుగాదు. ఈ వ్యాసమున కేవలము భట్టిప్రోలు బండరాతి శాసనముల నుండియే వివరించడమైనది.

తెలుగు విజ్ఞాన పీఠము యిట్టి పరిశోధనను చేపట్టవలెను.

ప్రాచీనముగా శాసనముల గావించు పద్ధతులు మూడు ప్రకరణము లున్నవి. 1) రచితమ్ 2) లిఖితమ్ 3) ఉత్కీర్ణమ్. మొదటివాడు రచయిత. ఇతడు ఆస్థానమందున్న కవి లేక ప్రత్యేకముగా వినియోగింపబడిన భాషా పండితుడు మాత్రమే. రెండవవాడు వ్రాత యందు నేర్పరి. లిపుల నెరింగినవాడు. ఘంటము లేక బలపము లేక రంగుతోనో చక్కగా నక్షరముల వ్రాయునట్టి వాడు. అట్లు వ్రాసినపాఠమును ఉత్కీర్ణుడు అనగా శిల్పి రాతిపై చెక్కెడివాడు. లిఖితుడు, ఉత్కీర్ణుడు చదువరి కాకపోవచ్చును, భట్టిప్రోలు శాసనముల రచయిత, దానిని రాతిపై సుద్దతోనో, సిరాతోనో వ్రాసిన లిపి కారుడు ఆ ప్రాంతమువాడు. కాని ఉత్కీర్ణుడు బహుశ ఉత్తర దేశము నుండి వచ్చిన శిల్పి కారుల గోష్ఠిలోనివాడు. రచయిత నిస్సంశయముగా తెలుగువాడు కాన తన మాతృభాషోచ్చారణ కలవడి అన్ని హల్లులపైని అచ్చు సంకేతముల గూర్చి వ్రాయించెను. తెలుగు అజంత

భాష గదా! గుణింత వద్ధతుల నీ అజంత భాష కనువుగా ప్రతి హల్లు సంది బడియున్న అచ్చును బ్రాహ్మీ వ్రాతలు వ్రాయించెను. అనగా మౌర్య బ్రాహ్మీలిపి అప్పటి తెలుగు భాషను గ్రంథస్థము చేయుటకుపయోగింప బడెనన్నమాట. క్రీస్తబ్దము 6—7 శతాబ్దిలో విడిగా పేర్కొన బడుచున్న తెలుగు—కన్నడ లిపికి మాతృక, భారతీయభాషలన్నింటికి తల్లి, ఈ బ్రాహ్మీ యేగదా! తమిళమునకు కూడ బ్రాహ్మీలిపి మాతృకయేగదా! క్రీస్తు పూర్వమున ఆంధ్రమునం పెద్దశాసనములులేవు. అందువలన నిట్టి శైలిశాసనముల మరెక్కడ నింతవరకు విడిగా కానరాలేదు. ఒక విధముగా నిట్టి దృక్పథముతో నిశితముగా పరిశీలింపలేదు కూడ. కాని క్రీస్తబ్దము నుండి తెలుగుపేర్లు శాసనములోను, సాతవాహన నాణెములపైని విరివిగా కానవచ్చు చున్నవిగదా!

ఆంధ్రమున యశోకుని శాసనములు రాజాస్థానమున రచించి లిఖింప బడెను. బండలపై చెక్కుటకుగా ఆస్థాన శిల్పుల బంపిరి. భట్టిప్రోలు బండశాసనము, పేటికలను, అందుంచబడిన వస్తువుల గావించిన వాడు ముఖ్యముగా నీ ప్రాంతమునేలిన ఖుబిరకయను పేరుగల రాజు. ఆ కాలపు యధికార భాష, లిపి యైన ప్రాకృత, బ్రాహ్మీలలోనే శాసనమును గావించెను. కాని రచయిత— లిపి కారుడు తెలుగు ప్రాంతమువారు. కాననే, తెలుగు లేఖనాశైలి అనుకోకుండగానే దొరలినది. అప్పట్లో తెలుగు అధికార భాష కానందున శాసనములు కానరాలేదు. టి. బరో గారు 28 చెప్పినటుల క్రీ. పూ. 5 లేక 6 వ శతాబ్ది నాటికే మూల ద్రావిడము నుండి తమిళ—తెలుగు భాషలువేరై భాషోచ్చారణలో నిర్దిష్టమైన శైలీ— ప్రాంతీయ తలను బొందినవి. ఆ తర్వాత బ్రాహ్మీ లిపిలో గూడ తెలుగుభాషోచ్చారణ సౌలభ్యతల కోసము లిపినందు కొన్ని మార్పు కూర్పులు గావింపబడెను. అశోకుని ధర్మ శాసనములందు పేర్కొన్న ఆంధ్రపుళింద29 మున్నగు నామములు కేవలము యొక ప్రాంతీయ వాసుల నుద్దేశించినవి కావు. వారి భాషాజాతుల సూచించు నట్టి పదములు. డా॥ బి. సి. లా గారు "అంధ కాట్ట కథ" యను ప్రాచీన బౌద్ధ గ్రంథమును దక్కను నందలి భాషలోనే వ్రాసి యుండిరని చెప్పియున్నారు. ఇది యాంధ్రభాషయే.

క్రీ. పూ॥ రెండవ శతాబ్దికి తమిళము బౌద్ధ— జైన గుహలందలి శాసనముల కానవచ్చు చున్నది. ఈ ప్రాంతములు ఉత్తరదేశమునకు చాలదూరముగా నున్నవి. ఆంధ్రమట్లుగాదు. బౌద్ధ—జైనమత సుస్థావర ములకు చేరువగా నుండెను. ప్రాకృత సంస్కృతములు ముందుగా ఆంధ్రమును చేరినవి. ఆంధ్రము నాకట్టు కొన్నవి. తెలుగు పామరుల భాషగా, ముఖస్థ విద్యగా మాత్రమే మని యుండెను. తరువాత కాలమున గూడ కావ్యభాషగా సంస్కృతము వచ్చి వ్యాకరణాదులతో నెలకొన్నది. తెలుగుపైకి వచ్చుటకు, శాసనభాష యగుటకు అస్కారము లేకుండెను. అట్లని భాషలేదనుట సమంజసము కాదు. కాని కొందరు పండితులు నీ ప్రాకృత— సంస్కృత వ్రభావముల మునిగిపోయి తెలుగు భాషను ప్రాకృత జన్యమని లేక సంస్కృత జన్యమనో వాదనములను రేకెత్తించిరి.30

ఆంగ్లేయుల పాలనమున మూడు శతాబ్దులలో ఇంగ్లీషు భాషా సాంప్రదాయముల మునిగి తేలి తల్లిదండ్రులకు తెలుగున లేఖ వ్రాయుటలో నిరుకుపడుచున్న మనము, రెండు వేల యేండ్లపైగా ప్రాకృతము ఆ తరువాత సంస్కృత భాషా శబ్దముల గాంభీర్యముతో తేట తెనుగు కృంగిపోయినది. ప్రాచీన శాసనములందు యెక్కడో అరుదుగా కాన వచ్చుచున్నది. ఈ రవ్వంత తెలుగుకోసము మనమెంతయేని కృషిచేయవలసియున్నది. లిపి శైలివరంగానైన నేమి, చిన్నపదములు, పేర్లుగా కానవచ్చినను సరే, ప్రాచీన తెలుగునకై వేటకొనసాగించవలసినదే.

క్రీస్తు పూర్వము మూడవ శతాబ్ది నాటికే ప్రాక్తెలుగు లేఖనాశైలి స్థిరపడెనని చెప్పుటకు భట్టిప్రోలు శాసనములు ముఖ్యమైన ఆధారముగా కనబడుచున్నవి.

అధోజ్ఞాపికలు

1. ఇండియన్ అంటిక్వేరి : వాల్ 3 (ఏప్రిల్ 1874). పు. 124. ఆర్. సివెల్ జి. ఒ. నెం. 1620 తే. 1-11-1878, పు 33 - 34. అయనే : టోపోగ్రాఫికల్ లిస్ట్ అఫ్ అంటిక్వేరియన్ రిమెయిన్స్ ఇన్ మెడ్రాస్ ప్రెసిడెన్సీ, 1882, వాల్ 1. పు. 77.
2. అలెక్సాండర్ రీ. సౌత్ ఇండియన్ బుద్ధిస్ట్ ఆంటిక్విటీస్, ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, న్యూ ఇంపీరియల్ సీరీస్, వాల్ 15 (మదరాసు — 1894).
3. ఆర్. జి. బుహ్లర్. "ది భట్టిప్రోలు ఇన్‌స్క్రిప్షన్స్" ఎపిగ్రాఫియా ఇండిక, వాల్—3, ఇంట్రడక్టరీ పు. 11, పు. 323—329.
4. ఇండియన్ ఆర్కియాలజీ, 1969—70, ఎ రివ్యూ, పు 1.
5. అలెక్సాండర్‌రీ. పైన ఉదహరించబడినది. (1894). అధ్యాయము-4 డా! దేవలమిత్ర యీ గొట్టము మాదిరి యున్న స్థూపనడిమి బొద్దుకు "ప్రాబబ్లీ ఇంటెండెడ్ ఫార్ మార్కింగ్ ది సెంటర్ ఆఫ్ ది డోమ్ ఇన్ ఆర్డర్ టు ఫెసిలిటేట్ ది లేయింగ్ ఆఫ్ బ్రిక్ కోర్సెస్ ఇన్ సర్క్యులర్ రింగ్" అని తెలిపిరి.
6. కె. ఎమ్. శ్రీవాస్తవ, "డిస్కవరీ ఆఫ్ కపిలవస్తు" (న్యూ ఢిల్లీ, 1986), అధ్యాయము — 5, బొమ్మ 5, లౌరియ నందన్ గర్, ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఆన్యువల్ రిపోర్ట్, 1906-7, (కలకత్తా 1909), పు. 123, ఇంకా కసియా, ఎ. ఎస్. ఐ. ఎ. ఆర్. 1910—11, పు. 64—65.
7. జాన్ ఇర్విన్ "ది స్తూపా అండ్ ది కాస్మిక్ యాక్సిస్ (యూపయష్టి)' ఆచార్యవందనా, డి. ఆర్. భండార్కర్ బర్త్ సెంటినరీ వాల్యూమ్, (కలకత్తా 1982). పు 249— 264. అయనే, "యాక్సియల్ సింబాలిసమ్ ఆఫ్ ది ఎర్లీస్తూపా ఎన్ ఎక్సెజెసిస్" ది స్తూపా, ఇట్స్ రిలిజియస్, హిస్టారికల్ ఎండ్ ఆర్కియలాజికల్ ఇంపార్టెన్స్ (హెయిడెల్ బర్గ్, 1980), పు 20—21, అయనే "ది స్తూపా ఎండ్ ది కాస్మిక్ యాక్సిస్ — ది ఆర్కియలాజికల్ ఎవిడెన్స్" సౌత్ ఏషియన్ ఆర్కియాలజీ, 1977 (నేపల్స్, 1979), పు. 810-819, 836—839, బొమ్మలు 5, 7, 11. ఇర్విన్ యీ వ్యాసమున గుప్త.పునాదులని గురించి చక్కగా చర్చించెను. ముఖ్యముగా మహారాష్ట్రలోని పవని, ఉత్తరప్రదేశ్‌లోని కుశి నగరము లౌరియా నందన గర్‌ను గూర్చి చిత్రిత వ్యాసములున్నవి.

8. ఎ) జ్యొసెప్పె తుచ్చి "ఇల్ టెంపో బ్రామ్యస్" (లాసింబాలిస్మ ద మాన్యుమన్ రిలిజో, అత్తెస్ దలా కన్‌ఫరాన్స్ ఇంటర్నాసిమాల్, ఇన్‌స్తితుతో ఇతాలియానో పర్ ఇల్ మెదిమో, ఎద్ఎస్త్రెమ్ ఓరియంత్, సెరె ఓరియంతాలె వాల్. 1114 (రోమ్. 1957), పు. 118—123.)

8. బి) ఐ. కె. శర్మ, ప్రెసిడెంషియల్ ఎడ్రెస్, సెక్షన్ I ఏన్‌షంట్ ఆంధ్రా, "ఆంధ్రప్రదేశ్ హిస్టారికల్ కాంగ్రెస్, 6 సెషన్ ఉస్మానియా యూనివర్సిటీ, (హైదరాబాదు, 1982), పు. 18-19, ఇంకా, ఐ. కె. శర్మ, "సమ్. యాస్పెక్ట్స్ ఆఫ్ ది భట్టిప్రోల కాస్కెట్ ఇన్ స్క్రిప్షన్స్" జర్నల్ ఆఫ్ ది ఎపిగ్రాఫికల్ సొసయిటి ఆఫ్ ఇండియా, వాల్. 9 (ధార్వాడ 1982), పు. 23—25.

9. వి. ఎస్. అగర్వాలా, ఇండియా యాజ్ నోన్ టు పాణిని, (వారణాసి, 1963), పు. 66.
10. సి. బి. త్రివేదీ. ఐడెన్టిఫికేషన్ ఆఫ్ నందనగర్ అండ్ నందన్‌గర్,

స్వస్తిశ్రీ డా. బి. ఛాబ్రా ఫెలిసిటేషన్ వాల్యూమ్, (న్యూ ఢిల్లీ, 1984) పు. 325—328, ఐ. ఎ. ఆర్., 1980—81, పు. 37.

11. పి. ఎస్. శాస్త్రి, "ది రయిస్ ఎండ్ గ్రోత్ ఆఫ్ బుద్ధిసమ్ ఇన్ ఆంధ్ర" ఇండియన్ హిస్టారికల్ క్వార్టర్లీ. 31, పు. 68—75.

12. డి. సి. సర్కార్, "రాజులమందగిరి ఇన్‌స్క్రిప్షన్ ఆఫ్ అశోక," ఎపిగ్రాఫియా ఇండికా, 31, పు. 211—218.

13. ఇంకా "ఎర్రగుడి ఇన్‌స్క్రిప్షన్స్ ఆఫ్ అశోక," ఎ. ఇ. 32, నెం. 1, పు. 13, ఎపిగ్రాఫియా ఇండికా 35 చిత్రం పే. 40.42 1-28, పటాలు.

13, ఎపిగ్రాఫియా ఇండికా 35, చిత్రం 1 పే. 40-43.

14. కార్ల్ ఖండాల్‌వాలా, "లలితకళ", నెం. 9, పు. 70; నెం. 18 (1977), పు 47.

15. ఐ. కె. శర్మ, "ఎర్లీ స్కల్ప్చరల్ ఎండ్ ఎపిగ్రాఫ్స్ ఫ్రమ్ సౌత్ ఇండియా : న్యూ ఎవిడెన్స్ ఫ్రమ్ అమరావతి "ఫ్రెడరిక్ అషర్ ఎండ్ జి. ఎస్. గాయి (ఎడ్)" ఇండియన్ ఎపిగ్రఫీ : ఇట్స్ బేరింగ్ ఆన్ ది హిస్టరీ ఆఫ్ ఆర్ట్" (న్యూ ఢిల్లీ 1985), పు. 15-230 ఇంకా "జర్నల్ ఆఫ్ ఎపిగ్రాఫికల్ సొసయిటీ ఆఫ్ ఇండియా" వాల్ 1. (మైసూర్, 1974), పు. 68—72.

16. ఎస్. శంకర్‌నారాయణన్ "సమ్ పేజెస్ ఇన్ ఎర్లీ కల్చరల్ హిస్టరీ ఆఫ్ ఆంధ్ర" స్వస్తిశ్రీ డా. ఛాబ్రా ఫెలిసిటేషన్ వాల్యూమ్ (న్యూ ఢిల్లీ. 1984). పు. 63.

17. డి. సి. సర్కార్, "సెలెక్ట్ ఇన్‌స్క్రిప్షన్స్" I (కలకత్తా, 1965) పు. 224—225. ఒక చోట క్రీ. పూ. 209 నాటిదనియు, మరొక చోట క్రీ. పూ. 100 నాటిదనియూ పేర్కొని యున్నారు. ఇంకా, "ది ఏజి ఆఫ్ ఇంపీరియల్ యూనిటి" వాల్ 2, పు. 191.

18. ఎ. హెచ్. దాని, "ఇండియన్ పాలామెగ్రాఫీ" (ఆక్స్‌ఫర్డ్, 1963), 69—72. ఈ రచయిత ఆంధ్రమున బ్రాహ్మి, అమరావతి స్తూప శాసనములన్నియు క్రీ. పూ. 2వ శతాబ్ది తర్వాత వచ్చినవనే ప్రతిపాదనను బలపరుస్తుండిరి.

19. సి. ఎస్, ఉపాసక్, "హిస్టరీ ఎండ్ పాలామెగ్రాఫీ ఆఫ్ మౌర్యన్ బ్రాహ్మి ఆల్ఫబెట్" (నలంద, 1960), పు. 78—79.

20. ఎస్. ఆర్. గోయల్ "బ్రాహ్మి ఎన్ ఇన్వెన్షన్ ఆఫ్ ఎర్లీ మౌర్యన్ పీరియడ్" ఎస్. సి. గుప్త ఎండ్ కె. ఎస్. రామచంద్రన్ (ఎడ్) "ది ఒరిజిన్ ఆఫ్ బ్రాహ్మి స్క్రిప్ట్" (న్యూ ఢిల్లీ, 1979), పు 16-20, 42—44.

21. కె. వి. రమేష్, "ఇండియన్ ఎపిగ్రఫీ" (న్యూ ఢిల్లీ, 1984), వాల్ I, పు. 67. కాని శ్రీనివాసరిత్తి యి టీ వ ల భట్టిప్రోలు శాసనముల గూర్చి వ్రాస్తూ అశోకుని తర్వాత కాలము వాటివిగా పేర్కొనెను. చూడుడు అధోజ్ఞాపిక 24.

22. కె. ఆర్. నార్మన్, "స్టడీస్ ఇన్ ది ఎపిగ్రాఫీ ఆఫ్ అశోకన్ ఇన్‌స్క్రిప్షన్స్" జె. ఇ. ఎస్. ఐ., 2 (మైసూరు 1975), పు. 37-41.

23. శ్రీనివాసరిత్తి "పలాయియోగ్రఫీ ఆఫ్ ఎర్లీ ఇన్‌స్క్రిప్షన్స్ ఇన్ కర్ణాటక" "వర్క్‌షాప్ ఆన్ ఎపిగ్రఫీ" సదస్సులో చదివిన వ్యాసం (మైసూరు. డిసెంబరు 1985), పు 6—7. తిరుమల రామచంద్ర "మన లిపి పుట్టు పూర్వోత్తరాలు (విశాలాంధ్ర, 1957), పు 72-75, 123—125.

24. ఎపిగ్రాఫియా ఇండికా 35, చిత్రపటం I "టిక్కు" మార్కు వలె యక్షరములపై తలకట్టులు ఇక్ష్వాకుల శాసనముల నుండియే మొదలగు చున్నవి. చూడుడు కేసనపల్లి (గురజాల, గుంటూరు)లో లభ్యమయిన సిరిచంతమూలుని, I, ప్రాకృత శాసనము : ఎపిగ్రాఫియ ఆంధ్రికా, I (1969) పు. 146 ఇత్యాది. మరియు ఎపిగ్రాఫియ ఇండికా. 38, చిత్ర పటం 7 (జులై. 1970), పు 313- 318.

25. ఆర్. కాల్‌డ్వెల్ "ఎ కంపేరిటివ్ గ్రామర్ ఆఫ్ ది ద్రవిడియన్ ఆర్ ది సౌత్ ఇండియన్ ఫామిలీ ఆఫ్ లాంగ్వేజెస్ (మద్రాసు. 1974) పు. 133—134.

26. ఇటీవల వడ్డమాను త్రవ్వకముల (అమరావతికి 10 కి. మీ. తూర్పున)లో మౌర్యకాలమునకు చెందిన బౌద్ధారామము. కొండపైని చైత్యము. కొండ బండలలో నొకచిన్న నీటి దోన దానిపై యంచున క్రీ. పూ. 3వ శతాబ్ది బ్రాహ్మీశాసనము "రణోదమకన అను బంధి" వెలుగులోనికి వచ్చెను. ఇండియన్ ఆర్కెయాలజీ— 1982—83, పు. 2—3, చూడుడు భారతి (జూన్, 1986) పు. 6—9.

27. టి. వి, మహాలింగం, "ఎర్లీ సౌత్ ఇండియన్ పలాయియోగ్రఫీ" (మదరాసు, 1974), పు. 106, 132. ఇరావతమ్ మహాదేవన్ "సమ్ యాస్పెక్ట్స్ ఆఫ్ తమిళ్ బ్రాహ్మి స్క్రిప్ట్" జర్నల్ ఆఫ్ ది ఎపిగ్రాఫికల్ సొసయిటీ ఆఫ్ ఇండియా (ధార్వాడ, 1985) పు. 123—126.

28. టి. బర్రో, పోర్‌వర్డ్ - కె. మహాదేవశాస్త్రి, హిస్టారికల్ గ్రామర్ ఆఫ్ తెలుగు, తిరుపతి, 1969) పు. 5, భద్రిరాజు కృష్ణమూర్తి (ఎడ్) తెలుగుభాషా చరిత్ర సింహావలోకనము. (హైదరాబాదు, 1979), పు 457.

29. డి. సి. సిర్కార్, సెలెక్ట్ ఇన్‌స్క్రిప్షన్స్, (1965), పు. 36-37, అధోజ్ఞాపిక 6.

30. కె. మహాదేవశాస్త్రి పయిన చెప్పినది (1979) పు 18— 19. దివాకర్ల వేంకటావధాని, "ఆంధ్రవాఙ్మయారంభదశ, (హైదరాబాదు. 1972) పు. 6—8.

ఈ వ్యాసమున రేఖా చిత్రములందు (3 నుండి 7 వరకు) బ్రాహ్మీ శాసనముల పాఠ్యభాగములతో బాటు (1 నుండి 6 వరకు), ఆంగ్లమున తెలుగులో కూడా వ్రాయించ బడినది. బ్రాహ్మీలిపిని తెలుగువారు సులభముగ అధ్యయనముచేయుదురనే ముఖ్యోద్దేశ్యము.

చంద్రునికో నూలుపోగు రీతి ఈ వ్యాసమును భాషాలిపి శాస్త్రములందు నిష్ణాతులు, చరిత్రాచార్యులైన సర్వశ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ, నేలటూరు వేంకటరమణయ్య మరియు రావిప్రోలు సుబ్రహ్మణ్యంగార్ల దివ్యస్మృతికి అంజలి ఘటిస్తూ సమర్పించడమైనది.

ఇందు ప్రచురితమైన చిత్రములన్నియు భారతీయ పురావస్తుశాఖవారి ఆదరములో చేయబడినవి.



సాపేక్షకం

పాలడుగు వెంకటేశ్వరరావు



ఎండచుర్రుమంటూవుంది. మలమలా మాడ్చేస్తూవుంది. భూమీ సెగలు గ్రక్కుతూవుంది. దయలేదు, జాలిలేదు, కరుణా కటాక్షం అసలే లేదు. ఉన్నావాడా - ఫర్లేదులే. లేనివాడూ దరిద్రుడూ - రెక్కాడితే గాని డొక్కాడని అల్పజీవిగదా - అయ్యో, పాపం ఎట్లా?- అన్న విచక్షణాలేదు సూర్యుడికి. లేదంటే లేదది, అసలే లేదు. మబ్బుతునకేలేని ఆకాశం మధ్యన, అడ్డూ అదుపూ లేకుండా తీవ్రంగా మండుతూవున్న కొలిమి లాగా, పేట్రేగిపోతూ వున్న సూర్యుని ప్రతాపానికి, చెట్లూ, చేమలూ, ఆకులూ అలములూ కుక్కలూ, కోళ్ళూ, గేదెలూ, ఆవులూ, వున్నవాళ్ళూ, లేనివాళ్ళూ, సమస్తమ గుడిసెలూ, మేడలూ, కార్లూ, సైకిళ్ళూ, రిక్షాలూ - వాటి స్వంతదార్లులూ - భూమ్మీద వున్న సమస్తమూ - అల్లాడి, వేడెత్తిపోయి, నానా విధాలుగా అవ పడి ఆప సోపాలు పడ్తూవున్నాయి. ఉస్సురుస్సురని తెగ రొప్పుతున్నాయి గిజగిజలాడ్తున్నాయి. ఎండకి జడిసి రోడ్డూ వల్చబడింది. రోడ్డు మీ

ఎండమావులు ఆటలాడు కుంటున్నాయి. రోడ్డు ప్రక్కనే చెట్లక్రింద రిక్షాల్నాపుకుని కాళ్ళుదాపుకుని, చేతులు వేలాడేసి, అలుపు తీర్చుకుంటున్నారు రిక్షాల వాళ్ళు, ఇప్పుడొక కారూ, అప్పుడొక లారీరోడ్డు మీద దూసుకుని పోతూవుంది, భయం భయంగా, హడావుడిగా, తొందరగా.

రాం పుల్లయ్య వగరుస్తూ, అంగలు పంగలు వేసుకుంటూ రోడ్డు వెంట ఒంటరిగా సాగిపోతున్నాడు. చమటకి చొక్కా తడిసింది. కాళ్ళుదుమ్ము గొట్టుకునివున్నాయి. చిన్నప్పటి నుండి మట్టి పిసుక్కుని మట్టిలో పెరిగిన శరీరం. చమటోడ్చి కష్టపడి రాటుదేలిన ఆరడుగుల ఆజాను బాహువు రాంపుల్లయ్య.

వూరిబయట ఆఫీసులున్నాయి. ఆ ఆఫీసులకి వచ్చిపోయే జనాలకోసం ఆ రోడ్డువారనే కిల్లీకొట్లూ, కూల్డ్రింకు షాపులూ, టీ బంకులూ వెలిసేయి. సాధారణంగా జనాలతో ముమ్మరంగా వుండే, ఆ బంకులు కూడా బోసి పోయివున్నయి.

దాహం. పదినిముషాల్నుండీ దాహంగా వుంది రాంపుల్లయ్యకి అట్లాగే బండగా మొండిగా నడక సాగిస్తూన్నాడు. ఆ మొండితనానికి కూడా ఒక హద్దు వుంటుంది. అందువలన _ ఇక తట్టుకో లేక - ఎదురుగా వున్న కిల్లీ కొట్టు దగ్గరకి గబగబా వెళ్ళాడు రాంపుల్లయ్య. రాంపుల్లయ్య వంక వోర చూపులు చూస్తూ - గోళ్ళు గిల్లుకోటం ఆపి ఏం గావాలి? కిల్లీకొట్లో కూర్చుని వున్న గారపళ్ళ అబ్బాయి - ఇకిలించి అడిగాడు. ముందువెనుకలు కానక చిందులు తొక్కుతూ వున్నవయస్సు అతనిది.

"దాహంగావుంది" అన్నాడు రాంపుల్లయ్య.

"ఏం గావాలి? కూల్డ్రింకు తాగుతావా? రొండున్నరా" - అన్నాడు కుర్రాడు.

"అమ్మ? రొండున్నరే? రూపాయలేనా?"

"మరే మనుకున్నావు? చిల్లపెంకులనుకున్నావా? రూపాయలే నాయనా"

"అయితే వద్దులే, గానీ-"

"మరేం గావాలి?"

"నీళ్ళు! త్రాగటాన్కి నీళ్ళుగావాలి"

"నీళ్ళా? నీళ్ళులేవు" - ఖండితంగా చెప్పాడు, కుర్రాడు.

"లేవా"?

"చెప్తుంటే అర్థంగాదా? లేవంటే లేవనేగదా అర్థం?"

"మరెట్లా?! దాహంగావుంది. దీనమ్మ! ఎండల్జూడు? ఎట్టెట్టా వున్నాయో? పుట్టి బుద్దెరిగినాక నేనెరగనంటే నమ్ము" - రొప్పాడు.

"అవున్లే. పోనీ - కలరు తాగుతావా? రూపాయి!"

"వద్దులే నాకు పడదు, దోకొచ్చుతుంది",

"అయితే నీ దార్ని నువుబో. ఏం చేస్తాం?"

"అంతేగాని నీళ్ళు ఇవ్వనంటావు! కాస్త కనికరమన్నా లేకపోతే ...

"ఏందయ్యో? ఏంటి నీ దబాయింపూ? ఆఁ!"

"దబాయింపుగాదు దాహమని తాగటాన్కి నీళ్ళు అడిగాను, ఇస్తే నీ సొమ్మేం పోయింది? ఇవ్వటం న్యాయంగదా? అది ధర్మంగదా"

"రొండున్నరపెట్టి కూల్డ్రింకు కొనుక్కొని తాగమన్నానుగదా నిన్నే తాగమన్నానుగానీ నాకు తాగించమనలేదు గదా! నీ సొమ్ము నిన్నే కర్చు పెట్టుకోమన్నానుగాని నాకిమ్మన్నానా? అందులో అధర్మం ఏముందయ్యా పెద్దమనిషీ?"

"నిజమేననుకో. నా చిన్నతనంలో రొండున్నరకి బస్తావడ్లు వచ్చేవనేవారు."

"ఆ రోజులు వేరు- కాలం మారిందని తెలియదా? ధరలు పెరిగేయ్,

"చూస్తూచూస్తూ ఆ రంగు నీళ్ళకి రొండున్నర ఎట్లా తగలేసేది?"

"నిజమే. నిన్ను నేను బలవంతం చెయ్యలేదుగదా? నీదార్ని నువుబోతానంటే నిన్ను నేను చొక్కాపట్టుకుని ఆపలేదుగదా? తాగుతావా చస్తావా అనలేదుగదా?"

"నేనూ కాదంటంలేదు గానీ; నా దాహంతీరేదెట్లా? గొంతు ఆర్చుకపోతావుంది. నాలుక పిడచగట్టుకపోతావుంది. ప్రాణం కడంటుతావుంది"

"ఇదుగోనయ్యో? పెద్దమనిషీ? నీతో తీరిగ్గా మాటాడ్డానికి నాకు కుదరదుగానీ—"

"పోనీ నన్ను తీసి అట్లావుంచులే. కొనుక్కుతాగటాన్కి డబ్బుల్లేని ఒక దరిద్రుడు ఇట్లాగే అల్లాడి - దాహంతో నీర్సపడి రోడ్డు మీద నిలబడ్డాడనుకో అడిగతేంటి? ఆ సంగతి ఆలోచించు. పెరిగి పెద్దాడివి అవాల్సిన కుర్రాడివి గదా."

"అదంతా నాకెందుకయ్యా? నేనూ నీలాంటి వాణ్ణే, పావల్దబ్బులకోసం ఇక్కడ ఇట్లాపడివుండేవాణ్ణే - మా అన్న పనిమీదబోతూనన్ను కూర్చోపెట్టి వెళ్ళాడు."

"మనిద్దరి సంగతీ అట్లావుంచుదాం? ఇంకబోతే —"

"చాల్చాల్లే. వెళ్ళిరావయ్యా, పెద్దమనిషీ నీకేం పనీ పాటా వున్నట్లుగా అసలులేదే? దాహమని ఒకప్రక్కన చెప్తూసోది పెట్టున్నావ్?-"

తుర్రున సైకిలేసుకొచ్చి ఆగాడు ఒక కుర్రాడు. బుస్సున కూల్డ్రింకు కొట్టి అతని కందిచాడు కిల్లీకొట్టు గారపళ్ళ కుర్రాడు - పళ్ళికిలిస్తూ తాగి డబ్బులిచ్చి, సైకిలు కుర్రాడు బాణంలాగా దూసుకుపోగా - ఇంకా అక్కడ్నే నిలబడి వున్న రాంపుల్లయ్యని చూసి - ఇంకా ఇక్కడ్నేవుండావా? — అన్నాడు.

"నీళ్ళివ్వకపోతే మానే, ఇచ్చేచోటయినా చూపించి పుణ్యంకట్టుకోమన్నారు గదా"— అన్నాడు రాంపుల్లయ్య, గుటకలు మింగుతూ.

"అంటే ఏంటి నీ వుద్దేశ్యం? ఆఁ!"

"నాలుకపీకుతాంది. గొంతు అర్చుకపోతావుంది. దాహంతో పేగు అల్లాడి పోతావుంది. తాగటానికి మంచినీళ్ళుగావాలి."

"సరే, నేనొకటడుగుతాను నిజంగా నీదగ్గరడబ్బుల్లేవా? అజ్జేప్ప ముందు"ఠవున్నాయి. లేవని నేనన్నానా?"

మరింకేమిటి? ఒక డ్రింకు కొనుక్కుని తాగిపోరాదా?

"ఒక్కసీసా రంగునీళ్ళని, రొండున్నర తగలేయటాన్కి మనసొప్పటం లేదు."

"—అది నీఖర్మ. దానికి నేనేంజెయ్యను" నిట్టూర్చాడు కుర్రాడు.

"నీ దగ్గర నీళ్ళు లేక పోతే - నీళ్ళున్నచోటయినా చూపించమని గదా-"

"ఓరినీతస్సాదియ్య? నీ సంగతి గమ్మత్తుగావుందే! ఇంత వరకూ నీలాంటివాడ్ని నేను చూడలేదంటే నమ్ముతావా, పెద్దమనిషీ?"

"అయితే నన్ను బొమ్మంటావా?"— అని నీర్సంగా నాలుగడుగులు వేసాడు రాంపుల్లయ్య, వెనక్కితిరిగి. అడుగులు తడబడ్డాయి. నిట్టూర్పులు వెచ్చగావచ్చాయ్.

"తస్సాదియ్య! గ్నాపకాని కొచ్చింది! ఇదుగో మునలయ్యో! అటుజూడు" అని — అరిచాడు వెనకనించి, గారపళ్ళ బడ్డీ కుర్రాడు.

"చూస్తున్నావే చెప్పు"

"ఇదుగో: ఈ రోడ్డమ్మట అట్లాగే పోయావంటే, ఆ మామిడితోట దగ్గర ఒక పాకవుంది. ఒక పెద్దమనిషి చలివేంద్రం పెట్టి దార్ని పోయే వాళ్ళకి మంచి నీళ్ళమ్మని ఏర్పాటు చేసాడని విన్నాను. అడకి పోయి అడుగు."

"అట్లాగే"

"జాగర్త." కుర్రాడి గొంతులో ఆత్మీయత తొంగిచూసింది.

"అట్లాగేలే"

పోయిపోయి - ఆ పాక - రెండు ఫర్లాంగులు నడిస్తేగాని అపుపడలేదు, కొత్త తాటాకులతో నింపెట్టిన ఆ పాకలో ఒక మూలన నాలుగు పెద్ద పెద్ద కావలు పెట్టివున్నాయి. ఇవతలివారన ఒక బెంచీవుంది. ఆ బెంచీ మీద ఒక లావుపాటి కార్తి వడుకుని కునుకుతున్నాడు.

రాంపుల్లయ్య పిల్చాడు "ఏమయ్యా! లెగు లెగు"

ఉలకా పలుకూ లేదు, ఆకార్తి నుంచి.

"ఏమయ్యో! పెద్దమనిషి"- అరిచాడు రాంపుల్లయ్య

ఆ అరుపుకి వులికిపడి, కళ్ళు తెరిచిన, ఆ లావుపాటాయన కళ్ళెర్రచేసి లేచి కూర్చుని, ఏం కావాలన్నట్లు తల ఎగరేసాడు, కోపంగా

"దాహంగావుంది. నీళ్ళుకావాలి"

"కావాలి."

నీకక్కడయ్యా నాక్కావాలంటున్నాను, ఇంటున్నావా"

"నాకూకావాలనిగదా, నేనంటా: నువ్వా ఇనిపిచ్చుకుంటన్నావా, అని:"

"మరి ఇక్కడ నువ్వు ఏం చేస్తున్నట్టూ"

"కనబట్టంలా: బస్సు కోసమని, ఇక్కడపడి వుంటాను."

బా బాగుంది. అయితే వరో చలివేంద్రం పెట్టి నిన్ను ఆ సంగతి చూసుకోమనటమేంటి: నేవు బస్సుకోసం వచ్చానని చెప్పి ఇక్కడబల్ల మీద పడి నిద్రపోవటమేంటి: చాలా బాగుందయ్యా, నాయనా"

"ఆ మాట నీకెవరు చెప్పారు: ఇది మాబాగావున్నట్టుంది గద!"

"అదవెవరో కుర్రాడు చెప్పాడులే."

"అడికి జర్గిలేదు. అమాటని నమ్మి వచ్చిన నీకూ బుర్రలేదు."

"ఏంటయా: ఇదిగో మాట్లాడతావుండావు"

"మరేంటి స్వామీ! నేనేదో బస్సు కోసమని వచ్చావటమేంటి: దినమ్మ! ఈ ఎండదెబ్బకి అల్లాడి, బల్లమీద కూర్చున్నానో లేదో కునుకు రావటమేంటి: నువ్వువచ్చి నన్నులేపి కూర్చోపెట్టి ఇట్టా దబాయించటమేంటి: ఏమన్నా పద్ధతిగావుందా! ఇదేంటయ్యా నాయనా:"

"అట్లాగా! నాకు తెలీక ఇట్లాగని, వర్లిగాని ఇప్పుడు ఎట్లాగని:

"ఏంటి నీ యవహారం:"

"దాహంగావుంది. నీళ్ళుకావాలి. ఇంతేగదా నేనడిగింది"

"చూడబోతే నువ్వు నాలాగే అమాయకుడిలాగావున్నావే: సన్నే దండయ్య నుంచావయ్యా: ఈ కావలన్నీ కాళీ, చుక్కా బొట్టూ లేని చలివేంద్రం ఇదో అర్థంకావటంలా! నీళ్ళుగావాలా, దాహం, దాహం: అతను చాలా సేపు ఆలోచించి అన్నాడు: ఇదుగో: గావకానికి వచ్చింది, నువ్వు అడిగావు గనుక చెప్తున్నా, ఆ ఏమక మర్రిచెట్టువుంది. దానికింద నుయ్యివుంది. అడితో మరి బొక్కినా చాడూ వుండాయిలే."

"నీ కడుపు చల్లగావుండ: ఎంత మంచి మాట చెప్పావయ్యా పెద్దమనిషీ" ఆనందం తన్నుకురాగా తబ్బిబ్బవుతూ అన్నాడు రాంపుల్లయ్య.

"ఇంతకీ మందేవూరు:"- అన్నాడా పెద్దమనిషి అరాగా, వూరికినే.

"ఈడకి పదిమైళ్ళు వుంటుందిలే, రామాపురమని".

"అట్లనా: ఎందుకిట్లా ఎండని బడ్డా:: బస్సుకి పోరాదా: డబ్బులు పోయినా, ప్రాణం సుకపడుద్దిగ!"

"ఇదిగో! ఇంత వరకూ ఈ కార్తి ఏనాడూ ఒక్కబస్సుగాని, రయిలుగాని, ఇమానం లాంటిదిగాని ఎక్కలేదు తెలుసా:". అదేదో గొప్ప విషయమన్నట్టు గర్వంగా అతన్ని చూసాడు రాంపుల్లయ్య.

"ఈ మధ్యదాకా నేనూ అంతేగాని — ఈమధ్యన దానెమ్మ - అక్కవాతం వకటి వచ్చి బస్సుం నెక్కక తప్పటం లేదులే. అది నరేగాని ఎక్కడ్నుంచి వస్తున్నా:"

ఇ స్త్రీలో అమ్మాయి అరదలే మా మునసబుపోయి మూడేళ్ళయింది గదా. ఇక నాకు మ్మాత్రం ఇంకా ఎవరున్నారు: అల్లుడికి ఇచ్చింది ఇవ్వగా - వూళ్ళో నాకు ఇంకా నాలుగెకరాల పొలమున్నదిగదా. అది చూసుకుంటా, మొండి చెట్టులాగా బ్రతుకుతున్నానా: అది కూడా దానికిమ్మని ఆ అల్లుడు అమ్మాయితో నాకు చెప్పించుతాడు: దాన్ని వదిలి గొయ్యా: ఈ వయసుకి అందులేదయ్యా ఇంకా అక్కర ఏముంది: అది అమ్మేసి డబ్బేసి నా దగ్గర వుంచరాదా - అని అమ్మాయి అంటుందనుకో దాని అపేక్ష దానిది."

"మరి అట్లాగే చెయ్యరాదా: అమ్మాయి చెప్పిందాంట్లో తప్పేంలేదే::"

"కాదని నేనూ అనను" మావూరి వచ్చినెంటు వున్నారామా అదే అంటారు! కాని - ఈ కాయా చెయ్యా ఆడినంతకాలం ఒకరి దగ్గర పడి వుండాల్సిన కర్మ నా కేంటయ్యా: ఎవరిదోట వారు వుంటేనే అభిమానాలు అవీ



రాగాలూ నిలిచేది.''

"నిజం అంతే గదా. నాకూ వున్నారులే ఇద్దరు కొడుకులు; పెళ్ళిళ్ళు ఇద్దరికీ చేసానా;- ఇక మొదలు కలతలు. అయిన దానికి కాని దానికి దొబ్బులాటలు. తల వాచి పోయి చస్తున్నాననుకో ఏం చెయ్యనూ;;"

"—అవునయ్యా అసలు - పరాయి వాళ్ళనీడను పడివుండి గతి లేని వాళ్ళలాగా ఏడవటాన్కి మనకేం కర్మ పట్టిందీ; ఈ నాటికి ఆ నాలుగెకరాల యవసాయమూ, వక్కచేతి మీదే లాక్కునివస్తున్నాను; తెలుసా; అసలు మా అమ్మా బాబులు నాకేమిచ్చారు;; బండినున్ను; కష్టపడి చెమటోడ్చి పదె కరాలు కొండర్రి నంపాదించాను. ఈ భూమిలోనే పుట్టాను"భూమిలోనే చెమట కార్చి కష్టపడ్డాను. భూమినే నమ్ముకుని ఈ నాటికి భూ కామందునయ్యాను. అంతా నాకష్టార్జితం. అందులో ఆరెకరాలు అమ్మాయికిస్తే అల్లుడు అమ్ము కు పోయాడు. బుద్ధిలేదు. పైగా ఆ మిగతా నాలుగెకరాలూ కావాలంటాడు. ఈ చేతుల్తోడు. ఆరవయ్యోపడి మీదకి వస్తావుందా;; వొంటి చేతి మీద బియ్యబ్బస్తాని మోసిగలను."

"నేనూ అంతే వడ్లబస్తాని మోస్తానులే. పిల్లల మూలాన్న నాకు చీకూ చింతా ఎక్కువయి, అట్లా అయ్యానుగానీ."

"బాగుంది నాయనా; నీ పేరేంటో చెప్పావుగాదు..."

"సుబ్బరంగయ్యంటారులే నన్ను. చింతల సుబ్బరంగయ్య."

"సుబ్బరంగయ్యా; ఒక్కమాట చెపుతావిను. ఈ బవబంధాలున్నయి చూడు జీవుడుని పుట్టిన వెంటనే తగుల్కుంటయి. అన్నీ తెలిసుండే-మనిషి భోల్తాపడక తప్పదు. ఏదీ నాదికాదు అని అప్పుడప్పుడూ అన్పించినా— "వీటి" నుండి తప్పించు కొనటం ఎవరికీవశంకాదు. నే నున్నాను. నాకు అన్నీ తెలుననుకుంటాను. కానీ చిత్రం ఏమిటంటే-నాకు ఏమీ తెలియదనీ, నేను దేన్నుండి తప్పించుకోలేననీ చివరికి తెలుసుకుంటాను. మనిషి బ్రతుకు ఇంతే నాయనా; ఇప్పుడు చూడరాదూ; పొలంలో పండిన కూరగాయలు - కూతురూ. కూతురుపిల్లలూతినాలన్న ఆపేక్షతో నిన్ననగా వూరువిడిచిపెట్టి ఆ కూరగాయలమూటని మోసుకుని కాళ్ళుగొట్టుకుంటూ బస్తీ కెళ్ళానా; అవి ఇచ్చి - మరలా, నా పొలం ఏమవుతుందో ఏమో అన్న ఆపేక్ష కొద్దీ ఈరోజే వాళ్ళు వుండమని బలవంతం చేసినా వినకుండా, ఈ ఎండనుబడి కాళ్ళూచచ్చి నట్లు తిరిగి పోతున్నాను. అందువలనా—"

"నీ బండబడ; ఏమయ్యా; నీ పేరేంటో;;".

''రాంపుల్లయ్య అని పెట్టి చచ్చారులే మా అమ్మాబాబులు."

"ఓయి; రాంపుల్లయ్యా; ఇప్పటిదాకా దాహందాహం అంటివి; అదాహం నంగతే మర్చిపోయి మాటల్లోబడ్తివి; పో పోయి ఆ నూద్దగ్గర నీ దాహం తీర్చుకుని రావయ్యా తర్వాత చెప్దువుగాని నీ వేదాంతం.''

"అట్లాగే" - అని, నూద్దగ్గర కెళ్ళి, బకెట్తో నీళ్ళు తోడుకుని - కడుపు నిండా తాగి, మరొక బకెట్ నీళ్ళతో కాలు చేతులూ, మొహమూ కడుక్కుని ఉస్సురని నిట్టూర్చి, అలుపుదీరి, తృప్తిచెంది - రాంపుల్లయ్య తిరిగి వచ్చాడో లేదో—

సుబ్బరంగయ్య లేచి పంచసర్దుకుంటున్నాడు. హడావుడి పడ్తున్నాడు,

"ఏంటయ్యో; పెద్దమనిషీ ఏంటా ఆడావుడి;" - రాంపుల్లయ్య అడిగాడు

"దూరాన ఎర్రగా దుమ్ములేచింది అవువట్టంలా; బస్సు వస్తావుంది."

"ఈలోగా ఒక్కమాట చెప్తావిను. సుబ్బరంగయ్యా;''

"చెప్పు"

మనిషన్నాక ఈ బాధలూ గొడవలూ ఎప్పుడూ వుండేవే. కనుక కొడుకులు దెబ్బలాటలకి దిగారని నువ్వు దిగులుపడి కుర్రంగి పోవాల్సిన అవసరం పడమాక నీ పని నువ్వుచేసావు. ఇక నువ్వు చేయగలిగిందిలేదు. మనం వచ్చేటప్పుడు తెచ్చిందీ ఏం లేదు. పోయేటప్పుడు పట్టుకుపోయేదీ ఏమీ వుండదు. జరిగేది జరక్క మానదు. తాగెటోడు కర్తాడు తాటిపన్ను అన్నట్లు-నీ కొడుకుల్నే ఏడవనీ ఆ తిప్పలన్నీ నువ్వుమాత్రం ఏదీ నీమనసుకు బట్టిచ్చుకోకుండా నీ ప్రయాణం నువ్వు సాగించి ధైర్యంగా నడిచిపో. ఇంతే నేను చెప్పగలిగింది .... కృష్ణారామా అనుకోవటమే మనలాటాళ్ళు చెయ్య వలసింది.''—

బస్సువచ్చి ఆగింది, దుమ్ము లేపుకుంటూ.

''వస్తామరి" అంగలు వంగలువేసి బస్సు దగ్గరికిపోతూ అన్నాడు సుబ్బరంగయ్య.

"అట్లాగే జాగ్రత్త"

''నువ్వు కూడా జాగ్రత్తగా వెళ్ళరా పొయ్యేటప్పుడు మరిన్ని నీళ్ళు కడుపునిండాతాగిపో. అసలే ఎండలు;" - సుబ్బరంగయ్య హడవుడిగా వెళ్ళిపోయాడు. అతన్నెక్కించుకుని బస్సుసాగి పోయింది.

బస్సులో నుండి దిగిన ఒకరిద్దర్ని చూస్తూ నిలబడి పోయాడు రాంపుల్లయ్య, అక్కడ్నే.

పైపంచని సర్దుకుంటూ తన వయిపే సాగివస్తున్న ఆ పెద్దమనిషిని గుర్తించి రాంపుల్లయ్య కళ్ళు పెద్దగా అయ్యాయి.

"వార్నీ; ఏమయ్యా ప్రసిడంటూ; ఏంటి నువుఇక్కడ దిగబడ్డావిప్పుడు; ఏంటి విశేషం;'' అన్నాడు రాంపుల్లయ్య.

ఈ ప్రక్కూర్లో మా బావవున్నాడు, ఆయన అర్జంటుగా రమ్మని కబురంపితేనూ"- నువ్వేంటి మరి; ఇక్కడున్నావు;

"అమ్మాయి దగ్గరికెళ్ళి పిల్లల్ని చూసి వస్తున్నాలే. నీతో అర్జంటుగా ఒకముక్క చెప్పాలయ్యా. వింటావా;"

''చెప్పుమరి.... నేనుబోయి, వస్తూసుకుని ప్రొద్దుబోయేలోగా మనూరు చేరుకోవాలి మళ్ళా"

"చెప్తారామరి" అని ప్రసిడెంటుని చెయ్యిపట్టుకొని తీసుకెళ్ళి, మర్రిచెట్టునీ ఆ చల్లని నీడలో వున్న బావినీ చూపించాడు రాంపుల్లయ్య ఎండనబడి వచ్చావు దాహం తీర్చుకో - అని బక్కెటుతో నీళ్ళుతోడి అందించాడు చల్లని నీళ్ళతో మొహం, కాలు చేతులు కడుక్కోనమని సూచనలిచ్చాడు. అట్లాగేచేసి.

''ఇకచెప్పు" అన్నాడు ప్రసిడంటు తువాల్తో మొహం తుడ్చుకుంటూ.

''దాహంతీరిందా; ఇంకా నీరుకావాలా;"

"ఆఁ. ఇకవద్దులే ఇక చెప్పుమరి."

"మనూరి దగ్గర కూడా రోడ్డు మీద ఇట్లాంటి ఏర్పాటు కావలయ్యా. ఇట్లాగే ఒక చెట్టూ, నుయ్యీ, నీరూ...."

''ఓర్నీ బండబడ; కావాలంటే ఎట్లావచ్చుద్ది; దానికి డబ్బుగావాలి. ప్రసిడంటుని గదా - అని డబ్బు లేకుండానే ఇట్లాంటి పన్లన్నీ చెయ్యమని నన్నంటే ఎట్లా చెయ్యగల్నునీ; "ఎవరన్నా చెప్పేదానికి వివరం వుండాలిగదా,

''ఆగవయ్యా; రెండెకరాల పొలం తెగనమ్మి నీ చేతుల్లోపోస్తాను. ఏదో ఒక మంచిపని చెయ్యాలని బుద్ధి పుట్టిందిలే. నా కోరిక తీర్చేభారం నీది. అంతే నువ్వు వెంటనే పూనుకోవాలి." అని రాంపుల్లయ్య అన్నాడు, నిశ్చితంగా.

ప్రసిడెంటు ఆలోచనలో పడ్డాడు.

"ఆ డబ్బుచాలాదా; చాలదంటే చెప్పు"

"బేషుగ్గా సరిపోతుంది,కాని....''

''మరెందుకాలోచన;; అసలేంటి నీ సందేహం;"

''ఏం లేదులే. అట్లాగే చేద్దాం మరి వెళ్ళిరానా;''- నవ్వాడు ప్రెసిడెంటు.

"అట్టాగే; వెళ్ళిరా మరి; జాగర్త;"

ప్రసిడెంటు, రోడ్డుదిగి కాలిబాట వెంట చెట్లచాటున కనుమరుగయే దాకా చూసి తనూ నడక సాగించాడు రాంపుల్లయ్య. □

ఈ మాసం - మీ నక్షత్రఫలం అక్టోబరు 1986

1. మేషం :- (అశ్విని, భరణి. కృత్తిక 1 పా.)

అశ్విని వారికి ఈ నెల అంతా మంచి అనుకూలమైన కాలము. ధన లాభం కలుగును. కాని నెల మధ్యనుండి కొన్ని కుటుంబపు చిక్కులవల్ల మనః ఖేదము కలుగును. ఆర్థికంగా లోపం లేకపోయినా, అన్నీ నిశ్చయమై ఫలించిన శుభకార్యములు చివరలో వాయిదా పడును. ఉద్యోగులకు ప్రమోషను అవకాశం కలుగును. గతంలో తప్పిన విద్యార్థులకు ఇప్పుడు ఉత్తీర్ణత కవకాశము కలుగును. ఆశాభంగము పొందిన రైతులకు అనుకూలత కలుగును. భరణి వారికి గతంకంటె పరిస్థితులు కొంచెము కొంచెము క్రమక్రమంగా అనుకూలంగా వున్నా, కుటుంబంలోని ఒడుదుడుకులు, అప్పుడప్పుడు శ్రమను కలిగిస్తూ వుంటాయి. ధనవ్యయం కూడ అవసరము లేని పనికిమాలిన వాటికవుతుంది. కుటుంబ సంసార సౌఖ్యం బాగా ఉంటుంది. శుభకార్యాలు నెరవేరుతాయి. స్వల్పంగా అసంతృప్తి అప్పుడప్పుడు కలుగుచుండును. కృత్తిక 1 పా. వారికి సర్వ విధముల యోగదాయకంగా ఉండును. ధనము కలసి వచ్చును. కుటుంబంలోని చిక్కులు తొలగిపోవును. స్థిరనిర్మాణ లాభం కలుగును. వర్తకులకు, వ్యవసాయదార్లకు, మొత్తం ఈ రాశి కార్మికులకు, విద్యార్థులకు వారి వారి రంగములలో మంచి యోగదాయకంగా వుండును.

2. వృషభం :- (కృత్తిక 2, 3, 4 పా. రోహిణి, మృగశిర 1, 2 పా.)

కృత్తిక 2, 3, 4 పా. వారికి గతంలోని చిక్కులన్నీ తొలగిపోయి ధన భాగ్య లాభం, సుఖ సంతోషములు వృద్ధియగును. సర్వవిధముల తలచిన పనులు నిరాటంకంగా నెరవేరును. రాజసమ్మానము జరుగును. భూ గృహాది సంపాదనం జరుగును. సర్వవిధముల అనుకూలమైన కాలము. వర్తకులకు విశేష లాభం కలుగును. రోహిణి వారికి 15వ తేదీనుండి ఉష్ణాధిక్యము, శరీరంలో నలత హెచ్చుగా వుండును. ధనవిషయమై లోపం లేకపోయినను అప్పుడప్పుడు తొట్రుపాటు తప్పదు. ఈ రాశి వారందరికి ముఖ్యముగా విద్యార్థులకు, ఉద్యోగులకు, పత్రకులకు శ్రమమీద ఫలితము కలసి వచ్చును. మృగశిర 1, 2 పా. చెడురోజులు తొలగిపోయినను ఇప్పుడిప్పుడే మంచి యోగకాలము కలసివచ్చుచున్నది. ఈ నెల చివరకు క్రమక్రమముగా సమస్యలన్నీ విడిపోయి అన్ని విషయములలోను అనుకూలత ఏర్పడును. ఈ నెల దాటేవరకు పెద్ద ప్రయత్నాలకు తలపెట్టవద్దు. అనుకూల ఫలములు వాటంతటవే ఒకదానికొకటి తోడయి కలసివచ్చును.

3. మిధునము :- (మృగశిర 3, 4 పా. ఆర్ద్ర, పునర్వసు 1,2,3 పా.

మృగశిర 3, 4 పా. వారికి 1, 2 పా. వారిలాగే యోగము సమానమైనను శరీరశ్రమ, ఉష్ణాధిక్యం, అలసట, త్రిప్పట, మనోవైకల్యం హెచ్చుగా ఉండును. పనులు మాత్రం ఏదోవిధంగా కొనసాగిపోవును. అనుకోకుండా కుటుంబంలో అశాంతి కలిగి తొలగిపోవును. దైవభక్తి, పరమార్థ చింతనము హెచ్చును. ఈ రాశివారందరికి అనగా విద్యార్థులకు, ఉద్యోగులకు, కర్షక, కార్మికులకు, కంట్రాక్టర్లు, వైద్యులు మొదలగువారికి నూరుపాళ్ళు శ్రమ, 75 పాళ్ళు ఫలితము కలుగును. ఆర్ద్ర వారికి 15వ తేదీ దాటేవరకు మానసికవ్యథ, కుటుంబంలో అశాంతి, కలతలు ఏర్పడును. అన్ని విషయములు అనుకూలముగా వున్నా, ఏదో ఒక కారణముచే మనస్సు బాధపడుతూ వుంటుంది. నెల రెండవ భాగము దగ్గరనుండి అశాంతి తగ్గి పరిస్థితులు కొంత కుదుటపడును. బంధుమిత్రాదులతో కూడ కొంత అనుకూలత కలుగును. ఉద్యోగ, విద్యా, వ్యాపార, వ్యవసాయ రంగాలలో వారికి అధికశ్రమ, అల్పఫలము కలుగును. పునర్వసు 1, 2, 3 పా. వారికి మొదటి 4 రోజులు చివరి 15 రోజులు నలత, శ్రమ, వ్యయప్రయాసలు, చిన్న ప్రమాదములు కలుగును. మానసిక వ్యధ కలుగును. కాని మిగిలిన 13 రోజులు బాగానే ఉండును. శుభకార్యములలో పాల్గొనుట జరుగును. ఈ నక్షత్రము వారందరికి శుభాశుభ మిశ్రఫలము కలుగును. విద్యార్థులకు పరీక్షలో ఉత్తమశ్రేణి వచ్చును.

4. కర్కాటకము :- (పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష)

పునర్వసు 4 పా. వారికి మొదటి మూడు పాదములవలెనే శరీర శ్రమా, నలత, త్రిప్పట మొదలగునవి జరిగినను, కార్యవిజయము, ధనలాభం. ఆదివరకు నెరవేరని పనులు నెరవేరుట, బంధుమిత్రాదుల ఆదరణము, కుటుంబంలో సుఖసంతోషములు కలుగును. 10-15 తేదీల మధ్య వ్యవహారమూలకంగా ధన లాభం కలుగును. పుష్యమి వారికి ఇంకను కొన్నాళ్ళపాటు శరీరంలో నలత తప్పదు, అయినను ఇకపైనుండి అన్ని వ్యవహారములు చురుగ్గానే నెరవేరుచుండును. ఆత్మీయులయినవారితో విరోధ మేర్పడును. తరచు ప్రయాణముల వలన లాభించును. శుభకార్యముల కాటంకము కలుగును. ఆశ్లేష వారికి నెల చివరిలో శ్రమ, త్రిప్పట జరుగును. గతంలోని చిక్కులు ఒక్కొక్కటే విడుట ప్రారంభమగును. ఆర్థికంగా వ్యయం హెచ్చుగా జరుగును. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, ప్లీడర్లకు, కంట్రాక్టర్లకు డాక్టర్లకు మొదలగువారందరికి మేలు కలుగును. కాని శ్రమ హెచ్చుగా నుండును. అయితే 19వ తేదీనుండి నెలాఖరు వరకు కార్యవిఘ్నం, అన్నిచోట్ల వ్యతిరేకత, ఆర్థికపు చిక్కులు ఏర్పడి వ్యథ కలుగును.

5 సింహము :- (మఘ, పుబ్బ. ఉత్తర 1 పా.)

మఘ వారికి 18వ తేదీవరకు శరీరశ్రమ, భార్యకు అనారోగ్యం కలుగును. తలకు మించిన బాధ్యతలు, శక్తికి మించిన పనులు తలపెట్టుట వలన కొన్ని చిక్కుల నెదుర్కొనవలసి వచ్చును. 19వ తేదీనుండి చిక్కులు తగ్గుముఖం పట్టును. వర్తకులకు, వ్యవసాయదార్లకు మంచి అనుకూలంగా ఉండును. చేసిన ప్రయత్నములకు అనుకోని విఘ్నములు తెలియకుండావచ్చి, తెలియకుండానే తొలగిపోవును. పుబ్బ వారికి ఇంకా శ్రమ, నలత కొన్నాళ్ళు కొనసాగును. కుటుంబ వ్యవహారములు చక్కబడి, సమృద్ధి ధనము చేకూరి, పెద్దలతో స్నేహము కలుగుట వలన శ్రమపడినా, సంతృప్తి దక్కును. విద్యార్థులకు, రాజకీయవేత్తలకు, వైద్యవృత్తివారికి మంచి అనుకూలమైన కాలం. గృహాది వ్యవహారముల క్రయవిక్రయాదులలో మంచి లాభమును కలిగించును. ఉత్తర 1పా. వారికి ఇతరుల విషయమై శ్రమ హెచ్చు. ఉద్యోగులకు మంచి ప్రమోషను లేదా స్థానం మార్పు జరుగును విద్యార్థులకు టెక్నికల్ కోర్సులలో రాణింపు వుండును. అవసరమునకు కావలసిన ధనము చేకూరి పనులు కొనసాగిపోవును.

6. కన్య :- (ఉత్తర 2. 3, 4 పా. హస్త, చిత్త 1, 2 పా)

ఉత్తర 2, 3, 4 పా. వారికి బంధు విరోధం, మాట పట్టింపులు కలిగి, మనస్సునకు ఖేదం కలుగును. భార్యకు లేదా భర్తకు శరీరంలో నలత కలుగును. ఆర్థికపు లోపం మాత్రం కలుగదు. వ్యవహారములన్నింటిలోను మంచి


అనుకూలత ఏర్పడును. మొత్తంమీద గత మాసంకంటె అన్నివిధాల మేలు కలుగును. హస్త వారికి గత నెలనుండి ప్రారంభమైన శుభయోగము కొనసాగుటయే కాక బంధుమిత్రాదులతో సమావేశము, శుభకార్యములలో పాల్గొనుట, తలచిన పనులన్నియు సక్రమంగా నెరవేరుట జరుగును. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అన్ని విధముల యోగకాలము. వర్తకులకు, రాజకీయవేత్తలకు, కర్షక, కార్మికులకు అన్నివిధాల కలసివచ్చును. శుభకార్య ప్రయత్నములకు చిన్న ఆటంకాలు కలిగి వాయిదా పడును. చిత్ర **1, 2,** పా. వారికి ప్రతి పనిలోను విఘ్నములు కలిగినా, విజయమును సిద్ధించును. బంధువుల వలన చిక్కులు ఏర్పడును, ఉద్యోగులకు అధికారుల వలన ఆదరము కలుగును. కాని వర్తకులకు అధికారుల పీడ కలిగి, ధనవ్యయం కలిగినా లాభం బాగానే కలసి వస్తుంది. శ్రమజీవులకు నూతనవస్త్రాదిప్రాప్తి. సుఖసంతోషాలు, బంధుమిత్రాదుల సమాగమం కలుగును.

7. తుల :– (చిత్ర 3, 4 పా. స్వాతి, విశాఖ 1, 2, 3 పా.)

చిత్ర **3, 4 పా.** వారికి గత నెల 18వ తేదీ నుండి ప్రారంభమైన శుభయోగం ఈ నెల కూడ కొనసాగును. శుభకార్యాలు ఫలించును. ఉద్యోగ వ్యవహారాలు సానుకూలమగును. బంధుమిత్రాదులవల్ల మేలు జరుగును. విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు, కర్షకులు, కంట్రాక్టర్లు మొ॥వారికి మంచి అభివృద్ధి కలుగును. స్వాతివారికి గత నెల 18వ తేదీనుండి ప్రారంభమైన ఒడుదుడుకులు ఈ నెల 15వ తేదీవరకు కొనసాగి ప్రతి పనికి ఆటంకము కలిగించినా, 15వ తేదీ దాటినప్పటినుండి క్రమంగా అనుకూల పరిస్థితులేర్పడి, శుభకార్య సిద్ధి, వ్యవహార విజయం, ధనలాభం చేకూరును. ఈ నక్షత్రం గల అన్ని రంగాల వారికీ 15వ తేదీ దాటినప్పటినుండి ఉత్సాహం, సౌఖ్యం, ధనలాభం కలుగును. నెల రెండవ భాగం సుఖదాయకంగా ఉండును విశాఖ **1,2,3** పా. వారికి ఈ నెల 15వ తేదీవరకు అన్నివిధాల అనుకూలంగా ఉన్నా, శరీర, మనః క్లేశం హెచ్చుగా వుండును. 16వ తేదీనుండి చిక్కులు అధికమై ఆరోగ్యభంగం కలిగించి, అలసటను, శ్రమను కలిగించును. వ్యవహారములన్నీ వాయిదాపడి, సమయానికి డబ్బు సర్దుబాటు కాక తొట్రుపాటు కలుగును. అనవసర వాగ్వాదాలు మాట పట్టింపులు పెరిగి స్థిమితం తక్కువగా వుండును. ప్రతి పనికీ విపరీతంగా ధనం ఖర్చయిపోవుటయే కాక ఫలితం సంతృప్తికరంగా వుండదు. వీలయినంత వరకు మౌనంగా వుండి, ఏ వ్యవహారంలోనూ తల దూర్చకుండా ఉండడం చాల మంచిది. వైద్యులకు, వ్యవసాయదారులకు బాగా కలసి వచ్చును.

8. వృశ్చికం :– (విశాఖ 4 పా. అనూరాధ, జ్యేష్ఠ)

విశాఖ 4వ పా. వారికి నెల మధ్యవరకూ, అన్నివిధాలా శుభ, సుఖ, యోగ ఫలితాలు ప్రారంభమై బాగా కొనసాగుతూ వుండగా, హఠాత్తుగా చిక్కులు



అనుకోకుండా ప్రారంభమై తగవులు, శ్రమ, మనఃఖేదం, కోపం, ఆలోచనలు, శత్రువుల బాధలకు గురి కావడం జరుగుతుంది. కావలసినవారు శత్రులవుతారు. అనూరాధ వారికి, గత నెలనుండి కొంతలో కొంత శుభయోగం ప్రారంభం అయినా, చిక్కులు, శ్రమ, నలత, కుటుంబంలో నలతయూ, కలతయూ పూర్తిగా తొలగిపోవు. సోదరజ్ఞాతి బంధువులవల్ల కష్టనష్టాలు ఎదురవుతాయి. గతంలోవలె మరీ అంత బాధ కలుగకపోయినా, ఒడుదుడుకులు ఇంకా కొనసాగుతాయి. ఖర్చులు మితిమీరుతున్నా, తగిన ఆదాయం ఏర్పడుతుంది. అయితే మనో ధైర్యంతో అన్ని చిక్కులనీ ఎదుర్కొని అధిగమించడానికి తగిన శక్తి కలుగుతుంది. శివపూజ ధ్యానం, శనికి శాంతులూ మంచిది. కొంత శాంతి కలుగుతుంది. జ్యేష్ఠవారికి 15వ తేదీనుండి మరింత యోగం కలసి రాగలదు. నోడి మంచిపలన పనులను సాధించుకొని వస్తారు. గృహ, సువర్ణాది స్థిర సంపాదనకి అవకాశం కలుగుతుంది. అయితే సహవాస దోషంవల్ల కొంతవరకు వ్యసనం తాత్కాలికంగా పట్టుపడుతుంది. అన్నీ అన్నివిధాలా కలిసివచ్చినా, మనస్సుకి సంతృప్తి కలుగదు సరికదా ఏవో ఒక లోపం కనబడుతూ, ఏవో తప్పు చేసినట్లు మనస్సుకి అనిపిస్తుంది. అయితే విద్యార్థులకి, ఉద్యోగులకి, వ్యవసాయ, వ్యాపార, వృత్తి రంగాలలో వున్నవారికి బాగా సంతృప్తి కల్గి సుఖసంతోషాలతో గడచును.

9. ధనుస్సు :– మూల వారికి రోజువారీ వ్యవహారం బాగుగానే గడిచిపోతున్నా, తలపెట్టిన పెద్ద పనులు, శుభకార్య ప్రయత్నాలు ఆటంకాలతో అనిశ్చితంగానే వుంటాయి. మధ్య మధ్య ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. పనికిమాలిన ఆలోచనలతో మనస్సు సతమతం అవుతూ వుంటుంది. గురునికి జపశాంతులు చేయించుటవల్ల చిక్కులు తగ్గుముఖం పట్టి మనశ్శాంతి ఏర్పడుతుంది. పూర్వాషాఢ వారికి గత నెల 18వ తేదీనుండి చిక్కులు విడిపోవుట జరుగును కాని ఇంకా పూర్తి స్వస్థత ఏర్పడదు. అన్ని పనులూ ఎప్పటికప్పుడు జరుగుతున్నట్లే అనిపించి ఏ పనీ చివరకు జరుగక వెనుకబడుతూ వుండును. మానసికంగా అదేపనిగా పనికిమాలిన ఆలోచనలు. ఎంత డబ్బు వచ్చినా, అంతా నిరుపయోగమైన ఖర్చులతో కొరగాకుండా అయిపోతుంది. అడుగడుక్కీ బంధువుల కక్ష సాధింపుతో పెట్టే బాధలకు గురి కావలసి వస్తుంది. ఏ విషయంలోనూ లోపం లేకపోయినా పరిస్థితి అంతా అయోమయంగా వుంటూ, స్వస్థత సరిగా ఉండదు. ఉత్తరాషాఢ 1వ పా. వారికి ధనాదాయం బాగుంటుంది. మనస్సు వ్యసనాల మీదకు పరుగెడుతూ వుంటుంది. వ్యాపార వ్యవసాయ-ఉద్యోగ-విద్యా, వైద్య రంగాల్లో వున్నవారికి అన్నివిధాలా మేలయిన కాలం. అప్పుడప్పుడూ కొన్ని చిక్కులు ఎదురయినా వాటిని అవలీలగా తొలగించుకొనడం జరుగుతుంది. కుటుంబంలో సుఖశాంతులు కలుగుతాయి. 15వ తేదీనుండి రాబడి పెరుగుతుంది. సంఘంలో పేరు ప్రతిష్ఠలు ఏర్పడుతాయి. మాతృవర్గం వారితో విరోధం కల్గును.

10. మకరం :– ఉత్తరాషాఢ. 2, 3, 4. పా. వారికి 15వ తేదీవరకు బాగానే వుంటుంది. తర్వాత ధనలాభం బాగుంటుంది. స్థిరాస్థి క్రయం చేయడం జరుగుతుంది. శరీరశ్రమ, అలసట, త్రిప్పుట హెచ్చుగా ఉంటుంది. సువర్ణ వస్త్రాభరణ ప్రాప్తి అగును. భూగృహాది వ్యవహారాలు నెరవేరుతాయి. వ్యవహారపు చిక్కులన్నీ తొలగిపోతాయి. బంధుమిత్రాదుల ఆదరాభిమానాలు, ప్రజలలో సంఘంలో మాట పలుకుబడి పెరిగి ప్రతిష్ఠ వృద్ధి అవుతుంది. శ్రవణం వారికి 15వ తేదీవరకూ అన్ని రంగాలలోని వారికీ ప్రోత్సాహకరంగా వుంటుంది. ఆ పిమ్మట కూడా బాగానే వున్నా, కార్యసిద్ధికోసం మిక్కిలి శ్రమా, వ్యయం కలుగును. బడలిక, అలసట, శరీరంలో ఉష్ణాధిక్యం హెచ్చుతుంది. వ్యవహారాలన్నీ సానుకూలం అవుతాయి. పాత బాకీలు, రావలసిన ఇతర మొత్తాలూ, ఒక్కసారిగానే అందగలవు. విద్యార్థులకు, ఉద్యోగులకూ, వర్తకులకూ అనువైన కాలం. కార్మికవృత్తి వారికి ధనలాభంతోపాటు శరీరశ్రమ అధికంగా వుంటుంది. ధనిష్ఠ 1 2, పా. వారికి 19వ తేదీవరకు శ్రమ అయినా, యోగం బాగుండును. పాత వ్యవహారాలన్నీ పరిష్కారం కాగలవు. కుటుంబంలో సుఖశాంతులు, ఆర్థిక

ముఖ చిత్ర వ్యాసం

నృత్య చూడామణి-కలైమామణి శ్రీమతి చిత్రావిశ్వేశ్వరన్

సుప్రసిద్ధ భరతనాట్య నర్తకీమణుల్లో "నృత్య చూడామణి" "కలైమామణి" శ్రీమతి చిత్రావిశ్వేశ్వరన్‌ను ప్రముఖ కళాకారిణిగా పేర్కొనవచ్చు.

చతుర్వేద సంగ్రహితయై పంచమవేదంగా భాసిలిచే నాట్యకళను జనరంజకంగా ప్రదర్శించి మెప్పించడంలో ఆమెకు ఆమే సాటి.

భావ, రాగ, తాళ సమ్మోహనంగా అలరింపు, జతి, శబ్ద, వర్ణ, పద, తిల్లాన భరతనాట్య ప్రక్రియలను సునాయాసంగ ప్రదర్శించగల నేర్పరి. ఆంగిక, వాచిక, ఆహార్యాభినయంలో సాత్వికతను సంతరించుకున్న నృత్యాంగన అందము అంగ సౌష్టవము, అభినయము ఆవిడ నాట్యకళను ఇనుమడించేవి.

శాస్త్ర సమ్మతమైన తంజావూర్ సాంప్రదాయరీతుల్లో భరతనాట్యాన్ని ప్రముఖ నాట్యాచార్యుడు శ్రీ కుప్పయ్య పిళ్ళే శిష్యురాలు టి. ఎ. రాజలక్ష్మి దగ్గర అభ్యసించింది.

భారత ప్రభుత్వ ఉపకార వేతనంతో వళువూర్ రామయ్య పిళ్ళే దగ్గిర భరతనాట్యంలో ఉన్నతవిద్యకు మెరుగులు దిద్దుకుంది.

చిత్రా విశ్వేశ్వరన్ జాతీయ స్థాయిలోని నాట్యోత్సవాల్లోనేకాక అంతర్జాతీయ స్థాయిలో పారిస్, లౌసేన్, స్విట్జర్లాండ్, ఫ్రాంక్‌ఫర్ట్, వెస్ట్ జర్మనీలలో జరిగిన నాట్యోత్సవాల్లో భరతనాట్య ప్రదర్శనలను ప్రతిభావంతంగా ప్రదర్శించింది.

— పోర్చుగల్ మరి అక్కడి టెలివిజన్‌లోను
— సోరబోన్ విశ్వవిద్యాలయంలోను
— చిదంబరాలయంలో నృత్యాంజలి సమర్పించిన బృందంలోను
— మద్రాస్ దూరదర్శన్ మొదటిసారిగా భరతనాట్యాన్ని ప్రత్యక్షంగా ప్రసారం చేయడంలోను

శ్రీమతి చిత్రావిశ్వేశ్వరన్‌ను మొదటగా ఎన్నుకోవడం ఆవిడ భరతనాట్యకళా నిపుణతకు చక్కటి నిదర్శనం.

భర్త శ్రీ విశ్వేశ్వరన్ స్వయంగా శాస్త్రీయ సంగీతం తెలిసినవాడు నాట్య ప్రదర్శనకు గాయకుడు సంగీత దర్శకుడిగానే కాక వీణ, సంతూర్, గిటార్ వాద్యాలను వాయించడంలో సిద్ధహస్తుడు.

దాదాపు పదకొండు సంవత్సరాల క్రితం 'చిదంబరం' అన్న పేర భరతనాట్య అకాడమిని స్థాపించి మన దేశ సంస్కృతి, కళా సంప్రదాయాలను అద్దం పట్టేలా సంగీతం, సాహిత్యం, శిల్పకళ, చిత్రలేఖనం, వేదాంత, పురాణ, ఇతిహాసపై చక్కటి అవగాహన కూర్చే విధంగా విద్యార్థులకు తర్ఫీదు నిస్తున్న శ్రీమతి చిత్రా విశ్వేశ్వరన్ ఎంతైనా అభినందనీయురాలు. 1982లో తమిళనాడు ప్రభుత్వం ఈ కళాకారిణికి 'కలై మామణి' అన్న బిరుదునిచ్చి సత్కరించింది.

శ్రీ యం. మధు

విషయాలలో విజయం స్థిరాస్థి సంపాదన జరుగును. ఉద్యోగులకి స్థానం మార్పు జరుగును.

11. కుంభం :— ధనిష్ట 3, 4 పా. వారికి కూడా ధనం 19వ తేదీ తర్వాత తక్కువ స్థాయి వర్గంవారినుండి కలసి వస్తుంది. ఆరోగ్యం బాగుండును. శుభకార్యాలు ఫలించును. విద్యా-ఉద్యోగ-కార్మిక-కర్షక వర్గాల వారందరికీ అన్ని విధాలా ప్రోత్సాహకరంగా వుండి, ప్రతి విషయంలోను విజయం, కార్యసిద్ధి, ఫలసిద్ధీ జరుగును. శతభిషం వారికి 19వ తేదీనుండి శరీరశ్రమ హెచ్చు. మిగిలిన వ్యవహారాలన్నీ అనుకూలంగా వుండి విజయాన్ని కలిగిస్తాయి. 19వ తేదీ లోగానే ధనలాభం, సువర్ణ వస్త్రాభరణ ప్రాప్తి, దైవ కార్యాల్లో పాల్గొనడం జరుగును. పదుగురికి ఉపకారం చెయ్యడం జరుగుతుంది. నెల ప్రారంభంనుండి 14వ తేదీవరకు శరీరశ్రమ అధికం అయినా ధనాదాయం బాగుంటుంది. పూర్వాభాద్ర 1, 2, 3 పా వారికి 19వతేదీవరకు అధికశ్రమవల్ల శరీరంలో నలత హెచ్చు. శుభకార్యాలకు అనుకోనివిధంగా ఆటంకాలు వచ్చి వాయిదా పడును. 19వ తేదీలోగా ధనలాభం, సువర్ణ వస్త్రాభరణ ప్రాప్తి, బంధుమిత్రులతో సుఖసల్లాపం, స్థిరాస్థి సంపాదనా జరుగును.

12. మీనం :— పూర్వాభాద్ర 4వ పా. వారికి శుభాశుభ మిశ్రఫలితం శ్రమ హెచ్చుగానే వున్నా తగిన ఫలితం వుండును. శుభకార్యాలకూ, విలాస వస్తువులకీ, బంధువుల నిమిత్తమూ అధికంగా ధనవ్యయం జరుగును. అయి ప్రతి విషయంలోనూ అత్యధిక శ్రమా, ఖేదం తప్పదు. తప్పు ఒప్పు పెట్టుట చివరకు బాధపడుటా జరుగును. ఉత్తరాభాద్ర వారికి, శరీరశ్రమాధిక్య బలహీనతవల్లనూ, అనారోగ్యం లేకపోయినా, నలత చేసినట్లు ఉండును. పుణ్య ధర్మకార్యాలూ, ఉపవాసాదులవల్ల కూడ నలత కలుగుతుంది. శుభకార్యాల వి షయంలో ధనవ్యయం జరుగుతుంది. ఒక్కొక్కప్పుడు, ఇతరులవల్ల అపవాదులు మాటపడుటవల్ల కూడా మానసికంగా అశాంతి కలుగుతుంది. మిగిలిన అన్ని వి షయాలూ అనుకూలంగా వుండి ధనలాభం చేకూరుతుంది. రేవతి వారికి 19వ తే వరకూ సామాన్యం, ఆ పిమ్మట విశేష ధనలాభం, కుటుంబంలోని వారందరి విద్యా, ఉద్యోగ వ్యవహార విజయాలూ, వివాహాది శుభకార్యాలూ, వస్తువాహ ప్రాప్తి కలుగుతాయి. అన్ని విషయాలలోను మంచి ప్రోత్సాహం లభిస్తుంది పెద్దలతో పరిచయం, అనేక లాభాలకు దోహదం చేస్తుంది. సంఘంలో మం పేరు ప్రతిష్ఠలూ, మాట పలుకుబడీ పెరుగుతుంది. అయితే స్త్రీ మూలకంగాను బంధుమిత్రాదుల రాకపోకల మూలకంగాను ధనవ్యయమూ, మానసికంగాను శారీరకంగానూ అశాంతి హెచ్చవుతాయి.

సర్వేజనాస్సుఖినోభవంతు

సిద్ధాంతి — విష్ణల వేంకట సత్యసుబ్రహ్మణ్యం

సీరియల్

మా రాజశేఖర చరిత్ర

బలివాడ కాంతారావు

(గత సంచిక తరువాయి)

ఉదయం లేచినా సిగ్గుతో ముడుచుక పోయాడు. రాత్రి ఆ హడావిడిలో జ్యోతి లేచిపోయి మిటుకు మిటుకు మని చూసింది కదా! జ్యోతి మనుసులోనూ దొంగగా వుండి పోతే అదెంతబాధ? ఇక యిక్కడ కొన్నిరోజులే తనవునికి. మరి తనకేం పని చెప్పదు ఉన్న కొద్దిరోజులైనా రమాదేవి యింట్లో తన్ను యిదివరలా తిరగ నివ్వదు.

ఏదిపోయినా తనమీదే తోసేస్తుంది. ఊర్లో అందరికి తెలిసి పోతుంది. 'దొంగనని పేరు పడి పోతాను. ఛీ....... యెంత పొరపాటు చేసాను, నాన్న చెప్పిన శతకాలు కంఠస్థం వచ్చినా వాటిమీద నమ్మకం లేక పోవటంవల్ల యిలా దొంగతనానికి వెళ్ళాను." అని అనుకుని తను యెలా యెందుకు దొంగతనం కెళ్లాడో, వెళ్ల గలిగాడో అంతా అయోమయంగా వుంది. తల తిరిగి పోతుంది. మరెప్పుడు యిలాంటి పనులు చెయ్యకూడదు అని నిర్ధారించుకున్నాడు.

" కాని వానితోడ కలసి మెలంగిన

హాని వచ్చు నెంతవానికైన........"నాన్న నూరి పోసిన యీ పద్యం ఆ క్షణంలో యెందుకు గుర్తుకు రాలేదు? ఈ అప్పారావే కానివాడు. వాడి ముఖం చూస్తే పాపం! వాడిని చంపినా పాపం లేదు. వాడు నిజంగా పులి. ఆ పులి దగ్గరకు వెళ్ళకూడదు.

ఆలోచనలపు యింక తావులేకుండా యేడుస్తున్న కొడుక్కి రమాదేవి రాజా చంకనెక్కించింది. బజారుకు పంపి యేం తేవాలో చెప్పి తిరిగి వచ్చి సరిగ్గా లెఖ్ఖ చెప్పు. బజారు తెచ్చాక డబ్బులెఖ్ఖ చెప్పాడు.

"ఎంత దాచావు?" అని అడిగింది జ్యోతి యెదరగానే రమాదేవి.

రాజా ఒళ్ళు చచ్చి పోయింది. జవాబు చెప్పడానికి నోట మాట రాలేదు. ఆవిడకేం అనుమానం వచ్చిందో గబ గబ రాజా జేబులు తడిమింది. కళ్ళల్లో నీరు తిరుగుతున్నా బలవంతాన ఆపుకున్నాడు.

" సరే! వెళ్ళు తిని స్కూలుకుపో" అంది.

ఆ తిండి వేపు చూస్తుంటే వాంతి వస్తోంది. ఎలాగో ఆ చల్ది అన్నం యిముడ్చుకుని స్కూలుకు వెళ్తే తన కోసమే కాసుకుని వున్నట్లు కనకారావు వాచీకాట్ అని మొదలు పెట్టాడు. క్లాసులో పోలీసు ఇనెస్పెక్టరులా దొంగ నెలా పట్టుకున్నాడో నటించి మరీ చెప్పేస్తున్నాడు. ఎవరూ నమ్మలేదు అలా కళ్లప్పజెప్పి కళ్లల్లో నీరు నింపుకుంటున్న రాజాను చూసాక కనకారావు నిజం చెప్తున్నాడన్న నమ్మకం కలిగింది వాళ్ళకు. క్లాసుకు ఫస్టు వచ్చానన్న గర్వం పోయింది. లాస్టు వచ్చినవాడు ఆ గర్వం లాక్కున్నాడు. ఎలాగో ఆ రోజు బడిలో తలదించుకునే గడిపేసాడు. స్కూలునించి వస్తుంటే అరుగుమీదున్న అప్పారావు పలకరించాడు. మాటాడకండా ధర్రిన లోపలికి వెళ్ళి పోయాడు. పిల్లడ్ని యెత్తుకొని వీధిలోనికి కూడా రాలేదు. వస్తే వాడెక్కడ మాటాడుతాడో? రెండు రోజులై పోయినా వాడు తనని వదల్లేదు. ఎలాగైనా తను చెప్ప దలచినది చెప్పేయాలన్న వుబలాటతో స్కూలునించి వస్తున్న రాజాతో 'నీకు చాతకాకపోతే నాది తప్పా?' అడ్డంగా నిల్చుని ఆపి మరీఅన్నాడు అప్పారావు. రాజా వాడిముఖం వేపు కోపంగా చూసాడు. వాడు తన చేతిలోని వాచీ తీసేస్తూ—

"ఇంద—కావలిస్తే నా వాచీ తీసుకో "

" నీకో?"

' ఎన్ని వాచీలైనా తెచ్చుకుంటాను. నీలా దొరికిపోను '

' నాకు వద్దు '

" ఒకరిస్తే తీసుకోవు నీవు తెచ్చుకో లేవు. ఎందుకు పని కొస్తావ్? "

ఆక్షణంలో నిజంగా తనెందుకూ యిక పనికి రానని తోచింది. ఈ సరికి వుత్తరం రాసే వుంటారు. అందగానే నాన్న వస్తారు. బతిమాలినా రమాదేవి అత్తయ్య వుంచదు. ఆ వూర్లో యింగ్లీషు లేదు. ఎందుకు పనికొస్తాను? అప్పారావు మంచిప్రశ్నే వేసాడు.

నాన్న రాలేదు వారం రోజులైనా! పంపించేమన్న రమాదేవి తనకు బియ్యం కడిగి పొయ్యిమీద యెందుకు పెట్టమంటోంది? రాజాకు కత్తి పీటంటే భయం. ఎలాగో వంకాయలు కోసాడు. గానీ వుల్లిపాయలు కోసేటప్పుడు కళ్ళు మండిపోయాయి. ఈ మంట వల్ల మూడొంతులు కన్నీరు వస్తే ఒక వంతు యిదేం శిక్ష. తండ్రి అని యేడ్చిన కన్నీటి చుక్కలున్నాయ్. కన్నీరొస్తేపోయె. ముఖం నూతి దగ్గిర కడుక్కుని మేడమీదకు తువ్వాలు తెచ్చుకోడానికి వెళ్తే జ్యోతి అక్కడ నిల్చుంది. చేతిలో బేడపరక వాచీ యిస్తూ అమ్మకు వినపడకుండా "ఇంట్లో పెట్టక స్కూల్లో పెట్టుకో" అంది. "స్కూల్లో పెట్టుకుంటే-మళ్ళీ వాచీకాట్ అంటాడు వాడు'

' నేను దొంగతనం చెయ్యలేదు కొనుక్కున్నానని చెప్పు. ఎక్కడ కొన్నావంటే షాపు చూపించు."

ఈసారి కళ్ల నింపుగా నీళ్ళు నిండాయ్. ఇవి బాధతోకాదు. సంతోషంతో. ఈ మాత్రం తనకు యెప్పుడూ తట్టనిది జ్యోతి కెలా తట్టింది? జ్యోతి తనలా ఫస్టు రాకపోయినా జ్యోతికి తన కన్నా తెలివితేటలు హెచ్చే అనుకున్నాడు.

వేసవి శలవులు వచ్చినా రమాదేవి వంట నేర్పిస్తోంది గానీ యింటికి పంపిస్తానని అనటంలేదు. ఒకటి రెండు సార్లు అడిగితే ఒక్కడి వెలా వెళ్తావు? మీ నాన్నవచ్చి తీసుక వెళ్తాడులే అనేసింది. ఎదురు చూడగా చూడగా కన్నబాబు వచ్చాడు. ఎన్ని


చాడీలు చెప్తుందో అని చూస్తే రమాదేవి.

" బాగా చదువుతున్నాడు. డిశంబరు పరీక్షల్లో క్లాసుకు ఫస్టు వచ్చాడు. ఇప్పుడూ వస్తాడు." అంది వెళ్ళేముందు " పిల్లలతో ఒక వారం కన్న వారింటికి వెళ్ళాలను కుంటున్నాను. స్కూలు తెరచటానికి ఒక వారం రోజులు ముందుగా పంపించండి.

ఇంచుమించు ఒక ఏడాదికి స్వంతవూరు వెళ్తున్నాడు. కొన్ని బొమ్మలు పట్టుకున్నాడు. స్టేషనుకు వెళ్ళే ముందు తోవలో తాతయ్యకు చుట్టలు కిళ్లీకొట్టు దగ్గర కొన్నాడు. డబ్బులు నాన్న యిచ్చినవే.

ఊర్లో అంతా తను బాగున్నానన్నారు. కాస్త తెల్ల బడ్డాడు. ఎదిగాడు ఊరంతకూ అప్పుడే తెలిసిపోయింది తను క్లాసుకుఫస్టు వచ్చాడని తాతయ్య అప్పుడే టాంటాం చేసేసాడు. అంచేత యెక్కడికి వెళ్ళినా అంతా యీ విషయమే అడుగుతున్నారు. ' బాబూ బాగా చదువుతున్నావట. ఇంగిలీషుతో యెదిగిపోయి దొరబాబయి పోడా? ఇలా వింటుంటే యెంత హాయిగా వుంది. పట్నం గాలీ నీరు పడిందని అంతా అంటున్నారని ఆ రాత్రి కాంతమ్మ కొడుక్కి దిష్టి తీసేసింది.

సౌదామిని అత్తయ్య పట్నం కబుర్లు, చదువు గురించి అడిగింది. చదువుతున్నపాఠాలు తెలుసుకుని ప్రశ్నలు వేసింది. ఎంతసేపు అత్తయ్య దగ్గర కూర్చున్నా విసుగుండదు. ఎన్నో విష



యాలు తెలుసు తనకు ఎన్నో ప్రశ్నలడుగుతుంది తెలియక పోతే చెప్తుంది. కుమారస్వామి మామయ్య కన్నా యీ అత్తయ్యకే హెచ్చు తెలుసు.

పట్నం కబుర్లు చెప్పేసరికి అడిగిన వాళ్ళందరితో తనచదువు స్నేహితులు, స్కూలూ వూరి గురించే చెప్పాడు గానీ రమాదేవి పెట్టిన పాట్లు చెప్పలేదు. తల్లి చాటుగా ఎన్నెన్నో అడిగేటప్పుడు మాత్రం కళ్ళల్లో నీళ్ళుబికి పోయాయ్. ఏడుపు వచ్చేస్తోంది. కళ్ళు తుడుచు కున్నాడు.

" నాకల నిజమే అయ్యింది. రాపాడిం చేస్తోందన్నమాట "

" ఏం కలమ్మా...... ?"

"ఆ మధ్య పండుగ రోజుల్లో - మాసిన బట్టలతో అమ్మాఅని యేడుస్తూ కలలో కనిపించావు. మీ నాన్నకు వుత్తరం రాయమన్నాను. రాస్తే చిక్కే వెళ్ళినా చిక్కే అని అలా మనసు కట్టుకున్నాం. మరేం చేస్తాం నాయనా? ఏ చాకిరీ చేసో నాలుగు అక్షరాలు నేర్చుకుని నివ్వు మెట్టెక్కితే నా మిగతా పిల్లలని మెట్టెక్కిస్తావ్ ".

ఇంట్లో తినే పిల్లలు హెచ్చు అయ్యారని వాళ్ళకోసం పెద్దవాళ్ళు కాస్త నోరు కట్టుకుంటున్నారని పెద్దలరూపులే చెప్తున్నాయ్. తను వేగరం గడిస్తే తాతయ్యకు తన దగ్గరకు తీసుక పోతానను కున్నాడు. తండ్రి యిదివరకన్నా హెచ్చు ప్రయివేట్లు చెప్తున్నాడు. అమ్మ చెవిలోనూ ముక్కులోనూ బంగారం అమ్మినట్లుంది. చేతిలో పూర్తిగా గాజు గాజులే. పిల్లలు పెరుగుతున్నారని యివన్నీ అమ్మించేసి గ్రాంటు డబ్బు కలిపి చిన్న పొలం కొన్నారట. ఈ యేడు దాని ఫలసాయం కొంత వస్తుందట.

ఇవన్నీ విని వూరులో ఒక నెలవుండే సరికే విసుగెత్తేసింది. ఇది వరకువున్న హాయిలేదు. మళ్ళీ పట్నంలో, స్నేహితులు జ్యోతి వీళ్ళంతా జ్ఞాపకానికి వస్తున్నారు. చదువు పాఠాలు, స్కూలు అంతా అటువేపు లాక్కుంటోంది. తండ్రితో కలసి తిరుగ విశాఖ పట్నం వెళ్ళేసరికి జోగయ్య యిచ్చిన ఖరారు ప్రకారం అక్కడే వున్నాడు. కుర్రాడు క్లాసుకు ఫస్టువచ్చాడని తెలిసి తన కొడుకు పిల్లలతోపాటు రాజుకు రెండుజతల డ్రెస్సులు కుట్టించాడు. ఏడాది జీతం, పుస్తకాలకు సరిపడ్డ డబ్బు కొడుకుచేత పెట్టాడు. ఈ శలవుల్లో యింటికి ఒక కొత్త వెలుగు వచ్చింది. ఇంట్లోకి యెలక్ట్రిక్ దీపాలొచ్చాయి.

జోగయ్య యీసారి కన్నబాబుతో కలసి తిరిగి వెళ్ళిపోయాడు. వెళ్ళే ముందు మనుమరాలు జ్యోతికి ఒక చిన్న బంగారం గొలుసు యిచ్చి మరి వెళ్ళాడు. అదివేసుకున్న కూతురివేపు పదేపదే చూసిన రమాదేవి కూతురప్పుడే యెదిగి పోయినట్లు! యింట్లోయేమీలేనట్లు...

" ఇలా యేవేవో కూర్చుకుంటే గానీ లాభంలేదు. ఆడపిల్ల యెదిగి పోవడం యెంతసేపు? "

ఈ ఆరాటంతో ఒకసారి పుట్టింటికి యేడాది కొకసారైనావెళ్ళక పోతే ఆ తలిదండ్రులు ఆడపిల్లలున్నారని మరచిపోయి అంతా కొడుకుల పరం చేస్తారన్నబాధ. అందుకే వారం రోజులు కోసం పిల్లలతో మకాం కట్టింది. వెళ్ళేముందు రాజును చాటుగా పిల్చింది. డబ్బులిచ్చి " వాచీ అంటే సరదాకదా—కొనుక్కో! నేనుండను. ఇల్లు జాగ్రత్త. ఇంకా బడికి శలవులేకదా. ఇంట్లోనే వుండు. ఊర్లో స్నేహితులతో తిరుగుతూ కూర్చోక టైముకు వంట చెయ్యి. మీ మామయ్యను ఒక కంట చూస్తుండు." అంటూ చేతిలో ఒక కోవాబిళ్ల పెట్టి " నేను తిరిగి వస్తాను. ఎవరెవరొచ్చారో చెప్పు".

' ఎందరో వస్తారు కదా........"

' మొగాళ్ళ సంగతి కాదయ్యా! ఆడవాళ్ళ మీద దృష్టిపెట్టు'

' వాళ్ళ పేర్లు యెలా........"

' పేర్లు తెలియక పోయినా యెలాంటి చీర కట్టారో—ఏం పువ్వులు పెట్టారో, యెలా ముస్తాబయ్యారో........"

' అలాగే........'

రమాదేవి అత్తయ్య పిల్లలతో కన్న వారింటికి వెళ్ళి పోయింది. తొలి రోజే తన వంట రమణయ్య మామకు నచ్చినట్లుంది. ' మీ అత్తయ్య కన్నా బాగా వండుతున్నావోయ్" అన్నాడు.

ఆ రాత్రి తన కింక చాప మీద కాదు పడక. గదిలోనే యింకో మంచం మీద పడుకోమన్నాడు. దూది పరుపు కానీ నేల మీద చాప అలవాటై పోవటం ఒకంతట నిద్రపట్టలేదు.

అలవాటు లేనిది కళ్ళు మూసినా నిద్ర రావటంలేదు. రమణయ్య యెంత రాత్రివరకో యేదోపుస్తకం చదువు కుంటున్నాడు. చదువయ్యాక ఆ పుస్తకాన్ని తలవేపు పరుపు క్రింద పెట్టుండగా క్రీగంట రాజు చూసాడు. తాతయ్య రామాయణం తల క్రింద పెట్టుకున్నట్లు రమణయ్య మామయ్య రామాయణంలాంటి పుస్తకం తలక్రింద చదివి పెట్టుకుంటే నిద్రలో మంచి మంచి కలలు వస్తాయేమో? మూడు రోజులై అదే చేస్తున్నాడు.

నాలుగో రోజు తన మిత్రుడు కాసరాజు వచ్చాడు. అతను లైట్ హౌసు సినిమాహాలు పది మంది పార్టనర్సులో ఒకడు. అందులో యింగ్లీషు సినిమాలే వేస్తారు. ఆహాలు ఫ్రీ. రమణయ్య రాజును కూడా సెకెండ్ షోకు తీసుక వెళ్ళాడు. 'శిధిలానగరం' అబ్బా! ఏం పోట్లాటలు. మరునటిరోజూ అదే హాలు సినిమా ఈసారి టార్జాన్! బలే బాగుంది. పులులూ, సింహాలూ, యేనుగులూ మూడోరోజు రమణయ్య ఒక్కడే సినిమాకి వెళ్ళాడు. ఆ సినిమా పిల్లలు చూడకూడదట. పైనుంచి తలుపు తాళం వేసుకొని వెళ్ళిపోయాడు. గదిలో లైటు వుంచి పడుకోమన్నాడు. భయమైతే పెరటి తలుపుతీసి పెరటి పిల్లలెవరినైనా పిలమన్నాడు.

అతను వెళ్ళిపోయాక కొంత సేపు చదువుకున్నాడు. తరువాత చప్పున రామాయణం జ్ఞాపకానికి వచ్చింది. ఆ పుస్తకం యేమిటో నని పరుపెత్తగా ఆ పుస్తకం కనపడింది. మెల్లగా తీస్తుంటే చప్పున అందునున్న కొన్ని ఫొటోలు క్రిందకు జారాయి. గబగబ అవి యెత్తుతుంటే ఆ ఫొటోలు—'అమ్మబాబోయ్ —చూడలేం ' అని కళ్ళు మూసుకున్నాడు. ఒంటిమీద బట్టలులేని ఆడమగ ఫొటోలు ఆ పుస్తకం యేమిటనిచూస్తే తెలుగులో " కొక్కోకం " అని రాసుంది. అందులో యేవో మంత్రాలు-తంత్రాలు ఆ పుస్త

కంఠంలోనూ బూతు బొమ్మలే! అన్నీ సర్ది పెట్టేసాడు రాజు. మళ్ళీ పుస్తకం పరుపు క్రింద పెట్టేముందు ఒకసారి చప్పున ఆ బొమ్మలు చూసేసాడు. బొమ్మలు బాగున్నాయ్. బట్టలు కట్టుకుంటే మరీ బాగుండేవి అనుకొని జాగ్రత్తగా యెక్కడినించి తీసాడో అక్కడే పెట్టేసాడు. పెట్టేసాక యేమీ యెరగనట్లు దీపం అలా వుంచే పరుపుమీద పడి కళ్ళుమూసాడు. రమణయ్య మామయ్య వచ్చేసరికి తెలిసివుంది కానీ నిద్రపోతున్నట్టే నటించాడు.

ఆ మరుచటిరోజు సాయంత్రం వంట చేస్తుంటే ఆఫీసులో ఒక గొంతుక వినిపించింది. ఎవరితను "రమణయ్య బావ" అంటున్నాడని తలుపు సందులోంచి చూస్తే యెంచక్కా చీర కట్టున్నది కనిపిస్తోంది. ఈ ఆడమనిషికి మొగ గొంతుక యెలా వచ్చిందో? ఈవిడ కోసంకూడా వండాలేమో? 'బావని పిలుస్తోంది. ఏం చీర కట్టిందీ? పువ్వులచీర. తెల్లచీర మీద నీలిరంగు పూలు. ఎర్ర జాకట్టు తొడిగింది. ముడి వేసిన జడమీద వాడం బరాల పువ్వులు ముడిచింది. ఈ వర్ణనంతా రమాదేవి అత్తయ్యతో చెప్పజెప్పాలి కదా మరి! ఒంటిమీద నగలున్నాయ్. తెల్లగానేవుంది. రమాదేవి అత్తయ్యకన్న కాస్త శరీరం పుష్టిగా వుంది. ఈ మరదలిని చూసి రమణయ్య మామ నవ్వుతున్నాడు.

పొయ్యిమీద అన్నం పొంగి పోతోందని వంట యింటికి వెళ్ళాడు. అన్నం గిన్నె వార్చి, చారుకోసం పోపువేసి అన్నీ చేసుకుని తిరిగి వచ్చే సరికి ఆ మరదలు వెళ్ళిపోయింది. ఇక రెండు రోజుల్లో రమాదేవి అత్తయ్య వచ్చేస్తోందని ఒక రోజే సినిమాకి తీసుక వెళ్ళాడు. సినిమానుంచి తిరిగి వస్తుండగా " మీ అత్తయ్య యెన్ని సినిమాలకు వెళ్ళారని అడిగితే లేదని చెప్పు''.

"అలాగే మామయ్యా" అన్నాడు.

ఆవిడ రానే వచ్చింది. కన్న వారింటి నించి చాలా సరుకులు మోసుకొచ్చింది.

' ఇక్కడ దొరకనట్లు ఆ బెల్లం దిమ్మెకూడా యెందుకు మోసుకొచ్చావ్?' అని మొగుడు అంటే ' వాళ్ల దొడ్లో కుంకుడు కాయలు చెట్లున్నాయని కుంకుడు కాయలుకూడా తెచ్చాను" అంది. అతను కోర్టుకు వెళ్ళిపోయాక తినడానికి యేన్నో యిచ్చి తినేక '' రాజూరాజూ-నేను లేనప్పుడు యెన్ని సినిమాలకు వెళ్ళారు? " 'లేదత్తయ్యా ...... " 'అన్నీ తిన్న నోటితో లేదని అబద్ధం యెలా చెప్తున్నావ్?' 'లేదత్తయ్యా'

అబద్ధం ఆడటంకూడా వచ్చన్నమాట? నాకు తెలీదా? రోజూ సెకండ్ షోయేనా?'

'ఒక్కసారే ...' అనేశాడు కంగారుగా.

' అంటే ఒక్కరోజే వెళ్ళలేదన్నమాట. లేక నిన్ను ఒక్కసారే తీసుకు వెళ్ళారా? సరేలే మరిచెప్పు—ఎవరైనా ఆడవాళ్ళు వచ్చారా? ఇప్పుడూ అబద్ధం చెప్తావా? "

ఇది చెప్పొద్దని రమణయ్య మామయ్య అనలేదుగా అందుకే ధీమాగా

"ఒక్క ఆడమనిషినే చూసాను"

' ఎలాగుంది? '

"తెలుపుమీద నీలిపువ్వులచీర కట్టుకుంది. ఎర్రని జాకట్టు వేసుకుంది. మరి తలలో కనకాంబరాలు పువ్వులు ముడుచుకుంది. తెల్లగా వుంది. బావా అని పిల్చింది."

" నగలున్నాయా? "

' ఉన్నాయి—కానీ...."

' ఏంటి? "

" మగాడి గొంతుక...."

' కొందరి ఆడవాళ్ళకి మగ గొంతుకలూ-కొందరి మగవాళ్ళకి ఆడగొంతుకలూ వుంటాయిలే ...సరే నివ్వెళ్ళి యీరోజుకు ఆడుకో నీ స్నేహితులతో...."

రాజు స్నేహితుల యింటికి పరుగెత్తాడు

కోర్టునించి యింటికి వచ్చాడు రమణయ్య. రమాదేవికి కంపరం యెత్తుకొచ్చింది. ఏ టైంలో శివాలేస్తుందో తెలియదు. ఈ అవతారాన్ని చూసి మొగుడు గజ గజలాడి పోతున్నాడు.

' ఏం అలాగున్నావ్" అన్నాడు నెమ్మదిగా

" ఇల్లు వదిలి యెక్కడకూ వెళ్ళలేను? "

" ఏం యిల్లు శుభ్రంగానే వుంచాం "

" ఇది సంసారికొంపా? సానికొంపా? "

" ఏసానిని తెచ్చినేను ఆడించలేదే! "


" ఎందుకు నా కళ్ళు మూస్తారు? "

" అబ్బబ్బే—నీ దృష్టి లోపం వుండాలి. "

" నా దృష్టిలోపమా? నీలి పువ్వుల చీర, ఎర్రని జాకట్టు తలలో కనకాంబరాలు....బావా అని పిల్చింది. నాకళ్ళే కప్పండి'

అంటుంటే రమణయ్య పకాపకా నవ్వుతున్నాడు. ఎప్పుడూ నవ్వురాని రమణయ్య యిన్నాళ్ళూ అణిచి పెట్టి నవ్వంతా కక్కుతూ అలసిపోతుంటే యితనికేం పిచ్చి పట్టిందేమోనని.... ....

' ఎందుకండి అలా నవ్వుతారు? సిగ్గులేకపోతే సరి ' అంటే యింకా పక్కలెగరేసుకుని నవ్వుతూ....



" వాడే....షోకుల శేషయ్య...." ఇంకా నవ్వుతూ "కొజ్జావాడే ఎవడో కేసు బనాయిస్తే వకాల్తా యివ్వడానికి వచ్చాడు...." కాస్త నిట్టూర్చి నవ్వుని దూరంచేసి "కొజ్జావాళ్ళు మగాళ్ళందర్నీ బావలనే పిలుస్తారే....వాడు తరువాత వస్తాడు పరిచయం చేస్తానులే....'

ఈసారి రమాదేవి పకాపకా నవ్వడం మొదలెట్టింది.

11

రాజు వూహలు పెరుగుతున్నాయి. ఇది తెలియదు. ఇది తెలియదు చెప్పమని స్కూల్లో యెదిగే పిల్లలే తనను అడుగుతున్నారు. ఇంట్లో రమాదేవి మారలేదు. ఊహల్లో యెదగలేదు. ఈ మూడేళ్లూ అవే మాటలూ అవే అరుపులు కేకలు, అవే ఆజ్ఞలు. ఆ రోజుల్లో కష్టం అనుకున్న పనులు వయసులో యెదగడంవలన సులువనిపిస్తోంది రాజుకు. ఆవిడ రెండో కొడుక్కు యిప్పుడు మెత్తుకోవడం అడించడం మొదటికొడుకులా కష్టం అనిపించలేదు. ఇది వరకు నిజమని నమ్మిన ఆమె మాటలు కొన్ని యిప్పుడు కోతలని స్పష్టంగా తెలుస్తోందిరాజుకి. ఇంట్లో కూతురు తెలివైనదని అందరితో చాటుకున్నా కూతురుకు రాని లెఖ్ఖలెన్నో తను చెపుతున్నాడు. ఇలానూ ప్రయివేటు మాష్టారి అవసరం తప్పింది, ఒకందుకు తండ్రి పల్లెటూరి బడిలో లెఖ్ఖల్లోవేసిన గట్టి పునాదిమీద తన తెలివి తేటలన్నీ పై కొస్తున్నాయ్. రమాదేవి యిదివరలా యేదేదో అంటున్నా అవి అంత పట్టింపు చేసుకుని బాధపడే తత్వం నించి బయట పడుతున్నాడు. ఆవిడ యేమీ అనక పోయినా యే బెడదా లేనట్లు చిరాకెత్తుతోంది,

మొదటి. రెండవ ఫారంలో ఆల్‌రౌండ్ ఫస్టు వచ్చానన్న తృప్తి తప్పించి పెద్ద పుత్తేజపరిచే సంఘటనగానీ బాధపడి మనసు కల్లోల పరచుకునే పరిస్థితిగానీ రాలేదు. స్కూలు, పుస్తకాలూ, పుస్తకాల్లో రాసింది చదవటం, చదివిన దానిబట్టి పరీక్షలు రాయటం అంతా ఒక సీదా సాదాలా జరిగిపోతే మూడవ ఫారంకి వచ్చేసరికి గాదె నారాయడుని జ్ఞప్తికి చేసుకునే క్లాసు టీచరు తారసపడ్డాడు. నారాయుడుతో ఒకరోజు అనుభవం ఆ అనుభవం తెచ్చిన మనోల్లాసం యీ నాటికీ గుర్తుంది కానీ యీ క్లాసు టీచరుతో ప్రతి రోజూ ఒక అపూర్వానుభవం. కృష్ణారావు యింటి పేరుకు తగ్గట్టు భావంలో రాజే: అతని తెల్లని ఖద్దరు దుస్తులు, పంచె దిగువగా ఆకు చెప్పులు భుజంమీద తెల్లని ఖద్దరు కండువా వ్రేలాడుతుంటుంది. పగడం ఛాయ మనిషి. పుష్టిలేని పగడం వుంటుందా అన్న సంశయం రేకెత్తించడు. వారం రోజుల్లోక్లాసు పిల్లల తత్వాన్ని పసిగట్టేసాడు. ఒక రోజు క్లాసులో చప్పున ఒక్కొక్కర్నీ "నిన్నటి పేపర్లో అతిముఖ్యమైన బోగట్టా చెప్పండి' అంటే యెవరికి తోచింది వాళ్ళు చెప్పారు. తోచని వాళ్ళు కొందరు తెల్లముఖం వేసారు. మరి కొందరు యేదో ఒక సమాధానం చెప్పి యెద్దుకన్నా అధ్వానమయిన మొద్దులని నిరూపించుకున్నారు.

మోహన్‌దాస్ దేశంలో జరిగిన విశేషమైన వార్త చెప్పితే. రాజు ఇంగ్లండులో జరిగిన వార్త చెప్పగానే కృష్ణారావు చప్పున కుర్చీదిగి రాజు భుజం తట్టాడు. ఇంట్లోకి పేపరు వస్తుంది. కాబట్టి రాజు రోజూ పేపరు చదవడం అలవాటు చేసుకున్నాడు.

జలియన్‌వాలాబాగ్ హత్యలకుకారకులైన వారిలో ఒకవ్యక్తి మైకేల్ ఓడయర్‌ని ఒక దేశ భక్తుడు హత్య చేసాడు. లార్డ్ జెట్లండ్ ఒక చెయ్యి తెగిపోయింది కదా. ఈ దృశ్యాన్ని మీ కాంపోజిషన్ పుస్తకాల్లో యెడమవేపు బొమ్మవేసి, కుడివేపు వివరంగా అరవై పంక్తులకు మించకండారాసి యెల్లుండి నాకు చూపించండి " అన్నాడు కృష్ణారావు.

ఎన్నాళ్ళకు పుస్తకాలలో లేని విషయం. తన స్వంత ఊహలతో చక్కగా రాయాలన్న తహతహ, బాగా రాయాలన్న పట్టుదల అందరూ రాసినవి చూసాక.

' ఈ క్లాసులో మనిషి కొక పేరుంది కదా. ఈ పేర్లలో ముందు ముందు కొన్ని పేర్లయినా వూరుదాటి రాష్ట్రం దాటి యెందరికో పరిచయమౌతాయి " అన్నాడాయన. ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు విద్యార్థులు.

క్లాసు పుస్తకాల ప్రభావం తగ్గించి, కొత్త పుంతలు తొక్కిస్తున్నాడు. ఒక విషయం యిచ్చి దానిగురించి క్లాసులోనే వక్తలను తయారు చెయ్యటం మొదలు పెట్టాడు రాజు వక్తగా రాణించలేదు ఏంటో మాట్లాడ్డానికి పిరికి వచ్చేసింది. బాగా మాట్లాడిన వాడు మోహన్‌దాసు. కొన్ని డిబేటులు చూసాక క్లాసులోనే " మోహన్‌దాస్ ! ఎంత బాగా చదివినా నీవు యింకో వృత్తిలో రాణించలేవు. నివ్వు లాయర్ కావలసిందే" అన్నాడు.

క్లాసులో యేదో ఒకరోజు, యెవరో ఒక విద్యార్థికి యేదో యిలాంటి యోగ్యతా పత్రం దొరుకుతోంది. రాజు వరకు యింకా రాలేదు కొన్నాళ్ళు పోయాక.

"ఈ క్లాసులో తెలుగులో ఒక రాత పత్రిక ప్రారంభించాలి. అందులో యీ క్లాసు పిల్లలు రాసినవే వుండాలి సేకరించి ప్రచురించే బాధ్యత రాజశేఖరానికి అప్ప చెపుతున్నాను. గడువు నెల రోజులు "

ఏం పేరు పెట్టాలి దగ్గరనించి వచ్చిన వాటి నించి యెంచుకుని వేసే బాధ్యతను తనకే అప్పచెప్పగానే ఓ క్షణం వణికి నా మరో క్షణంలో పట్టుదల వచ్చేసింది. ఈ పని పూర్తి చేస్తే గానీ తన యోగ్యతా పత్రం క్లాసు టీచరు నోటినించి రాదు. రాత పత్రికకు "విద్యార్థి" అని నామకరణం చేసాడు, అది సులువే. వచ్చినవి చదివి వెయ్యటంతోపాటు, తనుకూడా రాయాలన్న షరతువుంది. రాసే విషయం గురించి ఆలోచించగా యెన్నెన్నో తట్టున్నాయ్. సత్యం చావు గురించి రాయాలనుకుని చావుతో పత్రికలో తొలి రాత యెందుకని యింకా ఆలోచిస్తున్నాడు. అప్పుడు చప్పున యీ వూర్లో జరిగిన సంఘటన జ్ఞప్తికి వచ్చింది. ఇలా అసలు జరిగిన విషయాన్ని తెలియపర్చుకోవచ్చును. ఆ కనకారావుకు, రెండుసార్లు ఫెయిలయిన కనకారావుకు యీపత్రిక చదవడానికి యివ్వొచ్చు. అనుకుని స్వంత లాభంకొంత, యీ అనుభవం కళ్ళకు కట్టినట్లు రాయొచ్చునన్న ధీమాతో "సహవాసం" అన్న

ఒక కథ రాసాడు. అనుకున్న త్రైంకు పత్రిక క్లాసులో కృష్ణారావు మేష్టారు విడుదల చేసారు. ఆవేళ పత్రికను తన యింటికే తీసుక వెళ్ళాడు. ఈ పత్రిక కూర్పు సారథ్యం రాజశేఖరందియైతే, దస్తూరి వెంకటేశ్వరరావుది. బొమ్మలు నళినీ కాంతారావువి. మోహన్‌దాసు సహాయ సంపాదకుడు-విద్యార్థులు చేయదగిన పనులు గురించి రాయమంటే స్వరాజ్యం గురించి రాసాడు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ బొమ్మ వెయ్యించాడు తను రాసిన వ్యాసం యెదరగా.

మరుచటిరోజు క్లాసులో కృష్ణారావు అన్నాడు. 'మొదటినించి చివరిపేజీవరకు నిన్నరాత్రి చదివేసాను. బాగా రాయాలన్న తపన కనిపించింది. ఇందులో కొందరు ప్రయత్నిస్తే ముందు ముందు మంచి రచనలు చెయ్యగలరు. పుట్టకతోనే రచయిత అనిపించుకోగల మెరుపుతో ప్రకాశిస్తున్న వాళ్ళు ఒక్కరైనా వున్నారేమోనని చూసాను. ఒక్కడే వున్నాడు 'సహవాసం' కథ రాసిన రాజశేఖరం'

అంతతో వూరుకోక ఆ కథని తను యేయే క్లాసులకు వెళ్తాడో అన్ని క్లాసుల్లో చదివి వినిపించాడు. మిగతా టీచర్లకు రికమెండ్ చేసాడు చదవమని. రాజశేఖరం పేరు, విద్యార్థి రాత పత్రిక స్కూల్లో ప్రాకి పోయింది. స్కూలు రోజున రాజశేఖరంతోపాటు మరో నలుగుర్ని స్టేజి యెక్కించాడు. ఈ నాటిక రక్తి కట్టింది.

మనోధైర్యాన్ని వుత్తేజాన్ని ప్రసాదించిన కృష్ణారావు మేష్టారు పై క్లాసులకు వెళ్ళినా రాజశేఖరం మరువలేదు. శలవులు వస్తున్నాయ్ పోతున్నాయ్ రాజుకు అన్నం దీక్ష తగ్గి. అక్షరదీక్ష హెచ్చయింది. శత్రుత్వం లేక మిత్రత్వంతో మెసలడానికి ప్రయత్నిస్తున్నాడు. వయసుతో అవగాహన పెంచుకుని చీకటి గదిలోనికి వెలుగు చొచ్చుకుంటున్నట్లు తన బాధ్యతలను తెలుసుకుంటున్నాడు. అన్నం అరగడియలో అరగిపోతుందని ఆదరణ శాశ్వత ఫలితాలను యిస్తుందని లోకరీతిని తాతయ్య యీసారి శలవుల్లో చెప్పగా అర్థమైంది. అయినా లోనున్న ద్వేషం ఇంకా చావదుకదా. రమాదేవి అరుపులు తాతయ్యతో చెప్పుకుంటే

'ఆవిడ మన దగ్గిర చుట్టం కాదు. అన్నం పెట్టి ఆదరించి విద్యాదానం చేస్తోంది. ఆమె యీ సుగుణాన్ని యెందుకు ఆలోచించవు? ఆమె కేకలే ఎందుకు తీసుకుంటావ్? ఏడవకు ఏడుపు యేడింటికి అనర్థం.' అన్నాడు తాతయ్య.

ఏడవటం తగ్గిస్తే ఆవేశం వస్తోందిప్పుడు. పేదవాని కోపం పెదవికి చేటన్నట్లు రాజు అవేశపడి యేం చేస్తే యేం అనర్థం వస్తుందోనన్న జాగ్రత్తతోనే వుంటున్నాడు. ఎంత జాగ్రత్తతోనూవున్న ఈ ఆవేశం అనుకోకుండా పెళ్ళుబుకుతోంది. ఆనకట్టను తోసుకొని వుబికే ప్రవాహంలాంటిదీ ఆవేశం. ఎదిగే శరీరంలో రక్తం పొంగుతూ ప్రవహిస్తుందేమో? ఎక్కడో ఒక ప్రముఖ రాజకీయ నాయకుని జైల్లో పెట్టారని యిక్కడ స్కూలు గేటు దగ్గర యీ హడావుడేమిటి? ఈ హర్తాల్ శాంతియుతంగా జరపండని చెప్పే పెద్దల చేతినించి జారి స్కూలు పిల్లల పర
మైంది. అందుకే కంకరరాళ్ళు బాణాల్లా యెగిరాయ్. పోలీస
లొచ్చారు. లాఠీచార్జి చేసారు. అరిచారు గానీ చేతిలోవున్న
రాయిని మాత్రం రాజు విసర్లేదు. కానీ ఆ గందరగోళంలో పో
సుల లాఠీ చివర ఒకటి రాజు నుదుటిమీద పడి పెద్ద బొడి
కట్టేసింది. ఇంటికి వెళ్ళకండా యెంతసేపు వుంటాడు? ఇంటి
వెళ్ళగానే తన కోసమే కాసుక్కూర్చున్నట్లు రమాదేవి పని బెత
యించడానికి పిలిచి, నుదుటిమీద బొడిపిచూసి యేమైందని అ
గింది. కాస్త బెదురుతూనే

"పోలీసులాటి.. ...."

"స్కూలుకి వెళ్ళే ముందు యేం చెప్పాను? "

"నేను రాయి విసర్లేదు అత్తయ్యా? "

"గొడవగా వుంటే వచ్చేమన్నానా లేదా? "

"చెప్పావు? "

"అయితే యెందుకు దగ్గరగా వెళ్ళావు? ఎందుకరిచావ్?'


"మా క్లాసు పిల్లలందరూ అరిచారు."

"వాళ్ళకేం? నీలా బరువు లెత్తవలసిన అవసరం లేదు. నివ్వు జైల్లో కూర్చుంటే ఆ బరువు లెవరెత్తుతారు? పెరుగుతున్న బుద్ధికి గడ్డి తినిపించకండా వండిన రుచులు తినిపించు తిన్నగా రేపు బడికి వెళ్ళకపోతే నీపని పట్టిస్తాను."

కిక్కురు మనకండా వూరుకుని ఆమె చెప్పిన పనులన్నీ చేసాడు. ఇంట్లో జ్యోతికూడా వుంది. ప్రొద్దున్న స్కూలుకు వెళ్ళిందే-అక్కడ గొడబలు చూసి వచ్చేసుంటుంది. పిరికి పిల్ల అమ్మ వంట యింట్లో వుండటం చూసి అమృతాంజనం సీసాతెచ్చి ఆబొడిపికి రాయమని మూత విప్పింది. కొద్దిగా తీసి రాసుకుంటుంటే 'స్కూల్లో నేను కాంగ్రెస్ జెండా యెగరేసాను' అంది.

"పోలీసులు లాటీలతో కొట్టలేదా? "

"అబ్బే! మేం గాంధీ మహాత్ముడు చెప్పినట్లు చేసాం. ఎందుకు కొట్టారు? "



‘ ఏం చేసారు? ’

“ రాళ్ళు ముట్టుకో లేదు ”

మరుచటి రోజు పుస్తకాలు పట్టుకుని స్కూలు గేటు దగ్గరికి వచ్చిన రాజునుచూసి తన స్నేహితులే అరిచారు.

“ దొరల నమ్మకమైన బంటు” పెద్ద వాళ్ళు అన్నట్లే ఒక కుర్రాడు అన్నాడు. ఇంకొకడు వెనుక కాగితమేదో అంటించాడు. మరొకడు వెనుకనించి జుత్తు లాగాడు. తలవంచుకుని పోలీసులు కావలావున్న గేటు నించి లోనికి వెళ్ళగానే కొందరు సిగ్గు సిగ్గు అని అరిచారు. పిల్లి అరుపులు గాడిద సకిలింపు. నక్కల రోదన. తన క్లాసులో కూర్చున్నవాడు ఒక్కడే. క్లాసు రూములో కూర్చున్నాక యేడుపు వచ్చేసింది.

మరుచటి రోజుకు సమ్మెపూర్తయింది. క్షమాపణ పత్రాలు యిస్తేగానీ సమ్మెచేసిన వాళ్ళను క్లాసులోనికి రానియ్యలేదు. మిగతా అందరూ రాజువేపు కొరకొర చూస్తున్నారు. రాజు సిగ్గుతో తల దించుకున్నాడు. అప్పుడు తలెత్తి చూస్తే నింగిలో విహరించే విహంగంలా ‘ మోహన్‌దాసు ’ కనిపించాడు. తను ఆ పత్రాన్ని సంతకం పెట్టడానికి ఒప్పుకోలేదు. మోహన్‌దాసును మాష్టరు దగ్గరకు తీసుక పోయారు. మూడో రోజుకుగ్గాని మోహన్‌దాసు క్లాసుకు రాలేదు. తన బదులు తండ్రి ఆ పత్రాన్ని సంతకం పెట్టినట్లుంది.

12

పెంచలయ్య ముప్పయేళ్ళు గవర్నమెంటు నౌఖరీచేసి రిటైరయిన మనిషి. ఉద్యోగంలో వున్నప్పుడు వుప్పుతిన్నాడో పప్పు తిన్నాడో గానీ యిప్పుడు పెన్షను రాళ్ళతో యెలాగో వచ్చడి మెతుకులు తిని సంసారం యీదు కొస్తున్నాడు. ఇన్నాళ్ళు చేసిన సేవకు కొన్నాళ్ళయినా సుఖపెట్టగలిగే డబ్బు సంపాదించుకోలేని అనెష్టు వుద్యోగి తను. సూర్యుడస్త మించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని యెన్ని సింహాలు సవాలుచేసినా మూతి కాల్చుకుంటాయని తన వాదన. రోజూ సాయంత్రం రమణయ్య యింటికి పేపరు చదవడానికి వస్తుంటాడితను. ఇతనొక్కడూ ఒక పార్టీ మిగతా వాళ్ళంతా ఒకటి, హిట్లరు ప్రపంచాన్నే జయించేస్తాడు. మన దేశానికి వాడే స్వతంత్రం యిచ్చేస్తాడని మిగతా వాళ్ళంటే యిదంతా తొలివేడి-చల్లారి పోతాదుండండి అని నెమ్మదిగా సమాధానం చెపుతుంటాడు.

“ఎందుకిలా యీ దొరలని కొలుస్తున్నావని ” ఒకడు అడిగేసాడు. ఇదే రాజు మనసులోనూ తిరిగిన ప్రశ్న.

“న్యాయం వున్నచోట నలిగినా నన్ను చంపదు. అన్యాయం వున్నచోట యెదిగిపోతే నన్ను నరికేస్తారు.” పెంచలయ్య అంటే రాజుకు “సర్పంబు పడగ నీడను గప్పవసించిన విధంబు’ అన్న సుమతి శతకంలోని పద్యం గుర్తుకొచ్చింది. అదే యితను వేరే మాటలతో చెపుతున్నాడు,” వాడేదో మనకి వూడ బొడి చేస్తాడని స్వలాభంతో హిట్లర్ పక్షం మీరు వహిస్తున్నారుగానీ........దండెత్తే వాడు న్యాయం యెక్కడాలోచిస్తాడు? ఆ దండయాత్రను ఆపే వాడిలో న్యాయం వుంటుంది. అన్యాయపు మనిషికి బానిసగా బ్రతుకుతారో న్యాయపు మనిషి కృతజ్ఞతను స్వీకరిస్తారో తేల్చుకోండి’ అన్నాడు పెంచలయ్య.

ఎన్నోవేలమైళ్ళ దూరంలో యూరప్‌లో యుద్ధం జరుగుతుంటే యీ మారుమూల సందులో యిక్కడ న్యాయ న్యాయాల బేరీజు సామాన్యులు వేస్తున్నారు. “ ఇది యీ దేశపు అనాదినించి వచ్చే ఆచారం. రావణాసురుడి అన్యాయాన్ని చీదరించుకుని రాముని న్యాయాన్ని వుడతకూడ సమర్థించి వుడతా భక్తి అన్నట్లు వారధి కట్టడానికోరాయిని మోసింది. ఈ దేశంలో చాలామంది మంచి చెడ్డల బేరీజువేసిన వాళ్ళేగానీ ఉడతలా ఒక రాయిమోసినవారు కాక పోవటంవల్ల ఏ కాలంలోనూ యెక్కడున్నా యెక్కడికి వెళ్ళినా తెడ్డుయేగాని బతుకులు మనవి. అందితే జుత్తు అందకపోతే కాళ్ళు ఎక్కితే గుర్రపు రౌతు, దిగితే కాలిబంటు. ఎక్కడి బరువు అక్కడే వుంచి కర్మని-యెత్తమనే సోమరులంమనం ”

పెంచలయ్య పెల్లుబికినట్లు ఆవేశంతో మాటాడినా అందులో న్యాయం సత్యం పొంచినట్లనిపించింది రాజుకి. ఆవేశపడినా న్యాయన్యాయ విచక్షణ చేయవచ్చును. కానీ దానికెంతో అభ్యాసం కూసు విద్యలా రావాలి.

ఈ ఊహలు అర్థం చేసుకొన్నాక పరీక్షల్లో తెలుగు పేపర్లో రాసిన వ్యాసం యెందరి మన్ననలో పొందింది. తెలుగు మాష్టారు తనదీ, మోహన్‌దాసు, వెంకటేశ్వరరావు, నళినీ కాంతారావు పేపర్లు క్లాసులోనికితెచ్చి

“ ఈ నాలుగు పేపర్లుచూసి మార్కు లెయ్యడానికి తీసుకున్న టైంలో మిగతా క్లాసు పేపర్లన్నీ దిద్దేశాను’ అంటూ ఆ పేపర్లోని రాజు పేపరుతీసి ముద్దు పెట్టుకున్నాడు. తను రాసిన “ న్యాయ న్యాయాలు’ అన్న వ్యాసం చదివాడు.

“ఒకరో విషయాన్ని సంఘటనను ఒకలా అర్థం చేసుకుంటారు. ఇద్దరు చేసుకున్న రీతులను తెలుసుకుని తనకు తోచినట్లు అర్థం చేసుకోవడమే చదువుకదా రాజశేఖరం’ అని నలుగురూ వేళాకోళం చేసి చులకనగా చూసే పెంచలయ్య అనగానే చదువుయొక్క నిజ స్వరూపం తెలుసుకున్నట్లనిపించింది రాజుకు.

ఈ వూహతో చూసేసరికి విశాఖపట్నం చప్పున పెరిగి పోతున్నదనిపించింది, ఇన్ని యేళ్ళ వరకు పలుచగానున్న మనిషి ఒక్కసారి వుబ్బిపోయాడా అనిపించినట్లు పెరుగుతోంది. “ ఇది ఉబ్బువ్యాధి కాదు. ఇది ప్రగతి.” అన్నారు. ప్రగతికి మొదటి చిహ్నం నరకడం. ఊరు శివార్లలోవున్న పచ్చని చెట్లు నరుకుతున్నారెప్పుడో అప్పుడే యీ ప్రగతి పథం ప్రారంభమైందనుకున్నాడు. మిలటరీవాళ్ళు కట్టడాలకు కావలసిన కూలిజనం పాకలు అక్కడలేచాయ్. చెట్లు నరకబడినట్లు మనుషుల్లో పాతుకున్న బంధాలుకూడా నరకబడుతున్నాయ్. అక్కడక్కడా దొంగతనాలు ఎక్కడికక్కడే మురికి కూపాలు లెగుస్తున్నాయ్. వూర్లో డబ్బు ఆడుతోంది. అడుక్కునే వాళ్ళ సంఖ్యా తగ్గే బదులు హెచ్చింది. డబ్బుకు విలువ తగ్గి వస్తువులకు విలువ పెరగ్గానే దాపరికం పెరిగింది. ఈ దాపరికం చేసినవాళ్ళు బాగా కలిగిన

వాళ్ళు కాబట్టి వాళ్ళను దొంగలనటం లేదు. రోజుకో అర్ధరూపాయి విలువచేసిన వాడు పదిరూపాయలు సంపాదించినా, పావలా విలువకు దిగజారాడు. కాని కడుపు నింపుకోలేని వాళ్ళు, కొసరి నింపు కోడానికి తాపత్రయపడి కొద్ది కష్టాలకే తట్టుకోలేక కొద్ది వానలకే యెగిరిరాలిపోయే రెక్కలపురుగులై పోతున్నారు. చీమలా కష్టపడిన వాళ్ళు, రెక్కలచీమలై సమిసిపోయే మానవ సమాజాన్ని ఒక్కవ్యక్తి తన అత్యాశతో సృష్టించాడు.

కొత్త ఆవకాయలా, కొత్త పెళ్లంలా యీ కొత్త జయాలు రుచిగా వుంటాయి. ఈ రుచిని చవి చూడ్డానికన్నట్లు జపానువాడు కూడ చెయ్యి కలపడం వలన జాగ్రత్త అవసరం అయ్యింది. వాణిజ్యం యెక్కడుంటే యుద్ధాలూ దీపం ముద్దిక్రింద వున్న చీకటిలా అక్కడే వుంటాయి. తూర్పు కోస్తాలో విశాఖ ఓడరేవు వాణిజ్యానికి పేరు పడుతోంది. దానిమీద జపానువాడు నిఘా వుంచాడు. ఈ పొట్టివాని నెత్తి పొడుగువాడు కొట్టడాని కన్నట్లు అమెరికా వాడు వాడి యెదుట పార్టీలో నిలిచాడు.

ఈ గొడవల్లో యైదోఫారం ఫైనలు పరీక్షలు ప్రమోషను పరీక్షలు ప్రమోషను పరీక్షలుగా ముందుగానే జరిపించేస్తారు. శలవుల్లో యింటికి వెళ్ళిపోదామంటే రమాదేవి యింట్లో యింకెన్నో పనులు మిగిలిపోయినట్లు వుంచేసింది.

మొలుస్తున్న మీసాలు యింకా తను నిక్కర్లతో వుండటం వలన గుర్తించలేదుగానీ అప్పుడే లంగాలు వేస్తున్న జ్యోతిని చూడగానే యెంతవేగరం తోటకాడలా యెదిగి పోయిందనిపించింది. ఇన్నాళ్ళూ చూస్తున్న జ్యోతే. ఆ కళ్ళే. ఆ పలుచనైన ముఖమే. ఆ అర్భకమైన శరీరమే పొడుగాటి చేతివ్రేళ్ళు. కానీ యీ రోజున ఆ కళ్ళు సౌదామిని అత్తయ్య కళ్ళలా వున్నాయనిపించింది. చుక్కలకన్నా తేటుగా మెరుస్తున్నాయ్. పలుచని ముఖంలో వెలుగు శరీరం తేటగా నిగనిగలాడుతోంది. బహుశః సౌదామిని అత్తయ్య యీ వయసులో లంగా జాకెట్‌తో యిలాగే వుండేదేమో?

ఇలా అనుకుని మూతిని కుడిచేతితో తడుముకుంటే చేతికి మీసాలుతోపాటు, పెదిమలు తగిలాయి. మీసాలు వస్తే మాత్రం మితి మీరి ప్రవర్తించాలని వుందా? పంటికి పెదిమలు అడ్డన్నట్లు, కోరికలకుకూడా కొంత అడ్డు లేకపోతే అసహ్యంగా మనిషి కనిపిస్తాడు. ఎడమకాలు గోతిలో నిలబెట్టి కుడికాలును కనిపిస్తున్న మేడమీద పెట్టడానికి ప్రయత్నించడమెందుకు?

ఏదో సృష్టించాలని తపనలోవుంటే జ్యోతి ఒకరోజున " ఒక కథ రాయ కూడదూ? " అంది.

అలా అని పెదాలపై చిరునవ్వు నిమిత్త మాత్రంగా వెలిగించింది. ఏం కథరాయాలో తోచలేదు. ఒకరు చెప్పిన కథ రాయటం యిష్టంలేదు. సత్యంతో తన అనుభవాలురాసి జ్యోతి కళ్ళలో నీరు తెప్పించటం యిష్టంలేదు. ఎంతో రాయగలననుకున్న వాడు తీరా రాయాలంటే యేదీ రాయలేక పోయాడు. తారాజువ్వ వెలగడానికిగానీ, చుంచుబుడ్డీ పువ్వులను వెద జల్లడానికి గానీ యింధనం అవసరం వున్నట్లే యీ రాయడానికి యేదో యింధనం అవసరం వున్నట్లు తొలిసారి అనిపించింది. రెండు రోజుల్లో కథ వినిపించక పోగానే జ్యోతి దగ్గరగా నిల్చొని కళ్ళల్లోనికి చూస్తూ కవ్వించింది. మనసులో చిగిర్చిన అనురాగం మందహాసంలా పూగించింది.

'నుదుటి మీద బొడిపె సంగతి మరచిపోయావా? ' అంది

ఆ కవ్వించిన చూపుతో యీ ప్రశ్నించే మాటలతో రగిల్చే యింధనం సంప్రాప్తమయింది. ఒక కథ రాసేసాడు. అందులో ఒక పేదవాడు. ఒక సంపన్న గృహంలోని యువతి. పేదవాడ్ని ఆ యువతి యెందుకు ప్రేమిస్తుందో తెలుసా? అతను కాంగ్రెస్‌లో చేరి పరప్రభుత్వాన్ని యెదుర్కొంటాడు కాబట్టి.

పదిహేనో ఏట ప్రేమకథ రాసిన రచయిత. స్వాతంత్ర్య వీరుని కథరాసిన రచయిత. జ్యోతి ప్రోత్సాహంతో ఆ రోజుల్లో వస్తుండిన 'వినోదిని' అనే పత్రికకు రాజు పంపించాడు. జ్యోతి చాలా బాగుంది అన్నది కాబట్టి అది పడకుండా పోదే. ఇంక దృష్టి అటువేపే.

కథ పడలేదుగానీ యింట్లో పెద్ద కథ జరిగిపోయింది. శలవులు కదా. ఇంకా కొద్దిగా చలి వున్నా నంటోంది. సముద్రంలో మునిగాడు. స్నేహితులతో లానస్సుబేలో... సాయంత్రం సరికి బాగా రొంప పట్టేసింది. ఒళ్ళంతా నొప్పులు. ఆ మరుచటి రోజుకి వున్నాయ్. జ్వరం వుందని చెబితే రమాదేవి అత్తయ్య యెక్కడ యీనడిస్తుందో? కారణం లేకుండా యేదీ రాదన్న ఆమె

వకీలు వాదనతో అసలు విషయం తెలుసుకుంటే చీవాట్లు తినాలి. అందుకే వూరుకొని ఆమె చెప్పిన పనులు చేస్తున్నాడు. అన్నం సరిగ్గా సహించలేదు. జ్యోతి, రాజువాడిన ముఖం చూస్తోంది. కాలంకాని కాలంలో జరగరానిది జరిగితే యేదో అనర్థం వస్తుం దంటారు. ఏ బంగాళాఖాతంలో దక్షిణాన రేగిన సుడిగుండం మూలాన యిక్కడ ఆకాశాన మేఘాలు అల్లుకుని వున్నాయ్. చిరు చలివేస్తోంది. అలాంటప్పుడు రమాదేవి కాస్తదూరంలోవున్న బజారు వెళ్ళి డజను కోడిగుడ్లు వెంటనే తీసుకరమ్మంది. రాజు బయటకు వెళ్ళడం రమాదేవి వంట యింటి వేపు వెళ్ళడం ఒకేసారి జరిగాయి ఆ సాయంత్రం రోడ్డుమీదకు వచ్చేసరికి కాళ్లు గజగజ ఒణికాయి, నాలుగడుగులు యెలాగో వేసాడు వెనుకనించి -

''రాజూ" అన్న పిలుపు జ్యోతి

'నీవిక్కడే వుండు. నేను చప్పున వెళ్ళి తెచ్చేస్తాను" చేతిలో నంచి లాక్కోగానే డబ్బులుకూడా యిచ్చేశాడు. రాజు దగ్గరలో అడుగుమీద కూర్చుండిపోయాడు. రమాదేవి బయటకు వచ్చినా కనబడకుండా! జ్యోతి చకచకా నడిచింది. ఈలోగా మబ్బులు వక్కానికి వస్తున్నాయ్. కళ్లు ఆన్చి చూసినా జ్యోతి కనపడలేదు. ఒక్క ఝల్లువాన. గోడకు చారబడినా వెలిపిరి కొట్టోంది. చలి వేస్తోంది. పళ్ళు బిగపెట్టి నిల్చున్నాడు. రోడ్డంతా కొంతసేప య్యాక నీటి మయం అయేటట్లు వర్షం పడుతోంది. కొద్దిగా ముందుకువచ్చివంగి చూస్తున్నాడు. చూడగా చూడగా యెవరో పరు గున వస్తున్నట్లు కనిపించారు. రాజు గుండె గడగడ లాడింది. జ్యోతి తనకు వెతుక్కొని వచ్చినట్లు అరుగుయెక్కి పోయింది. పూర్తిగా తడిచి ముద్దయింది. చలివేస్తున్నట్లు పళ్లు వణికిస్తోంది. మాటాడుతొంటే.

'తడిచి యెందుకొచ్చావ్? "

'ఇంత వేగిరం వర్షం తగ్గుతుందా? అమ్మవేగం తెమ్మందిగా!'

" ఎంత పని చేసావ్? "

' నివ్వెళ్ళితే జ్వరం హెచ్చయేదిగా...."

" నాకు జ్వరం అని యెవరు చెప్పారు? "

" ఎవరెందుకు చెప్పాలి? నీ ముఖమే చెప్తోందిగా! ''

" ఈ మాత్రం జ్యోతి అమ్మకుతట్టితే యీఅవస్థ లేకపోయేదే' అనుకుని 'ఇప్పుడు అసలు అవస్థ' అని యింటికి వెళ్లాడు.

' తడవకండా తెచ్చావ్ సెభాష్' అంది రమాదేవి మాటాడ కండా పక్కగదిలో కూర్చుండి పోయాడు. కాళ్ళూ చేతులూ గుండె వణుకుతోంది. ఎన్నాళ్ళనుంచో జ్వరం వచ్చి నీరసం చేసినట్లు వుంది. జ్యోతి యింతలో చాటుగా వచ్చినా తల్లి కంట పడి పోయింది.

'పొరుగింటి కెళతానని—తడిచి వచ్చావేమే? '

జ్యోతి గబగబ తువ్వాలు తీసుకుని తల తుడుచుకుంటోంది. "ఎక్కడికి వెళ్ళావే" అని రమాదేవి అరుస్తుంటే జ్యోతి పెదాలు కుట్టినట్లు జవాబు చెప్పలేదు.

రొంప దగ్గుతో రోజు'స్తమానం పోట్లాడుతుంటావు కదా! ఇలా తడిస్తే యేమౌతావే "

" ఏమీ కాను. "

"ఏంటా మొండి జవాబులు? ఇంతకీ యెక్కడికెళ్ళి తడిచి నట్లు? రాజు తడవకుండా వచ్చాడు. నివ్వు తడిచి వచ్చావ్ — నివ్వుగాని బజారుకెళ్ళావా? "

కూతురు జవాబుకు ఆగకుండా " వెళ్ళు - వేగం ఆ బట్టలు మార్చిచావు" అంటూ 'రాజూ-యిలారా' అని కేక వేసింది. వెంటనే మరో కేక వెయ్యగానే రాజువచ్చి తలదించి నిల్చున్నాడు.

" ఆడపిల్లను అంత దూరం యీ వర్షంలో పంపిస్తావా? నీకు పొగరెక్కువై పోయింది రాజూ? ఇంకెంత కాలంలే " అంటూ ఛర్రున అక్కడినించి వెళ్లి పోయింది.

రాజు వులకలేదు. పలకలేదు. తలవులిచ్చినా యింకెందు కిక్కడ వుండాలని తన మనసు? తెల్లారే సరికి తనకు మందూ మాకు లేకండా కాలమే మందూమాక్రై కాస్త రొంప తగ్గించింది. రొంప తగ్గగానే శరీరంలో పీకులు తగ్గాయి. రమాదేవి దుమ దుమ లాడుతున్న తినకుండా వుండలేక పోయాడు. జ్వరం తగ్గగానే ఆకలి అధికమైంది. తనరోగం జ్యోతి తీసుకున్నట్లుంది. గదిలో మంచం మీదనించి లేవలేదు. జ్వరం మంచి రాత్రి మీద ముంచు కొచ్చిందట. గొంతుక పట్టేసింది. ఊపిరి సరిగ్గా పీల్చ లేక పోతుంది. రమాదేవి ఆ రోజంతా విసవిసలాడుతూనే వుంది. ఇంట్లోవున్న దగ్గు మందు వేస్తే దగ్గు హెచ్చిందేగానీ తగ్గలేదు. కఫం పడుతోంది. చలివేస్తోంది. గొద్దిగా గుండెలో నొప్పి రెండోరోజు ఉదయానికల్లా మనుషుల మీద సరిగ్గా ధ్యాసలేదు. దగ్గు విపరీతమైన దగ్గు. కఫం రాను రాను కాస్త యెరుపు రంగుతో పడ్తోంది. తలనొప్పి అని యేడుస్తోంది. డాక్టరు వచ్చాడు. పరీక్షచేసి మందిచ్చాడు. రమణయ్య ఆవేళ కోర్టుకు వెళ్ళలేదు. రాజు కిటికీనించి చూసేటప్పుడల్లా జ్యోతి కళ్ళు మూసుకునే వుంటోంది. మూలుగు తోంది. హెచ్చు చెమట పటుతుంది. ఇంకోసారి చొరవ చేసుకుని గదిలోనికి వెళ్ళాడు. అలా చూస్తుండగా ఒకసారి కళ్ళు తెరిచింది. ఏదో మాటాడు తోందని కాస్త దగ్గరగా జరిగితే

" మంచికథ - చాలా మంచికథ-పడ్తుంది . '' అలా గొణు క్కుంటూనే మళ్ళీ కళ్ళు మూసింది. పళ్ళ రసమైనా సరిగ్గా గొంతుకలో దిగలేదు. జ్వరం మళ్ళీ తీవ్రత దాల్చింది. బయటకు వచ్చి తిరిగిపోతున్న కన్నీటిని ఆపుకునే ప్రయత్నంలో వున్నాడు. డాక్టరువచ్చి పరీక్షచేసి "నిమోనియా - పెద్ద ఆసుపత్రిలో చేర్చండి అన్నాడు. పెద్ద ఆసుపత్రిలో సగం అప్పటికే సైనికుల కోసం ప్రత్యేకించారు. సీరియస్ కేసు కాబట్టి జ్యోతిని ఆసుపత్రిలో చేర్చు కున్నారు. ఆసుపత్రికి తిరుగుతున్నాడు. కాళ్ళు వణికి పోతున్నాయ్. జ్యోతి నుదుటిమీద చెయ్యివేసి జ్వరం వుందోలేదో చూద్దామని, ఆ కళ్ళు విప్పితే ధైర్యం చెప్దామని, యెన్నెన్నో అను కుని చివరకు అంతదూరంలోనే నిల్చునేవాడు. రమాదేవి నిత్యం అక్కడే వుండేది. ఇంట్లో రాజేవంట.

ఏదైతే కాకూడదని అనుకున్నాడో ఆదే అయిపోయింది. జ్యోతి శవం యింటికి వచ్చింది. కూతురుపై పడి యేడుస్తున్న రమాదేవి రౌద్రరూపిణి అయిపోయింది. ఒక్కసారి ఆ యేడుపుతో విజృంభించి అరుస్తోంది.


" నాతల్లీ - ఇదిగోనమ్మా....ఈ దరిద్రుడేనమ్మా నిన్ను ఖూనీ చేసాడు. వీడినించేనమ్మా నీకీ మాయ జ్వరం వచ్చింది. నా తల్లీ మమ్మల్ని యింత అన్యాయం చేస్తావనుకోలేదు. ''

ఒక మూల కన్నీటితో నిల్చున్న రాజు యీ మాటలు వినగానే ఒళ్ళంతా చచ్చిపోయింది. నలుగురి కళ్ళు వాడిపై పడ్డాయి. మెల్లగా పక్కకు తప్పుకున్నాడు. పలుకరించడానికి వచ్చే మనుషుల ప్రక్కనించే మెల్లగా బయటకు ఆ కట్టు బట్టలతో సిడి చాడు. గబగబ రోడ్డుమీద నడిచాడు. అదినడకకాదు. కాస్త పరుగే. తిన్నగా బుద్ధవరపు తోటకు వెళ్ళాడు. వెంకటేశ్వరరావు యింట్లోనే వున్నాడు. అప్పు అడిగి యెదురుపాయలు తీసుకున్నాడు. వాడు యెందుకని అడగలేదు. రాజు యిది అని చెప్పలేదు. డబ్బు తీసుకున్నాక పూర్తిగా మూగవాడై పోయాడు. ఆ రాత్రి కోచ్‌లో కూర్చున్నాడు. రాత్రంతా మేల్కొనే వున్నాడు. నిలబడినా కళ్ళల్లో జ్యోతే నిల్చుండి పోయింది. కళ్ళల్లో నీరు పేరుకున్నా ఆపలేదు. ఎంతో ఆశతో ఒకనాడు యీ రైలెక్కాడు. ఏ ఆశా లేకుండా తిరిగి వస్తున్నాడు. రమాదేవి యేడుపే యింకా యెదలో యెక్కుబెట్టిన విల్లులావుంది. సత్యం చావుకు తను బాధ్యుడుకాడు. అది వాళ్ళ తలిదండ్రులు చేసుకున్న కర్మట. జ్యోతి చావుకు కర్మకాదు. ఆ చావుకు బాధ్యత తనపై పడింది. తనోఖూనీ కోరుగా నిల్చిపోయాడు. ఇదీ తన కర్మేనా?"

ఇలా యెన్నెన్ని అనుకున్నాడో అన్ని మనసునించి చెరిగి పోయాయి. నిల్చిపోయింది జ్యోతి మనసు. ఆ మనసు తన మనసులో బ్రతికినంతకాలం అతుక్కుని వుండి పోతుంది." చిన్నదైనా అభిమానం, అనురాగం వర్షించింది. ఇన్నాళ్ళూ ఆ ఇంట్లో వుండగలిగాడంటే జ్యోతి వల్లనే వున్నానని అనుకున్నాడు. అలాంటి జ్యోతిని ఖూనీ చేసానా? ఇంకెందరిని జీవితంలో ఖూనీ చేస్తానో? ఎందుకు బ్రతకాలి? "

ఈ వైరాగ్యం రైలు దిగగానే తగ్గింది. తెల్లవారుఝామున స్టేషనులో దిగాడు. బాగా చీకటి యింకావుంది, స్టేషనులోను చీకటిగానే వుంది. స్టేషను మాష్టరు గదిలో దీపం మిటుకు మిటుకు మంటోంది. ఎంత వేగిరం యింటికి వెళ్ళిపోయి తనవాళ్ళ మధ్య పడిపోదామా అన్న వుబలాటతో కూర్చున్నాడు. తొలి వెలుగు చూడగానే తన వూరివేపు నడవటం మొదలు పెట్టాడు. వీధికి అంత దూరంలో వుండగా " రాజు వస్తున్నాడు " అన్న కేక విన పడింది. వీధి వీధంతా ముందుకు వచ్చేసారు.

" ఏ కబురూ కాకరకాయ లేకుండా వచ్చేసావ్?" అని కన్నబాబు అంటే యేమీ మాటాడడు. తిన్నగా వెళ్ళి వరండా మీద కూలబడిపోయాడు. గోడకి చారబడి యేడ్చేస్తున్నాడు. "ఏమైంది



నాయనా" అని తల్లి చిన్న పిల్లాడిలా ఓదారుస్తుంటే యింకా యేడ్చేస్తున్నాడు. నిన్న సాయంత్రం నించి ఆపుకుని వట్టి వుంచిన కన్నీరంతా కారిపోతోంది. తాతయ్య అన్నాడు. "అలా కాస్సేపు వాడిని వదిలేయండి " అంటూ నలుగురినీ ప్రక్కకు తప్పుకో మన్నాడు కాస్త గాలి వీచింది.

" ఎప్పుడు తిన్నాడో యేమిటో —— ముందు యేదో చేసి నోటిలో పొయ్యమ్మా" అన్నాడు ముసలాయన. గబగబ ఒక పళ్ళుదోము పుల్లనుతెచ్చియిచ్చాడు, చెంబుతో నీరు పెట్టాడు. దగ్గిరుండి ముఖం కడిగించాడు. కడుపులో యింత పడగానే కాస్త కాలూ చేతులు నిల్చున్నాయ్. మెల్లగా తాతయ్య మనుమడిని దగ్గరగా తీసుకుని మెల్లగా యేం జరిగిందో తెలుసుకున్నాడు.

తెలుసుకున్న వెంటనే కన్నబాబుకు నిలుచున్న పాటున ప్రయాణం కట్టించాడు. "వాళ్ళు పిల్లాడికోసం వెతుకుతుంటారు. వెళ్ళు."

కన్నబాబు ప్రయాణ మయ్యాడు.

" ఇంక - ఈ ఒక్కయేడాది యెలాగైనా వుంచమను. మెట్టు అయిపోతుంది. అప్పుడు ఎక్కడైనా తల అమ్ము కోవచ్చు " అన్నాడు తాతయ్య.

ఆ మాటలు విన్నరాజు

" నేను ఆ యింటికి మరి వెళ్ళనంటే వెళ్ళను——"అరిచాడు.

"వెళ్ళనంటే యెలాగరా '' ఇంకా తన బడిలో పిల్లడే అన్నట్లు కన్నబాబు కేక వేసాడు.

"అక్కడికెళితే-నేను చచ్చిపోతాను-నేను వెళ్ళనంటే వెళ్ళను"

ఈ కేకలతో వీధంతా మూగిపోయారు.

ఎవరేమన్నా, బ్రతిమాలినా రాజు మొండిపట్టు పట్టాడు. తండ్రికి మించిన కోపం తనకూ వుందని నిరూపించుకున్నాడు. ఆవూసు లెత్తితే యింకేం అనర్థం వస్తుందోనని యెవరి మట్టుకు "వాళ్ళు వూరుకున్నారు. కన్నబాబు వంటరిగా పట్నం వెళ్ళాడు..... ...

(ఇంకా వుంది)

భిక్షగాడి పాట

డాక్టర్ సమ్మనూరు రమేష్ బాబు

ఈశ్వరీ! నిన్నే నమ్మితి...

భూలోకమాత

ఈశ్వరీ! నిన్నే నమ్మితి...

రైలులో వినిపించే ఆ పాట నన్ను ఎన్నోసార్లు కదిలించింది. ఆ పాట పాడేవాడు ఊరూ పేరూ లేని ఓ భిక్షగాడు. గొంతులో కమ్మదనంలేదు. పాడే తీరులో శాస్త్రజ్ఞానంలేదు. కాని గుండెలనిండా నిండుకొన్న ఆర్తి తీరపోయిన ఆ గొంతులో గంగాస్రవంతిలా ఎగసివచ్చి ఎంతటి హృదార్ద్రునైనా మాన్పు గలుగుతుంది.

అందుకే ఆ పాటంటే నాకంత ఇష్టం! నన్ను నేను మైమరచిపోతాను. మళ్ళీ అడిగి పాడించుకోవాలని ఉంటుంది కాని... నాచుట్టూ ఉన్న సభ్యసమాజం నన్ను అనాగరికుణ్నిగా ముద్రిస్తుందేమోనని బెరకు.

ఏమి బ్రతుకో అర్థంకాదు. ఇష్టమున్నవి కొన్ని వదులుకోవాలి. ఇష్టం లేనివి కొన్ని చేసితీరాలి. ఈ యిష్టాయిష్టాల నడుమ మనసు ఎంత కష్టపడు తుందో ఆ దేవుడికే తెలుసు!

జీవితమంతా నటనే! ప్రతిఒకరూ నటిస్తూనే ఉంటారు.

ఎక్కడ అభిమానం ఉంటుందో ఎక్కడ వాత్సల్యం పొంగుతుందో ఎక్కడైతే స్వార్థమెరుగని స్నేహప్రవృత్తి వెల్లివిరుస్తుందో ఎక్కడైతే ఏ కల్మషమూలేని పసిహృదయం కన్నతల్లిలా లాలిస్తుందో... అక్కడ నిజంగా మనుషులుంటారు.

అయితే ఆ చోటెక్కడ? చూపే దిక్కెవ్వరు?

అందుకే నేనూ స్వగతంగా అనుకొంటాను...



ఈశ్వరీ! నిన్నే నమ్మితి...

భూలోకమాత

ఈశ్వరీ! నిన్నే నమ్మితి....

చెమ్మగిల్లిన కళ్ళతో ఆ భిక్షగానివైపు చూచాను. కడుపు తరుక్కుపోయింది.

మనసులో ఎవరో ముల్లుపెట్టి కెలికినట్లయింది.

వృద్ధాప్యం బాగా ఆవరించింది. దారిద్ర్యం వితండ తాండవంచేస్తోంది! కళ్ళల్లో పువ్వులు మొలుస్తున్నాయి. కాళ్ళల్లో ముడతలు ఒళ్ళు చేసుకొంటున్నాయి. నీరసం, ఆయాసం నిండుకొన్న హృదయంలో ఏదో విషాదం! గాఢాంధకారం కమ్ముకొన్న ఆ నిరామయ ముఖలోగిలిలో ఎక్కడో ఏమూలో చిరు ఆశాదీపం. పుట్టగోచీతప్ప ఒంటిమీద ఏమీలేదు. చేతిలో సత్తుగిన్నె తప్పనిస్తే ఇంకేమీ లేదు. చిల్లర గలగలలాడిస్తూ పెదవులు అప్రయత్నంగానే కదలిస్తున్నాడు. ఎన్ని ఏళ్ళుగా ఎన్నివేలమైళ్ళు నడిచాయో తెలియదుకాని ఆ కాళ్ళుకూడా చకచకా నడచి పోతున్నాయి.

నేను ఆ భిక్షగాడు పోతుంటే చూస్తూఉన్నాను. కనుమరుగవుతున్న కనక దుర్గమ్మ కొండనుకూడా చూస్తూఉన్నాను. రైలు కుదింపులు ఆ భిక్షగానిపైన ఏవిధమైన ప్రభావాన్ని చూపలేకపోతున్నాయి. వేగంగా కదులుతున్న రైల్లో అలా రోజూ తిరుగుతూ బిచ్చం అడగడం మామూలేకాబోలు!

గుంటూరునుంచి విజయవాడకి విజయవాడనుంచి గుంటూరుకి రోజూ తిరగడం నాకు కొత్త అనుభవాలను చవిచూపుతోంది. ఎందరో మనుషులు! ఎన్నోరకాల వారు!

కళ్ళురెండూ లేకపోయినా నిమ్మఒప్పులు అమ్ముకొంటూ బ్రతికే సుబ్బారావులూ, చేతుల్లేకపోయినా వేరుశనక్కాయలు అమ్ముకొంటూ పబ్బంగడుపుకొనే పార్వతమ్మలూ, కూలీనాలీచేసుకొని కాయకష్టం మరచిపోడానికి నాటుసారాకొట్టి ఈ లోకాన్నే మరచిపోయే ఇస్మాయిల్‌సాబ్‌లూ, ఒక ఊరంటూ లేకుండా దేశాటనచేస్తూ ఎందుకు బ్రతకాలోకూడా తెలియకుండా కాలాన్ని వెళ్ళబోసే లంబాడీ గవరమ్మలూ....

ఇలా ఎంతమందో!

చతుర్ముఖపారాయణంచేసే ఎన్జీవోలూ.... వాళ్ళ సమస్యలు, సందేహాలు, మధ్యతరగతి కోరికలు!

ఎవరినీ పట్టించుకోకుండా "ఫ్యూచర్" చదువుతూ కూర్చొనే ప్రొఫెసర్లు.. ఈ సమాజానికి అవసరంలేని ఆలోచనలు, ఆదుర్దాలు, చదువుకొన్న గాలాలు!

పంట ఎదిగొస్తుందో లేదోనని చింతాక్రాంతులై కళ్లు నలుపుకొంటూ చుట్ట పొగవదిలే అన్నదాతలు.... బీడునేలలు, నీటిఎద్దడులు, కలవరపెట్టే సర్కారు వారి బకాయిలూ!

కడుపునింపుకోవడం కోసం ఒళ్ళమ్ముకొంటూ వెగటు పొడరు వాసనల నడుమా కీళ్ళ ఎరుపులమధ్యా కొట్టుమిట్టాడుకొనే అభాగ్యజీవులు... రేపు పై అపనమ్మకం, సంఘంపైకసి, సభ్యతను మరచిపోయిన తమ జీవితంపై అక్కసు!

ఒక గంట రైలుప్రయాణంలో ఎన్నెన్ని ప్రహసనాలు!

ఎవరెలావెళ్ళినా ఏది ఏమైనా కూతవేస్తూ పరుగెత్తివెళ్ళే రైలులాందిలా ఈ కాలం...

ఇంకా నన్ను పసివాడనే అమ్మ అనుకొంటుంది కాని నాకు మూడు పదులు నిండాయి.

ఇప్పుడు నా కడుపున ఇద్దరు పసివారు.

ఎంత చిత్రమైందీ జీవితం! దుఃఖం సుఖం దుఃఖం... చీకటి వెలుతురూ చీకటి .. ద్వైతం ... అద్వైతం .. విశిష్టాద్వైతం...

ఆలోచనల్లో మునిగిన నాకు ఎవరివో పెద్దగా మాటలు వినిపించాయి.

—వెధవ న్యూసెన్సు. ప్రతిచోటా తగలడిచస్తారు. సినిమాకెళ్తే సినిమా హాల్లో మనకంటే ముందుఉంటారు. బస్టాండుకెళితే అక్కడా ఎదురవుతారు. స్టేషన్‌కిపోతే అక్కడా చస్తారు. భగవంతుడా! అనుకొంటూ గుడికెళితే ధర్మం, ధర్మం అంటూ ఎదురవుతారు. తప్పించుకొని పారిపోదామని బస్సెక్కినా రైలెక్కినా చివరికి విమానం ఎక్కినా ఈ అడుక్కుతినేవాళ్ళ బాధ తప్పడం లేదు. ఛఛ! వెళ్ళు! అడుక్కోవడంలోకూడా వెధవపాటొకటి! వాయిస్ పొల్యూషనూ... ఫోఫో! పక్కకి తగలడు— పెద్దగామాట్లాడిన ఆ పెద్దమనిషి పేరుమోసిన ఓ పెద్ద డాక్టర్! పక్కనే ఆయన భార్యఉంది. కోట్లకు పడగలెత్తిన ఆ డాక్టర్‌కు ఇంటా బయటా మంచి పరపతికూడా ఉందని వినికిడి. అందుకే ఆయన కనిపిస్తేచాలు ఎన్నోచేతులు నమస్కారం చేస్తాయి. కొందరి తలలైతే పాదాలకికూడా మొక్కుతాయి!

నేనా భిక్షగాణ్ని చూసాను. ఓ మూలగా ఒదిగికూర్చొని కృష్ణానది వైపుకి చూస్తున్నాడు. రైలు బాగా వేగంగాపోతోంది. ఆకాశంనిండా సిమెంటు ఫ్యాక్టరీ వదలిన నల్లటి పొగ.

ఆ పెద్దమనిషి ఇంకా ఏదేదో మాట్లాడుతున్నాడు కాని...నామనస్సంతా...

ఈశ్వరీ! నిన్నే నమ్మితి...

భూలోకమాత

ఈశ్వరీ! నిన్నే నమ్మితి....

పాటపైనే ఉంది. నాకు ఎంతో ఊరటనిచ్చిన ఆ పాట మరొకడికి వెధవ పాటనా? ఈ తేడా ఎందుకొస్తోంది? సైకాలజీ ఎందుకు మారుతుంది? దానిని మార్చేది ఏమిటి లేక ఎవరు?

ది న్యూయార్క్ రివ్యూ ఆఫ్ బుక్స్‌లో ఒక విచిత్రమైన విషయం ఎప్పుడో చదివింది అనుకోకుండా జ్ఞాపకానికి వచ్చింది.

ఒక క్రైస్తవసన్యాసిని - పద్దెనిమిదేళ్ళ పడుచుపిల్ల - అసహ్యం అనే భావాన్ని చంపుకునేందుకు ఒక కుష్ఠురోగి చేతివేళ్ళలోని చీమునీ కాలివేళ్ళలోని చీమునీ నోటితో చీకి ఉమ్మివేస్తుంది. ఆమెకు ఏసుక్రీస్తు తరచూ దర్శనమిస్తూ ఉంటాడు. అవధూతల లక్షణంకూడా ఇంతేకదా! మహావీర వర్ధమానుడు నగ్నంగా ఊళ్ళవెంబడి తిరుగుతూ క్రిమికీటకాదులు తన దేహాన్ని పట్టుకొని కొరికి బాధ పెడుతున్నా చిరునవ్వు నవ్వుతూఉండేవాడట!

ఏమిటి వింత ప్రవృత్తులు...

మరోసన్యాసిని ఎన్నోరకాల మహిమలుచూపి దేవదేవునికి ఎంతో ప్రీతిపాత్రురాలు అని నిరూపించుకొనికూడా స్వలింగ సంపర్కం, హస్తప్రయోగం మొదలైన మానవ బలహీనతలకు లోబడిపోయింది. దేవుడే నన్ను అలా చేయమని ఆదేశించాడని ఆమె చెప్పడం ప్రారంభించింది.

ఇది విపరీతమా.... పతనమా... ఉన్మాదమా... అర్థంకాదు.

ఎన్నోవిషయాలు రకరకాల సందేహాలను కలిగిస్తూ ఉంటాయి. అందులో ఇదికూడా ఒకటి అని సరిపెట్టుకోనా? అంతకంటే చేయగల్గిందేముంది?

నా ఆలోచనలకు అంతరాయం కలిగిస్తూ "అమ్మా" అన్న పెద్దకేక వినిపించింది. భిక్షగాడే రైల్లోంచి క్రిందపడిపోయాడేమోనని అనిపించింది నాకు. ఆదుర్దాగా చూచాను.

భిక్షగాడు యథాప్రకారం నిర్వికారంగా కూర్చొని ఉన్నాడు. "అరిచిందెవరబ్బా" అని అనుకొంటుండగనే మెలికలు తిరుగుతున్న డాక్టర్ కనిపించాడు. అయ్యో! భరించలేను! గుండెల్లో పోటు! — అంటూ అరుస్తున్నాడు.

ఆయనభార్య ముఖం భయంతో నిండిపోయింది.

చుట్టూ జనం మూగారు. రైలు పోతూనేఉంది.

— అరెరె! గుండెపోటా! చాలా ప్రమాదంసుమా!— ఎవరో అన్నారు.

— కనకదుర్గమ్మకి ముడుపుకట్టుకోండి అపదమంచి గట్టెక్కుతారు— ఎవరో అడకూతురు సలహాచెప్పింది.

— మంగళగిరి పానకాలసామికి మూడెనిమిది బిందెల పానకం పొయ్యం డమ్మా. ఇక చస్తే గుండెపోటురాదు — ఎవరో పల్లెటూరివాడు తనకు తోచింది చెప్పాడు.

— నాకో సందేహం— ఆపివేసాడు ఓ బట్టతలాయన.

ఏమిటా సందేహం అన్నట్లు అందరూ ఆతణ్ని చూదారు అందరితో పాటు నేనుకూడా!

— మరేంలేదు. ఆ భిక్షగాడు మామూలువాడిలా లేడు. మాయలమారిలా ఉన్నాడు.

ఈ డాక్టరుగారు ఇంతకుముందు వాణ్ని తిట్టారుకదా! దాంతో వాడికి కోపంవచ్చి ఏదైనా మంత్రంవేసాడేమో! అందుకే ఈయనకి గుండెల్లోనొప్పి వచ్చిఉంటుంది—

బట్టతలాయన మాటలు అందరిమీద పనిచేసాయి. కొందరు భయం భయంగా భిక్షగాడివైపు చూచారు. కొందరు సందేహంగా చూచారు. మరికొందరు అక్కసుగా చూచారు. ఇంకొందరు యధాలాపంగా చూచారు.

భిక్షగాడుమాత్రం ఇదేదీ పట్టించుకోకుండా రైలు ఎప్పుడు ఆగుతుందా అని చూస్తున్నాడు. కళ్ళు మూసుకొని తెరుస్తున్నాడు

డాక్టర్‌కు ఏమనిపించిందో ఏమో... లేచి నిలబడి

— నాది తప్పయిపోయింది నన్ను బాధపెట్టవద్దు ఇదిగో ఇదిగో వందరూపాయలనోటు తీసుకో— అంటూ భిక్షగాడికి అందించారు.

డాక్టర్ భార్యఇచ్చిన నీళ్ళుతాగి సేదదీరాడు. గుండెనొప్పి నిమిషాల్లో తగ్గిపోయింది. నాకంతా ఆశ్చర్యంగాఉంది.

భిక్షగాడిదగ్గర ఏదో మంత్రముందని కొందరూ కాదు కాదు ఏదో శక్తి ఉందని కొందరూ మాట్లాడుకొంటున్నారు. ఎంతోమంది వెళ్ళి ఆ భిక్షగాడికి దండంపెట్టి పదీ పరకా రూపాయ్ రెండ్రూపాయలూ ఐదురూపాయలూ పది రూపాయలూ చొప్పున ఇస్తున్నారు.

భిక్షగాడికి ఇదంతా అయోమయంగా ఉంది. ఎంత అడుక్కున్నా పది రూపాయలు రాని తనబ్రతుకులో ఈవేళ ఇన్నిరూపాయలా అన్న భావం వాడి మొహంలో కనిపిస్తోంది.

నేనెక్కిన రైలుపెట్టెలోఉన్నవారందరూ ఆ భిక్షగాడికి వాళ్ళకు తోచినంత ఇచ్చారు. నాదగ్గర ఇవ్వడానికి నిజంగా ఏమీ లేదనేచెప్పాలి. ఐదురూపాయల నోటు ఉంది. కానీ వెయ్యలేదు. నాశక్తి రూపాయలోపు! ఏమైతే అది అవుతుం దన్న తెగింపుఉంది కాకు. పయిగా ఆ భిక్షగాణ్ని చూస్తుంటే నాకేమీ అనిపించడం లేదు. నాలాంటి మనిషే కనిపిస్తున్నాడు.

మంగళగిరి కనిపిస్తుండగా భిక్షగాడిముందు రూపాయలకుప్ప తయారయింది. వాడు ఆ కుప్పవైపు అదోలా చూస్తున్నాడు. ఏదో ఆలోచిస్తున్నాడు. ఒక నిర్ణయానికి వచ్చినవాడిలా కదిలాడు. సత్తుగిన్నెనిండా ఆ రూపాయలను కుక్కాడు. మొత్తం కుప్పను సత్తుగిన్నెలో పట్టించాడు. లేచి నిలబడ్డాడు. కళ్ళల్లో ఏదో బాధ! అర్థంకాని అసంతృప్తి! .

సిగ్నల్ ఇవ్వలేదుకాబోలు రైలు ఊరిబయటే ఆగిపోయింది. సరిగ్గా మాపెట్టె ఎదురుగ్గా పాచిపట్టిన నీటికుంట ఒకటి ఉంది. ఏమనుకున్నాడో ఏమో ఆ భిక్షగాడు దిగాడు. అందరికళ్ళూ వాడిమీదే ఉన్నాయి. వాడు సత్తుగిన్నెను రెండు చేతులతోనూ గట్టిగాపట్టుకొని ఆ గుంటదగ్గరికి వెళ్ళాడు. ఒక్కసారి మేమున్న రైలుపెట్టె వైపు చూచాడు. మేమంతా వాణ్నేచూస్తున్నాము. ఆ సత్తుగిన్నెను విసురుగా గుంటలోకి గిరవాటువేసాడు. రూపాయికాగితాలు ఆ పాచిపట్టిన నీటిపై తేలసాగాయి. అయితే ఆ గుంటవైపు చూడకుండా రైలువైపుకీ రాకుండా మైదానంలోకి నడుచుకొంటూ వెళ్ళిపోయాడు ఆ భిక్షగాడు.

ఈశ్వరీ! నిన్నే నమ్మితి....

లోకమాత

ఈశ్వరీ! నిన్నేనమ్మితి....

పాట రైలుకూతలో కలిసిపోయింది.


భయంతో దేవుణ్ని కొలవడంకాదు భక్తితో కొలవాలి— అని అమ్మ అన్న మాట గుర్తుకొచ్చింది.


దానమైనా అంతే దయతో ఇవ్వాలికాని ప్రాణభయంతోకాదు!

నాకు ఆ భిక్షగాడిని ఒక్కసారైనా చూడాలనీ, మళ్ళీ ఆపాట వినాలనీ ఉంది కాని...

ఎక్కడా ఆ భిక్షగాడు తరువాత ఎప్పుడూ కనిపించలేదు.

ఆ పాటమాత్రం అప్పుడప్పుడు నా పెదవులపై వినిపిస్తూ ఉంటుంది.





సీరియల్

సృష్టి

ఇచ్ఛాపురపు రామచంద్రం

(గత సంచిక తరువాయి)

తనకి వొచ్చే రెండువందలూ.... ఇంట్లో సామానులమ్మగా వొచ్చిన డబ్బూ.... బాకీలు చెల్లించి.... యిల్లు ఖాళీచేసి.... చిన్న గదిలోనికి మారింది పిల్లలతో. ఎలాగయినా బతకాలని ఆమె పట్టుదల. ఏమయినా ఆమెను ఓడిస్తానని - జీవితం.

ఒకటి రెండు నెలలు.

బ్రతుకుదుర్భరం అయిపోయింది. పిల్లల మీద పెట్టుకున్న ఆశలూ కలలూ సంగతి దేముడెరుగు, వారికి రోజుకొక పూటయినా కడుపునిండా అన్నమే పెట్ట లేక పోతూంది. ఈ ఆదాయంతో... వాళ్లని పెంచి పెద్దచేయడం అసాధ్యం. నేడో రేపో కట్టు కుందుకు గుడ్డముక్కలు కూడా వుండవు వాళ్లకి తనకి, సంపాదించడానికి కష్టపడదామన్నా పనిదొరకడం లేదు. కొంచెం రోజుల్లో బతుకులు వీధిన పడాలి, తప్పదు. అయ్యో!

ఎన్నికలలు కంది - పిల్లల గురించి. బాగా చదివించాలని.. మంచి జీవితం యివ్వాలనీ.. ఎన్నెన్నో కలలు. ఎన్నెన్నో ఆశలు! అన్నీ .... ఏం కాబోతున్నాయి! వాళ్లకి కనీసం కడుపునిండా తిండయినా పెట్ట లేక పోతూంది. ఎంత దౌర్భాగ్యం!

వారు — ఏమయ్యారు?

లాటరీ తగలలేదని తెలిపోయాక — ఏం చేశారు? తను - తన మీద ఆశ వదిలేసుకోమని ఎంత సులభంగా చెప్పేశారొక్క ముక్కలో! లాటరీ తగలకపోతే — అంతే సంగతులన్నారు. ఏమిటాయన ఉద్దేశం?

ఆమె మనసు కీడు శంకించింది. ఆ వాక్యాలలో అమంగళమూ అన్యాయ మయిన భావమూ అవే స్ఫురించాయి. వొద్దువొద్దు.. అలాగవొద్దు. మీరయినా బతకండి. పిచ్చిపని చేయకండి.

మనసులో — ఆయనని కాపాడమని దేముణ్ణి ప్రార్థించింది. అవేళ — మిల్క్‌బూత్‌లో అడుగుపెట్టే సరికి.... కష్టాలు—పరంపరగానే తప్ప వొంటరిగా రావని మరోసారి తెలిసివొచ్చింది. ఆమె ఉద్యోగం పోయింది. ఆ కాగితం.... వార్త అందుకుంటూనే మ్రాన్పడి పోయింది. ఒక్కసారి — ప్రపంచమూ, భవిష్యత్తూ చిన్న వెలుగయినా లేని చీకటి గుయ్యారమే అనిపించాయి, భయం వేసింది.

ఎవరూలేని తను .... నెలకి రెండు వందలిచ్చే — యీ చిన్న ఆధారం కూడా పోతే ఎలా బతకాలి? తన సంగతి కాదు.... పిల్లలు? ఇప్పటికే వాళ్లు ముష్టి వాళ్ల పిల్లల్లా తయారయ్యారు. అందుకు తనదే బాధ్యత. వాళ్ల తండ్రి పరారీ అయిపోయాడు కనుక, రేపు - వాళ్లకి అన్నం ఎలా పెడుతుంది? వాళ్లు .... "అమ్మా! ఆకలి." అంటే ఏం చెప్పాలి? అమ్మ పెట్టక.. వాళ్లు వీధుల్లోపడి... కాలే కడుపుకి — బిచ్చమెత్తుకుంటారేమో, ఆకలి — అన్నిటి కంటే ఘోరమయినదీ. తీవ్రమయినది. ఆకలిని తీర్చుకుందుకు పెద్ద వాళ్లే ఎంతకయినా దిగ జారుతారు. పిల్లల సంగతి చెప్పేదేముంది?

తన పిల్లలు .... రత్న మాణిక్యాల్లాటి బిడ్డలు .... రేపటి నుంచి రోడ్డునపడి అడుక్కుంటారు. చివరకు— అలాగే గాలికి ధూళికి పెరిగి ... వొద్దు వొద్దు. ఎందుకా నికృష్టపు బ్రతుకులు? ఏం సాధించాలని? ఏం సుఖపడాలని? ఎందుకు బ్రతకడం అలాగ- భూమికి బరువుగా? ఏం చూసుకుని? ఏం చేసుకుని? ఎవరికోసం?

బతకడం అసాధ్యమని తెలిపోయాక — చచ్చి పోవడమే మార్గమనిపించింది. పిల్లలని చంపి .... తను చావడం .... అదే ఉత్తమ మనిపించింది. ఈజనారణ్యంలో .... తన వంటి ఆడదానికి యింకే మార్గముంటుంది?

అందుకని.... విధి లేక.... పిల్లలని చంపి.... తను చావాలను కుంది. చావడం ఎలా? ఏ చెరువులోనో దూకు?— చెరువులు చాలా దూరం. పిల్లలు నడవలేరు. ఉరి పోసుకునా? చాలాబాధ. లేత పిల్లలు తట్టుకోలేరు. కిరసనాయిలు పోసుకుని నిప్పంటించు కునా? దీపం బుడ్డికే కిరసనాయిలు కొన లేక పోయిందే! అయ్యో! ....చావు కూడా ఖర్చుతో కూడినదేనా బతకడానికి మల్లే! పేదవాళ్లకి చావుకూడా అందదా?...."

ఇంక వినలేనట్లు చూసింది సుషమ. "ఇక తరువాత నాకు తెలుసులే. పిల్లలకి యింత తిండి పెట్టలేక .... సముద్రంలోకి తోసెయ్యాలని ప్రయత్నిస్తూ నా కంట పడి — దొరికి పోయావు. అంతేగా?" ఆమె ఏమీ అనలేదు. మౌనంగా — తలవొంచు కుంది సిగ్గుతో. అంత వరకూ ఆశ్చర్యంగానూ బాధగాను ముఖం పెట్టి వింటున్న అలిస్ హటాత్తుగా అంది. "నీ కలలన్నీ నిజం కావాలా? నీ ఆశలన్నీ తీరాలా? నీ పిల్లలని మంచి కాన్వెంటులో చదివించడం... నువ్వుహాయిగా బతకడం యివన్నీ నిజంగా కావాలానీకు?"

లత — తలఎత్తి చూసింది. "నాకు తెలుసు అవన్నీ అసంభవాలని."

"కాదు — సంభవాలే." ధృఢంగా అంది సుషమ.

లత ఆమె వేపు చూసింది — కళ్లల్లో నీళ్లతో. "చచ్చిన పామునింకా ఎందుకు చంపుతారు? నాతో పరిహాసమేమిటి మీలాటి పెద్ద వాళ్లకి?"

"పరిహాసంకాదు. పరమ సత్యమే. నువ్వొక.... విషయానికి వొప్పుకుంటే...."

"నిజంగానా? ఏమిటది? చెప్పండి. నా పిల్లలకోసం.... వాళ్ల భవిష్యత్తుకోసం నేనేమయినా చేస్తాను. ప్రాణమయినా యిస్తాను.

చెప్పండి."

"తీరా చెప్పాక — లేదన కూడదు. మీ పిల్లలిద్దరికీ మంచి జీవితాన్నీ నీకూ మంచి రోజులనీ యిచ్చే బాధ్యత నాది. అందుకు ప్రతి ఫలంగా నువ్వొక చిన్నపని.... ఉపకారం.. త్యాగంచేయాలి."

"ఏమిటి?"

"నీ గర్భాన్ని అద్దెకివ్వాలి—"

అర్థం కానట్లు చూసింది— "ఏమిటి మీరంటున్నది?"

"నువ్వు— ఒకరి బిడ్డను కనాలి."

చర్రున లేచింది లత. "నేను పేద దాన్నయ్యాను తప్ప పతితను కాలేదు. కాను కూడా. వారు నన్ను విడచిపోయినా - ఆయనంటే నాకు ప్రేమే. ' వారికి నేనంటే ప్రేమాభిమానాలు లేక పోలేదు- కాలం—కర్మం అలా చేశాయి. నేను పతితనీ కాను. కులటని కాను. వ్యభిచారిని కాను. నా భర్త తప్ప మరే మగవాడూ నన్ను తాకడానికి - ప్రాణం పోయినా అంగీకరించను. అయినా సాటి ఆడవాళ్లయి ఉండీ ఎలా అడగ గలిగారు నన్నంత నీచానికి పాల్పడమని? నేను మీ కంటికెలా కని పిస్తున్నాను?"

లతా! ప్లీజ్.... ఆగు.... మమ్మల్నర్థం చేసుకో. నీ వంటి మీద ఏ మగవాడూ చెయ్యి వెయ్యడు. మే మడిగేది నీ శరీరాన్ని కాదు.. గర్భం.. గర్భాశయం.. స్త్రీ పురుష సంయోగంతో ఏర్పడిన పిండాన్ని నీ గర్భాశయంలో కొన్ని నెలలు పెంచాలి. తగిన సమయంలో ప్రసవించాలి. అంతే. ఇందుకు .... యీ ఉపకారానికి నీ పిల్లలకు చెరో పాతిక వేలూ .... నీకు యాభై వేలు ...."



అమాటనడానికి .... గర్భానికి అద్దె నిర్ణయించడానికి .... అలిస్ తక్కువ సంకోచించలేదు. కానీ.... గత్యంతరమేముంది?

ఇంకా—అర్థం కానట్టే చూసింది లత.సుషమ వివరించింది. "ఇది — నిజంగా త్యాగం. ఎందుకంటే .... ఒకస్త్రీ.... తనకి సంతానం కల్గ నందుకు ఆత్మహత్య చేసుకోబోతూంది. . ఆమెలో లోపమల్లా గర్భసంచి ఇరుకుకావడం. పిల్ల పెరిగేంత పెద్దది కాకపోవడం. దాన్ని సరి చేయడం కుదరదు. ఆమె అండం -పిండమౌతుంది. కాని- పెరిగేందుకు చోటులేక చచ్చి పోతుంది. అందు చేత — ఆమె పిండాన్ని — మీ గర్భాశయంలో పెంచాలి, ఐదవవారం నుంచీ, ఆమె శిశువు మీ గర్భంలో పెరిగి....ప్రసవించ బడుతుందన్నమాట. - అంటే.... సుమారు ఎనిమిది మాసాల పాటు గర్భాశయాన్నద్దె కివ్వడమూ ... మీరు నిర్వర్తించ వలసిన పవిత్ర కార్యాలూ, త్యాగాలూ. ఆ స్త్రీ చాల ధనవంతురాలు. ఆయన-మీకు లక్ష రూపాయలయినా యిస్తారు. పైగా — మీ రొక స్త్రీ జీవితాన్ని నిలబెట్టిన వారౌతారు. ఒక కుటుంబానికి వెలుగునిచ్చిన వారౌతారు. మనదేశంలో యిలా గర్భాశయాన్నద్దె కివ్వడం కొత్త కాని.... అమెరికాలో యిది యిప్పటికే వ్యాపారమై పోయింది.'

నివ్వెర పోయింది లత. "గర్భాశయాన్నద్దెకివ్వడం! ఛీఛీ!"

"కాదు. అద్దెకుకాదు—" తన పొరపాటు తెలుసుకుని అంది అలిస్ .... "ఒక జీవితాన్ని రక్షించడం .... ఒక యింటిని నిల బెట్టడం.... పవిత్ర కార్యం.... త్యాగం.... మానవత్వం...."

లత ఆలోచనలో పడినట్లు మౌనం దాల్చింది.

"అదే మానవత్వదృష్ట్యా — ఆత్మహత్యకు పాల్పడబోయిన

మిమ్మల్నీ పిల్లలనీ వారు ఆదుకుంటారు. ఎనిమిది నెలలపాటు గర్భం ధరించి — బిడ్డను ప్రసవించి యివ్వడమూ — తక్కువ శ్రమకాదు. అందుచేత...."

"నేనాలోచిస్తున్నది అదికాదు—"

"మరేమిటి?"

"నేను— కూటికిలేని దాన్నే కాని — కులస్త్రీని. నాకు— ప్రాణం కంటె శీలం ముఖ్యం. శీలం గురించే నే నాలోచిస్తున్నది."

ఆమెతో పాటు సుషమా, ఆలిస్ కూడా ఆలోచనలో పడ్డారు శీలం గురించి. మగవాడికి అక్కరలేనిదీ — స్త్రీ కి మాత్రమే అతి ముఖ్యమయినదీ అయిన యీ శీలమంటే ఏమిటి? శీలం — శారీరకమా, మానసికమా? శారీరకమను కుంటే— అబల అనబడే స్త్రీ — తన శీలాన్నెలా కాపాడుకో గలుగుతుంది? మానసిక మనకుంటే — ఐదుగురు భర్తలు కల ద్రౌపదిని ప్రతివ్రత అని శీలవంతురాలనీ ఎల అన్నాయి పురాణాలు? ఈ విషయంలో హిందూ మతం కంటె క్రిష్టియానిటియే కొంత నయమేమో. బిట్వీన్ స్కిన్ అండ్ స్కిన్ (శరీరానికీ శరీరానికి మధ్య) నోసిన్ (పాపం లేదు) అంటారా మతస్థులు. తనకి తెలిసినంత వరకూ హిందూ మతంలో — కచ్చితంగా స్త్రీ కి శీలమంటే యిది అని నిర్ధారించి నట్లెక్కడా లేదు. బ్యూటీ యీజ్ స్కిన్‌డీప్ (అందం — చర్మపు మందమే) అన్నట్లుగా యీ శీలం తాలూకు లోతెంతో ఎందు కెవరూ సుస్పష్టం చేయలేదో? లేక.... చేసినా — తనకే తెలియలేదో.

"చూడమ్మా" కలదు కలందనెడి వాడు కలడో లేడో అన్నట్లు— యీ శీలం ఉందే— యిదో బ్రహ్మపదార్థం. అగస్త్య భ్రాతలా స్వంత అడ్రస్‌లేనిది. హిందూ పురాణాలు— మనసుని పరిశుద్ధంగా ఉంచుకోమంటాయి. శారీరక శుభ్రత — మానసిక పవిత్రతను దోహదం చేసేందుకే తప్ప యిదే ధ్యేయమూ గమ్యమూ కాదు. నిన్ను పరపురుషుడు స్పృశించడు. శుక్ర శోణితాలు కలిసి ఏర్పడిన పిండం— నాలుగువారాల పయసుది నీ గర్భాశయాన్ని ఆశ్రయమిమ్మంటూంది. తన ప్రాణం నిలపమంటూంది. మరొకరి బిడ్డకు స్తన్యమివ్వడము నేరమూ, అపవిత్రమూ కాదుకదా. ఇంకా రూపుదిద్దుకోని గుడ్డుకి ప్రాణదానం చెయ్యడానికి- సంకోచం దేనికి ఇది అయితే మానవత్వమూ మహత్తరమూ ఔతుందే కాని మహా పాపం ఎన్నటికీ కాజాలదు. ఈ పవిత్ర భారతావనిలో- యింతటి త్యాగంచేసే ఉన్నతురాలివి.... మహోన్నతురాలివి.... మొట్ట మొదటిగా నువ్వేనేమో.

గర్భాన్నద్దెకిస్తున్నానని భావించకు. త్యాగం చేస్తున్నాననే అనుకో, నీవుచేసే ఉపకారం వల్ల—ఒకప్రాణి ఉద్భవిస్తుంది. మరొక స్త్రీప్రాణం తీసుకోకుండా.... ఆత్మహత్య చేసుకోకుండా జీవిస్తుంది. నువ్వు వాళ్ళకి చేయగలిగే సాయం చెయ్యి! వాళ్ళు చేయగలిగేసాయాన్నందుకో. జీవితమంటేనే యిచ్చి పుచ్చుకోడం. ఇందులో నేరమేమీ లేదు. కడుపుతీపి నువ్వెరుగనిది కాదు. ఇంకా ఏం చెప్పేది? ఆ దంపతుల నదృష్టవంతులని చెయ్యి, నిన్నూ.... నీ పిల్లలనీ అదృష్టవంతులని చెయ్యి, జీవితం జీవించడానికి కానీ, చేతులారా తీసుకుందుకు కాదు. నువ్వు బతుకు, ఆమెను బ్రతికించు...."

ఆమె ఆలోచిస్తూంది.

ఈవిడ చెప్పినది సమంజసంగానే ఉంది. తానేమీ వ్యభిచరించడంలేదు. మరొకరి బిడ్డ ఆకలి తీర్చేందుకు స్తన్యమిచ్చినట్లు మరొకరి పిండానికి ప్రాణం రక్షించడానికి గర్భాశయంలో స్థానం యిస్తుంది కొన్ని నెలలు. ఇందులో తప్పేమిటి? ఒక కుటుంబం నిలబెట్టడం కాదూయిది? ఇక—డబ్బు ... తను యివ్వగలిగిన ఆశ్రయం— తన శరీరంలో ఆశ్రయం యిస్తుంది—అర్థరాలు కనుక.... అవసరం కనుక. అలాగే వాళ్లూ—యివ్వగలగిన దిస్తారు. తనపిల్లలు దేనికీలోటు లేకుండా పెరుగుతారు. మంచి భవిష్యత్తేర్పడుతుంది వాళ్ళకి. అంత కంటె ఏం కావాలి తనకి? ఆయనే వొదిలేసి పోకపోతే — యివాళ యిటువంటి పరిస్థితి ఎదురయ్యేదే కాదు. పిల్లలకోసం.... యిద్దరి పిల్లలకోసం....

"సరే," అందామె.

"థాంక్యూ .... థాంక్యూ వెరీ మచ్ .... నిజంగా నువ్వు దేవతవి. కరుణామయివి.... దయామయివి ...." ఆమెచేతులు పట్టుకుని ఊపేసింది ఆలిస్.

సుషమ కళ్లు మెరిశాయి ఆనందంతో. ఆమెకు యింకా నమ్మకం చాలడం లేదు.

"లతా! ఇక నుంచి మీపేరు దయామయే." అంది నవ్వుతూ. ఆమె— సమాధానం చెప్పలేదు.

"మీరు కొంచెం విశ్రాంతి తీసుకోండి. మీ పిల్లలని తీసుకు వొచ్చేందుకు మనిషిని పంపుతాను. కొంచెం సేపట్లో వాళ్ళు వొస్తారు. అంటూ సుషమ చెయ్యిపట్టుకుని అవతలకి తీసుకు వెళ్ళింది.

"డాక్టర్!" పిలిచింది దయామయి.

వాళ్లు ఆగిపోయారు.

"నన్నే వాళ్ల దగ్గరకి పంపకూడదూ?"

"సాయంత్రం వెళ్ధురుకాని...." అనియిక ఆమె మాట వినిపించుకోకుండా నడిచింది ఆలిస్. వాళ్ళు వెళ్లిన మరునిముషం— నౌకరు ఆమెకి క్యారియర్‌తో భోజనమూ....పళ్లూ పాలూ తెచ్చాడు.

"పిల్లలు?" అడిగందామె ఆత్రంగా.

"వాళ్లకి భోజనాలు పెట్టించాను."

"నువ్వేనా?"

"డాక్టరుగారు చెప్పారు .... ముందు వాళ్లచేత భోజనాలు చేయించి మీకు క్యారియర్ తెమ్మని."

అప్పటికామె స్తిమిత పడింది. "వొస్తాననలేదూ వాళ్లు?"

"సినిమాకి వెళ్లే హడావిడిలో ఉన్నారు."

అమ్మయ్య అనుకుని ఆమె భోజనానికుపక్రమించింది.

నౌకరు వెళ్లి పోయాడు. ఆమె ఏదో తింటుందేకానీ.... అంత రుచికరమయిన భోజనం కూడా సయించడం లేదు. అక్కడి నుంచి పారిపోవాలనిపించిందొక్కసారి. తను చేస్తున్నది తప్పా? ఒప్పా?

తప్పేమో.... ఇంతవరకూ ఎవరూచేయనిది.... మొదటిసారిగా .... తప్పుకాదేమో .... ఒక జీవిని .... మరొక స్త్రీని రక్షించడం.... తప్పెందు కౌతుంది?

✽ ✽ ✽

అలిస్‌కి చాలా సంతోషంగా ఉంది— సుషమ అందించిన రిపోర్టులు చూసి. సుషమ— చాలా చురుకైనది. ఆమె ఎల్లో పతిలోకి రాకపోవటం నిజంగా ఆరంగానికి లోటే, ఎంత చక్కని రిపోర్టు తయారుచేసిందని!

లత.... యిక నుంచి దయామయి. ఆమె పేరుని మార్చడం—ముందు జాగ్రత్తగానేకాదు. అత్యవసరం కూడా. గర్భాన్ని అద్దెకివ్వడం లేదా అద్దెకు తీసుకోవడం అనేది యీ దేశంలో యింతవరకూ చట్ట బద్ధంకాదు. స్త్రీ శీలానికి .... పాతి వ్రత్యానికి .... సెంటిమెంట్లకి అధిక ప్రాముఖ్యత నా పాదించే యీ దేశంలో.... కేసంటూ న్యాయ స్థానానికి వెడితే—బహుశా న్యాయస్థానం దీనిని నేరంగానే పరిగణించ వొచ్చు. అందుచేత యిది మెడికోలీగల్ కేసు కావొచ్చు. కనుక డాక్టరు ఆత్మ రక్షణచేసుకోవాలి. పేషంట్‌కి కూడా యిదే మంచిది. ఎందుకంటే సామాజిక పరంగా గర్భాన్నద్దెకివ్వడం — తప్పుగా పరిగణించ బడవొచ్చు. అట్టే ఆలోచనా స్థాయి లేని మనుషులు ఆమెని చిన్న చూపుచూడ వొచ్చు.... పతితలా వ్యభిచారిణిలా. అందువలన కూడా ఆమె గుర్తింపుని రహస్యంగా ఉంచాలి. కనుక ఆమె పేరు దయామయి.... హాస్పిటల్ రికార్డులలో ఆమె అలాగే పిలవబడుతుంది. వ్యవహరించ బడుతుంది. మెడికల్ హిస్టరీ : ఇంతవరకూ ఆమె రెండుసార్లు గర్భవతి ఐ రెండు సార్లూ ఆరోగ్యవంతమయిన పిల్లలను ప్రసవించింది. పోషణ లోపం తప్పితే పిల్లలు నార్మలే, శారీరకంగా మానసికంగా. గర్భస్రావం జరగలేదు. ఆ గర్భాశయాన్ని పరీక్షించాక .... ఆరోగ్యంగా.... బిడ్డని పెంచగలిగే లక్షణాలలోనే ఉందామె యుటేరస్, పేషంట్‌కి— పోషణలోపం తప్పితే— మరే విధమయిన లోపమూ లేదు. జెనిటోయూరినరీ సిస్టమ్ సక్రమంగా ఉంది. మెన్సస్ - పీరియడ్స్ రెగ్యులర్, పి. వి. (పెర్ వాజినా) ఎగ్జామినేషన్‌లో యోనిద్వారం తగినంత ఎలాస్టికగా .... డెలివర్ చెయ్యడానికనువుగా ఉన్నట్లే రుజువైంది.

బాడీ టెంపరేచర్ నార్మల్.

అబ్డామిన్....వాల్స్‌తో సహా.... బేబీని పెంచేందుకుతగిన వైశాల్యాన్ని సంతరించుకో గలిగే తీరులోనే ఉంది.

మూత్రంలో కాని .... రక్తంలో కాని సుగర్ లేదు. యూరిన్‌లో ఆల్బుమిన్ లేదు. బ్లడ్ ప్రెషర్ — నార్మల్.

విటమిన్లూ ప్రొటీన్‌లూ రెగ్యులర్‌గా యిస్తే — పదిహేను రోజులలో ఆమె ఇంకా ఆరోగ్యం పుంజు కుంటుంది. జీర్ణకోశానికి చెందిన లోపాలు లేవుకనుక ఫటస్‌ని ఫీడ్ చెయ్యగలదు.

క్లుప్తంగా చెప్పాలంటే — దయామయి .... బ్లడ్‌గ్రూప్‌తో సహా ఫటస్‌ని పెంచి ప్రసవించడానికి సర్వవిధాలా సమర్థురాలు. ఆమె యుటేరస్ — రివర్స్డ్ — కాదనుకుందుకే అవకాశాలెక్కువ. ఎలాగు నాలుగువారాల వ్యవధి ఉందికనుక .... పేషంట్ ఆరోగ్యాన్ని చాల మెరుగుపరచ వొచ్చు మందులతోనూ పౌష్టికాహారం తోను ....

థాంక్యూ సుషమా.... థాంక్యూ.... అనుకుంది అలిస్.

ఇంకపరవాలేదు. టెస్ట్‌ట్యూబ్ బేబీకి .... తగిన ఆశ్రయం దొరికినట్లే, ఆమెకు — గర్వంవేసింది. భారతదేశం మేరకు కలకత్తాలోనే టెస్ట్‌ట్యూబ్ బేబీలు సృష్టించ బడ్డారు తొలిసారిగా.

ఇప్పుడు — తనూ సృష్టిస్తోంది!

ఈ ప్రయోగాన్ని సర్వవిధాలా సఫలం కావించు ప్రభూ! అనుకుంది మనసులో.

అదే సమయంలో.... సుషమ- దయామయినొక కాన్వెంటుకి తీసుకువెళ్ళి.... అక్కడ అన్నీ చూపుతోంది.

"ఇది—క్లాస్‌రూమ్.... ఇది.... ప్లేగ్రౌండ్.... రేపటి నుంచి మీ పిల్లలాడుకునే దిక్కడే. పాఠాలు నేర్చుకునే క్లాస్‌రూమ్ బాగుంది కదూ!"

ఆమెకు—మతి పోతోంది. కల నిజమౌతున్నట్లు ఉక్కిరిబిక్కిరిగా ఉంది.

"ఇది పిల్లలుండే హాస్టల్.... ఇవి.... గదులు.... వీటిలోనే ఉంటారు.

అది— డైనింగ్ హాల్.... క్రమశిక్షణ.... విద్యతోపాటు— ఆరోగ్యాన్ని కూడా పెంచుతారిక్కడ. దయామయీ! మీకి రెసిడెన్షియల్ కాన్వెంట్ నచ్చితే— యిప్పుడే చేర్పిద్దాం—" చెప్పండన్నట్లు చూసింది.

కలయో వైష్ణవ మాయయో అనిపిస్తూంది దయామయికి, తను కోరుకున్నది.... కలలు కన్నది.... నిజం కాబోతూంది! తన పిల్లలకి....మంచి తిండి, చదువు....భవిష్యత్తు....

"నాకు చాలానచ్చింది. నేనుకోరుకున్నది.. యిదే." అనేసిందామె. సుషమ —నవ్వింది. నేను కోరుకున్నదీయిదే.... అనుకుంది.. మనసులో. ఆమెను ప్రలోభపరచి అయినాసరే వొప్పించాలని తన ప్రయత్నం. పిల్లలనీ.... ఆమెనూ బాగుచెయ్యడం ఒక వేపు, జయదేవ్ పద్మల సమస్యను పరిష్కరించడం మరొకవేపు, రెండు జరుగుతాయి దయామయి ఊ! అంటే, ఆమెచేత ఊ అనిపించడానికే యిదంతా, తను జయించింది.

"రేపే పిల్ల లిద్దరినీ చేర్పిస్తాను, మీరు నర్సింగ్ హోమ్‌లో ఉందురుగాని."

"నర్సింగ్ హోమ్‌లోనా!"

'పిల్లలు బోర్డింగ్ స్కూల్‌లో ఉంటారు. మీరు వొక్కరూఎక్కడో ఉండడం దేనికి!నర్సింగ్ హోంలో మీరుండడంఅవసరం కూడా."

నాలుగువారాల అనంతరం కానీ పిండాన్ని ఆమె గర్భంలోకి ప్రవేశపెట్టకపోయినా" ఈ నాలుగువారాల మార్పులూ ఆమె గర్భంలో రావలసిందే. అందుకే ఆమె మెడికల్ అబ్జర్వేషన్‌లో ఉండాలి. దయామయి- అలాగే అన్నట్లె తల ఊపింది. తను ఎక్కడుంటే ఏమిటి!పిల్లలు బోర్డింగ్ స్కూల్‌లో ఉండేటప్పుడు.

[ఇంకా ఉంది]

డాక్టర్ మహీధర నళినీమోహన్

మాత్రా ఛందస్సులో మేఘసందేశం

(గత సంచిక తరువాయి)

ఉత్తరమేఘం

మెరపు తీవియ లిచట - సురుచిరాంగన లచట
రమ్యేంద్ర చాపమిట - రంగు చిత్రము లచట
మంద్ర ఘోషము లిచట - మర్దల ధ్వనులచట
అంతర్జలంబిచట - ఆటల సరస్సులట
ఆకాశ మంటుకొను నగ్రములు రెండింట
అలకాపురాలయము లచ్చు నీవలెనుండు. 1

లీల చేతులయందు లీలారవిందమ్ము
మొల్లముగ ముంగురుల మల్లెమొగ్గలమాల
వదనమున లోధ్ర పుష్పపరాగ రోచిస్సు
సిగలోన గోరింట, చెవిలో శిరీషమ్ము
నీవల్ల వికసించు నీ పమ్ము పాపటల
నలకాపుర స్త్రీల కవసరాభరణములు. 2

అళిపాళి ప్రేపేగి గళమెత్తగా చెట్లు
పుష్పించు నిత్యమ్ము - ముగ్ధ హంస శ్రేణి
మొలనూలుగా సదా నళిని తమ్ముల విరియు
అనుదినము పురివిప్పియాడు మెడ తిక్కించి
ఇండ్లలోని నెమళ్ళు - ఎల్లరాత్రుల నచట
పాడు చీకటి తొలగ పండు వెన్నెల మరియు 8

ఆనందమున దక్క అన్య హేతువు చేత
నశ్రు జలములు నాస్తి - ఆసమాస్త్రజము తక్క
నిచ్చారతుల కళ్కి నితర తాపము నాస్తి -
ప్రేమ కలహము తక్క విరహ తీవ్రవ్యధకు
పరకారణము నాస్తి - స్థిరయౌవనము తక్క
అలకలో యక్షులకు నన్యదశలే నాస్తి 4

తారకలు ప్రతిబింబితమ్ములై పుష్పములు
చల్లినట్లగుపించు స్ఫటిక మణిరచితమగు
హర్మ్యస్థలుల జేరి, యక్షులతివల గూడి,
ఘట వాద్యముల మ్రోత గంభీరమగు నీదు
ఉరుములను బురుడింప సురవృక్ష జనితమగు
రతిఫలంబైన మధురసము సేవింతురట. 5

చదలేటి తుంపురుల చలితెమ్మెరలు వీవ
కల్పవృక్షపు నీడ ఘర్మవ్యథల దీర్ప
పిడికిళ్ళ బంగారు తడి యిసుక పట్టుకొని
అందొక్కచో రహస్యముగ నొక మణిదాచి
అరసికొను గూఢమణి యనునాట నాడుదురు
దేవతలు సైత మర్థించు కన్నియ లచట 6

పోకముడి విడిపోయి కోక సడలుటగాంచి
వణకు చేతుల ప్రియులు వలువ లాగగ నచటి
కామినులు సిగ్గుపడి కర్తవ్య మూఢులై
మిరుమిట్ల దీపాల మెలప దలచి బిరాన
గుప్పిళ్ళతో తీసి కుంకుమను జిమ్మ నవి
రత్న దీపము లగుట యత్నమ్ము వ్యర్థమగు. 7

అలకా పురంబునం దర్ధ రాత్రమునందు
బిగి కౌగిలింతలను ప్రియులు సడలింపగా
అడ్డు నీవు తొలంగ నగుపించు వెన్నెలల
జాలీల వ్రేలాడు చంద్రకాంతపు శిలలు
చిందుచుండెడు నీటి బిందువులచే తొలగు
సుందరీ బృందముల సురత జనిత గ్లాని. 8

అనిలు ప్రేరణ చేత అచటి యుత్తుంగ సౌ
ధాగ్ర భాగము జేరి, అంబుకణముల జల్లి,
చిత్తరువులను పాడుచేసి, తన తప్పెరిగి,
దండ ´గన భీతి త్వరితగతి పొగవోలె
మారు.. ఱ దాల్చి, పారిపోవుదురు నీ
వంటి జలమ కుక్కలు గవాక్ష రంధ్రమునుండి 9

కిన్నరులు ధనరాజు కీర్తి గీతమ్ములను
రక్త కంఠముల మధురముగ నాలాపింప
నట్టింట తరుగు లేనట్టి నవనిధులున్న
యక్షముఖ్యులు స్మరవ్యాసంగ పండితులు
విబుధ వారాంగనా బృందమును భోగింత్రు
వైభ్రాజ బాహ్యోపవనము నందహరహము 10

మందార పుష్పదామములు సిగలోనుండి
శృంగార పత్రములు చెక్కిళ్ళపై నుండి
స్వర్ణ సరసీజములు కర్ణమ్ము లందుండి
కురువింద హారములు కుచతటంబులనుండి
నడక జోరున జారిపడి పగలు సూచించు
రాత్రి నభిసారికా వ్రజము వెడలిన దారి. 11

ధనపతికి సఖుడైన స్థాణుండు సాక్షాత్తు
నచ్చోట వసియించు టరసి భయపడి రతీ
ధవు డిక్షుకోదండ ధారణము మానుకొనె.
గురి తప్పి పోకుండ స్మర బాధితుల గొట్టు
జాణలగు జవరాండ్ర స్త్రభూ విభంగి వి
భ్రమ విలాసములచే పని జరుపుకొనుచుండె. 12

పలువన్నె వస్త్రములు - కలువ కన్నులయందు
కమనీయ విభ్రమము గల్పింపగల మదిర-
సిగలలో తురుముటకు చివురులంబువ్వులును-
చరణ పద్మములపై విరచింప యోగ్యమగు
లాక్షారసమ్ము - నఖిలా భూషణము లెల్ల
కల్పవృక్ష మొకండె కల్పించు నవ్వీలు. 18

ధనరాజు నింగారమున కుత్తరమ్ముగా
ఇంద్రచాపము వంటి హృద్యసింహద్వార
మగుపించు దూరమున కదియెమా భవనమ్ము.
బిడ్డనుంబోలె నా ప్రియురాలు పెంచుకొను
పూలు చేతుల కందు లీల వంగిన బాల
మందార తరువుండు మా యింటి ముంగిటను. 14

గరుడ పచ్చల మెట్లు గల దిగుడుబావి మా
పెరటి తోటను కలదు - విస్తార మందుండు
వైడూర్యనాళముల బంగారు పద్మములు-
ఆ నీట వసియించు హంసములు నీ రాక
గమనించియును నీరు కలగునని భయపడవు,
చెంత మానసమున్న జింతింప వటు పోవ. 15

నీలాల శిఖరమ్ము నిర్మింపబడి మధ్య
స్వర్ణకదళీవృక్ష పరివేష్టితంబైన
ఆ బావి చెంత క్రీడాచలము కలదొకటి.
మెరపు తీగెల తోడి మిత్రమా! నిను జూడ
మా యింటి దీపమ్ము మనసుపడి కట్టించు
కొన్నట్టి యా కొండ గుర్తువచ్చినదయ్య. 16

గోరంట పూ బొదల గుడిమధ్య మాధవీ
మంటప ప్రాంతమున మంజు రక్తాశోక
మందమగు బొగడ కల వదరుచున్న చిగుళ్ళ-
అందొకటి నాతో సహా కోరు నీ సకియ
ఎడమ పాదపు తాకు, నింకొకటి దోహద
వ్యాజమున గాంక్షించు నామె వదనాసవము 17

లే వెదురు రంగు గల్గిన మణుల యరుగుపై
ఆ చెట్ల నడుమగల దపరంజి దండంబు,
స్ఫటిక ఫలకము నెమలి వచ్చి కూర్చుండుటకు-
కమనీయ కంకణ క్వణనంబుతోడ నా
చెలియ తాళము వేయ చిందు ద్రొక్కుచునుండు
సాయంత్రముల నీదుసఖుడు పెంపుడు నెమలి. 8

ఈ యానవాళ్ళెల్ల హృదయాన నిలుపుకొని

ద్వార పార్శ్వములందు పద్మ శంఖమ్ములను
గమనించి నిపుణుడా! కనుగొందు సులభముగ
నేను చిరకాలమ్ము లేనందుచే కళా
హీనమగు మా భవన, మినుడబ్ధిలో మునుగ
శోభాయమానముగ జూపట్టునే తమ్మి? 19

శ్రీగృహప్రవేశమ్ము సిద్ధించుకొరకు నీ
వేనుంగు పిల్ల చందాన లఘు రూపమ్ము
దాల్చి, క్రీడా శైల తటమునం గూర్చుండి,
కిటికీలలోనుండి క్రీగంట మా యింట
మిడుగురుల మెరపువలె మిగుల నల్పమ్ముగా
నిగిడించు విద్యుదున్మేష దృగ్రేఖలను. 20

కావి పెదవుల కొమ్మ, కమ్మతావుల రెమ్మ
నడుము సన్నని బాల, నాభిలోతగు బేల
స్తన భరమ్మున వంగి, జఘన భరమున క్రుంగి
మందమ్ముగా నడచు మత్తు కన్నుల పడుచు
కమలాసనుని మొదటి కామినీ సృష్టియన
అందాల బరిణె యొకటగుపించు నా యింట. 21

సహచర వియోగాన చక్రవాకి విధాన
దవ్వులందున్న నను తలచుచొంటిగ కుములు
నా బహిః ప్రాణమ్ము నాతి భాషిణి నీవు
గురుతింపగలవులే - చిరవియోగ వ్యథల
శిశిరమథి తాంబుజ శ్రీ వోలె వాడినను
ఆమె వేరెవ్వరో యని భ్రాంతి పడబోకు. 22

గాఢ రోదన చేత కన్నులుబ్బిన దాని
నిట్టూరుపుల వేడి కట్టుడికి యధరంపు
పక్వబింబచ్ఛాయ వాడిపోయిన దాని
చేయి చేరుచుకొన్న చెలిమోము దీనమై
దీర్ఘ కేశములచే తిన్నగా కనబడక
నీ చాటు శశివోలె తోచునని యూహింతు. 23

నా క్షేమ మర్థించి నానా విధార్చనా
వ్యాకులంబై యుండు - కాకున్న బక్క చి
క్కిన నాదు చిత్తరువు గీయుచుండెడు - లేక
పంజరము లోని గోరవంకతో "నీ యందె
ప్రేమ గల నాథుని స్మరింతువటె? నెరజాణ!"
యనుచుండ కాంత నీ కగుపింపగా వచ్చు. 24

మలిన వస్త్రము గట్టి, పలుద తొడపై వీణ
నిలిపికొని, నా పేరు కలిపి కూర్చిన పాట
గాంధార గ్రామమున గానమొనరుపనెంచి,
కన్నీళ్ళచే తడియుచున్న తీగను చిట్టి
చివరికెట్లో తుడిచి, స్వీయకృత మూర్ఛనల
మాటి మాటికి మరచు బోటి జూచెదవేమొ. 25

ఆనాటినుండి శాపాంత సమయముదాక
ఎన్ని దినములు మిగిలియున్నవో లెక్కింప
గడపపై గల పూల పుడమిపై నిడుచునో-
స్వాంతమున నాతోడి సంభోగ మూహించు
కొనుచునో - నా తన్వి కనిపించు - రమణుండు
దరి లేని విరహిణుల సరిదా లివే కదా! 26

పగటి పూటను పెక్కు పనులుండి నీ సకియ
నెడబాటు బాధింప దెక్కువగ - రాత్రి యే
వ్యాపకమ్ములు లేమి వ్యథ అధికమని యెంతు
నేలపై శయనించి నిదుర పట్టని సతిని
మిగుల సంతస పెట్ట మేడ కిటికీ నుండి
నాదు సందేశమ్ము నడురేయి వినిపించు. 27

మానస వ్యాధిచే క్షీణించి, చివురాకు
ప్రక్కపై నొత్తిగిలి, ప్రాగ్దిక్కునం బొడచు
చంద్ర రేఖా లేశ సామ్యాంగి నారాణి
ఏరేల నాతోడ నిచ్చారతులమున్న
క్షణము వలె నడిపింప గలిగెనో అట్టి రే
లశ్రుధారల గడచు నతిదీర్ఘమై నేడు. 28

కిటికీల నుండి లోగిలిలోన జొరబారు
చంద్రశీతల పాద సంపదకు పూర్వాభి
మానమున నెదురేగి మరలి గ్రక్కునవచ్చు
కనుల నీ సఖి అశ్రుగరిమమగు పక్ష్మముల
మూసికొను - దుర్దినమ్ముల మేల్కొనకయుండు
నిద్దురయు పోకుండు నేల తామరవోలె. 29

ముంగురులు కేవలాంబుస్నాన పరుషమై
చెక్కిళ్ళ పొడుగునను చెదరుచో, కెంబెదవి
గ్లేశపెట్టెడు నూర్పు కెరటాల నెగ్రదోసి-
స్వప్నమందైన మత్సంభోగ మబ్బునని
నిదుర పోవగ నెంచి, నేత్రాంబు పూరముల
కనుమూత పడకున్న కాంత నీ కగుపించు. 30

విరహాది దివసమున విరచితంబై మరల
శాపాంత సమయమ్మున సకల దుఃఖము లెడలి
వచ్చి నేనే విప్పవలసియుండిన జుట్టు-
పరుషమై, చిక్కులై, పట్టుకొన బాధించు
ఎగుడు దిగుడుగనున్న, మొగముపై పడుచున్న
ఏక వేణిని తరచు నెగ్రదోయు సఖిజూడ. 31

సకల భూషల రోసి, సౌకుమార్యపు రాసి
స్వశరీరమును తరచు శయ్య యొడిలో నిడుచ
కొన ప్రాణముల నిలుపుకొనుచున్న నీ సకియ-
నీవు సైతమ్ము నవనీరకణ రూపమున
కన్నీటిపశ్రమ్ము కార్చునట్లుగ సేయు
ఆర్ద్రహృదయుండు కరుణాత్ముడగునే కదా! 32

ఎరుగుదును నీ వదినె హృదయమ్ము నామీది
యనురాగమున పూర్ణమైయున్నదని, కనుక
భావింతు తొలి విరహ బాధ లిట్లుండునని-
అందగాడ నటన్న అహముతో నేనిట్లు
పదరినట్లు తలంప వలదు - త్వరలో నీవె
తెలిసి కొందువు నేను పలికినది సత్యమని. 33

నిడుకురుల అడ్డుచే కడగంటి సిరి చెడిన
బొమల ముడి మదిరాసవము లేమి కొరవడిన
మెరుగు కాటుకలేమి మిసమిసలు కరవైన
ఎడమ కనుపైతట్టు మృగశాబలోచనకు
నదరుటను శంకింతు నంబుదా! నినుజూడ-
కలగు చేపల వలన కలువ వణకిన యట్లు. 34

రతినాటి నా నఖక్షతము లిప్పుడు లేని-
తదుపచారార్థమ్ము దాల్చుచుండెడి చలువ
ముత్యాల కటిభూష లత్యవసరము కాని-
మరుకేళి పిదప మత్కర మర్దనమ్ములకు
భావ్యమగు, సరస రంభాస్తంభగౌరమగు
నా పడతి యెడమ తొడ నాడదరు ననుకొందు. 35

నీవు చేరినవేళ నిద్రాసుఖమ్ము నా
యువిద కబ్బినయేని యురుమకుండగ జాము
కాలమ్ము నీ వచట కనుపెట్టుకొనియుండు.
స్వప్నమందైన తన ప్రాణేశ్వరుండ నే
నెట్టకేలకు దొరుక గట్టిగా నా మెడకు
భుజ లతంతో వేయు ముడి విప్పటుచితమే? 36

సుకుమార మాలతీ ముకుళములతో సహా
స్వజల బిందుస్పర్శ చల్లనగు మారుతము
నొలసి నీ సఖిని పునరుజ్జీవితమొనర్చు.
ఆశ్చర్యమున జూచు నా మానవతి తోడ
మెరపులను దాచికొని, యురుములనియెడు ధీర
భాషణంబులనిట్లు పలుక నారంభించు. 37

నీ మగని మిత్రుండ నే నో సుమంగళీ!
అతని సందేశమ్ము నాత్మలో నిలిపికొని
నీ కడకు వచ్చితిని నీరవాహుడ నేను.
విరహిణుల జుట్టుముడి విప్ప నుత్సుకతతో
పరతెంచు పరదేశి బాటసారుల మంద్ర
కిరుణార్ద్ర ఘోషముల త్వరపెట్టగలవాడ. 38

అని పలికినట్టి నిన్ననిల పుత్రునివంక
జనక రాజకుమార్తె చందాన మొగమెత్తి,
ఔత్సుక్యమున జూచి, ఆదరము ప్రకటించి
సందేశ మామె కడు శ్రద్ధతో వినగలదు-
చెలికాని నోటవచ్చిన మగని సంగతులు
కాంతలకు సంగమము కన్న కొంచెమెలొచ్చు. 39

అన్యోపకారార్థ మగు జీవనము వాడ!
ప్రార్థించు నాకై, కృతార్థుండ వగుటకై
ఆమెతో చెప్పుమా - రామగిర్యాశ్రమ
ప్రాంతమున నీ మగడు బ్రతికియే యుండెనని,
అతడు నీ క్షేమమ్ము నరసెనని - తొలుదొల్త
ఆపదల నున్న వా రడుగున దివేకదా? 40

భిగ్గరగ వాక్రువ్వ దగ్గ విషయంబయ్యు
చెలికత్తెలుండ నీ చెక్కిళ్ళపై ముద్దు
గుస్తరింప నెవండు గుసగుసలు పోవునో
అతడిపుడు శ్రవణ విషయమ్మునకు దూరమై
కనులుండి కనలేక గాఢవిరహార్తిలో
పలికినది నా నోట తెలుపుచుంటిని వినుము. 41

నీ మేని సామ్యమ్ము శ్యామా లతలయందు
దృష్టిపాతము భీత మృగలోచనములందు
నీలాలకల శోభ నెమలి పింఛెమునందు
నెరికన్బొమల విరుపు చిరుకెరటములయందు

వదనరుచి శశియందు వెదకుచుంటినిగాని
అలుగకే చండీ! సమగ్ర సామ్యము నాస్తి 42

ప్రణయ కుపితగ నీదు వర్ణచిత్రము బండ
రాతిపై గైరిక ద్రవ్యములతో గీసి
త్వత్పాదములమీద పడినవానిగ నన్ను
వ్రాయ జూపగ బాష్ప వాహినలు పెల్లుబికి
కనులు కనబడవాయె - కఠినంపు లోకమైన
మన సంగమమ్ము విధి కననొల్లదే చెలీ! 43

బహు యత్నమున నిద్ర పట్టి, కలలో నీవు
కనుపింప బిగియార కౌగలింపదలంచి
శూన్యమున చేతులం జాచుచుండిన నన్ను
కరుణార్ద్రచిత్తులై కాంచు వనదేవతల
ముత్యమ్ము లంతేసి భూరి బాష్పకణంబు
లడవి చెట్ల చివుళ్ళ యందుండి పడుచుండె. 44

దేవదారువు చెట్ల నేవళపు లేజివురు
దొన్నెలను విరిచి, యందుండి కారెడు పాల
పరిమళము గబ్బెత్తి, పరుగెత్తి, దక్షిణవు
దిక్కుగా వచ్చు తద్ధిమశైల పవనముల
నాలింగనము సేతు నవి తొల్లి నీమేను
తడివి వచ్చినవన్న తమకమున గుణవతీ! 45

తొలివాన చినుకులకు నిలనుండి వెలివచ్చు
పరిమళము వంటి నీ వదన సౌరభమునకు
బహుదూరమై వాడి వత్తలైయున్న నను
పంచబాణుడు విడక బాధించుచున్నాడు
ప్రేయసీ! వేసంగి వెళ్ళి ఆకసమెల్ల
మబ్బు కప్పిననాడు మరి యేమిటగు నాకు? 46

దరి కానరాని దుర్భర రాత్రములు కుంగి
క్షణము లవవలెనంచు - సర్వకాలమునందు
పగటి పూటలనెండ పలుచబడవలెనంచు
తీర్పజాలని కోర్కె లేర్పరచుకొనుచుండు
నా పిచ్చి మనసునకు నళినాక్షి! నీతోడి
విరహానలము నుండి శరణమెట్లు లభించు? 47

మునుముందు పొందగల సుఖము లూహించుకొని
నను నేనె రక్షించుకొనుచుంటి - నీవైన
దిగులు పడకెక్కువగ దీర్ఘ సౌభాగ్యవతీ!
ఎల్లకాలము సుఖము లెట్లుండవో అట్లె
కష్టములు కూడ కలకాల ముండవు లెమ్మ
బండి చక్రపు కమ్మివలె క్రిందు మీదగును. 48

శ్రీమహావిష్ణుండు శేషశయనము నుండి
లేచినప్పుడు శాప మోచనంబగు నాకు
కడమ నాలుగు నెలలు కనులు మూసుక గడుపు-
పిదప మన మిద్దరము విరహకాలమునందు
సలుప దలచిన వెల్ల సాగించుకొనవచ్చు
ప్రౌఢ శారద రాత్రి పండు వెన్నెలలందు. 49

ఇంతిపోతాక అతడిట్లనియె - "మున్ను నా
యెద కత్తుకొని నీవు నిదురపోవుచు నడుమ
నెందుకో బిగ్గరగ నేడుచుచు లేచితివి
ఎన్నియోమారు లడిగించుకొని లోలోన
నవ్వుతో చెప్పితివి 'ఎవ్వతెనో గూడుచుం
గనిపించితివి మోసగాడ! కలలో' ననుచు! 50

పైన చెప్పిన గురుతు వలన నే కుశలముగ
నుంటినని యెరుగుమో ఉత్పలాక్షీ! నేను
చనిపోతినని లోకు లను మాట నమ్మకుము.
విరహమున స్నేహమ్ము విరుగునని యెందుకో
చెప్పుదురు కాని యది తప్పు - భుక్తము కామి
రసపూర్ణమై ప్రేమ రాసులై వర్ధిల్లు. 51

ప్రథమ విరహపు తీవ్ర బాధచే శీర్ణమగు
నీ సకియ నోదార్చి, నీలకంఠుని యెద్దు
గోరాడు కైలాస గౌర శిఖరము విడిచి
గురుతుతో కూడ తత్కుశల వార్తను దెచ్చి
వేగుజామున మల్లె విరివోలె శిథిలమై
పడనున్న నా బ్రతుకు పట్టి నిలుపుము వేగ. 52

ఈ బంధు కార్యమున కీ వొప్పుకొంటివని
తలతు ఘనుడా! బదులు పలుకకుండుటె నీదు
గాంభీర్యమునకు తార్కాణమని భావింతు
నిశ్శబ్దముగ నీవు నీరిత్తు వర్షించు
చాతక శ్రేణులకు - సర్వదా యాచకుల
కోర్కె లీడేర్చుటే గొప్పవారి జవాబు. 53


విరహాంధ నేనన్న కరుణనో, మైత్రినో
నీ వంటి గొప్పవానికి ననుచితంబైన
వార్తాహరత్వంబు వనద! చేపట్టితివి.
ఆ పిదప నీ తోచినట్టి చోటుల వర్ష
సంపదల దిరుగాడు క్షణమైన నాలాగు
విద్యుదంగన తోడి విప్రయోగము లేక. 54

యక్షాంగనా ప్రాణ రక్షణార్థమ్ము త
త్సందేశమును వారి ధర వరేణ్యుడు దివ్య
వాణితో జనహిత ప్రౌఢంబుగా పలికె
తన భర్త కుశలవార్తను విన్న యాతన్వి
చిత్తమ్ము పులకించె - ఉత్తముల నర్థింప
నీప్సితోచిత ఫలము లీడేరకుండునే? 55

ధనరాజు సైతమ్ము ఘనుడు తెచ్చిన వార్త
విని, యలుక చల్లార, మనసెల్ల చలియింప
ఉండిపోయిన శాప ముపసంహరించుకొని
మరల నా యక్ష దంపతుల దగ్గర జేర్చె-
కష్టాలు గట్టెక్కి హృష్టాంతరంగులై
అభిమతా నందంబు లనుభవింపగజేసె. 56

[ఉత్తరమేఘం సమాప్తం]
(అయిపోయింది)

ప్రాతికేయుడు — బాబు



చిన్న నవలల పోటీలో మొదటి బహుమతి రు. 2500/- లు పొందిన నవల

సుందరం

ఘండికోట బ్రహ్మాజీరావు



కొండా మీదీ వెండీగిన్నె
కొక్కీ రాజూ కాలూ విరిగె
మందా కేదో చెప్పావయ్యా
చందామామా దండాలయ్యా.

గంపమీద కూర్చున్న సింహాచలం లేచి నిల్చబడింది. ఫ్లడ్ లైట్ల వెలుతురు చాలా హెచ్చుగా ఆమెమీదపడుతున్నది. చీరకుచ్చిళ్లు దులిపింది. తొడలవరకు మీదికి ఎత్తికట్టింది. పైటతీసి పృధువక్షం మధ్యనుంచి వెనుకకు తీసి దోపుకుంది. ఆమెకు కుడివేపు ఎడమవేపు గంపలు బోర్లించుకొని కూర్చున్న పదిమంది చెలికత్తెలు లేచి నిలబడ్డారు. ఆమెకుమల్లే చీరలు ఎత్తి కట్టుకున్నారు.

వాళ్ల చుట్టూ రాత్రి డ్యూటీకివచ్చిన మగాళ్లు కూర్చున్నారు. రాత్రి పదకొండుగంటల వేళ. పన్నెండు గంటలకు షిఫ్టు మారుతుంది.

సింహాచలం మళ్లా పాడడం మొదలుపెట్టింది.

చెలికాడొచ్చీ చేయీ పట్టి
చెక్కిలినొక్కి చెవిలో చెప్పి
మబ్బూ చాటుకు పోవా నీవు
మంచీ వాడవు కావా నీవు ।
చందామామా చందామామా ।

ఇటు ఆయిదుగురు, అటు అయిదుగురు - నిలబడ్డ చెలికత్తెలు "చందామామా, చందామామా" అని వెనుక పాట అందుకున్నారు.

సింహాచలం ఒకడుగు ముందుకు వేసింది. సవిలాసంగా చేతులుతిప్పి అభినయించింది. పాడుతూ మరి రెండడుగులు ముందుకు వేసింది. అభినయంలో మందగతి మధ్యమానికి చేరుకుంది. చెలికత్తెలు వెనుక పాట పాడుతున్నారు. మరి రెండడుగులు అభినయిస్తూ సింహాచలం సాగింది. తారాస్థాయిలో ఆమె అంగాలు కదుల్తున్నాయి. చుట్టూ కూర్చున్నవాళ్లు ఒళ్లు మరచి చూస్తున్నారు.

ముందుకు వచ్చినట్లే, అడుగులు క్రమంగా వేసుకుంటూ సింహాచలం పాడుతూ, అభినయిస్తూ వెనుకకి నడిచింది. తారాస్థాయినుండి క్రమంగా. మధ్యగతికి, చివరకు మందగతికి చేరుకుంది.

సింహాచలం గొంతుక చాలా శ్రావ్యమైనది.

ఆమె ముక్కు సంపెంగపూవులా ఉండనే ఉంది. ఆమె శరీరచ్ఛాయ కూడ సంపెంగరంగే. పాతిక సంవత్సరాల వయస్సులో ఆమె ఒంటి వంపులు అన్ని వయసులవారిని కదిపి పారేస్తాయి. మనిషి ఒడ్డూ, పొడుగూ ఉండడం చేత మామూలు వాళ్ళకి అందుబాటులో ఉండదు.

పాట ముగిసింది. సింహాచలం, ఆమె చెలికత్తెలు నిలబడే ఉన్నారు. ప్రేక్షకులనుండి వీరాసామి లేచి నిలబడ్డాడు.

"ఇక్కడ కూర్చున్న మగాళ్ళలో ఎవరైనా ముందుకొచ్చి సింహాచలాన్ని కావలించుకుంటే పదిరూపాయలిస్తాను." అన్నాడు వీరాసామి.

కూచున్న మగాళ్ళందరూ లేచినిలుచున్నారు అందరూ ఆలోచిస్తున్నారు. సింహాచలం కౌగిలి అంటే రంభ పరిరంభమే. సందేహం లేదు. స్వర్గం కోసం తపస్సు చేయనక్కర లేదు.




Bali

అక్కడ నిలబడ్డ రసికులెవరూ ముందుకు రావడంలేదు.

"ఒకటి, రెండు.... నేను పదిచెప్పేనరికి ధైర్యమున్నవాడు సింహాచలాన్ని కావలించుకోవాలి. కాకపోతే ముడుచుకొని కుక్కలా వెళ్ళిపోవాలి."

వీరాసామి లెక్కపెడుతున్నాడు.

"మూడు, నాలుగు... తొమ్మిది..."

సింహాచలం పతివ్రత కాదు.

మొగుడు ముసిలాడని విడిచిపెట్టింది. తమ్ముడింటికి చేరుకుంది. సింహాచలానికి తల్లి ఉంది. తండ్రి లేడు. తల్లి బొగ్గులేరు కుంటుంది. సింహాచలంకూడా ఆ పనే చేస్తుంది. ఇంజన్ల షెడ్డులో పగలు తల్లి, రాత్రి కూతురు బొగ్గులేరు కుంటారు. బొగ్గు లమ్ముకుంటారు. కాలిన బొగ్గులు మాత్రమే ఏరుకోవాలి. కాలినవాటి మాటున పచ్చిబొగ్గులు కూడా వాళ్ళు దాచుతారు. పగలు అటువంటి అవకాశాలు తక్కువ. రాత్రిపూట అవకాశాలు ఉంటాయి. వాటిని మెరుగుపరచడమే సింహాచలం చేసేపని.

సింహాచలం పెరట్లో ఒక సంపెంగ చెట్టుంది. రాత్రి తిండితిని, కొప్పులో రెండు పూలు ముడుచుకొని, ఒడిలో నాలుగుపూలు ఉంచుకొని సింహాచలం ఇంజన్ల షెడ్డుకు వస్తుంది. ఆమెతో మరో పదిమంది చెలికత్తెలొస్తారు. అందరూ బొగ్గుల కుప్పలకు సమీపంలో ఉన్న దిబ్బమీద, ఫ్లడ్‌లైటు వెల్తురులో బుట్టలు బోర్లించి కూర్చుంటారు. రోజుకో చెలికత్తె పాడుతుంది, మిగిలిన వాళ్ళు వెనకపాట పాడి, ఆమెతోపాటు అడుగులు వేస్తారు. ఈ రాత్రి సింహాచలం వంతు - పాట, ఆట అయిన తరువాత, పన్నెండు గంటల రాత్రికి షిఫ్టు మారి, పనివాళ్లు మారిన పిమ్మట, సింహాచలం చిన్నదొర కూర్చున్న ఆఫీసు కిటికీదగ్గిర నిలబడుతుంది. ఒడిలోనున్న సంపెంగపూవు ఒకటి తీసి చిన్న దొర చూస్తున్న డైరీమీదికి విసురుతుంది.

ఆ దొర తలెత్తి చూడడు. సంపెంగపూవు తీసుకొని వాసనచూస్తూ డైరీ చదువుతుంటాడు.

ఒక అయిదు నిమిషాల తరువాత ఆమె మరొకపూవు విసురుతుంది. దానికికూడా దొరతలెత్తడు. రెండోపూవు పక్కను పెడతాడు.

"ఓయి మనుషుడా!"

మరో అయిదు నిమిషాల తరువాత మూడోపూవు డైరీ మీదికి విసిరి సింహాచలం చాలా తీయగా పిలుస్తుంది.

"యూ బిచ్! యూ డోన్ట్ ఎలవ్ మీ టువర్క్!"

ఆ దొరలేస్తాడు. వాడికి ఒక కాలు సొట్ట. యుద్ధంలో ఆ కాలు పోయిందంటాడు. ఎంతవరకూ నిజమో! అందుకోసమే వాడు 'యుద్ధం జరుగుతున్నా ఇంజన్ల షెడ్డుకో పని చేయగలుగుతున్నాడు.

వాడి భుజంమీద సింహాచలం తన చేయివేస్తుంది.

ఇద్దరూ ఫ్లడ్‌లైటు వెలుతురు పడనిచోటికి మాట్లాడుకుంటూ నడుస్తారు.

పదిమంది చెలికత్తెలు పరుగుపరుగున బుట్టలతో పచ్చిబొగ్గు మోసుకు పోతారు. ఆ బొగ్గుకు ధర హెచ్చు.

సింహాచలం నాట్యభంగిమలో వెనక్కి నడిచేటప్పుడు రెండు చేతులు తల వెనుకకు పెట్టుకొంది. ఆ విధంగానే నిలబడి, వీరాసామి పందానికి ముందు కొచ్చే మగాడెవరని అందరివేపు చూస్తున్నది.

నిలబడ్డ వాళ్లందరూ సింహాచలం రోజూ చూస్తున్నవాళ్ళే. ధైర్యం లేని మగాళ్ళనుచూసి ఆమె నవ్వుతున్నది.

ఈ విధంగా నాలుగు రోజులయి వీరాసామి సవాలుచేస్తునే ఉన్నాడు; ధైర్యం చాలని పెద్దమనుషులు గుడ్లు మిటకరించుకుంటూ పేలవంగా నవ్వుకుంటూ వెళ్ళిపోతున్నే ఉన్నారు.

వీరాసామి 'పది' అనే లోపలే ఒక అనుకోని పని జరిగింది.

కళ్ళుమూసి తెరచేలోపల ప్రేక్షకుల మధ్యనుండి ఒక మనిషి ముందుకు రావడం, బలమైన తన బాహువులతో సింహాచలాన్ని బంధించడం జరిగాయి. సింహాచలం తన పక్షంలో బొమ్మలా నిలబడలేదు. తన తల వెనుకనున్న చేతులు రెండూ కౌగిలించుకున్నవాడి తల వెనుకకుమార్చి, వాడి తలను తన వేపుకువంచి, పెదవులను గాఢంగా చుంబించింది.

ఈ భంగిమలో ఆ జంట లోకాన్ని మరచి పోయినట్లుంది.

పది నిమిషాలకాలం రెప్పపాటులో ముందుకు నడిచింది.

చూచేవాళ్ళు స్థాణువులై నిలబడిపోయారు.

వీరాసామి ఒక్కసారి మామూలు ప్రపంచంలోకి వచ్చాడు.

తన కళ్లను తానే నమ్మలేక పోయాడు.

కాలుపడ్డ తాచుపాములా బుసలుకొట్టాడు. ప్రక్కనే పడివున్న చువ్వనొకదానిని తీసుకొని లోకంతో సంబంధం లేకుండా ఆలింగనముద్రలో ఐక్యమైపోయిన జంటలో పురుషుడిని బలంగా కొట్టాడు.

"ఓరి ఓప్లెస్ (హూప్లెస్) నా కొడకా! నీ కెన్ని గుండెలున్నాయిరా! సింహాచలాన్ని ముట్టుకోడానికి నువ్వు తగుదువురా? చుట్టూ ఉన్నవాళ్ళకన్న నువ్వు గొప్పోడివిరా? అడుక్కుతిని బతికిన.... కొడకా? జాతిలేని పింజారీ! నీతి నీకెందుకుంటుందిరా! ఈ సింహాచలం, చిన్నదొర ప్రాపకంలోని సింహాచలం, ఈ చక్కని చుక్క సింహాచలం - దీని కాలిగోరుకి నువ్వు పోలవురా! పోయేకాలం దాపురించిందిరా!...." తరువాత వినలేని బండబూతులు తిడుతూ చువ్వతో కొడుతూ ఆ జంటను విడదీశాడు.

అప్పటికి రాత్రి పదకొండున్నర అయింది.

వీరాసామికి చాల ముఖ్యమైన పనొకటుంది. కాగడా ముట్టించి చిన్న దొర బంగళాకు పరుగెత్తాలి. సరిగా పావు తక్కువ పన్నెండుకు దొరని లేపాలి. ఆ దొర పది నిమిషాలలో తయారవుతాడు. అతనికి కాగడా వెలుతురులో దారి చూపించాలి. ట్రేలో దొరగారి కాఫీ పాట్, సాండ్‌విచ్ పాక్‌ని పెట్టుకొని నడవాలి అన్నిటికన్న ముఖ్యం హోప్‌లెస్‌గాడి ఘోరమైన నేరాన్ని చిన్నదొరకి చెప్పాలి. ఎవరూ చెప్పకముందే చెప్పాలి. దొర అనుగ్రహం పొందడానికి మూర్తిమీద, గురునాధం పంతులుమీద, నరసింహరాజుమీద ఎన్నో చాడీలు చెప్తునే ఉన్నాడు. వాటివలన అంత ఫలితం కనిపించడంలేదు. దీనితో చిన్నదొర దారిలోకి రాకేం చేస్తాడు? ఏదో దొరలు పెట్టిన భిక్షేకదా తనకి ఉద్యోగం. ఇల్లుపట్టిన బావమరిదికో నౌకరీ దొరికితే కోటలో పాగావేసినట్లే. పనిచేయకుండా, చుట్టమీద చుట్ట కాలుస్తూ, వీడిమీద వాడిమీద దొరకి కబుర్లు చెప్పుకుంటూ హాయిగా బ్రతకవచ్చు.

సింహాచలం ఇంకా సుఖపారవశ్యం నుండి తేరుకోలేదు.

హోప్‌లెస్‌గాడు తలవంచుకొని బండరాయికిమల్లె నిలబడ్డాడు.

వీరాసామి పరుగులుతీశాడు.

మిగిలిన ప్రేక్షకులు చాలని వారించారు. మట్టిబుక్కడం వంటి హోప్‌లెస్‌గాడు ఇటువంటి పని చేస్తాడని వాళ్లు కలలోకూడ అనుకోలేదు. వాడంటే అందరికీ జాలి. అభిమానం - స్వంతమైన కొడుకు తన ఎదుటే చేయరానిపని చేసినప్పుడు తండ్రిపడే బాధ వారందరి ముఖాలలోను కనిపిస్తున్నది.

వీరాసామి దొరగారి బంగళా చేరేసరికి అయిదు నిమిషాలు ఆలస్యమయింది. చిన్నదొర అసరికే లేచాడు. బంగళాలో అన్నిలైట్లు వెలుగుతున్నాయి. వీరాసామి చాలా గాభరాగా తలుపుతట్టి లోపలికి ప్రవేశించాడు.

చిన్నదొర, విరగబి కాలుకు మేజోడు ఎక్కిస్తున్నాడు, సోఫాలో

కూర్చొని.

"బ్లడీ నిగర్ ! ఎందుకురా లేటయింది ?" చిన్నదొర ఉరిమాడు.

"సార్, సార్ ! చాల ముఖ్యమైన సంగతి సార్ !" అన్నాడు పీరాసామి జాపోస్తూ.

"బ్లడీ ఫూల్ ! గాడిదలా జాపోస్తున్నావెందుకురా ! ఈ దొర ప్రాణం పోవాలి కాని డ్యూటీకి లేటవదని తెలిసినా ఎందుకు ఆలస్యంగా వచ్చావురా ,"

"కాదుసార్ ! మన సింహాచలాన్ని, కాదు, కాదు, తమరి సింహాచలాన్ని హాప్‌లెస్‌గాడు, రాత్రి డ్యూటీ మనుమలందరూ చూస్తుండే, సిగ్గూ శరమూ లేకుండా కౌగిలించుకొని ముద్దెట్టుకున్నాడు సార్...."

జోడు, ఆ ఉన్న ఒక్క మంచి కాలుకు తొడుక్కోకుండా, చంకలో కర్రపెట్టుకొని చిన్నదొర నిలబడిపోయాడు.

"డబల్ బారల్‌గన్ - అర్జంట్ !" దొర పిచ్చివాడిలా అరుస్తున్నాడు.

"వద్దుసార్ ! అరుక్కుతినే ముండాకొడుకు సార్ !...."

"హంటర్, హంటర్ !"

సింహాచలం మామూలుగా పన్నెండున్నర వేళకు చిన్నదొర కిటికీదగ్గిరకి వచ్చి నిలబడింది. చేతిలో చిగురాకుల మధ్యనున్న బంగారం రంగులోని సంపెంగపూవుని దొర డైరీమీద విసరబోయి, ఆగిపోయింది.

లోపల జరుగుతున్నది చూస్తుండే ఆమెకు ఒళ్ళు మండిపోయింది. చేతిలోని పూవును నలిపినలిపి నేలను విసిరికొట్టింది.

2

మూర్తి పని పంచాడు. పనివాళ్ళందరూ వెళ్ళిపోయారు, ఒక్క హోప్‌లెస్ తప్ప.

గురునాధం పంతులుకూడా తన పనివాళ్ళను పంపించాడు.

మూర్తి, గురునాధం పంతులు ఇంజన్ల షెడ్డులో సూపర్‌వైజర్లుగా పని చేస్తున్నారు. ఇద్దరిదీ ఒకే షిఫ్టు. గురునాధాన్ని అందరూ గురువుగారని పిలుస్తారు. అతను ఇంజను బాయిలర్ శాఖకు సంబంధించిన మనిషి. మూర్తి ఫిటింగ్ పనులు చూస్తాడు.

మూర్తికి పాతిక సంవత్సరాలకు మించిన వయసులేదు. పందొమ్మిదో ఏటే ఉద్యోగంలో ప్రవేశించాడు. అతను నీలి ఖద్దరు నిక్కరు, తెల్లటి ఖద్దరు షర్టు తొడుక్కున్నాడు. చొక్కామీద చేతులులేని నెహ్రూకోటు తొడుక్కున్నాడు. కాళ్ళకి బూట్లు వేసుకున్నాడు.

గురునాధం పంతులికి ముప్పై అయిదేళ్ళు. అతను పదహారు సంవత్సరాలయి ఉద్యోగం చేస్తున్నాడు. మనిషి పొట్టిగా సన్నంగా ఉంటాడు. పంట్లాం తొడుక్కొని, తెల్లగా ఇస్త్రీ మడతలలోనున్న చొక్కా వేసుకున్నాడు. కళ్ళకి జోడుంది, కాళ్ళజోడు పాలిష్‌చేసి నిగనిగ మెరుస్తున్నది.

ఇద్దరూ ఇంటర్‌మీడియేటు పాసయినవాళ్ళే.

ఇంజన్ల షెడ్డులో ఆ రోజుల్లో వీళ్ళిద్దరే విద్యాధికులు,

గురువుగారికి మంచి అనుభవముంది. దొరల దగ్గిర తలవంచకుండా పనిచేసే ధైర్యముంది. మనిషి పిట్టలా ఉన్నా, బీమ మిరపకాయ వంటివాడు.

"మూర్తీ ! ఈ రాత్రి హోప్‌లెస్‌గాడికి పనివ్వకు. ఇంటికిపోయి పడుకోమను. వీడిని సొట్టదొర హంటర్‌తో బాదుతుండే ఎవరెవరు చూశారో గుర్తుందా ?" గురువుగారు అడిగారు.

"అప్పిశ్శుగాడు, వెంకటస్వామి, ఫకీరు సాహెబు, పీరాసామి... .... అన్నాడు మూర్తి.

"పీరాసామిగాడిని వదిలిపెట్టు. మిగిలిన ముగ్గురు కోర్టులో నిలబడి సాక్ష్యం చెప్పగలరా ?"

మూర్తి ఆలోచిస్తున్నాడు.

"ఈ సొట్టదొరని కోర్టుకీడ్చించి ఏడ్పించాలని ఉంది. వీడేమో ఆంగ్లో యిండియన్‌కూడా కాదు. ఇంగ్లండులో వీడికో పెళ్ళాముందట. బ్రిటిష్ వాడినని చెప్పుకుంటాడు. వీడికి జీతంకూడా హెచ్చే." అన్నాడు గురువుగారు.

"ఇతను ఇంగ్లండులో బట్లరుగా ఉండేవాడు. ఇతని యజమానిని హిందూదేశం పంపించినపుడు ఇతనినికూడా ఆ యజమాని తీసుకొచ్చాడు. ఇతనికో మంచి ఉద్యోగం ఇచ్చి అతను వెళ్ళిపోయాడు. హిందూదేశానికి సంరక్షకుడనని ఇతను అందరితో చెప్తాడు."

"ఏది ఏమయినా వీడో వెధవ అన్నది నిజం. ఈ బట్లరు ఉద్యోగం చేసిన వెధవకి తన మాతృభాషకూడా రాదు. వాక్యంలో కనీసం అరడజను 'బ్లడీ' లుంటాయి. వీడిరాతలో అన్నీ తప్పులే. వీడికి ప్రపంచజ్ఞానంకూడా అంతంత మాత్రమే. ఆ మధ్య వీడితో మాట్లాడుతూ, జపానువాళ్ళు టోకియో నగరాన్ని బాంబు వేశారని చాల సీరియస్‌గా అన్నాడు, ఆ జోక్ వాడు విని చాల ఆశ్చర్యపోయాడు. ఏదోవిధంగా కాలు విరగ్గొట్టుకొని వీడు మనల్ని పరిపాలిస్తున్నాడు ప్రత్యక్షంగా."


మూర్తి ఆలోచిస్తున్నాడు.

రోజూ ఇద్దరూ ఎవరింటికో పోయి రేడియో వింటారు. టోకియోనుంచి సుభాష్‌బాబు సోదరుడి సందేశాలు వింటుంటారు. బ్రిటిష్‌వారిని భారతదేశం నుండి తరిమివేసే దినంకోసం ఎదురు చూస్తుంటారు.

మూర్తి రోజూ ఇంటిదగ్గిర పెట్టె రాట్నం మీద నూలువడికేవాడు. బీచ్‌లో దేశనాయకులు ఇచ్చిన ఉపన్యాసాలన్నీ విన్నాడు. ఏదో ఒకరోజు ఈ దేశం మనదయినప్పుడు ఏవిధంగా దీనిని తీర్చాలన్న ఆలోచనలలో మునిగి పగటి కలలు కంటుండేవాడు.

"ఎవడయినా పనిచేయనివాడిని, తాగుబోతును శిక్షించినా నేను విచారించను. ఈ హోప్లెస్‌గాడు శరీర నిర్మాణంలో సింహంవలె ఉన్నా, స్వభావంలో మేకవంటి వాడు. ఎవరూ లేనివాడు. అందరి పనివాళ్ళు పెట్టిన తిండితిని బతికినవాడు. పనిలో నూటికి నూరుపాళ్ల విశ్వసించదగినవాడు. రెండేళ్ళయి పనిలో చేరినా, చాలామంది సోమరిపోతులకంటె ఎంతో నయం. వీడిని చిన్నదొర నిర్దాక్షిణ్యంగా పశువుకన్నా హీనంగా బాదాడు. మరొకడయితే ఆ దెబ్బలకక్కడే స్పృహతప్పి పడిపోయేవాడు. వీడికి జరిగిన అన్యాయం మనందరికీ వర్తిస్తుంది. మనం నోరు మూసుకొని ఊరుకుంటే రేపు మనమీద కూడా ఇతను విరుచుకుపడతాడు."

గురునాధం పంతులు లేచినిలబడ్డాడు. గదిలో ఈ కొసనుండి ఆకొస



వరకు పచారు చేశాడు ఆలోచిస్తూ.

"వీడిని మనం ఏమీ చేయలేం. కాని వీడిని అదుపులో పెట్టాలి. వీడికి పెద్ద దొరకి మధ్య మంచి అవగాహన ఉంది. మనం వీడిమీద ఫిర్యాదు చేసినా పెద్దదొర మననే చీవాట్లు పెడతాడు. అందరికీ సింహాచలం చిన్న దొర మనిషని తెలుసు. దానినిచూస్తే నాకుకూడా మనసుండబట్టదు. ఒరే హోప్లెస్.. ఎందుకీ పని చేశావురా ?"

హోప్లెస్‌గాడు జవాబు చెప్పలేదు. ముఖం దించుకున్నాడు.

"రోజూ నీకు చదువుచెప్పి, నీతులు బోధిస్తున్న మీ బాబుగారు నరసింహారావు, ఇటువంటి పని చేయకూడదని చెప్పలేదా ?" గురునాథం హోప్లెస్ గాడిని ప్రశ్నించాడు.

"చాలసార్లు చెప్పారు. తప్పు చేసినప్పుడు శిక్ష తప్పదన్నారు బాబు గారు." అన్నాడు వాడు.

"నువ్వు తప్పుపని చేసినట్లు అంగీకరిస్తే ఎవరం ఏమీ చేయలేం." అన్నాడు మూర్తి.

"అదేను సార్ ! నేను తప్పు చేయలేదని చెప్తున్నాను." అన్నాడు హోప్‌లెస్‌గాడు.

గుమ్మం దగ్గిర నిలుచున్న చిన్నదొరని చూసి మూర్తి నిలబడ్డాడు.

"ఈ బ్లడీ హూప్లెస్‌గాడికి పనెందు కివ్వలేదు ?" దొర ప్రశ్నించాడు మూర్తిని.

"వాడిని ఇంటికి పంపించి వేస్తున్నాను." అన్నాడు మూర్తి.

"పర్మనెంటుగా ఇంటికి పంపిస్తా. ముందు వీడిని స్మోక్‌బాక్స్ క్లీనింగ్‌కి పంపించు" అన్నాడు దొర.

రాత్రి ఇంజన్‌షెడ్ పాలనకు చిన్నదొరే బాధ్యుడు. అతని ఆజ్ఞలు శిరసావహించవలసిందే.

వీడిక్కడ కాలం వ్యర్థం చేయడం పనికిరాదు" మరోసారి చిన్నదొర చెప్పి అక్కడనుండి కాలు ఆడించుకుంటూ నడిచిపోయాడు.

మూర్తి, గురునాథం పంతులు ముఖంలోకి చూచాడు.

గురువు చాలా కోపంగా పళ్లు కొరికాడు. మరేం మాట్లాడకుండా గది నుంచి వెలుపలికినడిచి పనిమీదికి వెళ్ళిపోయాడు.

ఏం చేయడానికి మూర్తికి తోచలేదు.

"ఒరే హోప్‌లెస్ ! నువ్విక్కడ ప్రొద్దున్నవరకు కూచో - నేను సంగతంతా పెద్ద దొరతో చెప్తాను. నువ్వు ఏం నేరం చేశావో, రెండు శిక్షలనుభవించడం పనికిరాదు. ఇటువంటి పరిస్థితిలో నిస్సహాయులు చేయవలసినది సత్యాగ్రహం మాత్రమే."

హోప్‌లెస్ చిన్న నవ్వు నవ్వాడు.

"మూర్తిబాబూ! నేను చేసినపనికి మీరుకూడా ఇరుకునపడడం బాగుండదు. పెద్దదొర చిన్నదొర పనిని సమర్థిస్తాడు. ఇప్పటికే మీరంటే వాళ్లు శత్రువులుగా చూస్తున్నారు." అన్నాడు వాడు.

"ఒరిం హోప్లెస్ ! నువ్వు నా క్రింద పనిచేస్తున్నావు. నీకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోడానికా నేనున్నాను ?"

"మీరు ఊరుకోవద్దు. చిన్నదొర చెప్పినట్లు నన్ను పనిలోకి పంపండి. మిగిలిన విషయాలు రేపు పొద్దున్న ఆలోచిద్దాం...."

మూర్తి మరేమీ జవాబు చెప్పలేదు,

అతనికి ఏ ఇంజను మీదికి పోవాలనిలేదు.

అతని ఆలోచనలలో ఒక్క హోప్లెస్‌గాడే ఉన్నాడు.

అప్పుడు వాడు నాలుగేళ్ళ వాడట. వాడి తల్లెవరో, తండ్రెవరో వాడి చేతిలో ఒక సిల్వరు కంచం మాత్రం ఉంది. వాడు కట్టిన నిక్కరుకి చాల చిరుగులున్నవి. మధ్యాహ్నం పన్నెండు గంటలవేళ, రాత్రి ఎనిమిది గంటలపుడు పనివాళ్లు ఒకచోట భోజనం చేస్తారు. నాలుగేళ్ళ పేరులేని కుర్రాడు కంచం చాపితే ఎవరికి తోచినముద్ద వారు కంచంలో వేసేవారు. కొళాయి దగ్గిర నీళ్లు తాగి, ఆఫీసు వరండాలో రాత్రి పడుక్కొని వాడు పెద్దవాడయాడు. ఎవడో పెద్దమనిషి వాడిని 'హోప్‌లెస్ ఫెలో' అని పిలవడంతో వాడు హోప్‌లెస్‌గా, పాటక జనం నోళ్ళల్లో ఓప్‌లెస్‌గా స్థిరపడ్డాడు. వాడి పదేళ్ళ ప్రాయంనుంచీ పనిలో ప్రవేశపెట్టారు. ఇంజన్ల షెడ్డులో ఒక కాంటీను ఉంది. అప్పుడక్కడ టిఫిన్ తయారుచేసేవారు కారు. ఉదయం మధ్యాహ్నం దూరంగా ఊరిలోనున్న మంచి హోటలునుండి తెప్పించేవారు. టిఫిన్ తెచ్చే కుర్రాళ్లు ఎవరూ స్థిరంగా ఉద్యోగంలో ఉండేవారుకారు. ఒకరోజు ఎవరూ లేకపోతే వీడిని హోటలుకు పంపించారు. ఆనాటినుండి వాడు ఎనిమిది సంవత్సరాలు నిరంతరంగా కాంటీనులో పని చేసేవాడు. ఉదయం, మధ్యాహ్నం వేళపట్టున టిఫిన్ అందుతుండేది. హోటలువారు పొద్దున్న టిఫిన్ ఇచ్చేవారు, మధ్యాహ్నం కాంటీనువారు ఇచ్చేవారు. వాడు చేస్తున్న పనికి జీతమివ్వాలని ఎవరికీ నాలుగేళ్ళదాకా తోచలేదు. సంవత్సరానికి రెండు జతల బట్టలు మాత్రం ఇచ్చేవారు.

మూర్తి ఉద్యోగంలోచేరిన ఆరు నెలలకు నరసింహారావుకూడా చేరాడు. అతను గుమస్తాగా పనిచేసేవాడు. సహజంగా మనిషి చాల ఉత్తముడు. ఒకరికి జరిగే అన్యాయాన్నికూడా సహించలేనివాడు. అతను హోప్‌లెస్‌గాడిని చూచి చాల బాధపడ్డాడు. అతను ఎలక్షన్లలో కాంటీన్ సెక్రటరీ అయాడు. అయిన వెంటనే అతను హోప్‌లెస్‌గాడికో జీతం ఏర్పాటు చేశాడు. ఒకపూట తనయింట్లో భోజనం పెట్టేవాడు. రెండోపూట కాంటీనులో వాడు వండుకునేవాడు. రెండేళ్ళక్రింద వాడికి పద్దెనిమిదేళ్లు నిండగనే పెద్దదొరతో చెప్పి ఒక ఉద్యోగం వేయించి వాడిని మూర్తి దగ్గిర పనిచేయడానికి పంపించాడు.

హోప్‌లెస్‌గాడి బాగోగులు ఆలోచిస్తూ మూర్తి పనిలో మునిగిపోయాడు.

ఉదయం ఆరు గంటలకు మూర్తి ఆఫీసు గదికి తిరిగివచ్చేసరికి హోప్‌లెస్‌గాడు అతని టేబిలు దగ్గిర నిలబడ్డాడు. ముఖంనిండా నల్లటి, కాలిన బొగ్గుధూళి కప్పివుంది - కళ్లు ఎర్రగా ఉన్నాయి - జుత్తుమీద పడకుండా కట్టుకున్న గుడ్డమీదకూడా ధూళి పేరుకుంది.

"మూర్తిబాబూ ! మీరు వీరాసామికి పాకింగ్ పని ఇచ్చారు - అతను బేరింగులలో పాకింగ్‌తీసి, పొయి ముట్టించుకోడానికి పట్టుకుపోయాడు, ఆ యింజను పాసింజరుకు తగిలిస్తారు - పెట్టెలు కాలిపోతాయి...." అన్నాడు వాడు.

మూర్తి పరుగుపరుగున ఇంజనుదగ్గిరకి పరుగెత్తాడు. వీరాసామి చేసిన ద్రోహానికి ఏంచేయాలో అతనికి తోచలేదు. ఇంజను సరిచేసేసరికి ఎనిమిదయింది.

వీరాసామి మీద మూర్తి పెద్ద రిపోర్టు వ్రాశాడు.

వాడిసంగతి తెలిసి నవ్వుకున్నాడు.

చిన్నదొర ఆ రిపోర్టు చింపేశాడని మూర్తికి తెలియదు, వీరాసామికి తప్ప.

3

"సుందరం, ఏం జరిగిందో వివరంగా చెప్పు" నరసింహారావు పన్నెండు గంటల వేళ భోజనానికొచ్చిన హోప్‌లెస్ గాడిని అడిగాడు.

హోప్‌లెస్ గాడికి ఏ పేరూ లేదు. ఉద్యోగంలో చేరవలసి వచ్చినప్పుడు

తండ్రి పేరు, వాడి పేరు కావలసి వచ్చాయి. తండ్రి పేరు తెలియదని, సంరక్షకుడు నరసింహారావని పుస్తకాలలో వ్రాసుకున్నారు. వాడి పేరు "సుందరం"అని నరసింహారావు పెట్టాడు. ఏ పేరు పెట్టాలో అతనికి తోచ లేదు. భీమారావో. ఘటోత్కచుడో అంటే వాడి ఆకారానికి, బలానికి సరిపడ తుంది. "సుందరం" అని పేరు పెట్టడంలో అతని అభిప్రాయ మేమిటో మూర్తితో ఒకనాడు చెప్పాడు.

ఆంజనేయుడు మహా బలశాలి. చాలసౌమ్యుడు. వీటన్నిటికి మించి అతను సుందరుడు. అతని బాహ్య రూపంలో సౌందర్యం ఎక్కడి నుంచి వస్తుందని మూర్తి ప్రశ్న వేశాడు. వంక తిరిగిన మూతి, తామ్రవర్ణంలో కోతి ముఖం, అతను సుందరుడేమిటి ? అతని ముఖంలోకి చూసిన వాళ్ళు ఏదో దివ్యమైన తేజస్సు గుర్తించి, అతను మహా సౌందర్యవంతుడని నమ్ముతారు. ఇక అతని అంతః సౌందర్యం గురించి చెప్పనే అక్కరలేదు. వీటన్నిటినీ మనసులో ఉంచుకొని వాల్మీకి సుందరకాండకు ఆ పేరు పెట్టాడు. అటు వంటి సుందరుడుగా ఈ హోప్‌లెస్‌గాడు లోకంలో బ్రతకాలని ఆశించాడు నరసింహారావు.

ఆ సుందరుడు పరమబ్రహ్మచారి.

ఈ సుందరం ఎందుకి తప్పుపని చేశాడని · నరసింహారావు బాధ పడ్డాడు.

ఈ సుందరానికి ఏ అనాధాశ్రమం నుండో గుణవంతురాలైన చదువు కున్న పిల్లను తెచ్చి పెళ్ళిచేయాలనుకున్నాడు. కాని వీడా కలలన్నీ వమ్ము చేశాడు.

నరసింహారావుకి ఈ హోప్‌లెస్‌ని చూడగానే ఒక కోరిక కలిగింది. ఎవరూలేని మనిషిని మంచి దారిలో పెట్టి ఆదర్శ పురుషుడుగా తీర్చి దిద్దాలని మనసా సంకల్పించాడు.

అందుకే దీక్షగా రోజూ వాడికి రెండు గంటలపాటు చదువు చెప్తూ, మంచి నడవడి అలవరచుకునే దారిలో వాడిని నడిపిస్తున్నాడు. హోప్‌లెస్ గాడికి నరసింహారావంటే దేవుడేనన్నమాట

సుందరం గడచిన రాత్రి జరిగిన విషయాలన్నీ నరసింహారావుకి వివరంగా చెప్పాడు. అన్నీ చెప్పిన తరువాత అతను వేసినప్రశ్న, "ఎందుకు తప్పు చేశావు" అన్నదానికి మాత్రం జవాబు చెప్పకుండా మౌనం వహించాడు.

"సుందరం ! నీకన్నీ మంచి బుద్ధులే నేర్పించాను. నువ్వు చాల ఓర్పుతో వాటిని పాటించి, నలుగురూ సంతోషించేటట్టు మసలుకుంటున్నావు. మనిషనే వాడికి శీలమన్నది చాల ముఖ్యమైనది. అది లేనివాడి బతుకు నిరర్ధకమే. నువ్వు చేసిన పని నీ శీలానికే మచ్చ తెచ్చింది. ఒక పొర పాటు చేయడంవలన ఇంతకాలం శ్రమపడి సాధించిన మంచి పేరు నాశనమై పోయింది. నేను పడిన శ్రమ వ్యర్థమయింది. ఇక నీ దారిని నువ్వు పోవచ్చు".


సుందరం ఏమీ జవాబివ్వలేదు. తలవంచుకొని ద్వారంవేపు నడిచాడు. నరసింహారావు వాడిని చూస్తూ ఏమనాలో తెలియక కళ్ళంట జారుతున్న నీళ్ళను కూడా తుడుచుకోలేకపోయాడు.

నరసింహారావు ఒక్కసారి డగ్గుత్తికతో పిలిచాడు.

"సుందరం !"

సుందరం తిరిగివచ్చి అతనికి ఎదురుగా మఠం వేసుకు కూర్చున్నాడు.

"బాబుగారూ ! మీరింతగా బాధపడడం దేనికి ? లోకంలో ఏమీ కాని వాడిగా బ్రతికాను. నన్ను బాగుచేయాలని మీరు దీక్ష పూనారు. చదువు నేర్పుతున్నారు. తిండి పెడుతున్నారు. ఎన్నో విషయాలు చెప్పి నాకు దారి చూపించారు. తప్పు చేయడం మనుష్యుడి స్వభావం. నేను అన్ని లోపాలున్న మానవుడిగానే నన్ను భావించుకుంటాను. మీరందరూ నేను చాల



పరిచయం

శ్రీ ఘండికోట బ్రహ్మాజీరావు గారు శ్రీ కాకుళం జిల్లా పొందూరులో 1922లో జన్మించారు ఇంజనీరు వృత్తి కాని తెలుగు, సంస్కృతం, ఇంగ్లీషులలో ఎం ఏ లు పుచ్చుకున్నారు రైల్వేలో 40 సంవత్సరాలు పనిచేసి రిటయిరయి హాల్దియా డాక్ కాంప్లెక్సులో స్పెషల్ ఆఫీసర్‌గా కూడా ఉన్నారు

1940 నుంచి నేటి దాకా ఏభయి పయిగా కథలు, తొమ్మిది పయిగా నవలలు రాస్తే ప్రచురించ బడ్డాయి

ఇంతకి ముందే చెప్పినట్లు శ్రీ బ్రహ్మాజీరావు గారు పశ్చిమ బెంగాలులో ని కుల్టియాలో ఉంటున్నారు

పెద్దదయిన తప్పు చేశాననే అంటున్నారు. కాని, నా మనసు మాత్రం నేను చేసిన పని తప్పుకాదని అంటున్నది. అందుచేత తప్పు చేశానన్న చింత నాకు లేదు. మీరు ఒక సంగతి పదే పదే చెప్పారు, పౌరుషం లేని మనిషి చచ్చినా బతికినా ఒకటేనని. నేను చేసిన పని పౌరుషానికి చెందినది. మరి తప్పెలా అవుతుంది ?"

"నీ తర్కమేమిటో నాకు అర్థమవడం లేదు. మనిషి శీలానికి, పౌరు షానికి సంబంధ మేమిటి ? అన్నిటికన్న విలువయినది శీలం. దానిని కాపాడుకోవడం ముఖ్యం".

"మీరు చెప్పిన తర్కమే మళ్ళా చెప్పవలసి వస్తున్నది. పౌరుషం లేని జన్మ నిష్ప్రయోజనమైనదని మీరే చెప్పారు. నేను శీలానికి భంగం కలిగించే పని చేయలేదు".

"వివరంగా చెప్పు, నీ మాటలలో ఏమి గూఢార్థముందో వింటాను".

"వీరాసామి నాలుగు రోజుల నుండి మమ్మల్ని రెచ్చగొడుతున్నాడు. అందరం సింహాచలం పాట విని, ఆట చూసి పనిలోకి వెళ్ళేవాళ్ళము. అతను సింహాచలాన్ని కావలించుకున్నవాళ్ళేమగాళ్ళన్నాడు. ఆ పని చేయలేనివాడు పౌరుషం లేనివాడన్నాడు. పందెం కాశాడు. రోజురోజుకి అతను విజృంభించి అందరికీ అవమానం కలిగించే మాటలంటున్నాడు. అతని ఆట కట్టించడానికి ఎవరికీ ధైర్యం లేకపోయింది. మరోరోజు ఇటువంటి ప్రసక్తి లేకుండా, మిగిలిన పురుషుల గౌరవం కాపాడటానికి నేను ముందుకొచ్చాను".

"ఒక పని చేసేటప్పుడు మంచి చెడ్డలు బాగా ఆలోచించాలి".

"నాలుగు రోజులు ఆలోచించాను. అయిదో రోజు వీరాసామి ఆట కట్టించాను. మరి అతను జన్మలో ఇటువంటి సమస్యను లేవనెత్తడు".

"నువ్వు వొట్టి మూర్ఖుడివి. అందరి మధ్య వయసులోనున్న ఆడదానిని కావలించుకోవడం నలుగురూ మెచ్చేపనా ? అంత మందికి పౌరుషం లేద

నేనా నీ అభిప్రాయం ?"

"కొంతమంది లోకానికి భయపడి, బెదిరింపులకు భయపడి, ఉద్యోగానికి భయపడి ఏ పని జేయడానికి ముందుకురారు. నేను చేసిన పని కామానికి లొంగి చేసినదికాదు".

నరసింహారావు నవ్వాడు.

"ఇద్దరూ ఒకరి కౌగిలిలో ఒకరు పది నిమిషాల వరకు ఉండిపోయారు. వీరాసామి నిన్ను చువ్వతో కొడుతున్నా అయిదు నిమిషాల వరకు నువ్వు ఆమె నుండి విడిపోలేదు. దీనికేం సంజాయిషీ చెప్తావు ?"

"బాబుగారు నేను కేవలం పౌరుషంతో ఆమెను కావలించుకున్నాను. కామంతో కాదు; ఆమె నన్ను గాఢంగా కావలించుకొని, నా తలను దగ్గిర తీసుకొని ముద్దుపెట్టుకుంది. పది నిముషాల వరకు నన్ను చేతుల నుండి విడవలేదు. దానికి నేను బాధ్యుడను కాను."

"సుందరం! నువ్వు సింహాచలాన్ని కావలించుకోడం, ఆమె నిన్ను ముద్దుపెట్టుకోవడం బహిరంగంగా చేయవలసినవి కావు. అందరి ఎదుట ఇటువంటివి చేస్తే సిగ్గుచేటు. నలుగురిలో తలెత్తుకొని తిరగలేం".

"నేను ఈ విషయం కూడా చాలా ఆలోచించాను. వీరాసామి మాటలకు అంతం కనిపించలేదు. అప్పుడు నేను రంగంలోకి దిగవలసి వచ్చింది".

"అది నాయకుడెవడో చేయవలసిన పని. నీకా అర్హత లేదు".

సుందరం ఒక క్షణం మౌనంగా ఉండి పోయాడు. తరువాత మెల్లిగా అన్నాడు.

"బాబుగారూ ; నా జీవితం ఎన్నో విషయాలు నేర్పింది. కంఠం పట్టుకొని మనిషి మనిషిని ఒక ముద్ద పెట్టమని అడిగినప్పుడు కొందరు విసుక్కునేవారు, కొందరు కోపపడేవారు, కొందరు పిలిచి పెట్టేవారు. ఒక రోజు తిండి దొరికేది - ఒక పూట ఏమీ ఉండేది కాదు. మసిలో, చలిలో, వానలో, ఎండలో బ్రతికాను. మీ దృష్టిలోపడ్డ తరువాత నా బ్రతుకే మారి పోయింది. ఇపుడు నాకు తిండి సమస్య లేదు. తల దాచుకోడానికి మీరు ఏర్పాటు చేసిన ఇల్లు ఒకటుంది. నాకు అన్యాయం జరిగినందుకు నేను అంతగా పట్టించుకోవడం లేదు, కాని, మరొకరికి జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ ఊరుకోలేక పోతున్నాను. నాయకత్వం వహించే అర్హత నాకుందో లేదో, నాలో ఈ మార్పు మాత్రం తలెత్తుతున్నది".

నరసింహారావు సుందరం వేపు చాల సేపు చూశాడు.

"సుందరం ; కొన్ని నిజాలు చాల కటువుగా ఉంటాయి. నువ్వు నలుగురి ఎదుట సింహాచలాన్ని కావలించు కున్నావు. సిహాచలం చిన్నదొర మనిషి. చిన్నదొర నీ ఉద్యోగం తీయించే సామర్థ్యమున్నవాడు. నేను ఎంతో శ్రమపడి వేయించిన ఉద్యోగం నువ్వు ముందు వెనుకలు ఆలోచించకుండా చేసిన తప్పువని వలన ఒక్క క్షణంలో ఊడిపోతుంది. అపుడు నీ బతుకు నడివీధి పడుతుంది".

సుందరం పెదవుల మీద పేలవమైన నవ్వు కలిగింది.

"బాబుగారూ ! నేను చేసిన పనికి శిక్ష అమలు పడింది. చాల ఓర్పుతో శిక్షను అనుభవించడమే నేను చేయవలసిన పని. నేను తప్పు చేయలేదని నా అంతరాత్మ చెప్తున్నది. నేను చేసిన పనివలన మీరు ఇబ్బందిలో పడ్డారు. దీనికి నేను చాల విచారిస్తున్నాను. నన్ను క్షమించమని మిమ్మల్ని అడిగే అర్హత కూడా పోగొట్టుకున్నాను.

అప్రయత్నంగా సుందరం కళ్ళు చెమ్మగిల్లాయి.

"సుందరం ! నువ్వు స్వతంత్రమైన అభిప్రాయాలు కలవాడివి కావాలని నేను ఆశించాను. ఆ దారిలో నిన్ను నడిపించాను. నీ అచంచలమైన ఆత్మ విశ్వాసానికి నేను గర్విస్తున్నాను. ఆ ధైర్యంతోనే ముందుకు అడుగు వెయ్యి".

సుందరం మరి మాట్లాడలేదు- భోజనం ముగించి ఇంటి వేపు నడిచాడు.

ఇంజన్ల షెడ్డుకి తూర్పు వేపు నాలుగు బంగళాలున్నాయి. అందులో ఒక దానిలో పెద్దదొర, రెండిటిలో ఇద్దరు చిన్న దొరలు, నాలుగో దానిలో ఒక ఇనస్పెక్టరు ఉన్నారు- నరసింహారావు ఇనస్పెక్టరుగారి ఉత్తరాలు టైపు చేసేవాడు. ఆఫీసు వైర్లు అతనివి నడిపించేవాడు. ప్రతి బంగళాలో ఒక అవుట్‌హౌసుంది. ఒకసారి ఇనస్పెక్టరుగారి అవుట్‌హౌసు ఖాళీ అయితే దానిని సుందరానికిప్పించాడు. ఇల్లిచ్చినందుకు ఇనస్పెక్టరుగారి పూలమొక్కలకు గొప్పులు తవ్వడం, నీళ్ల పోయడం చేసేవాడు సుందరం.

శ్రమపడంది సుందరానికి ఏదీ జీవితంలో లభించలేదు.

ఉదయం ఎనిమిది గంటలకు ఇంటి కొచ్చి, ఇల్లు చక్కదిద్దుకొని, స్నానంచేసి మడతబట్టలు కట్టుకున్నాడు- అవుట్‌హౌస్‌లో ఒక్క పెద్దగది, చిన్న వంటకొట్టు మాత్రమే ఉన్నాయి. గదిలో ఒకచాప, చిన్న తలగడా, కర్రపెట్టె, దానిమీద కొన్ని పుస్తకాలు, మూలనొక కూజాలో మంచినీళ్లు ఉన్నాయి. సుందరం కొంతసేపు నరసింహారావు చెప్పిన లెక్కలు చేశాడు. తరువాత ఇటు అటు గదిలో పచారుచేసి పదకొండున్నరకు నరసింహారావు గారి యిల్లు చేరుకున్నాడు- అతని భోజనమయిన తరువాత సుందరానికి భోజనం పెడతారు.

భోజనానికి ముందరే నరసింహారావుతో చర్చ జరిగింది.

సుందరం ఇల్లు చేరుకున్నాడు- గది తలుపు తాళం తీసి లోపలి కెళ్ళాడో లేదో, దగ్గరగానున్న తలుపు తోసుకొని సిహాచలం లోపలికి వచ్చింది. ఆమె వచ్చే సరికి సుందరం చొక్కా విప్పి గోడకున్న మేకుకు తగిలిస్తున్నాడు- అతని వీపుమీద నెత్తురు చిమ్మిన చారలు కనిపిస్తున్నాయి. సుందరం వెనక్కు తిరిగి సింహాచలాన్ని చూశాడు.

సింహాచలం నీలంరంగు నేతచీర కట్టుకుంది- జరీ అంచున్న రవికె తొడుక్కుంది. కొప్పు పెట్టుకుంది; కొప్పులో చిన్న రెమ్మతోనున్న సంపెంగ పూవు తురుముకుంది. ఆమె నుదుట కుంకుమ బొట్టు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నది.

"సింహాచలం ! నువ్వెందుకొచ్చావు ?" అడిగాడు సుందరం చాప మీద కూర్చుంటూ.

"నావల్ల నువ్వు దెబ్బలు తిన్నావు. నా మనసు మనసులా లేదు. ఒకసారి చూచి పోదామని వచ్చాను-" అంది సింహాచలం.

సుందరం మెత్తని నవ్వు నవ్వాడు.

"చూశావు కదా ; నాకు నిద్ర ముంచుకొని వస్తున్నది. నువ్వు వెళ్లేటప్పుడు తలుపు దగ్గిర పెట్టివెళ్ల".

"ఓరి ఓప్లేసూ ; నీ కోసం బాధపడి వస్తే ఇదరా మాట ?"

"సింహాచలం ! నువ్వు దొరగారి మనిషివి. నిన్ను గౌరవంగా చూడాలి. వీరాసామి మాటలకు రెచ్చిపోయి నిన్ను నలుగురిలో కావలించుకున్నాను. దానితో పందెం ముగిసిపోయింది. ఇప్పుడు నేను నేనే - నువ్వు నువ్వే ;"- సుందరం చాపమీద పడుకున్నాడు.

సింహాచలం ఆ మాటలు వినిపించుకున్నట్లు లేదు- ఎదురుగా నున్న గూటిలోంచి కొబ్బరినూనె తెచ్చి సుందరం పక్కనే కూర్చుంది. మెల్లగా వాడి తలమీదనున్న ఒత్తైన జుత్తులో వేళ్ల పోనిచ్చి కొంచెం సేపు రాసింది. తరువాత ఒంటిమీద నున్న దెబ్బలకు కొబ్బరినూనె మెల్లగా రాసింది.

సింహాచలం కొబ్బరినూనె సీసా గూటిలోపెట్టి వచ్చే సరికి సుందరం నిద్రపోతున్నాడు- ఆమె చాలసేపు వాడి ముఖంలోకి చూచి, మెల్లగా వంగి వాడిని ముద్దుపెట్టుకొని గది నుండి వెలుపలికి నడిచింది.

"మామా ! పెళ్ళయిన తరువాత మీ యింటి భోజనం తప్పదు. కొత్త వీధిలో నా మనిషి ఎదురు చూస్తుంటుంది. వీరాసామీ ! నువ్వు భోజనం చేస్తావా ?"

వీరాసామి అన్న పేరు విని లాయరుగారు ఆశ్చర్యపోయారు.

"లేదుసార్ ! అర్జంటుగా మెయిల్లో వెళ్ళిపోవాలి సార్ ? అన్నాడు వీరాసామి దగ్గుత్తికతో

"మామా ! సెలవు"

గురునాధం పంతులు వీధిలోకి నడిచాడు. వీరాసామి పరుగు లంకించుకున్నాడు.

వీరాసామి మెయిలు దిగినవాడు ఇంటికెళ్ళలేదు. పరుగు పరుగున చిన్నదొర బంగళాకి పరుగెత్తాడు.

అప్పటికి మధ్యాహ్నం ఒంటిగంటయింది.

చిన్నదొర సావకాశంగా షేవ్ చేసుకొని, టబ్బులో అరగంట వరకు లవండరు పోసిన వేడి నీళ్ళలో జలకమాడి, ఒళ్ళు తుడుచుకొని, లోపల బనియను అండర్ వేరు మాత్రమే తొడుక్కొని పైని పొడవుపాటి సిల్కు కోటు వేసుకున్నాడు. డైనింగ్ టేబిలు దగ్గిర కూర్చున్నాడు. కుసినీవోడు (అంటే బట్లరన్నమాట) ప్లేట్లులో ఒకటి ఒకటి ఉంచి టేబిలు మీద పెడుతున్నాడు. బౌలులో ఆనియర్ సూప్ ఉంది. డిష్‌లో స్టఫ్డ్ చికెన్ ఉంది. ఒక ప్లేటులో సలాడ్, మరొక దానిలో రైసు, మరొక దానిలో ఫ్రెంచి ఫ్రై ఉన్నాయి. ముక్కలు కోసి నిమ్మకాయ, సాల్టు, పెప్పరు అన్నీ హంగులతో భోజనం చేయడానికి సన్నద్ధమవుతున్నాడు. ఫోర్కు, చెంచాలు, డిన్నరు ప్లేటు, సైడ్ ప్లేట్లు, అఫరన్ అన్నీ శాస్త్ర సమ్మతంగా కుసినీవోడు టేబిలుమీద పెట్టాడు.


సాధారణంగా చిన్నదొర భోజనం చేసే సమయంలో ఎవరినీ లోనికి రానీయడు. ప్రతి రూలుకి చిన్న అమెండుమెంటు ఉన్నట్లే ఒక్క వీరాసామికి మాత్రం ఎమర్జన్సీలలో దొరను చూడడానికి అనుమతి లభిస్తుంది.

రోజుతూ వీరాసామి దొరగారి డైనింగ్ రూములోకి ప్రవేశించాడు. కుసినీవోడు వీరాస్వామి ఆకారం చూడగానే ఏదో ప్రమాదం సంభవించిందని గ్రహించి వెంటనే లోపలికి పోనిచ్చాడు.

"బ్లడీ బగర్ ! గాడిదలా ఇలా పోస్తావేం రా ?" దొరగారు అభిమానంగా వీరాసామితో అన్నారు.

"సార్, సార్ ! కొంపమునిగిపోయింది సార్ ! తమర్ని కోర్టు కీడుస్తున్నారు సార్ ! గురునాధం పంతులు మీ మీద కేసు వేస్తున్నాడు సార్".

చిన్నదొర కొంచమైనా చలించ లేదు. తాపీగా అఫరన్ తొడల మీద



వేసుకొని బౌలు నుండి ప్రత్యేకమయిన ప్లేటులోకి సూపు పోసుకొని, కొంచెం సాల్టు, పెప్పరు దానిమీద జల్లి చెమ్చాతో ఒకసారి తీసి చప్పరించాడు.

"సార్ ! మీరు దొరలని, శిక్ష వేయడం సాధ్యం కాదని, అందుచేత నాలుగు సార్లు కోర్టుకి తిప్పి, పత్రికలలో వేయించి మీ పరువు తీయిస్తానని గురునాధం పంతులు అన్నాడు సార్ !

సూప్‌బౌల్ పక్కకు పెట్టి దొర, ఎదురుగా నిలబడ్డ వీరాసామి వేపు చూశాడు.

"ఇది నిజమేనా ?"

"వీరాసామి ఎప్పుడేనా అబద్ధం చెప్పాడా సార్ ! రేపే కేసువేయమని, అరెస్టు వారెంటు జారీ చేయించమని క్రిమినల్ లాయరుగారికి నాకళ్ళ ఎదుటే నూరురూపాయలు బయానా ఇచ్చాడు సార్ !

"గురు చాల కరెక్టయిన మనిషి. ఇటువంటి పని చేస్తాడంటే నమ్మకం చాలకుండా ఉంది".

"అవును సార్ ! అతను చాల కచ్చితమయిన మనిషి. అతనికి పుల్లలు పెట్టినవాడు మూర్తిసార్ ! అతనే మీ మీద పెద్ద దొరకి రిపోర్టు చేస్తానన్నాడు. హోప్‌లెస్‌గాడిని వెనకేసుకొని నాటకమాడుతున్నాడు సార్ !"

"అదీ సంగతి ! మెత్త మెత్తగా మాట్లాడి, ఖద్దరు బట్టలు వేసే ఈ పెద్దమనిషి ఎంతపనయినా చెయ్యగలడు. మరి, ఇప్పుడేం చెయ్యడం?"

"ఒక్కటే దారుంది సార్ !

"ఏమిటది ?"

"అయిందయింది, అన్ని మరచి పోవాలని చేతులు కలపాలి సార్ !"

"అంటే అపాలజీ చెప్పాలనా ?"

"అదే సార్ !"

"ఇది మా జాతికే అవమానం రా వీరా !"

"ఈ అవమానం రహస్యంగా ఉంటుంది సార్ ! రేపు పేపర్లో ఫలానా బట్లర్ దొరగారు కోర్టులో బోనెక్కారంటే భరించలేని అవమానం. కేసు కోర్టుకెళ్ళేముందే జాగ్రత్తపడాలి సార్ !"

దొర చాలసేపు ఆలోచించాడు. భోజనమంతా వెనక్కు పెట్టాడు. ఒంటి కాలుతో హాలులో చాలసేపు పచారు చేశాడు.

"గురు ఎక్కడున్నాడు ? పిలుచుకొనిరా !

"అతను విజయనగరంలో ఉన్నాడు".

"ఎప్పుడొస్తాడు ?"

"రాత్రి డ్యూటీకి వస్తాడు".

రాత్రి చిన్నదొర గురునాధం పంతులు టేబులు దగ్గిర పదకొండు గంటల దగ్గిర నుండీ కూర్చున్నాడు. గురునాధం సరిగా పన్నెండు గంటలకు అయిదు నిమిషాల ముందు వచ్చి ఛార్జీ తీసుకున్నాడు. పని పంచాడు. తరువాత చిన్నదొరనివిష్ చేశాడు.

"గురూ ! ఏమిటి సంగతి ?" చిన్నదొర అడిగాడు.

"ఏముంది, తప్పుచేసిన వారికి కోర్టులో శిక్ష విధిస్తారు ?"

"మన మందరం కలిసి పనిచేస్తుంటే కోర్టెందుకు ?"

"ఇక్కడ అన్యాయమే జరుగుతున్నది. కోర్టే దానిని సరిచేస్తుంది".

"ఓమై బ్రైట్ బాయ్ ! జరిగింది జరిగింది. మనం రాజీకి వద్దాము".

"అది సుందరం ఒప్పుకోంటే.

దటీజ్ నాట్ ఫెయిర్ ? నీకు నేను అపాలజీ ఇస్తాను - కాని హోప్‌లెస్ గాడికా ?"

"వాడికే ! నువ్వొక్కడివి ఇస్తే చాలదు- వీరాసామికూడా ఇవ్వాలి- వాడే దీనికి కారణం".

కొంచెం సేపు తర్జన భర్జనల తరువాత అంగీకారం కుదిరింది- దొర, వీరాసామి క్షమాపణ పత్రాలమీద సంతకాలు చేసి, సుందరంతో చేతులు కలిపారు.

అపుడు గురునాధం పంతులు టెలిగ్రాము మామకు రాసిచ్చాడు, మరునాడు ఉదయమే ఇమ్మని.

"కేసు ఆపుచేయవలసింది- పార్టీలు క్షమాపణలు చెప్పిరాజీ కొచ్చారు"

5

ఆకాశమంతా ఒక్కటే మేఘమయి ఉరిమింది.

ఆరోజు మూర్తికి, గురునాధం పండితులుకి డబల్ డ్యూటీ. ఆ రోజులలో వారానికి రెండుసార్లు పన్నెండు గంటల డ్యూటీ చేయవలసి వచ్చేది. వాళ్లు రాత్రిడ్యూటీకి బయలుదేరేసరికి వర్షం ప్రారంభమయింది; షెడ్డుచేరేసరికి బాగా తడిసిపోయారు. పనివాళ్లు కూడా తడిసిపోయారు. ఎవరేమయినా రైళ్లు నడవాలి. ఒకప్పుడు గుడ్సు ట్రెయినులు నడవక పోయినా ఇబ్బంది లేదు, పాసింజరు రైళ్ళు మాత్రం విధిగా నడవవలసిందే.

మూర్తి పని పంచాడు. పదకొండు గంటల రాత్రికి వెళ్ళవలసిన పాసింజరు ఇంజనుకి చాల మరామ్మత్తులున్నవి. ఇంజను అయిదు నిమిషాలు ఆలస్యమయినా అధికారులు దానిని పెద్ద తప్పుగా పరిగణించి శిక్షవిధిస్తారు. పనికి బయలుదేరవలసిన వేళకే వర్షం మొదలవడం నుంచి సగం మంది, దూరం నుండి రావలసిన పనివాళ్లు హాజరు కాలేదు.

పాసింజరు ఇంజనుకి బరువైన పనులేఉన్నాయి. దాని స్థానంలో మరొక ఇంజను పంపించాలన్నా సిద్ధంగాలేదు. వీరాసామికి తేలికపని ఇచ్చి ముందే పంపించాడు మూర్తి. చివరకు పాసింజరు ఇంజనుమీద పనిచేయడానికి పనివాళ్ళలో సుందరమే మిగిలాడు

సుందరం కేవలం కళాసీ మాత్రమే. వాడు ఫిట్టర్లకు కావలసిన పనిముట్లు పట్టుకొని, వాళ్ళు చెప్పేపని, అంటే బరువులు ఎత్తిపట్టడం, మోయడం తుడవడం వంటి పనులు చేయాలి. వాడు ఉద్యోగంలోచేరి రెండు సంవత్సరాలే అయింది. వాడు చాలమంది సీనియర్ ఫిట్టర్ల పనికూడా చేసేస్థితికి చేరుకున్నాడు. హోప్‌లెస్‌గాడు చేసినపనికి తిరుగులేదు-డ్రైవర్లు వాడు ఇంజనుమీదఉంటే సకాలంలో షెడ్డు విడిచి ఇంజను తీసుకుపోతారు. అందరికీవాడు కావలసినవాడే. ప్రతీ ఒక్క ఉద్యోగి ఏదో ఒక సమయంలో వాడికి సహాయం చేసినవాడే- కొంత మందికి మంచి బుద్ధులు ఒకరునేర్ప నక్కరర్లేదు. హాస్యానికికూడా వాడు అబద్ధమాడి ఎరగడు. ఎటువంటి క్లిష్ట పరిస్థితుల లోను వెనుకంజ వేయడు. కటువుగా మాట్లాడటం వాడికి తెలియదు. అవమానం భరించవలసిన సమయాలలోకూడా వాడు బయటపడలేదు.

మూర్తి పూర్తిగా హోప్‌లెస్‌మీదే ఆవర్షారాత్రి ఆధారపడవలసి వచ్చింది. పాసింజరు ఇంజనుమీద చాల పనులున్నాయి. కాబట్టి అతనుకూడా ఇంజను వేపే బయలుదేరాడు. ఆ యింజనుకు ఒక పెద్ద చికాకుంది. బాయిలరు నీటితో నింపడానికి రెండువేపులా ఇంజక్టరులుంటాయి. వాటిలో కుడిచేతి వేపుది పనిచేయడం లేదు. దాని భాగాలు ఇత్తడి తో తయారవుతాయి. ముందుగా మెషీనుషాపులో దానికోసం భాగాలు తయారు చేయడానికిచ్చి ఆ తరువాతే హోప్‌లెస్ మిగిలిన మరమ్మత్తులమీదికి సర్దుకున్నాడు. ఎడమచేతి వేపు ఇంజక్టరుకూడా అంతబాగా పనిచేయడం లేదు. వాడు ముందు దీనిని బాగుచేశాడు. చాలా బాగా పనిచేస్తున్నది. ఇంతలోమూర్తికూడా వచ్చాడు ప్రతి మరమ్మత్తు దగ్గిరుండి చేయిచాడు. వెళ్ళవలసిన డ్రైవరు చాలా చాదస్తుడు. పదిగంటలకు మెషీన్‌షాపునుండి కొత్తభాగాలు తెచ్చి కుడిచేతివేపు ఇంజక్టరుకు బిగించి టెస్టు చేశారు. చాలా బాగా పనిచేస్తున్నది. ఇంజను అన్ని విధాల పనిచేయడానికి యోగ్యంగాఉంది. డ్రైవరు ఇంకా రాలేదు. వర్షంజోరు హెచ్చింది. కుంభవృష్టి ధారాపాతంగా కురిసే వర్షానికి లోకమంతా జలమయమయింది.

మూర్తి ఇంజనువెళ్లే వరకు హోప్‌లెస్‌ని ఉండమనిచెప్పి తాను ఆఫీసు వేపు నడిచాడు నీళ్లుకారుతున్న బట్టలతో. పది గంటల పదిహేను నిమిషాలు అయింది. డ్రైవరింకా రాలేదు. హోప్‌లెస్ మీదకెక్కి బట్టలార బెట్టుకుంటున్నాడు.

అప్పుడోపని జరిగింది. ఎక్కడినుంచో వీరాసామి ఊడిపడ్డాడు. పనిముట్లు తెచ్చి, కుడిచేతివేపు బిగించిన ఇంజక్టరు భాగాలను, ఇత్తడి వాటిని సులువుగా విప్పేశాడు.

వీరాసామి విప్పుతుంటే హోప్‌లెస్ చూశాడు.

"వెళ్ళవలసిన పాసింజరు బండిఇది. ఇంజక్టరు ఎందుకు విప్పుతున్నావు? ప్రశ్నించాడు వాడు.

" నా బండికి వీటిని తగిలించమన్నారు మూర్తి. దీనికోసం మరోసెట్టు -తయారుచేస్తున్నారట. " అన్నాడు వీరాసామి.

హోప్‌లెస్‌కి ఏమీ అర్థమవలేదు.

ఇంతలో డ్రైవరువచ్చాడు. అప్పుడు ఇంజనును టెస్టుచేయడం మొదలుపెట్టాడు. కుడిచేతివేపు ఇంజక్టరు పనిచేయదని, దానిభాగాలను తయారుచేసి తెస్తున్నారని హోప్‌లెస్ చెప్పాడు. పది, పదిహేను నిమిషాలు దొర్లిపోయాయి. డ్రైవరు షెడ్డు విడిచే సమయం సమీపించింది. హోప్‌లెస్ మరి ఆలోచించలేదు. పరుగెత్తాడు. ముందుమూర్తితో చెప్పాడు. మూడుఫర్లాంగులు, అరమైలు దూరంలో ఒక కమ్మరి దుకాణం ఊరిచేవుంది. అక్కడ దొంగ సామానులు కరిగిస్తారు, కొంటారు.

హోప్‌లెస్ ఆ దుకాణం చేరుకొనేసరికి అప్పుడే ఆ యిత్తడి భాగాలను సమ్మెటతో కొట్టి ముక్కలుచేసి కరిగించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వీరాసామి జాడ ఎక్కడా కనిపించలేదు.

హోప్‌లెస్ తిరిగి వచ్చేసరికి ఇంజనుదగ్గర చాలా గలాభా జరుగుతున్నది. చాందస్తం డ్రైవరు పెద్దగా అరుస్తున్నాడు. పెద్ద దొరకు టెలిఫోను చేస్తానన్నాడు. చిన్న దొరను పిలుచుకొని వస్తానన్నాడు.

ఈ పరిస్థితిలో గంగన్న అన్న పాతఫిట్టరు ముందుకొచ్చాడు. రెండు నిమషాలలో అన్నీ సరిచేస్తానన్నాడు. తన పనిముట్ల పెట్టిలో చాలా జాగ్రత్తగా దాచిన ఓవర్ సైజు భాగాలను, పాతవాటిని తెచ్చి బిగించాడు. దానితో గండం గడించిది. కాని. ఇంజను పది నిమిషాలు ఆలస్యంగా షెడ్డు విడిచి పెట్టింది.

ఇన్ని జరుగుతున్నా వర్షం మాత్రం కరుణించలేదు. హెచ్చుతునేఉంది. కొండమీదనుంచి జారిన కాలువలు షెడ్డును క్రమంగా ముంచుతున్నాయి.

మూర్తి, పనివాళ్ల ఆఫీసువేపు నడిచారు. అందరి బట్టలు నీటితో బరువెక్కి అడుగులు ముందుకు పడకుండా అడ్డుపడుతున్నాయి.

సూపర్వయిజర్ల గదిలోకి అప్పుడే నీరు ప్రవేశిస్తున్నది. రైలు పట్టాలన్నీ మునిగిపోయాయి. షెడ్డులో ఇంజను కింద భాగాలను మరామ్మతు చేయడానికి పిట్లుంటాయి. అవన్నీ నిండిపోయాయి. పనివాళ్ళు, మూర్తి చలితో గడగడ వణికి పోతున్నారు.

ముందువీరాసామి ఎక్కడున్నాడో తెలుసుకురమ్మని హోప్‌లెస్‌ని పంపించాడుమూర్తి. వాడు చిన్నదొర ఆఫీసులో ఉన్నాడు. అక్కడికి కూడా నీళ్ళు పాకుతున్నాయి. చిన్నదొర కుర్చీమీదనుంచి టేబిలుమీద కెక్కాడు.

అతనికి ఎదురుగా వున్న కర్రపెట్టెమీద వీరాసామి కూచున్నాడు. దొరతో నవ్వుతూ కబుర్లు చెబుతున్నాడు.

వీరాసామి మీద రిపోర్టుచేసినా దొర వినేటట్టు లేడు. పెద్ద దొరతోనే మరునాడు చెప్పాలి, అంతకన్న ముఖ్యం శరీరాన్ని రక్షించుకోడం-సాయంకాలం షెడ్డులో ఒక ఇంజను ఉంచారు. దానిలో నిప్పు ఆర్పలేదు. జాగ్రత్తగా నీటిలో అడుగులు వేసుకుంటూ, మూర్తి ముందు ఇంజను ఎక్కాడు. అతని వెనుకనే మిగిలిన పనివాళ్లు ఎక్కారు. నిప్పుపెట్టె తలుపు తెరుస్తే లోపల బాగా మండుతున్న మంటల వెలుతురు వాళ్ళ ముఖాలమీద, తడిబట్టల మీద పడింది. ఒకరొకరు బట్టలు పిండుకున్నారు. ఆవేడికి వాటిని ఆర బెట్టుకున్నారు. క్రమంగా ఆవేడికి గుండెల వణుకు తగ్గింది. మూర్తి డ్రైవరు కూర్చుండే బల్లమీద కూర్చున్నాడు. మిగిలిన వాళ్లందరు సర్దుకున్నారు.

పనివాళ్లందరూ ఇంజనుమీదే ఉన్నారు, ఒక్కహోప్‌లెస్ తప్ప. వాడు మాత్రం ఆఫీసుకు సమీపంలో నిలబడ్డాడు. వాడి మీద పడుతున్న వాన ఎనుబోతుమీద పడినట్లు ఏమీ చేయలేక పోతున్నది. అంత తడిసి పోయినా వాడు కొంచెమైనా వణకలేదు. చిన్న దొర కిటికీకి దూరంగా నిలబడి లోపలికి చూస్తున్నాడు. వీరాసామి తమాషా అయిన సంగతులు చెప్తుంటే చిన్న దొర వింటూ నవ్వుతున్నాడు.

హోప్‌లెస్‌కి దూరంనుంచి చీకట్లను చీల్చుకుంటూ టార్చిలైటు వెల్తురు కనిపించింది. లోకమంతా జల ప్రళయంలో మునుగుతుంటే ఇంజన్ల షెడ్డుకొచ్చే పెద్దమనిషి ఎవరని వాడనుకున్నాడు.

ఆ వర్షంలో అర్ధరాత్రి ఇంజన్ల షెడ్డుకి వచ్చిన పెద్దమనిషి వుల్ఫుదొర.

వుల్ఫుదొర ఇనస్పెక్టరుగా పని చేస్తున్నాడు. ఇతను ఆంగ్లోఇండియను. షెడ్డుకు తూర్పువేపు నున్న బంగళాలలో నాలుగోది ఇతనిదే. ఇతని దగ్గిరే నరసింహారావు సాయంకాలం పనిచేస్తుంటాడు. ఇతని బంగళా ఔట్‌హౌస్‌లోనే హోప్‌లెస్ గాడుంటున్నాడు.

హోప్‌లెస్ వుల్ఫును చూడగానే "సలాం సాబ్" అన్నాడు. అతను దానిని అందుకొని చిన్నదొర ఆఫీసులోకి ప్రవేశించాడు.

చిన్నదొర వుల్ఫును చూచి లేవనేనా లేవలేదు.

"హలోజో! " అన్నాడు చిన్నదొర వుల్ఫును పలకరిస్తూ—

"హలో మైక్!" అన్నాడు వుల్ఫు.

"ఇంతరాత్రి ఎందుకొచ్చావు?"

"నైట్ ఇనస్పెక్షన్‌కి"

"కిడ్ చేయడం లేదా ?"

"నోకిడింగ్! ఇవాళ రాత్రి నైట్ ఇన్స్పెక్షనని ప్రోగ్రాము లేసుకున్నాను. అంతే - లోకాలు మునిగిపోయినా షెడ్యూలు ప్రకారం జరగవలసిందే".

"మంచిది! నీ మానాన్న నువ్వు తిరుగు, నేను నీతో రాలేను."

"సూపర్‌వైజర్లెవరు?"

"మూర్తి, గురు"

"ఎక్కడ వాళ్ళు?"

"వీరా చెప్పరా!"

వీరాసామి నిలబడ్డవాడు గొంతుక సరిచేసుకున్నాడు. వుల్ఫుతో వాడే మాట్లాడాడు".

"గురునాధంగారు ఆఫీసులోనే ఉన్నారు సార్!"

"మంచిది"

"మరి, మూర్తిగారేషెడ్డులో ఇంజనుమీద వెచ్చగా కూర్చున్నారు."

"వాట్?"

"అవునుసార్!"

"మరిస్టాఫ్"

"అదే సార్! అతను సూపర్వయిజరు కదా, ఎక్కడకూర్చున్నా ఫరవాలేదు. స్టాఫ్‌ని తన దగ్గరే కూర్చోపెట్టుకున్నారు సార్!"

"ఎంత ఘోరం - పనిచేయకుండా స్టాఫ్‌నికూడా అడ్డుతోవ పట్టిస్తున్నాడా?"

"అందుకు సందేహమా సార్?"

వుల్ఫుదొర మరి సహించలేక పోయాడు. మూర్తి కూచున్న ఇంజనువేపు నడిచాడు. వీరాసామి మాత్రం వెళ్ళలేదు అతని వెంట హోప్‌లెస్ మాత్రం వెంబడించాడు.

వుల్ఫు దొర ఇంజనెక్కేసరికి అందరూ కునుకు తున్నారు, అందరి బట్టలు నిప్పు వేడికి ఎండిపోయాయి.

ఇంజనుమీదికెక్కి వుల్ఫుదొర అందరి ముఖాలమీదికి టార్చిలైటువేశాడు. వాళ్లు కళ్లు తెరిచి వుల్ఫుదొరని చూసి భయంతో కంపించిపోయారు.

మూర్తికూడా లేచి నిలబడి ఇనస్పెక్టరు దొరను విష్ చేశాడు.

ఆ దొర దాన్ని అందుకోలేదు.

"మీరంతా ఏం చేస్తున్నారు?"

ఎవరూ జవాబు చెప్పలేదు.

"వర్షంలో అందరం తడిసిపోయాం. పనిచేయడానికి వీల్లు అన్నీ నిండిపోయాయి. అందుచేత ఈ యింజనెక్కి కూర్చున్నాం". అన్నాడుమూర్తి.

"అన్నీ అబద్ధాలు—మీ బట్టలన్నీ పొడిగా ఉన్నాయి—మీరంతా పనె గగొట్టారు. పేర్లు చెప్పండి."

అందరిపేర్లు అతను రాసుకున్నాడు, మూర్తితో సహితం. అతని జాబితాలో మాత్రం వీరాసామిపేరు, హోప్‌లెస్ పేరులేదు.

"మూర్తీ! నువ్వు రెండు పెద్ద నేరాలుచేశావు. వాటిని యజమానులు క్షమించారు, కాని మరచి పోలేదు. ఇది మూడవది. నువ్వు సూపర్వయిజరువు- పనివాళ్ళ నుండి పనిరాబట్టాలి. నువ్వే వాళ్లతో చేతులు కలిపి ఖుషీ చేస్తున్నావు. ఇది మహాపరాధం, యజమానులు యీ నేరాన్ని, ఈ క్రమశిక్షణారాహిత్యాన్ని ఈ బాధ్యతా దుర్వినియోగాన్ని క్షమించలేరు. మరెక్కడేనా పని వెతుక్కో! ఈమూడో అపరాధంనుండి నిన్నెవరూ రక్షించలేరు."

వుల్ఫుదొర ఇంజను దిగి ఆఫీసు వేపు నడిచాడు.

అంతవరకు వెలుగుతున్న ఎలక్ట్రిక్ దీపాలు ఒక్కసారి ఆరిపోయాయి.

ఆకాశం రెండు ముక్కలయినట్లు మెరుపు కత్తి ఖండించింది. దగ్గిరలోనే పిడుగు పడింది.


6

మూర్తి. పెట్టె రాట్నంమీద దారం తీస్తున్నాడు. ప్రతి రోజు ఒక అరగంట ఆపని చేస్తాడు, గాంధీగారి హరిజన్ పత్రిక తెప్పించి చదువుతాడు. మనిషి సన్నంగా కొంచెం పొడుగ్గా ఉంటాడు. దొరలక్రింద ఉద్యోగం చేయడం అతనికి రోజురోజుకి కష్ట మవుతున్నది. కొన్నితప్పులు అతను చేయకపోయినా నింద మాత్రం తప్పడం లేదు.

వర్షం కురిసిన నాటి రాత్రి అతను తప్పేమీ చేయలేదు. కాని వుల్ఫ్ దొర తనకు వచ్చిన ఇంగ్ల భాషలో (అందులోని వాక్యాలను చాలా వరకు నరసింహారావు దిద్దాడు) మూర్తి మీద రిపోర్టు చేశాడు. సూపర్వైజరు కుండవలసిన గుణాలు అతనికి లేవని, అతనిని ఉద్యోగం నుంచి తొలగించడం మంచిదని, అట్లుకానిపక్షంలో యజమానులు దయదలిస్తే అతన్ని పనివాడుగా రివర్టు చేయవలసిందని రాశాడు. రెండు ఘోరమయిన తప్పులను యజమానులు క్షమించారని ఈ మూడోనేరం క్షమించరాదని వ్రాసి దాని అడుగున ఎర్రసిరాతో అండర్‌లైన్ చేశాడు.

మూర్తి దారం తీస్తున్నాడు-ఆదారం ఒకచోట వలంగా. మరొక చోట చాలా సన్నంగావస్తూ, తరుచు తెగిపోతున్నది. దారం తీయడానికి ఏకాగ్రత చాల ముఖ్యమైనది. మనసు అన్యత్రా ఉంటే దారంకూడా తప్పుదారి పడుతుంది. అతను తాను చేసిన తప్పుల గురించి మరోసారి ఆలోచించాడు.

మొదటిసారి అతను చేసిన తప్పు అందరు ఉద్యోగులు చేశారు. మూర్తి ఉద్యోగంలోచేరి ఒక సంవత్సరమయింది. ఒకరోజు పట్టపగలు అతను డ్యూటీనుంచి ఇంటికొచ్చి భోజనం చేస్తుంటే సైరన్లు అరవడం మొదలుపెట్టాయి. విమానాలదాడిని సూచించే సైరన్‌మోత అదేవనిగా వినిపించింది. తొందరగా తిండితిని మంచం కిందికి దూరిపోయాడు. ఇంట్లో అంతమంది అదే పని చేశారు. వక్కవాటాలో వాళ్ళు, ఇంటి యజమానులు అందరూ దాగున్నారు. హార్బరులో బాంబులు పడ్డాయి. విమాన విధ్వంసకాలైన ఫిరంగులు మోగాయి. మొదటిసారి నిజమైన యుద్ధ పరిస్థితులు ముంగిట్లో తారాడాయి.



చాలసేపటి తరువాత ఆల్ క్లియరుసిగ్నలు వచ్చింది. మూర్తి మధ్యాహ్నం ఉద్యోగానికి వెళ్ళలేదు. నగరంలోని వారందరూ భయభ్రాంతులై ప్రాణాలు గుప్పిళ్ళలో పెట్టుకొని ఇళ్లువాకిళ్లువదలి నడవడం మొదలు పెట్టారు. జనప్రవాహం!—మామూలుది కాదది- ఆ మహాభినిష్క్రమణంలో సాగిపోతున్న ప్రవాహమది-వేల కొలది పురుషులు, స్త్రీలు, వృద్ధులు, బాలురు, ఆరోగ్యవంతులు, రోగులు అందరూ ప్రాణాలకు తెగించి ఇళ్ళూ వాకిళ్ళు విడిచిపెట్టి ముందుకు నడుస్తున్నారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు మూర్తి, కుటుంబంలోనివారు, పక్కవాటాలోవాళ్ళు ఆలోచించారు ఇల్లు విడవాలా, వద్దా అని. వాళ్ళ కళ్ళ ఎదుటే గట్లు తీసి పారుతున్న వరద గోదావరిలా మనుషులు రోడ్డుమీదకిక్కిరిసి నడుస్తున్నారు. పక్కవాటాలో ఉంటున్న ఇల్లాలు చంటి పిల్లతల్లి, ఆమె కాలికి పెద్ద వ్రణం ఆమె యింట్లోనే నడవలేక పోతున్నది. ఆమె యజమానికూడా రైల్వేలోనే పనిచేస్తున్నాడు. వాళ్ళది రాజమండ్రి ఆమెకు చంటిపిల్ల కాక మరో యిద్దరు పెద్దపిల్లలున్నారు. ఎక్కడికి వెళ్ళాలి, ఏమిటిచేయాలి అన్న ఆలోచనలేకుండా అందరూ ఆజనప్రవాహంలో కలసి పోయారు. కాలి బాధతో ఆ యిల్లాలు ఆ విధంగా నడుస్తునే ఉంది. పుండుకన్న బతుకు ముఖ్యం. బతికుంటే పుండు మానుతుంది. చంటిపిల్లను తండ్రొకసారి. పెద్దపిల్ల లొకసారి ఎత్తుకొనేవారు. వాళ్ల సింహాచలం స్టేషను చేరేసరికి బాగా చీకటి పడింది. ప్లాట్‌ఫారమ్‌మీద తూర్పుకు వెళ్ళే రైలొకటి అప్పుడే వచ్చి నిలబడింది. పొబుపోత్తోమని అందరూ ఎక్కి పోతున్నారు. పక్కవాటావాళ్ళు, మూర్తి, తల్లిదండ్రులు అందరూ అందులోకి పోయారు. ఏర్రాత్రి పన్నెండుకో అది ఆముదాల వలస చేరుకుంది. అక్కడ దిగి ఉదయం బస్సు పట్టుకొని మూర్తి కుటుంబం పక్కవాటావాళ్ళు పల్లె చేరుకునే సరికి పదిగంటలయింది. గడచిన దినం మూడు గంటలకు యిల్లు వదలిన వాళ్ళు పందొమ్మిది గంటల తరువాత అపాయం నుండి భయం లేని పల్లెటూరు చేరుకొని నిట్టూర్పు విడిచారు.

ఆ వూళ్ళో మూర్తి కుటుంబం, పక్కవాటా వాళ్ళు పదిరోజులపాటు ఉండిపోయారు. సంపన్నులైనమూర్తి తాతగారు అందరినీ ఆదరించి, కాలి మీద రణమున్న యిల్లాలికి కట్లు కట్టించి చాలా సహాయంచేశారు. ఆ పదిరోజులు పల్లెటూళ్ళో మూర్తి చాలా హాయిగా గడిపాడు. ప్రాణంమీది భయంతొలగి, తనవాళ్ళ మధ్య నివసించడంలో అతనికో ఆనందం కలిగింది. దక్షిణం నుంచి వీచే పిల్లగాలులు, పూలతో నిండిన మామిడి తోపులు, చిక్కటి పాలు, తీయటి పెరుగు, రెండేసి కూరలతో భోజనం అతను ఎప్పుడూ మరచిపోలేడు. అతడు ఒక్కటే మరచి పోయాడు. అది తన వుద్యోగం, ఉంటే వుంటుందది. లేకపోతే మరొకటి.

పరిస్థితులు బాగు పడ్డాయి. బతకడానికి ఉద్యోగాలు అవసరం. మూర్తికి ఈ ఉద్యోగం కాకపోతే మరొకటి, కాని, పక్కవాటా అతనికి ఇదే జీవనాధరం. అప్పటికతనికి పదిహేనేళ్ల సర్వీసుంది. అతని బలవంతంతో మూర్తి తిరిగి వుద్యోగానికి వచ్చాడు. అపుడు పెద్ద దొర రెండు చీవాట్లు పెట్టాడు. సూపర్వయిజరు వుద్యోగాన్ని నిర్లక్ష్యం చేయరాదన్నాడు. పదిరోజులు గైరు హాజరయినందుకు మరేమి చర్య తీసుకోలేదు. ఉద్యోగానికి పోని దినాలను సెలవు క్రింద మార్చాడు. కాని, రికార్డులో ఈ విషయం స్పష్టంగా రాశాడు. ఇది ఉద్యోగి చేసిన మొదటి తప్పని కూడా అందులో వుదహరించాడు.

ఇక రెండో తప్పు- యుద్ధం ముదిరిపోయింది. ఏ క్షణమయినా శత్రు విమానాలు దాడిచేసే పరిస్థితులు ఎదురయాయి. ఉద్యోగంలో వున్న రైల్వే వాళ్ళలో యువకుల్ని ఎంపికచేసి ఏ అర్ పీ స్క్వాడ్ ఒకటి తయారు చేశారు. వారికి యూనిఫారమ్ యిచ్చారు. హెల్మెట్లిచ్చారు. విమానాల దాడుల నుండి ప్రజలను ఏ విధంగా రక్షించాలో, మంటలనెలా ఆర్పాలో, కూలిన యిండ్లనుండి మనుషులను ఎలా వెలికితీయాలో, ప్రథమ చికిత్స ఏ విధంగా చేయాలో నేర్పించారు. మూర్తి ఒక స్క్వాడ్ లీడరు. అతని కింద పదిమంది వాలంటీర్లున్నారు. అందరికీ ఒకనాడు వార్తొకటి చేరింది. ఏ అర్ పీ లోపని చేస్తున్న వాళ్ళ నందరినీ యుద్ధానికి పిలుస్తున్నారని ఒక ప్రబుద్ధుడు వార్తలేవనెత్తాడు. ఇంకేముంది ప్రతి ఏ ఆర్ పి వర్కరు యింట్లో ఏడుపులు. మొర్రలు, మూర్తి అసలే గాంధేయవాది, ఖద్దరుధారి, యుద్ధ వ్యతిరేకి- అతను, అతనిక్రింద పనిచేస్తున్న వాలంటీర్లు వార్త తెలిసిన మరునాడే ఒక గుంపుగా పెద్ద దొర ఆఫీసులో ప్రవేశించి, తమ కిచ్చిన యూనిఫారములు, నిప్పునార్పే పంపులు, హెల్మెట్లు అన్నీ తిరిగి యిచ్చి వేశారు. అప్పుడు పెద్ద దొరకు మూర్తిమీద చాలా కోపం వచ్చింది. వి మా నా ల దాడులనుండి రక్షించుకోవడం, ఇతరులను రక్షించడం చాల 'పవిత్రమైనపని. పనివాళ్ల అంతగా చదువుకున్నవాళ్లు కారు. మూర్తివంటి లీడరు వాళ్ళ భయాలను పారద్రోలి, ప్రజలకు రక్షణ కల్పించవలసిన బాధ్యత వహించాలి, దీనికి యుద్ధానికి సంబంధం లేదు.

పెద్దదొర అందరికీ నచ్చచెప్పి, తెచ్చిన సామాన్లు పట్టుకు పొమ్మని వాళ్ళని పంపించి వేశాడు. అప్పుడు తనుమూర్తి రికార్డులో ఒక విషయం ఎర్ర సిరాతో రాశాడు.

" ఈ మనిషి ఖద్దరు ధరించడమే కాకుండా, ప్రభుత్వానికి వ్యతిరేకమయిన ప్రచారం చేస్తున్నాడు. అలజడి లేవనెత్తుతున్నాడు. ఇతని ప్రవర్తనలో మార్పు రాకపోతే ఉద్యోగం నుండి తీసి వేయవచ్చు. "

ఈ రెండో తప్పుకు తనెంత వరకు బాధ్యుడు ?

పదిమంది వాలంటీర్లు, వాళ్ళ పెళ్ళాలు ఏడుస్తూ ఇంటిమీద పడితే చేసిన పని ఇది. నిజంగా అతనికి బ్రిటిష్ ప్రభుత్వం మీద గౌరవంలేదు. మరి బాధపడడం దేనికి?

ఇప్పుడు రెండవ ప్రపంచ మహాసంగ్రామం ముగిసి పోయింది. అధికారులు చాలా బలవంతులయారు. తమకు అడ్డుపడిన వారిని సులువుగా తొలగిస్తున్నారు. ఏదో సాకు దొరికితే చాలు. అదే ఆ వర్షం కురిసిన నాటి రాత్రి జరిగింది. మూడో నేరాన్ని తనమీద మోపి, ఎందుకు తనను ఉద్యోగం నుండి తొలగించరాదో వివరించమని చార్జిషీటు ఇచ్చారు అధికారులు.

మూర్తి దీనిగురించి కూడా అంతగా పట్టించుకోలేదు. స్వాతంత్ర్యం కనుచూపు మేరలో ఉందని అంటున్నారు. చార్జిషీటుకు మామూలుగా ఉన్నవున్నట్లు వ్రాసి జవాబిచ్చాడు. అదే మవుతుందని అతను ఆలోచించడంలేదు.

సాయంకాలం నాలుగు గంటలయింది. హాస్పిటలుకు వెళ్ళడానికి మూర్తి రాట్నంనుండి లేచాడు. రెండు రోజుల క్రిందే వీరాసామిని రైల్వే హాస్పిటలునుండి కింగ్ జార్జి హాస్పిటలుకు తరలించారు.

వీరాసామికి దవడ ఎముక విరిగింది. కింద వరుస పళ్లన్నీ ఊడిపోయాయి. కుడిచేయి ఎముక విరిగిపోయింది. తొడ ఎముక విరిగిపోయింది. వర్షం కురిసిననాటి రాత్రి వాడిని ఈస్థితిలో ఊరిలో కమ్మరి దుకాణం ముందు ఎవరోచూసి వెంటనే పోలీసులకు రిపోర్టు చేశారు.

వీరాసామిని పదిరోజులు రైల్వే హాస్పిటలులో ఉంచారు. పరిస్థితి మెరుగుపడక పోతే వాడిని పెద్దాసుపత్రికి తరలించారు. వాడికి తెలివి రావడానికి అయిదు రోజులు పట్టింది. పోలీసులు వీరాసామిని రైల్వే ఆస్పత్రిలో చేర్పడమే కాకుండా కమ్మరి దుకాణం యజమానిని అరెస్టు చేశారు. అతని దుకాణంలో చాలా రైల్వే సామానులు ఇత్తడివి. ముఖ్యంగా ఇంజను భాగాలు దొరి

కాయి. చాలావరకు అతను కరిగించి బిందెలు చేశాడు. వీరాసామి చాలా వరకు ఆ సామాను అమ్మాడని అతను ఒప్పుకున్నాడు. ఈ వ్యవహారంలో ఏదో పేచీవచ్చి కమ్మరి దుకాణం యజమానే వీరాసామిని ఈ విధంగా గాయ పరచాడని రిపోర్టులు తయారు చేశారు.

వర్షం ఆ రాత్రి రెండు గంటల వేళకు తగ్గిపోయింది. షెడ్డులో నీళ్లు మరొక్కగంటలో తీశాయి. వీరాసామి తెల్లారగట్ల నాలుగు గంటలకు బహి ర్భూమికి పోయినవాడు తిరిగిరాలేదు. వాడు ఉదయం అయిదు గంటలకి దొరగారి బంగళానుండి టీ, పాలు, బిస్కత్తులు ట్రేలో పట్టుకొని రావాలి. అయిదు అయిదున్నర అయింది. దొరగారు చిందులు తొక్కుతున్నాడు. వాడి జాడలేదు.

హోప్‌లెస్‌గాడు వెళ్లవలసిన ఇంజనులమీద పనిచేస్తునే ఉన్నాడు. వాడిలో ఏమీ మార్పులేదు. తెల్లవారుఝామున హెచ్చుయింజన్లు షెడ్డు విడిచి వెళ్లాయి. ఆపని తొందరలో వీరాసామి గురించి ఎవరూ పట్టించుకోలేదు.

వీరాసామి గురించి పగలు తొమ్మిది గంటలకు వార్త తెలిసింది. పోలీసులు ఆ సరికి రంగం మీది కొచ్చారు. వాళ్లు షెడ్డుకొచ్చి వీరాసామి షెడ్డులో ఎంతవరకూ ఉన్నది. ఎప్పుడు విడిచి పెట్టినది మొదలైన వివ రాలను సేకరించారు. చిన్నదొరవెళ్ళి హాస్పిటల్ ఎమర్జెన్సీ నెత్తురెక్కిస్తున్న వీరాసామినిచూచి వచ్చాడు. మూర్తి, అతని స్టాఫ్ కూడా వెళ్ళి వచ్చారు. ఎవరికీ ఎవరిని అనుమానించాలో ఎవరిని అనుమానించకూడదో తెలియలేదు.

మూర్తి రోజూ హాస్పిటలుకి వెళ్ళి వస్తున్నాడు. కింగ్‌ధార్జి హాస్పిటలులో పెద్ద ఆపరేషనుచేస్తేనే కాని ముఖం తిన్న బడదని, వీరాసామి మాటాడడానికి కూడా వీలుపడదని అన్నారు. వీరాసామికి తెలివి వచ్చింది. బాధకు తట్టుకులేక పోతున్నాడు. తరచు మత్తు ఇంజక్షన్లమీద ఉంచుతున్నారు.

ఆ రాత్రి కుంభ వృష్టి మూలాన్న బొగ్గు కుప్పలవేపు ఎవరూ లేరు. అందరూ షెడ్డులో ఇంజన్లలో తలదాచుకున్నారు. దానికి తోడు కరెంటు పోయినది. మళ్ళా పగలు పదిగంటలకే వచ్చింది. బొగ్గు కుప్పలు గాఢాంధ కారంలో మునిగి పోయాయి. వీరాసామి పక్కనే పడిఉన్న బొగ్గుల సంచిలో పోలీసులకు ఇంజను భాగాలు ఇత్తడివి దొరికాయి.

అంతా జరిగిన పదిరోజుల తర్వాత మధ్యాహ్నం భోజనానికి వచ్చిన సుందరాన్ని నరసింహారావు ఉన్నట్టుండి ప్రశ్న వేశాడు.

"వీరాసామిని కొట్టింది నువ్వేనా? "

" నేనే "

" ఎందుకు కొట్టావు? "

" మూర్తిబాబుగారికి వాడు ద్రోహం చేస్తుంటే పట్టలేక పోయాను".

" మూర్తి బాబుకా ? "

" అవును. వాడు నన్ను విడిచి పెట్టాడు. గురునాధం పంతులు గారిని విడిచి పెట్టాడు. కలలో కూడా ఎవరికీ బాధ కలిగించని శాంతమూర్తి, మూర్తిగారి వెంట వర్డాడు. "

ఆ రాత్రి ఇన్స్పెక్టరు దొరకి వీరాసామికి జరిగిన సంభాషణ వివరంగా చెప్పాడు. -అన్నిటికన్న ముఖ్యమయినది వాడు చేస్తున్న దొంగతనం. చిన్న దొర అండ చూసుకొని వాడు హీనంగా ప్రవర్తిస్తున్నాడు.

" నువ్వు చేసిన పని తప్పు కాదా?"

" నాకు తప్పనిపించలేదు. "

" నువ్వు వీరాసామిని కొట్టావు. వాడు హాస్పిటలు పాలయాడు. వాడి కుటుంబం నడిపేదిని పద్దడి. దీనికి ఎవరు బాధ్యులు? "

సుందరం ఒక్క క్షణం ఊరు కొని మళ్ళా అన్నాడు.

మృత్యుంజయుడు

["జిడ్డు కృష్ణమూర్తి" మరణవార్త విని]

ఫస్ట్ స్టెప్ ఈజ్ లాస్ట్ స్టెప్.
జీవన మృత్యువులు పెనవేసుకొని ఏకమైన నీకు
వేరే మృత్యువెక్కడ కృష్ణమూర్తీ!
నీ నిమీలిత ప్రశాంత నేత్రాల వెనుక
విస్తరించిన అనంత శూన్యంలో
ఏ అనుబంధాల సాలెగూళ్ళకూ ఆధారం లేదు
సముద్రవు ఒడ్డున ఏ అడుగు జాడలూ మిగలవు
కోల్పోతానేమోనని భయపడడానికి
ఏం మిగుల్తుంది చిల్లు జేబులో?
ఎగిరిపోతున్న పక్షుల్ని రెక్కలు కత్తిరించి
భద్రంగా దాచుకొని ఆడుకొనే స్వభావం లేని నీవు,
దిగంతాలకి ఎగిరిపోతున్న రంగుల పక్షుల్ని ఎగిరిపోనిస్తావు
గడచిపోతున్న కాలాన్ని గడచిపోనిస్తావు
పలకమీది అక్షరాల్ని ఎప్పటికప్పుడు చెరిపేస్తావు
నీ బ్యాంక్ ఎకౌంట్ నిల్లు.
శూన్య దిగంతాన్ని కప్పుకొని అగాధ ఏకాంత సముద్రంలోకి దూకే
సంధ్యారుణుడివి నువ్వు
ఏ తోడూలేని ఒంటరి యింట్లో, నీకే దిగులూ స్ఫురించదు.
నీ ఇంట్లో ఆరలు లేవు. నీ యింటికి పైకప్పు లేదు.
ఆకాశం నీయిల్లు అనుభూతి నీ ఆస్తి
జీవితానికి లాగే ప్రతినిత్యం
గుడ్ మోర్నింగ్ చెప్తావు మృత్యువుకికూడ
శీతోష్ణాలనుండి, ఎండ వానల నుండి,
ఏ ఆచ్ఛాదనం లేని అటవీ విటపానివి నువ్వు
హిమబిందు స్పర్శనుండి తలదాచుకోని
గులాబీ పువ్వువి నువ్వు
ఏటిమీది నురగలా ప్రతిక్షణం నవ్యం నీ నవ్వు
సాఫీగా సాగిపోయే సెలయేరువి నువ్వు
అగాధ అనంత శూన్య సముద్రం ముందు నిలబడి
అస్తిత్వాన్ని కోల్పోతాననే భయంలేని నది,
ఒక్క అడుగు ముందుకువేసి
ఆకృతినే కోల్పోతే సంతాపా లెందుకు?

శ్రీ రాణి శివశంకరశర్మ

" వాడు దొంగ సొమ్మెత్తేస్తుంటే ఇంటి వాళ్ళెవరూ అటంక పరచలేదు. వాడిని మంచి దారికి తేలేదు. పైగా ఇంకా దొంగతనాలు చేయడానికి ప్రోత్సాహమిచ్చారు. వాడు దొంగ సామానమ్మి డబ్బుతెస్తుంటే వాడి సారా కోటా హెచ్చు చేశారు. వాడు చేసిన దొంగతనాల వల్ల ప్రభుత్వం నష్టపోతున్నది. మా వంటి తోటి పనివాళ్ళు, మూర్తి వంటి సూపర్వైజర్లు మసి అయి పోతున్నారు. "

" ఈ ధర్మరక్షణ నువ్వే చేయాలా?"

" ఎవరూలేని వాడిని - నేను చేస్తే మంచిది. "

నరసింహారావు మరి మాట్లాడలేదు. తానొక్కడి నున్నా నన్న సంగతి వాడు మరచాడా అని సందేహించాడు.

7

సింహాచలం పరిస్థితులన్నీ మారిపోయాయి.

ఇప్పుడామె బొగ్గులు మొయ్యడం లేదు. ఆ రాత్రి సుందరాన్ని కౌగిలించుకున్న క్షణం నుంచీ ఆమె మారిపోయింది. సుందరం ఒంటి మీది దెబ్బలని తలచుకొని రెండు రోజులు ఏడ్చింది. సుందరం దొరమనిషని, దూరంగా ఉంటే ఎంతో బాధపడింది. తను ఇప్పటికీ దొర మనిషే.

' సింహాచలం బంగారం వంటిది : బంగారు గని కూడా. బంగారం తీసే నేర్పు ఆమె తమ్ముడికి తెలుసు. ఆ రోజులలో షెడ్డులో చాలా ఖాళీలు వచ్చాయి. వాటిని పెద్ద దొరే నింపేవాడు. పెద్ద దొరకి చిన్న దొరకి మంచి దోస్తీ. ఇద్దరూ రాత్రిళ్ళు లాన్‌లో కూర్చొని కబుర్లు చెప్పుకుంటారు. ఇంగ్లాండు దేశాన్ని జ్ఞాపకం చేసుకుంటూ బుడ్లు బుడ్లు ఖాళీ చేస్తారు. నేటివులకు కల స్వామి భక్తిని వారు ఎప్పుడూ శంకించేవారు. నేటి బానిస రేపటి శత్రువు. వాడు సమయం చూచి వెన్నుపోటు పొడుస్తాడు. వాడిని బానిసగానే ఉంచాలి.

బానిసలలో కూడా తెలివైనవాళ్ళు, దేశ భక్తులు ఉన్నారని వాళ్ళకు తెలుసు. వాళ్ళని ప్రత్యేక దృష్టితో పరీక్షించి సమయం దొరికినప్పుడు పాతాళానికి తొక్కేయాలి.

వాళ్ళు ఎవరినీ నమ్మరు. యూరేషియన్లమని చెప్పుకుంటూ తమకు వారసులైన నల్లదొరలనికూడా వాళ్ళు అంతంత మాత్రంగా చూస్తారు. ఈ దేశమొక ఆట వస్తువు.

ప్రపంచ మహాయుద్ధంలో చాల దెబ్బలు తిన్నారు వాళ్ళు. భారతదేశం రోజు రోజుకు చేయి జారిపోతున్నది. ఈ సంగతి కూడా వాళ్ళకు తెలుసు. అందుకొనమే ఇంగ్లాండు దేశం, పల్లెల సౌందర్యం, మనుషుల ఋజువర్తన మొదలైన గొప్ప సంగతులు మననం చేసుకుంటుంటారు.

సింహాచలం తమ్ముడు చాల ప్రయోజకుడు. వాడు సింహాచలం వేయించిన మొదట కళాసీ. వాడి పెళ్ళాం వాడిని విడిచిపెట్టి వెళ్ళింది. ఆడారి మొగుడని. మొగుడిని వదిలిపెట్టి ఇల్లు పట్టిన ఆడపడుచుని, నిత్యం సాధించుకుతినే అత్తగారిని విడిచిపెట్టి మరో మంచి మనిషితో వెళ్ళిపోయింది.

సింహాచలంతో కలియాలని చిన్నదొర తహతహ లాడిపోతున్నాడు. రోజూ దాని తమ్ముడిని పిలిచి యోగక్షేమాలు కనుక్కుంటాడు. వారం రోజులు తిరక్కముందే ఇద్దరు సింహాచలం మనుమ్యలకు ఉద్యోగాలు వేసి, సింహాచలాన్ని తిన్నగా బంగళాకే తెప్పించుకున్నాడు.

. ఆ రోజు నుంచీ సింహాచలం తమ్ముడు చాల గొప్పవాడయ్యాడు. ప్రతీ కళాసీ ఉద్యోగానికి మూడువందల రూపాయలు పుచ్చుకునేవాడు. రెండు వందల రూపాయలు వాడివి. ఒక వంద దొరకిచ్చే విస్కీ బుడ్లకో, బ్రాందీ బుడ్లకో, కోళ్ళకో ఖర్చు పెట్టేవాడు.

షెడ్డులో పనివాళ్ళకి సింహాచలం పాట, ఆట కరువైపోయాయి.

అందరూ అన్ని విధాల అనుకుంటారు. ఎవ్వరూ సింహాచలం ఏమను కుంటుందోనని అయినా ఆలోచించరు. సింహాచలం ఒక్కర్తే అంత బంగళాలోను ఒకప్పుడుంటుంది. దొర డ్యూటీలో ఉన్నప్పుడు, పెద్ద దొరతో మాట్లాడడానికి వెళ్ళిపోయినప్పుడు ఒంటరిగా గదిలో కూర్చొని ఆలోచిస్తుంది. తాను చిలకలా ఉండడం నిజమే. పంజరంలో ఉండే చిలక అయినందుకు విచారిస్తుంది. తన అందమేమో తనకు తెలియదు. దొర తప్పతాగి వెర్రిగా తనవేపు చూస్తుంటే చాల బాధపడుతుంది. తన బతుకుని తమ సుఖానికి, తమ ఆర్జనకి బలియా వేసిన తమ్ముడి మీద, తల్లి మీద విరుచుకుపడుతుంది. వాళ్ళు నయాన్న భయాన్న వయసులోనున్న దానిని దొర ఇంటికి దిగబెడితే తలమోదుకొని ఏడ్చింది.

దొర ఇంట్లో సింహాచలానికి లోటేమిటి లేదు. కుసిసీవోడు మూడు పూటల వండి పెడతాడు. దొర మంచి చీరలు కొనిపెట్టాడు. తమ్ముడిన్ని ఊళ్ళో వాళ్ళందరూ దొర బావమరిది అని పిలిస్తే వాడు సంబరపడి పోతున్నాడు.

తల్లిముండాకూడా కూతురు మాత్రం తనదని తాను మానలేదు. మామూలుగా బొగ్గులు మోస్తునే ఉంది. చిన్నదొర అల్లుడవడం నుంచి ఆమెను ఎవరూ అడ్డుపెట్టరు. బొగ్గులమ్మిన డబ్బులు వడ్డీలకు తిప్పుతుంది. సింహాచలం తమ్ముడుకూడా అదే వృత్తి చేస్తున్నాడు. వడ్డీలకు వడ్డీలు- చేతినిండా డబ్బు ఇల్లు బాగుచేయించాడు. పాకతీయించి పెంకుటిల్లు కట్టాడు. మంచి మంచి బట్టలు వేసుకుంటాడు రిక్షాలో సినిమాకి పోతాడు- ఇవన్నీ సింహాచలం చేతి చలవని వాళ్ళకి తెలుసు. దీపం బాగా వెలుగుతున్నది. వాళ్ళన్నీ చక్కబెట్టుకుంటున్నారు.

ఈ మధ్య దొర విపరీతంగా తాగుతున్నాడు. అప్పుడప్పుడు సింహాచలాన్ని ఇంగ్లాండు వస్తావా అని అడుగుతున్నాడు- మనిద్దరం బెంగుళూరు పోదామా అని మరోసారి అంటాడు. దొరకి సింహాచలం అంటే చాల గౌరవం ఆమె వల్లనే విస్కీ బ్రాందీలు ఇంట్లో కాలువలై పారుతున్నాయి. కోళ్ళు దొరుకుతున్నాయి. వళ్ళకు అంతేలేదు. వచ్చిన జీతమంతా బాంకులో జమ అవుతున్నది. ఎవరైనా ఆడదాని షోకు మరిగితే డబ్బు కర్పూరంలా హరించుకు పోతుంది. అతని విషయంలో సింహాచలం కల్ప వృక్షమే.

వీళ్ళెవరికి సింహాచలం మనసులో ఏముందో అక్కరలేదు. సింహాచలం ఒంటరిగా ఉన్నప్పుడు కిటికీకి ఎదురుగా కుర్చీ మీద కూర్చుంటుంది. ఆకాశం మీద ఎగిరే పక్షుల్ని చూస్తుంది. తన పెరటిలో సంపెంగ చెట్టు జ్ఞాపకం వస్తుంది. ఆ చెట్టుని ఎవరో మాధవదార పువ్వుల మనిషికి తమ్ముడు కౌలు కిచ్చాడని తెలిసి ఎంతో బాధపడింది. రాత్రిపూట ఫ్లడ్‌లైట్ల వెలుతురులో చీర ఎగగట్టి, పయ్యెద వెనక్కు దోపుకొని చందమామ పదాలు చెలికత్తెలతో పాడుతూ, పాటకు అనుగుణంగా అడుగులు వేస్తూ, అభినయిస్తూ స్వేచ్ఛగా నవ్వుతూ బ్రతికిన దినాలు జ్ఞాపకం తెచ్చుకుంటుంది.

ఇంకా ఇంకా ఆలోచనలను వెనక్కు మళ్ళిస్తుంది. ఇంజన్ల షెడ్డులో అటువంటి మనిషుంటాడని సింహాచలం కలలోకూడా అనుకోలేదు. హోప్‌లెస్ గాడిని నాలుగేళ్ళ క్రింద మొదటిసారి చూసినపుడు ఆమె మనసు అదోవిధంగా అయిపోయింది. వాడి గురించి చాల విషయాలు వింది. వాడి నడక, వాడి ఛాతీ, వాడి నవ్వుతున్న ముఖం, వాడి మాటలలో మగతనం చూచి పొంగి పోతుంది. వాడికి ఆమెకు వయసులో అయిదేళ్ళు తేడా. వాడు కాంటీనులో పనిచేస్తున్నప్పుడు ఎవళ్ళులేకుండా చూసి పనికట్టుకొని వెళ్ళి మాట్లాడేది. వాడికి తగని సిగ్గు- వాడి సాహసకార్యాలు ఒకటీ ఒకటీ విని, మనసంతా వాడే నిండి వాడి కౌగిలికోసం ఎదురు చూచేది. అందుకోసమే వీరాసామి తన మీద పందెం కాసినా అభ్యంతరం తెలపకుండా నవ్వేసి ఊరుకుంది. మొదటి నాలుగు రోజులు అందరి మగాళ్ళ మధ్య సింహంలా నిలుచున్న వాడు ముందుకొస్తాడేమోనని ఎదురు చూచింది. ఎవరూ కాలు కదపక తిరిగి వెళ్ళిపోతుంటే, తాను హోప్‌లెస్‌గాడి గురించి విన్నదంతా తప్పేమోననుకుంది.

కాని, అయిదోరోజు వాడు ముందుకొచ్చి, అందరి మధ్య నిర్భయంగా తనని కౌగలించుకున్నప్పుడు ఒళ్ళు దాచుకోలేక పోయింది. వాడి కౌగిలిలో, కాదు కాదు తన కౌగిలిలో వాడు జారిపోతాడని శంకించి, వాడి పెదవులను తన పెదవులతో బంధించింది. వాడిలో ఏవిధమైన ఉద్రేకం లేకపోతే కష్టించి నవ్వించింది. చుట్టూ అంతమంది చూస్తున్నారని, సిగ్గుచేటని కూడా ఆలోచించకుండా తనువు మనసు వాడికి సమర్పించుకుంది.

వాడిని కుంటి దొర ఎన్నెన్ని దెబ్బలు కొట్టాడు- ఆ దెబ్బలేవీ వాడి శరీరం మీద పడలేదు- తన మృదువైన చర్మాన్ని వొలుస్తున్నట్లు అనుకుంది. ఆ రోజుతో కుంటిదొర పొందు తెంపుకు పోదామనుకుంది. కాని ఏం ప్రయోజనం? అదన్తె పుట్టదంకంటె ...

రోజులు గడుస్తున్నాయి. మూర్తి మీద ఛార్జి షీటు తయారు చేశారు. దానికి ఆధారం పుల్ప్ దొర రిపోర్టు- అదికాకుండా మూడుసంవత్సరాలయి అతని కాన్ఫిడెన్షియల్ రిపోర్టులన్నీ బాగులేవు- పెద్దదొర అవి రాసేముందు చిన్నదొరని పిలిచి అడగడం. అతను విధిగా చెడ్డ చెప్పడం, పెద్దదొర రిపోర్టును పాడుచేయడం జరుగుతున్నది. ఈ విధంగా ఉద్యోగానికి వచ్చిన దగ్గిర నుండి మూర్తి గురించిన చెడ్డ రిపోర్టుల నన్నిటిని క్రమబద్ధం చేసి చాల బలమయిన ఛార్జి షీటు తయారు చేశారు.

మూర్తి ఛార్జి షీటుకు జవాబిచ్చాడు. దానికి యజమానులు సంతృప్తులు కాలేదు. ఆ విషయం తెలియపరుస్తూ అతనిని ఉద్యోగం నుండి తొలగించే ముందర చివరి ఎంక్వయిరీ చేయడానికి ఒక ఆఫీసరును నియమించారు. ఏదో గోటితో చిక్కవలసిన దానిని గొడ్డళ్ళతో చీల్చడానికి దొరలు సిద్ధపడ్డారు.

మూర్తిలో మాత్రం ఏ విధమైన మార్పు రాలేదు. అతను ఇంత జరుగుతున్నా కొంచెమైనా భయపడలేదు. తను, తన రాట్నం, తన ఖద్దరు, తన ఉద్యోగం అంతా మార్పులేకుండా చేస్తున్నాడు. వీరాసామిని విధిగా వారానికి రెండుసార్లు చూసి వచ్చేవాడు. అతని వెంట ఎప్పుడూ సుందరం ఉండేవాడు. వీరాసామి మాట్లాడడానికి ప్రయత్నించాడు. క్రింది దవడ చాల శ్రమతో కదప గలిగేవాడు. ప్రాణభయం తప్పింది. కాని వాడి ముఖం మాత్రం కొంచెం వికృతంగా మారక తప్పలేదు.

గురునాథం పంతులు ఇప్పుడు విజయనగరం వెళ్ళడం లేదు. ఆమనిషి నెవతెనో విశాఖపట్నం తీసుకొచ్చి తన యింట్లోనే ఉంచుకున్నాడు. తల్లి వేరే వండుకు తింటుంది. అతనికి, అతని మనిషికి హోటలు నించి కారియరు వచ్చేది. అతను మూర్తి మీద జరుగుతున్న అత్యాచారానికి చాల మథన పడ్డాడు. నరసింహారావుతో కలిసి ఆలోచించాడు. కోర్టులో కేసు పడేసి స్టే అర్డరు తెప్పిస్తానన్నాడు. కాని ఏ విధమైన చర్య తీసుకోడానికి మూర్తి అంగీకరించలేదు. కోర్టులకు వెళ్ళి డబ్బు వ్యయం చేయడం, న్యాయాన్ని డబ్బిచ్చి కొనుక్కోవడం అతనికి నచ్చని పనులు. అతని నిర్ణయాన్ని వాళ్ళిద్దరూ ఎంత ప్రయత్నం చేసినా మార్చలేకపోయారు.

సుందరం వారానికి రెండుసార్లు మూర్తిగారితోను, రెండుసార్లు గురునాథంగారితోను, రెండుసార్లు నరసింహారావుగారితోను వీరాసామిని చూడడానికి వెళ్ళడమేకాకుండా ఆదివారం నాడు తానొక్కడు స్వయంగా వెళ్ళేవాడు. వీరాసామికి తొలి దినాలలో సుందరాన్ని చూచినప్పుడు వణుకు వచ్చి, రాత్రికి విధిగా జ్వరం వచ్చేది. వీరాసామి ఇంకా మరచిపోలేదు. వర్షం కురిసిన నాటి రాత్రి తెల్లవారుఝామున నాలుగుగంటల వేళ తను బొగ్గు లేరుకోడానికి నంచి పట్టుకు బయలుదేరాడు. దానిలో చీకట్లో విప్పిన రెండింజనుల ఇత్తడి భాగాలున్నాయి. వాటిమీద పేరుకు నాలుగు బొగ్గు ముక్కలు వేసుకొని కమ్మరి దుకాణానికి పోదామనుకున్నాడు. ఇంజను నుండి ఇత్తడి భాగాలు విప్పుతున్నప్పుడు ఎవరో వెనుక తచ్చాడుతున్నట్లు వాడికి అనుమానమే. అయినా చిన్నదొర మనిషిని ఎవరూ ఏమీ చేయలేరని వాడి ధైర్యం.

ఆ ధైర్యం పటాపంచలయింది ఒక్కసారి. కొరుడీకట్లో ఒక్కసారి మెరిసినట్లయింది. దవడ మీద మొదటి దెబ్బ తగలగానే - పళ్ళూడి పోయాయి- నెత్తురు కారిపోతున్నది - ఏదో బాధ- కేక వేయడానికి దవడ కదలదు-రెండో దెబ్బ చెలిమీద, మూడవది తగిలేసరికి స్పృహ పోయింది. వీరాసామికి వాటిని తలుచుకుంటే నాడి ఆగిపోతుంది.

సుందరం చాల సహాయం చేస్తున్నాడని వీరాసామి భార్య చెప్పింది. క్రమంగా వాడిమీద కోపం తగ్గింది, భయం పోయింది. వాడేదో రహస్యాన్ని చెప్పడానికి వస్తున్నట్లు వీరాసామికి అనుమానం కలిగింది. మహాపరాధం చేసిన మనిషి పశ్చాత్తాపాగ్నితో దహింపబడుతున్నట్లు, మహాపాతకాలు చేసినవాడు గంగలో మునిగి ప్రాణత్యాగం చేయదలచినట్లు వీరాసామికి అనిపించింది.

రెండు మూడురోజులలో వీరాసామిని విడిచి పెడతామని డాక్టర్లన్నారు. ఆ ఆదివారం ఎవరూ వీరాసామి దగ్గిర లేరు. గొంతుక బొంగురుపోయి, మాట తిన్నగారాక, కళ్ళ నీళ్ళు తుడుచుకుంటూ సుందరం వీరాసామి చేతులు పట్టుకున్నాడు.

"వీరాసామి ! నువ్వు మూర్తిగారికి అన్యాయం చేస్తున్న సంగతి తెలుసు కాని నేను కోపం పట్టలేక నిన్ను కొట్టాను. ఈ పాపం దాచుకున్న కొద్దీ నాకు నిద్రాహారాలు దూరమవుతున్నాయి. నేను చేసిన నేరాన్ని ఒప్పుకుంటున్నాను. నన్ను కోర్టుకీడ్చి శిక్ష వేయించు నేను బాగుపడతాను".

వీరాసామి సుందరం ముఖంలోకి చాలసేపు చూశాడు.

"ఓరి ఓవ్‌లెన్నూ ! నీ తండ్రెవడో, తల్లెవరో తెలీదు- జాతేదో తెలీదు- మతమేదో ఎరగం- కాని, నీకున్న నీతి మాకెవరికుందిరా ! నేను మంచి గౌరవమైన కుటుంబానికి చెందిన వాడిని- నాకేం డబ్బుకు లోటా- కాని నీతి మాలి దొరల చెప్పలు నాకి బతికానురా ! మీరంతా నన్ను చూడడానికి వచ్చారుగాని, ఒకరోజైనా ఆ చిన్నదొర వచ్చేడ్రా! నేను అతనికి ఆడవాళ్ళను తార్చాను, బుడ్లు పట్టుకొచ్చి చేతుల్లో పెట్టాను. అవసరం ఉన్నంత సేపు మాట్లాడేవాడు - వాడిదయ సంపాదించడం కోసం అందరి మీదా నేరాలు కల్పించి చెప్పాను. ఇవన్నీ హద్దులు మీరిపోయాయి- నువ్వు శిక్షించినది ఇంకా చాలదు. నా పాపం జన్మలకుగాని విడిచిపెట్టదు-" అన్నాడు వీరాసామి కళ్ళ నీళ్ళు కారుతుంటే.

"వీరాసామీ ! నేనెంత నీతి మంతుడనయినా న్యాయం నమకూర్చే అధికారం నాకేదీ ? ప్రభుత్వం వారు శిక్షిస్తారు- లేకపోతే దేవుడు చేయవలనది చేస్తాడు, నేను చేసిన పని క్షమించరానిది. నా వాఙ్మూలం ఇస్తాను-కేసు వెయ్యి వీరాసామీ !"

వీరాసామి కళ్ళు తుడుచుకున్నాడు.

"అంతకన్న గొప్ప పని మరేదేనా లేదా ?"

"ఆదే న్యాయ సమ్మతమైనది."

"న్యాయం విడిచిపెట్టు - నిన్ను క్షమించానని అంటే నా మనసు సంతోషిస్తుందిరా ఓవ్‌లెన్."

వీరాసామి లేచి సుందరాన్ని గుండెలకు హత్తుకున్నాడు; ఆనందాశ్రువులు కారుతుంటే.

8

వెళ్ళబోయే మెయిలింజను ఎండలో తళతళ మంటున్నది.

ఆ రోజుల్లో స్టీము ఇంజనులే మెయిలు ట్రెయినులు పనిచేసేవి. బ్రిటిష్ శాస్త్రజ్ఞులు కనుక్కొని, మేలురకం ఇంజనులను తయారు చేసి భారతదేశానికి దిగుమతి చేశారు. ఈ ఇంజనులు వారి సాంకేతిక నైపుణ్యానికి ప్రతీకలు. ఎక్కడయినా బ్రిటీషువారు అశ్రద్ధ ప్రదర్శించవచ్చుగాని, తాము తయారు చేసిన యంత్రాల విషయంలో అశ్రద్ధ వహించరు. చిన్నదొరకూడా అటువంటివాడే. మెయిలింజను భాగాలలో కొన్ని ఇత్తడి భాగాలను తోమి, కొన్నింటికి నల్లరంగు వేసి, కొన్ని స్టీలు భాగాలను మెరుగుపెట్టి యింజను నిగనిగ లాడేటట్టు తయారు చేశారు, భారతదేశంలో అన్నింటికన్న చవక యినది శరీర శ్రమ. దానిని వినియోగించడం బ్రిటీష్‌వారికి బాగాతెలుసు. దొరల మెప్పులకోసం మితిమీరి శ్రమపడినవారు చాలమంది ఉన్నారు. అటు వంటివారి మీద ప్రభువుల దయ నిలుస్తుంది. దొరల బంగళాలలో పెరిగే కుక్కల తరువాత ఇటువంటి విశ్వాస పాత్రులమీద వారి అనుకంప అంతంత మాత్రం కనిస్తుంది.

అసిస్టెంటు ఫోర్మన్ బట్లరు దొర స్వయంగా మెయిలింజను దగ్గిర నిలబడి పనులు చేయిస్తున్నా, అతని అత్తగారు, అంటే సింహాచలం తల్లి మాత్రం కాలిన బొగ్గులు ఇంజను దగ్గిరే ఏరుతున్నది. సింహాచలం మోజులో దొర ఉన్నన్నాళ్ళు ఎవరూ ఆ జరరను ఆపలేరు. ఎంత తాగినా తీరనిది ధన దాహం. రోజుకో పదిరూపాయలు బొగ్గులమ్మి సంపాదించి దానిని వడ్డీకిచ్చి, వచ్చిన వడ్డీ మళ్ళా తిప్పి ఆ ముసలిది మరీ తాపత్రయపడుతున్నది. సింహాచలాన్ని ఉంచుకున్నందుకు చిన్నదొర నెలకు యాభైరూపాయలు ముసిలిదాని కిస్తాడు. సింహాచలం తమ్ముడు ఉద్యోగం చేసి డబ్బు సంపాదించడం ఉండనే ఉంది. ఉద్యోగాలు వేయించి, డబ్బు వడ్డీకిచ్చి, తనయిల్లు బాగు చేసుకుంటున్నాడు కాని, ఇద్దరికిద్దరూ సింహాచలం సంగతి పట్టించుకున్న వాళ్ళుకాదు.

రైలు పట్టీలకు మధ్య కొంత పచ్చి బొగ్గు పడివుంది. క్రమంగా సింహాచలం తల్లి ఆ కుప్పదగ్గరికి చేరుకుంది. బొగ్గులతట్ట ఒకటి నింపి దూరంగా పెట్టుకోడానికి వెళ్ళిపోంది. ముసిలి దానికి చూపు ఒక మాదిరిగా ఉన్నా చెవుడు మాత్రం బ్రహ్మాండంగా ఉంది. మెరుస్తున్న ఇంజను మీద ఎక్కిన వాడు అబ్రహాము డ్రైవరు. ఇతను ఆంగ్లేయుడుకాడు. కాని యురేషియనునని చెప్పుకుంటాడు. దొరల తెలుపు అంటక పోయినా తల్లి నలుపు మాత్రం ఇతనిని విడిచిపెట్టలేదు. రంగెలా ఉన్నా వేష భాషల్లో వాళ్ళనోటి నుండి ఊడిపడ్డవాడే. అంబలిలో పోషక పదార్థాలున్నాయని, తల్లిముండ చీరలే కడుతుందని అందరితో చెప్తాడు. ఇతనికి చాలమంది పిల్లలు- మనిషి మస్తుగా తింటాడు. శ్రమపడి మీది కొచ్చాడు. మైలు నడిపొదంటే గాలిలో ఎగిరి పోతున్నట్లే ఉంటుంది. రెండుగంటల లేటుగా బయలుదేరినా నకాలంలో రైలును గమ్యం చేర్చగలడు. అతనెప్పుడూ అరగంట ముందుగానే డ్యూటీకి వస్తాడు. ఇవాళ మాత్రం ఏదో చికాకువచ్చి సరిగా బయలుదేరవలసిన సమయానికవచ్చి, తొందరతొందరగా ఇంజనెక్కి అన్నీ ఒకసారి చూచుకున్నాడు.

"జిమ్ ! హరియప్ ! యూ ఆర్ ఆల్‌రడీ లేట్" క్రిందను నిలబడ్డ సొట్టదొర అరిచాడు.

డ్రైవరు అబ్రహాము విజిల్‌కొట్టి తనవేపునుండి రైలు పట్టీలను చూచు కొని ఇంజను నడిపించాడు. మరో కాళీతట్ట పట్టుకొని పరుగెత్తి వస్తున్న సింహాచలం తల్లికి ఏవీ వినిపించలేదు; కదులుతున్న ఇంజను కనిపించలేదు - పచ్చి బొగ్గులు - తట్ట రూపాయి - ఆ పచ్చి బొగ్గులు మాత్రమే కనిపిస్తున్నాయి - ముసిలిది పట్టీలమధ్యకు పరుగున రావడమేమిటి, ఇంజను కదిలి ముందుకు పోవడమేమిటి - అన్నీ రెప్పపాటు కాలంలో జరిగిపోయాయి. పనివాళ్ళ హాహాకారాలు మిన్నుముట్టాయి. అబ్రహాం దొర ఎమర్జన్సీ బ్రేకు వేసినా ఇంజను వెంటనే ఆగలేదు - ముసిలిదాని శరీరం మీదనుండి ముందుచక్రాలు వెళ్ళినతరువాత ఆగిపోయింది.

లోకాన్ని ఏకఛత్రాధిపత్యంతో ఏలుదామనుకున్న సింహాచలం తల్లి రెండుగా తెగి ఇంజనుక్రింద ఉండిపోయింది.

మనుషులు కొంతమంది చచ్చినా తగాదాలే తెచ్చిపెడతారు. మదరాసు నుండి కలకత్తా పోవలసిన మెయిలువచ్చి ప్లాట్‌ఫారము మీద సిద్ధంగా ఉంది. ఇంజనువెళ్ళి తగలవలసినది ఎటూ కదలలేని స్థితిలో ఉండిపోయింది. ఆ ఇంజను ఒక్క అంగుళముకూడా కదలడానికి వీలులేదు - పోలీసులు, రైల్వే

అధికారులు అందరూవచ్చి పరీక్షచేసి అనుమతించే వరకు అదికదలడానికి వీలులేదు. డ్రైవరు అబ్రహాం కూడా కదలడానికి వీలులేదు.

వంక్యూవాలిటీ వీక్ మొదటిరోజు ఆ విధంగా ధ్వంసమయింది. మొదటి రోజునే సంధి కొట్టేసింది. పేరు సంపాదించుకోవాలన్న సొట్టదొరకు రెండవ కాలు విరిగిపోయినట్లయింది.

చిన్నదొర అందరినీ తిడుతున్నాడు. ఇప్పుడొచచ్చినది సింహాచలం తల్లి అని, తన అత్తగారని వాడికి గుర్తులేదు - బ్లడీవ్హోర్, బ్లడీబిచ్ ఇంకా అశ్లీల పదాల్ని ప్రయోగించి తిడుతున్నాడు - అప్పుడు మూర్తి ముందుకొచ్చాడు. మరొక ఏర్పాటు చెప్పమన్నాడు. మెయిలు వెనకపోయే గుడ్సు ఇంజనొకటి సిద్ధంగా ఉంది. దానిని పంపమని చిన్నదొర చెప్పాడు. గుడ్సు ఇంజను చక్రాలు చిన్నవి - దానిని నలభై ఆయిదుమైళ్ళ వేగం దాటి నడవకూడదు. అప్పటికే అరగంట ఆలస్యమయింది. గుడ్సు ఇంజను తగిలిస్తే ఇంకా తోవలో లేటయిపోతుంది. మూర్తి మరో ఏర్పాటు చేశాడు - గూడ్సు ఇంజను డ్రైవరు మునుసామిని సాయంకాలం వెళ్ళవలసిన పాసింజరు యింజనును పంపుదామన్నాడు - ఇంజనుకి రిపేర్లవలేదు. ఆలస్యమవుతుందని దొర గునిశాడు. ఇంజనుకు నీరు నింపుతుండే రిపేర్లు పూర్తిచేశాడు సుందరం - నేటివ్ డ్రైవరు మునుసామి మెయిలు నడపటం బట్లరుదొరకి ఇష్టంలేదు - అది అసలు రహస్యం ఏదయితేనేం మెయిలు వెళ్ళిపోయింది.

ఇంతలో పోలీసులు రంగంలోకి వచ్చారు. జిల్లా రైల్వే అధికారి ఒకతను వచ్చాడు.

"ఎవరీమె ?" పోలీసు ఇనస్పెక్టరు ప్రశ్నించాడు.

అందరికీ ఆమెపేరు పైడమ్మని తెలుసు. సింహాచలం తల్లి అని తెలుసు ఆమె కొడుకు పాపయ్య షెడ్డులో పనిచేసే కళాసీ అనితెలుసు ఎవరూ ముందుకొచ్చి మాట్లాడరు.

తల్లి చచ్చిన సంగతి సింహాచలానికి తెలియదు. ఈమధ్య దొర ఏం చేస్తున్నాడంటే ఆమెను బంగళాలోపెట్టి తాళం వేస్తున్నాడు - తాను న్నప్పుడు లోపల తాళం వేసుకుంటాడు. ఆమెకు కబురు అందజేసినా ప్రయోజనంలేదు - దొర ఆమెను పైకిరానీయడు.

ఇక పాపయ్య సంగతి - వాడు రాత్రి డ్యూటీలో ఉన్నాడు - వాడి దగ్గిరకి ఒకరిద్దరు పరుగెత్తారు. వాడు హాయిగా భోజనంచేసి పడుకున్నాడు - తల్లిముండ ఏ మూడుకోవచ్చి తిండి తింటుంది. పొద్దున్న గుండెమొయ్యా చద్దన్నం తింది. ఆమె వచ్చేవరకు వాడు హాయిగా నిద్రపోతాడు - అరగంట సేపు ఇంటి తలుపులు బాది వాడిని లేపేసరికి కబురుచెప్పిన వాళ్ళు మూడు చెరువుల నీళ్ళు తాగారు - 'ఒరే పాపిగా ! నీతల్లి బండికిందపడి చచ్చిందిరా !' అని వాళ్ళు చెప్తే వాడు తల్లికోసం ఏడవలేదు - ఎవరెవరికి డబ్బు అప్పిచ్చిందో చెప్పకుండా చచ్చిపోయినందుకు ఏడవడం మొదలుపెట్టాడు. పోలీసులొచ్చారని ఎంక్వయిరీ జరుగుతుందని వాళ్ళు చెప్తే వాడు ఇంటికి తాళం వేసుకొని సీతమ్మ ధారకొండమీదికి పారిపోయాడు - పోలీసులు సోదాచేస్తే తాకట్టు సామాన్లు తనఖావత్రాలు దొరకుతాయని భయపడ్డాడు.

పైడమ్మ ముసిలిది చావడానికి మూడే కారణాలు.

మొదటిది, సొట్టదొర బట్లరు, మెయిలు డ్రైవరును ఇటు ఆటూ చూడకుండా ఇంజనును నడిపించమని తొందరపెట్టడం.

రెండవది, అబ్రహాము దొర ఎంతమంది బట్లరు దొరలు అరచినా రెండు ప్రక్కలా చూచి, ఎవరూలేరని నిశ్చయానికి వచ్చిన తరువాతే ఇంజను నడిపించవలసి ఉంది. ఆ విధిని అతడు ఉల్లంఘించడం.

మూడవది, ఇతరులకు ప్రవేశార్హత లేనిచోటుకి పైడమ్మ ప్రవేశించడం అనధికారంగా బొగ్గులేరడం కోసం పట్టీల మధ్యకు రావడం -

ఈ కారణాలు ఎంక్వయిరీలో ఒకేఒక్క కారణమయాయి. పైడమ్మ ట్రెస్ పాస్ చేయడం ఒకటే అపరాధంగా నిలిచింది.

శవపంచాయితీ అయిపోయింది. ఉద్యోగులెవరూ ముసిలిదాని చావుకు బాధ్యులుకారని తీర్పు ఏకగ్రీవంగా అధికారులిచ్చారు. అపుడు రెండుగా తెగిపడిన శరీరం ఎవరికి అప్పజెప్పడమనే సమస్యవచ్చింది.

"ఈమె మనుషులేరి?" పోలీసు ఇనస్పెక్టరు చుట్టూ నిలిచిన పనివాళ్ళను అడిగాడు.

ఎవరూ ముందుకురాలేదు.

"ఈమెకెవరూ లేరా ?" మళ్ళా అందరినీ చూస్తూ అతనే అడిగాడు.

కొంచెం సేపటి తరువాత ఒకతను ముందుకొచ్చి అన్నాడు.

"ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు ?"

"కొడుకుకి కబురువెళ్ళిందా ?"

"3647 వెళ్ళివచ్చాడు సార్ ! ఆ కొడుకు ఎక్కడికో పోయాడు. ఇల్లు తాళం సార్ !"

"కూతురెక్కడుంది ?"

అందరూ చిన్నదొరవేపు చూశారు.

చిన్నదొర నవ్వుతూ ఇనస్పెక్టరుతో అన్నాడు

"ఆమె ఎక్కడుందో ఎవరికీ తెలీదు".

"మరెవరూ లేరా ? చెప్పండి - ఎవరూ లేకపోతే మునిసిపల్ హెల్తాఫీసరుకు ఫోనుచేసి చెత్తలబండిలో ఈడ్పిస్తాను".

అందరు ముఖాలు చూచుకుంటున్నారు.

అపుడు సుందరం ముందుకొచ్చాడు.

"ముసిలిది నీకేమవుతుంది ?"

"నేను ఈ షెడ్డులో అడుక్కోడానికి వచ్చిన మొదటి రోజున నా కంచంలో ఆదరంతో మొదటి కబళం పెట్టింది ఈమె. అనాటినుండీ నేను ఉద్యోగంలో చేరేవరకు నన్నుసాకింది. ఈమె నాకు తల్లికన్న హెచ్చు. నేనొక్కడినే కాను. ఇక్కడ నిలబడ్డ వాళ్లందరికీ ఆప్తురాలే. ఆమెకు దిక్కులేని చావు దేనికి ? మాకిచ్చేయండి ఈ శరీరాన్ని".

సుందరం కాంటీను సేల్సునుండి నూరు రూపాయలు అప్పతెచ్చాడు, మర్నాడు బాంకినుంచి తెచ్చిఇస్తానని - నరసింహారావుకూడ ఆమోదించాడు. పనివాళ్ళు ముందుకొచ్చారు.

ఎవరూ లేరనుకున్న సింహాచలం తల్లి తిన్నగా వైకుంఠానికే వెళ్ళిపోయిందారోజు.

9

ఆ రోజు ఇంజన్లషెడ్డు ఇనస్పెక్షను జరుగుతున్నది. ఆ పని చేస్తున్న అధికారి కలకత్తా ప్రాంతాలనుంచి వచ్చాడు. అతనిపేరు ఫిలిప్స్ నూటికి నూరుపాళ్ళు అతను ఆంగ్లేయుడు - మనిషి ఆరడుగులకు పైగా పొడవుంటాడు. పొడవుకుతగ్గ శరీరం - అతను తెల్లనిబట్టలు వేసుకున్నాడు. అతని నోటిలో ఎప్పుడూ పైపుంటుంది. ఆ పైపు నోటిలో ఉన్నప్పుడు అతను మాట్లాడితే ఎవరికీ బోధపడదు.

ఇటువంటి అధికారి సంవత్సరానికోసారి వచ్చి తనిఖీచేసి వెళ్ళిపోతుంటాడు. క్రిందటిసంవత్సరం వచ్చిన అధికారి ఉద్యోగంనుండి విరమించి మాతృదేశం వెళ్ళిపోయాడు - అతని స్థానంలోవచ్చిన ఈ అధికారి ఇంగ్లండులో ఇంజనులు తయారుచేసే కర్మాగారంలో పని చేస్తున్నప్పుడు బ్రిటిష్ ప్రభుత్వం అతనిని భారతదేశానికి పంపింది. అతను చాలా పెద్ద యింజనీరు. చిన్నతనంలోనే ఉన్నతస్థాయికెక్కినవాళ్లలో ఇతనొకడు.

వారం రోజులనుండి, ఫిలిప్సుదొర తనిఖీకి వస్తున్నాడని ఇంజన్లషెడ్డు కిందమీద చేస్తున్నారు - రంగులువేసి, సున్నాలుకొట్టి, మట్టి ఊడ్చి బొగ్గు కుప్పలు సర్దిచేసి, సేఫ్టీ స్లోగనులు రాయించి, త్రివర్ణ సామాగ్రి సరిచేసి అందరూ క్రిందామీదా పడుతున్నారు.

ఉదయం అతను తొమ్మిది గంటలకు వచ్చాడు - పన్నెండు వరకు తిరుగుతున్నాడు షెడ్డులోను, పైనకూడా - హిందూదేశపు జూలై నెల ఎండకి అతను ముఖం కందగడ్డవలె ఎర్రబారిపోయింది. అతని తెల్లనిబట్టలు చెమటతో తడిసిపోయాయి - అతను తరచు కళ్ళజోడును తెల్లని రుమాలుతో తుడుచుకుంటూ, కారే చెమటను మరొకదానితో అద్దుకుంటూ పెద్దదొర ఆఫీసులోకివచ్చి కూర్చున్నాడు.

అతడు కూర్చొని ప్రత్యేకంగా తనతో తెచ్చుకొన్న పెద్ద ఫ్లాస్కు నుండి లైమ్‌జూస్ కార్డియన్ వంపుకొని తాగి తాపీపడ్డాడు - అప్పుడు చప్రాసీ వీరాసామి లోపలికొచ్చి పెద్ద దొరకొక చీటీ ఇచ్చాడు.

వీరాసామి ఆస్పత్రినుండి విడుదలయిన రెండు నెలల తరువాత తిరిగి ఉద్యోగంలో ప్రవేశించాడు. అతను బలమయిన పనులు చేయడానికి తగడని. తేలిక ఉద్యోగం ఇవ్వవలసిందని కంపెనీ డాక్టర్లు సిఫారసు చేశారు. వీరాసామికి చదువులేకపోవడంవలన పెద్దదొర ఆఫీసులో చప్రాసీ ఉద్యోగం ఇచ్చారు.

మూర్తి కోసం చేస్తున్న ఎంక్వయిరీ పూర్తి అయిపోయింది. దానికి అధికారిగా వర్తించిన దొర చాలా గొప్పవాడు. ఇనస్పెక్టరు వుల్ఫుదొర వ్రాసిన రిపోర్టు, రికార్డులో ఉన్న పాత రిమార్కులు, అన్నీ సమగ్రంగా పరిశీలించి మూర్తి నూటికి నూరుపాళ్ళు దోషి అన్న అభిప్రాయానికి వచ్చాడు. మూర్తిని ఉద్యోగంనుండి తీసివేయవచ్చని తన తీర్పుని వివరించాడు. ఇవన్నీ రహస్యంగా జరిగినవి. ఇవి ఎవరికీ తెలియకూడదు. అయినా డివిజనల్ ఆఫీసులోనున్న నేటివ్ స్టెనోగ్రాఫరు మూర్తికి జరుగుతున్న అన్యాయానికి చాల విచారించి నరసింహారావుకి ఎంక్వయిరీ ఫలితాన్ని సూచా వాచా తెలియజేశాడు. ఈ విషయం వారం రోజులక్రిందే సుందరం చెవిని పడింది. సుందరం వెంటనే వీరాసామిని కలుసుకున్నాడు. వీరాసామి శకునివంటివాడు - చాలా మంచి సలహాలు ఇవ్వగలడు. వీరాసామికి అందరికన్నా పెద్ద అధికారి వారం రోజులలో వస్తున్నాడని తెలుసు - ఎంక్వయిరీ రిపోర్టంతా ఆ దొరకే పంపిందారని కూడా తెలుసు. రక్షించడం అతని ఒక్కడికే సాధ్యం. ఆ అధికారికి మూర్తి గురించి సరిగా తెలియదు - మూర్తి చాలా శ్రమపడవలసిన వాడని పనిలో చాల మెలకువలు తెలిసినవాడని, తన క్రింద పనివాళ్ళచేత హెచ్చుపని చేయించగలవాడని,వాళ్ళతో మంచి సంబంధాలు కలవాడని, రైళ్లు సకాలంలో నడవడానికి అతను మూలకారణమని ఆ దొరకు తెలియదు. అటువంటి మనిషి షెడ్డుకి చాలముఖ్యం. అతనిపై మోపిన నేరాలు క్షమింపరానివికావు. ఉన్నతాధికారి న్యాయం విచారించి మూర్తిని ఉద్యోగంనుండి తొలగించకూడదు- ఇది షెడ్డులో పనిచేసే ఏడువందల మంది అభిప్రాయం - మహజరు ఈ విధంగా రాసి, దానిమీద ఏడువందల మంది సంతకాలు తీసుకొని ఇనస్పెక్షను సమయంలో ఉన్నతాధికారికి సమర్పించాలి.

రాత్రిళ్లు, పగళ్లు నిర్విరామంగా ఇంజన్ల షెడ్డు ఉద్యోగులందరినీ కలసి, గురునాథం పంతులు ముక్తసరిగా వ్రాసిన మహజరు మీద సంతకాలు తీసుకున్నాడు సుందరం - ఆ విషయం మూర్తికి తెలిసి చాల బాధపడ్డాడు - దొరల దయను అర్థించే పద్ధతి అతనికి ఏవిధంగా నచ్చలేదు. పనివాళ్ళ ఇష్టానికి అతను వ్యతిరేకంగా వెళ్ళలేకపోయాడు-

ఇనస్పెక్షను నాడు పన్నెండు గంటలవేళ రమారమి నాలుగు వందల మంది పనివాళ్ళు ఆఫీసు ముంద వరుసలలో నిలబడ్డారు - సుందరం మహజరు చేతితో పట్టుకొని ఉన్నతాధికారిని కలియదలచినట్లు చీటీ పెద్దదొరకు పంపించాడు.

పెద్దదొర చాలా కోపపడ్డాడు. కొత్తగావచ్చిన అధికారిని ఎవరూ కలియడానికి వీలుపడదని ఆ చీటీ చింపిపారేశాడు. లైమ్‌జ్యూస్ తాగిన ఫిలిప్సు దొర చిరిగిన కాగితాన్ని, పెద్దదొర ఆగ్రహాన్ని గమనించి ప్రశ్నించాడు.

"ఏమిటి విశేషం ?"

"స్టాఫ్ ఎవరో మిమ్మల్ని చూస్తానంటే నేను వారిస్తున్నాను. మీరు ఎండలో చాల అలసిపోయారు-" అన్నాడు పెద్దదొర.

ఫిలిప్సుదొర నోటినుండి పైపు తీశాడు.

"ఐసీ ! వాళ్ళు నన్ను కలియదలిచితే ఆటంకం లేదే- అన్నిటికన్న మొదటిది పనివాళ్ళ కష్టసుఖాలు తెలుసుకోవడం - వారిలో ఒకరిని లోపలికి రమ్మనండి - మాట్లాడడానికి నాకేమీ అభ్యంతరం లేదు."

పెద్దదొర మరి అడ్డుచెప్పలేక పోయాడు-

వీరాసామి ఒక్క సుందరాన్నే లోపలికి తీసుకొనిపోయాడు.

ఫిలిప్సుదొర తన ఎదుట నిలబడిన యువకుడిని సావకాశంగా పైపు నోట్లోపెట్టుకొని చూశాడు.

సుందరం తెల్లటి ఖద్దరు నిక్కరు, చొక్కా తొడుక్కున్నాడు - ఆరడుగుల పొడుగుండి కండలు తిరిగిన మనిషినిచూచి ఫిలిప్సుదొర ఆశ్చర్యపోయాడు.

సుందరం ఫిలిప్సుదొరకు నమస్కారం చేశాడు. తాను సంతకాలు పెట్టించిన మహజరు అతనికి ఇచ్చాడు - అతను దానిని చదువుకున్నాడు. విషయమేమిటని పెద్ద దొరని ప్రశ్నించాడు. అతను చెప్పినదంతా విన్నాడు. కొంచెంసేపు ఆలోచించాడు.

"కేసు జాగ్రత్తగా చదవంది నేను ఏ విధమైన మాట ఇవ్వలేను. కాని ఒక్కసంగతి చెప్తున్నాను, ఉద్యోగంనుండి ఒక వ్యక్తిని తొలగించవలసి వచ్చినప్పుడు చాలబాగా ఆలోచించి ఒక నిర్ణయానికి రావడం జరుగుతుంది. ఇంతకుమించి నేను మరేమీ వాగ్దానం చేయలేను."

సుందరం దొరలకు నమస్కారం చేసి పైకివచ్చాడు. నాలుగువందల మందికి దొరగారి మాటలు చెప్పాడు - అందరూ నిశ్శబ్దంగా వెళ్ళిపోయారు.

దేశభవిష్యత్తులో మార్పులు ఉదయిస్తున్నవి.

దొరలకు గడ్డురోజులు వచ్చాయి - వారు దేశం విడిచి పోవలసిన

సమయం ఆసన్నమయింది. కొంతమంది ఆస్ట్రేలియాకు, కొంతమంది ఇంగ్లాండుకు పోవడానికి ఏర్పాటులు చేస్తున్నారు. కొంతమంది సిమ్లాలోనో, బెంగుళూరులోనో స్థిరపడాలని అనుకుంటున్నారు.

చిన్నదొర బట్లరు మహాశయునికి నిజమైన సంకట పరిస్థితులెదురయాయి. సింహాచలం ఉండుండి ఎదురు తిరుగుతున్నది - తల్లి చనిపోయినప్పుడు తనకు చేసిన అన్యాయం ఎప్పటికీ మరచిపోలేక పోతున్నది. దొరకు తాగడానికి బుడ్లు పూర్వంవలె సప్లయి అవడంలేదు - ఉద్యోగాలు నిలిచిపోవడంతో అన్ని సప్లయిలు ఆగిపోయాయి. సింహాచలం తమ్ముడు తప్పించుకు తిరుగుతున్నాడు. తల్లి వడ్డీకి తిప్పిన వేలకొలది రూపాయల గురించి రాత్రి పగలు ఆలోచిస్తాడు. కనిపించినవాడిని తన తల్లి అప్పిచ్చిందా అని అడుగుతాడు. అప్పు పుచ్చుకున్న పెద్దమనుషులెవరూ ముందుకురారు. ఆ విధంగా రెక్కలు ముక్కలు చేసుకొని పైడమ్మ కూడబెట్టిన డబ్బు మట్టిపాలయింది.

చివరకు బట్లరుదొర ఇంగ్లాండు వెళ్ళిపోడానికి నిశ్చయించాడు. స్టీమరు టిక్కట్టు కొనుక్కున్నాడు. హిందూదేశం స్వాతంత్ర్యం పొంది హర్షిస్తుంటే చూడలేనన్నాడు. బానిసలందరూ స్వేచ్ఛగా బ్రతకడానికి అర్హులుకారన్నాడు ఇంట్లోని సామానంతా అమ్మేశాడు.

సుందరం చాలాకాలమయి మూర్తి సహవాసంతో ఖద్దరు కట్టడం, నూలు వడకడం చేస్తున్నాడు. నూలు వడుకుతున్నంత సేపు మనసు నిలిపి ఉంచడం అభ్యసించాడు. శరీరం ఎంత కట్టుబాటులో ఉందో అంతకు పదిరెట్లు మనసు కట్టుబాటులో ఉండాలనుకుంటాడు. భగవద్గీత చదువుతాడు. శ్లోకాలకు తాత్పర్యం చదివి తన జన్మను సార్థకం చేసిన నరసింహారావుకి వేయి నమస్కారాలు చేస్తాడు. ఒక్కొక్కరాత్రి నిద్రపట్టనప్పుడు ఏదో జ్ఞాపకమొస్తుంది. కదలకుండా తనను కౌగిలిలో బిగించి, మెత్తటి పెదవులతో తన పెదవులను బలంగా అదిమి పరవశమైన సింహాచలం జ్ఞాపకమొస్తుంది. తర్వాత తన నిస్సహాయస్థితి బాధపెడుతుంది. ఆ దొరను రెండు గుద్దులతో హతమార్చి వాడి బారినుండి సింహాచలాన్ని రక్షిస్తేనో ! అవేవీ జరగని పనులు అటువంటి తెలివితక్కువ పనులుచేస్తే సింహాచలంకాదు లభించేది, శ్రీకృష్ణ జన్మస్థానం.

మూర్తి రోజులు లెక్కపెడుతున్నాడు. ఏదో ఒకరోజు వంచిన తన కంఠంమీద అధికారుల ఖడ్గం పడుతుంది. దానితో తనకు ఈ యింజన్ల షెడ్డుకు ఋణం తీరిపోతుంది. దాని గురించి అతను బాధపడలేదు. తనతో ఆరు సంవత్సరాలయి ఎండలోను వానలోను పనిచేసి ఇంజన్లను సకాలంలో పంపడానికి కారణభూతులైన సోదర కార్మికులను విడిచిపెట్టడమే గొప్ప బాధగా అతను భావించాడు.

గురునాథం పంతులు మేనమామ ఒకరోజు వచ్చారు. పది రోజులలో స్వాతంత్ర్యం దేశాన్ని వరించబోతున్నది. ఇప్పటికే నా అతను తన కూతురుని పెళ్లాడతాడా లేడా అని కనుక్కోడానికి వచ్చారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏరోజు ముహూర్తం పెడితే ఆ రోజు తాను విజయనగరంలో వాలుతానని లాయరుగారికి హామీ ఇచ్చాడు అతను.

నరసింహరావు చేతిలో సుందరం ఒక పార్సెలుంచాడు. అతను దానిని విప్పిచూస్తే ఖద్దరు చీర, ఖద్దరు పంచెలచాపు ఉన్నాయి. రెండింటికి నీలం పట్టు అంచులున్నవి, చీర అంచు చాల వెడల్పుగా ఉంది. బట్ట అంత ముదకగాలేదు. వాటినిచూసి అతను ఆశ్చర్యపోయాడు.

"ఇవెక్కడివి ?" అతను ప్రశ్నించాడు.

"నేను వడికిన నూలుతో తయారయినవి. అన్నాడు సుందరం.

"నువ్వెప్పుడు నూలు వడుకుతున్నట్లు నాతో చెప్పలేదే !"

"అవును, చెప్పలేదు-నేను తీసిననూలు నేతకు పనికివస్తుందో రాదో నాకు తెలియదు-సంవత్సరం బట్టి నేను తీసిన నూలు ఈ మధ్య పొందూరులో ఇచ్చివచ్చాను - అక్కడి పట్టు శాలీలు ఆ నూలును తీర్చి దిద్ది పంపిన పార్సెలు ఇది".

"వీటినేం చేయమంటావు ?"

"మీరు, అమ్మగారు కట్టుకోవాలని నా కోరిక".

"నాకు గాంధీగారంటే గౌరవమే - ఖద్దరు మాత్రం కట్టలేను. బరువు మోయలేను. నా భార్య నాకన్న సుకుమారమైనది".

"మన మూర్తిగారు, వారి భార్య ఖద్దరే కడతారు".

"పోనీ వాళ్ళకివ్వకూడదా !"

"వీటిని మీ కోసమే నేయించాను. మరొకరికివ్వడం నాకిష్టం లేదు". నరసింహారావు చిరునవ్వు నవ్వాడు.

"సుందరం ! వీటి అవసరం కూడా దగ్గిర పడింది"అని వాటిని తిరిగి కాగితంలో కట్టి లోనికి తీసుకొని పోయాడు.

భారతావనిలో స్వాతంత్ర్య దుందుభులు మ్రోగాయి.

శిరచ్ఛేదంకోసం తలవంచిన మూర్తి కంఠం పుష్పమాలాలంకృతమయింది. కలకత్తా నుండి ఉన్నతాధికారి పెద్ద దొరకు ఫోన్ చేశాడు. వెంటనే మూర్తి మీద బనాయించిన కేసు యజమానులు రద్దు చేస్తున్నారని, స్వాతంత్ర్యం దేశానికి వస్తున్న శుభ సమయంలో ఈ సంతోష వార్త పనివాళ్ళందరికి ముందు చెప్పమన్నారని సందేశం వచ్చింది. మూర్తిని, ఆ రోజు మహజరు సమర్పించిన యువకుడిని, ఇద్దరు ఖద్దరు ధారులను స్వాతంత్ర్య దినోత్సవాలకు తగు ఏర్పాటులు అలంకరణ చేయడానికి నియోగించవలసిందని ఆదేశం వచ్చింది. పెద్దదొర ఈ విషయం పనివాళ్ళందరికీ చెప్పించి, మూర్తిని తన ఆఫీసులోకి పిలిపించాడు. ఎప్పుడు తన దగ్గర నిలబడే మాట్లాడవలసిన అతనిని సరసనే కుర్చీమీద కూర్చోమన్నాడు. సుందరాన్ని

కూడా పిలిపించాడు. అప్పటికి స్వాతంత్ర్య దినం వారం రోజులే ఉంది. ఈ వారం రోజులలోను దొరల ఇన్స్టిట్యూటులో తోరణాలు కట్టి, కాగితం పువ్వుల దండలు వ్రేలాడ దీసి, దేశనాయకుల చిత్రాలు వరుసగా గోడలకు తగిలించి అలంకరించమన్నారు. ఖర్చుల క్రింద డబ్బు ఇచ్చారు.

మూర్తిమీద కేసును తొలగించిన మరునాడే బట్లరు దొర ఇంగ్లండుకు బయలు దేరాలి. సామానంతా అమ్మి ఆ సాయంకాలం అతను రైలెక్కి బొంబాయిలో స్టీమరు పట్టుకోవాలి. మూడు నాలుగు రోజుల నుండి అతను తాగిన మత్తులోనే ఉన్నాడు. రానురాను సింహాచలం అతనిని దగ్గిరకి రానిచ్చేది కాదు. అతను వెళ్ళిపోవలసిన రాత్రికి ముందు ఆమె ఆ బంగళా నుండి తప్పించుకొని పారిపోయింది. కుసినీవోడిన పంపించి వెతికినా లాభం లేక పోయింది. తమ్ముడింటా లేదు, ఎక్కడా లేదు. బ్లడీబిచ్‌ని దొర కాల్చి చంపాలనుకున్నాడు, తన యడల అంత నిర్లక్ష్యంగా ప్రవర్తించినందుకు. చిన్నదొర వెళ్ళిపోతుంటే ఒక పనివాడు కూడా స్టేషనుకు పోలేదు. అతను బొంబాయి చేరుకొని స్వాతంత్ర్య దినానికి ముందే స్టీమరెక్కి భారతదేశం విడిచి పెట్టాలని అనుకున్నాడు. కాని ఆ పని సక్రమంగా కాలేదు. బొంబాయికి వెళ్ళే దారిలో ఒక స్టేషనులో ప్లాట్‌ఫారమ్ మీద నుండి జారి పట్టీల మీదపడి పోయాడు. కదులుతున్న రైలు అతని మంచి కాలుమీంచి వెళ్ళిపోయింది. రెండు నెలలు బొంబాయిలో ఒక హాస్పిటల్‌లో ఉండి, రెండు కాళ్ళులేకుండా ఇంగ్లాండు పోవడమెందుకని స్టీమరు మీద నుండి సముద్రంలో పడి చచ్చి పోయాడు. భారతదేశం మట్టిపై ఆ విధంగా చావకుండా అతను ప్రతిజ్ఞ నిలబెట్టుకున్నాడు.

అగష్టు పధ్నాలుగో తారీకు రాత్రి పన్నెండుగంటలకు ఇంజన్లషెడ్డులో స్టీములో ఉన్నవాటి అన్నిటిమీద మనుషులెక్కి ఒక్కసారి పుంగాలు ఊదారు. పనివాళ్ళందరూ ఇనిస్టిట్యూట్‌లో నిండిపోయారు. ఇంతకాలం దానిని యూరోపియన్ ఇనిస్టిట్యూట్ అనేవారు. ఆ క్షణం నుండి అది ఇండియన్ ఇనిస్టిట్యూట్‌గా మారిపోయింది. డాన్సు చేయడానికి అనువుగా బల్లలు తాపిన నేల తళతళ లాడింది. రంగు రంగుల కాగితాల తోరణాలు, కాగితపు పువ్వులు కళ్ళను ఆ కట్టుకునే విధంగా అలంకరించారు. అగరుధూపం అంతటా అలముకుంది. కొబ్బరి కాయకొట్టి దేశమాత చిత్రం దగ్గిర నూనె దీపాలు వెలిగించారు. బాణ సంచాలు కాల్చారు. యూరోపియన్లు, ఆంగ్లో ఇండియన్లు, భారతీయులు అందరూ ఆ రాత్రి కలసి స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకున్నారు.

కన్నుల పండువుగా జరిగిన అలంకరణకు ఇద్దరే బాధ్యులు-మూర్తి, సుందరం - వాళ్ళ ఆధ్వర్యంలోనే అన్ని పనులు జరిగాయి. ఉత్సవ సమయానికి మూర్తి దేశీయ విధానంలో వస్త్రధారణ చేశాడు, ఖద్దరు పంచ, బెంగాలీ లాల్చీ. దానిపైన వాణీ, నుదుటకు తిలకం, తలమీద గాంధీ టోపీ. ఆ వేడుకల సంరంభంలో పెద్దదొర మూర్తిని, సుందరాన్ని అందరి సమక్షంలో అభినందించి వారికిగల దేశ భక్తికి ప్రశంసలు చేశాడు.

వేడుకలన్నీ అయిపోయాయి. దేశం మనదయింది. ఇంతవరకు పరదేశ పాలనకు అనువుగా పనిచేసిన వాళ్ళు ఇకమీద స్వదేశం కోసం పని చేయాలి. సాంకేతిక రంగంలో కార్మికులందరూ భారతీయులే. అధికారులలో ఒకరో ఇద్దరో భారతీయులు తప్ప మిగిలినవారు విదేశీయులే. వాళ్ళు ఒక్కసారి దేశం విడిచి వెళ్ళినప్పుడు వారు లేనిలోటు పూర్తి చేయవలసిన అవసరం ఎంతేనా మనమీద ఉంది. సుందరం ఈ పరిస్థితులని అర్థం చేసుకున్నట్లు ఒక రోజు, ఉత్సవాల గురించి పనిచేస్తున్నప్పుడు, మూర్తితో అన్నాడు.

"మూర్తి బాబూ! తెల్లవాళ్ళు వెళ్ళిపోతున్నారు. వాళ్ళే ఇంతకాలం వ్యవహారం నడిపించారు. మనని బానిసల స్థాయిలోనే ఉంచారు. అన్ని కిటుకులు, రహస్యాలు తమతోనే పట్టుకుపోతున్నారు - మనలో ఎవరమైనా ముందుకొచ్చి పని నేర్చుకుందామన్నా వాళ్ళు హేళనచేసి, మభ్యపెట్టి ఏమీ నేర్ప లేదు. ఇదికూడా ఒక మంచికే వచ్చింది. మనయిల్లు చక్కదిద్దుకోడంలో వాళ్ళ పద్ధతులు అవలంబించనక్కరలేదు. మన యింజన్లను మనమే బాగు చేసుకోగలం - మనమే నడుపుకోగలం - రాబోయే తరాలవారికి మన విద్య నేర్పడానికి. ప్రస్తుతం పనిచేస్తున్నవారి స్థాయిని పెంచడానికి ట్రెయినింగు అవసరం. బహుశా ప్రభుత్వంకూడా ఇటువంటి అవకాశాలు కల్పించవచ్చు. మీరు చదువుకున్నారు. విషయం బాగా తెలిసినవారు. మా వంటి వారికి చెప్పగలరు. ఉత్సాహమున్న వారికి క్రమ పద్ధతిలో శిక్షణ ఇవ్వడానికి ఒక చిన్న సంఘాన్ని మనం ప్రారంభించవచ్చు. దానిని కూడా ఈ స్వాతంత్ర్యం లభిస్తున్న శుభవేళ మనం ప్రారంభించుతే బాగుంటుంది".

సుందరం చెప్పిన మాటలు మూర్తికి చాల నచ్చాయి. ఇప్పుడు నిజమయిన పరీక్షా సమయం వచ్చింది. భారతీయులు తమ దేశాన్ని పాలించుకోలేరని బ్రిటిష్‌వారి అభిప్రాయం. దానిని పోగొట్టడానికి ప్రతి భారతీయుడికి బాధ్యత ఉంది. తాను ఈ దేశంలో ఒక భాగం. ఈ దేశం బాగుపడితే తను బాగుపడతాడు. నిర్మాణాత్మకమైన మార్గంలో ముందుకు నడవడమే ధ్యేయం.

పెద్ద దొర ఇంజన్ల పనివాళ్ళ శిక్షణా కేంద్రానికి ప్రారంభోత్సవం చేసాడు. అగష్టు పదిహేనో తారీకున షెడ్డులో ఒక గది వాళ్ళకిచ్చి, తన దగ్గిరనున్న సాంకేతిక గ్రంధాలను బహూకరించాడు. ఆ కేంద్రానికి పెద్ద దొర అధ్యక్షుడు. మూర్తి కార్యదర్శి. సుందరం మరో నలుగురు కార్యవర్గ సభ్యులు - బ్లాక్ బోర్డు, టేబిలు, కుర్చీ, బెంచీలు అన్నీ తెచ్చారు. ప్రారంభోత్సవం చాల ఘనంగా జరిగింది.

వారం రోజులు నిర్విరామంగా పనిచేసిన మూర్తి అలిసిపోయాడు. ఉత్సాహంతో ఎంతపని అయినా వెనుకాడకుండా పూర్తి చేశాడు. వేడుకలన్నీ అయిపోయిన తరువాత అతను చాల బడలిపోయాడు. రెండు, మూడు రోజులు లేవలేకపోయాడు. ఎంత శ్రమపడినా అతని హృదయం మాత్రం ఆనందంతో నిండిపోయింది. ఉద్యోగం స్థిరపడిందని కాదు, దేశం విశృంఖలమయిందని.

తిండి తిప్పలుకూడా మరచిపోయి సుందరం వారంరోజులు పనిచేశాడు. ఒక్కొక్కప్పుడు ఇంటికి వాడు రాలేకపోతే నరసింహారావే భోజనం పట్టుకొచ్చాడు. మూర్తికి వచ్చిన భోజనం ఒకప్పుడు ఇద్దరూ పంచుకొనేవారు. అయిదారుగురు చేయవలసిన పని వాడొక్కడే సునాయాసంగా చేసేవాడు. విసుగులేకుండా, అలిసిపోకుండా, నాలుగయిదు గంటలు నిద్రపోయి మిగిలిన కాలమంతా పనితోనే వాడు గడిపేవాడు. వాడే లేకపోతే అనుకున్న ప్రకారం అలంకరణ జరిగి ఉండేదికాదని మూర్తి అందరితోను చెప్పాడు. వాడిని ఎంతో మంది ఎన్నో విధాలుగా మెచ్చుకున్నారు.

కాని,

హోప్‌లెస్‌గాడు ఇంటికి తిరిగివచ్చి చాల నిరుత్సాహంతో నులకమంచం మీద కూలబడ్డాడు. వాడు సింహాచలం కోసం చాలచోట్లు గాలించాడు. ఆమె ఎక్కడుందో ఎవరికీ తెలియదన్నారు. అన్ని పనులు సక్రమంగా నెరవేరి వాడి మనసును ఇతరములైన ఆలోచనలు విడిచి పెట్టాయి. ఆ ఖాళీ అయిన హృదయంలో ఒక్క సింహాచలం మాత్రం సింహాసనం వేసుకొని కూర్చుంది. ఆమె పైని ఆలోచనలు మాత్రం విడువకుండా వెంటబడుతున్నవి. జీవితంలో ఇంత వరకు వాడు ఒంటరిగానే బతికాడు. ఇప్పుడు వాడికి సింహాచలంపై ఆలోచన దేనికి?

వాడు కూడా సింహాచలాన్ని మరచిపోవాలని చాల ప్రయత్నాలు చేశాడు. పనిపట్టి దారం తీయడానికి కూచుంటే దారం మాటి మాటికి తెగి పోయేది. భగవద్గీత చదవాలని కూచుంటే పుస్తకంలోని పేజీలమీద అక్షరాలేవీ కనిపించేవి కావు. అక్కడ సింహాచలం ముఖం నవ్వుతూ దర్శన మిచ్చేది. సింహాచలం బొగ్గులు బుట్టమీద కూచొని మాట్లాడుతుంటే ఎంత బాగుండేది?

ఏమి నాగరికత!

ప్రజలు సేసికొన్న పాపమెల్లనుబండె
వాన లేక పైరు పచ్చలెండె!
అన్న వస్త్రములకు నల్లాడఁ జొచ్చిర
పట్టనములయందుఁ బల్లెలందు.

మాన్యములు మంటి దిబ్బలు
ధాన్యము శూన్యంబు, నిత్య దారిద్ర్యమొ, సా
మాన్య స్థితి యయ్యె జగ
న్మాన్యుఁడ! నీ చిత్త మవల మాభాగ్యమగున్,

గుడిలోని లింగమున కం
గడె లోపలి బెల్లమనుట! కడు నిక్కముగా,
బొడవగుడు వెలలు, వేడ్కలు
నిడుపటి మధ్యాహ్నవేళ నీడలె యయ్యెన్!

ఏమి నాగరకత! ఏమి సౌంభ్యంబు
అడుగవలెనె! సొంపు నుడువవలెనె!
వనధి ఘోషమట్లు వినఁబడు చుండంగ
యంత్రబలము బుద్ధి తంత్రఫలము?

ప్రక్క బడుగులకును ప్రక్క పోటులెకాని
శిరముఱెత్తి తిరుగఁ దెరువు లేదు;
చిన్న చేప పెద్ద చేత పొట్టనె కాని
కదలి నీట నీఁద వెడలరాదు!

....

[థాట్స్ ఆన్ మాడరన్ సివిలిసేషన్ అన్న కవి వ్రాతప్రతిలో దొరికిన రచన. వారు దీనిని 5-7-1921 న రాశారు.]

కైలాసవాసి-జనమంచి వేంకటరామయ్య

తనని ఈ విధంగా ఇబ్బందిలో పెట్టి ఆమె ఎక్కడికి పారిపోయింది?

వాడు ఆ విధంగా ఆలోచిస్తుంటే పన్నెండు గంటలయింది. తొందరగా బట్టలు వేసుకొని వాడు నరసింహారావుగారింటికి భోజనానికి బయలుదేరాడు. ఆ సరికే నరసింహారావు వచ్చాడు. ఇద్దరూ కొంతసేపు వేడుకల గురించి మాట్లాడుకున్న తరువాత సుందరానికి ఆకువేసి వడ్డించడం మొదలు పెట్టారు.

సుందరానికి పెరటి వేపున్న వరండాలో భోజనం పెడుతారు. ఇవాళ కూడా అక్కడే పెట్టారు. వరండాకి ఆనుకొని ఒక చిన్నగది ఉంది. అరేదులో సామానులేవో పడేశారు. కాని ఇవాళ అందులో ఎవరో ఉన్నట్లు వాడికి అనుమానం కలిగింది. పదిరోజుల తర్వాత మళ్ళా ఈ రోజే భోజనానికి వచ్చాడేమో వాడికేమో కొత్త అనిపించింది. నరసింహారావు భార్య వడ్డించింది. కూర, పచ్చడి, పప్పు- ఊరగాయ- అన్నీ వాడికి నచ్చినవే- పదిరోజుల తరువాత ఇవాళ భోజనం వాడికి అమృతంగా తోచింది. అమృతమన్నది స్వర్గంలోనే ఉంటుంది. స్వర్గంలో అప్సరలుంటారు. వారి ధమ్మిల్లాలలో పారిజాతసుమాల మాలికలు సుగంధాన్ని పంచిపెడతవి. వారి కంకణాల నిక్వాణంలో వీణానాద మాధుర్యముంటుంది. అటువంటి పరిస్థితులు ఎలా వచ్చాయని వాడు అనుకున్నాడు- వరండా చివరనున్న గదిలోంచి సంపెంగ పూల వాసన ప్రయాణం చేసి ఏవో జ్ఞాపకాలను కదిపింది. ఆనాటి రాత్రి సింహాచలం తన తలను లాక్కొని గాఢంగా చుంబించినప్పుడు ఆమె జడలోని సంపెంగ పూవునుండి ఇటువంటి వాసనే వచ్చింది. ఆమె చేతికున్న కడియాలకు గాజులు తగిలి అదొకశబ్దం, వీణ మీద మీటినట్లే, తన హృదయాన్ని తాకింది. ఇక్కడా మృదువైన ధ్వని ఎక్కడినుంచి వచ్చింది?

తలెత్తి అటువేపు చూడాలని అనుకున్నాడు. కాని ఎదురు గుండా అమ్మగారు నిలబడి అడిగి వడ్డిస్తున్నారు- శరీరకం అక్కడే ఉంది, మనస్సు అమె ఎవరని ఉత్సుకతతో పరవళ్ళు తొక్కింది.

మధ్యాహ్నం సుందరం ఇంటికి గురునాథం పంతులు వచ్చాడు. ప్రసుంటున్న అవుట్ హౌస్‌కి గౌరవనీయుడైన వ్యక్తి రావడంతో వాడు గాభరా పడ్డాడు. అతని కూర్చోబెట్టడానికి నులకమంచం తప్ప మరేది లేకపోయింది. అతను మాత్రం మొహమాటం పడకుండా దానిమీదే కూర్చున్నాడు.

"ఒరే హోప్లెస్! నాకు వచ్చే వారం పెళ్ళిరా! నిన్ను పిలవాలని నేను స్వయంగా వచ్చాను- మనమందరం మగ పెళ్ళివారంరా! మనం ఎల్లుండి శనివారం సాయంకాలం బండిలో విజయనగరం తర్లి వెళ్తున్నాము. నువ్వు పెళ్ళికొచ్చిన మనవాళ్ళందరినీ మర్యాద చేయాలి. తెలిసిందా!"

"బాబుగారూ! ఎన్నాళ్ళకి మంచివార్త విన్నాను. తప్పకుండా నేను వస్తాను".

"ఇంకా మంచివార్త మరొకటుందిరా! అది వినడానికింకా వ్యవధి ఉందిరా!"

గురునాథం పంతులుపెళ్ళి చాల ఘనంగా జరిగింది. వేణుగోపాలస్వామి మఠంలో పెళ్ళయింది. గురునాథం పంతులుగారి పెళ్ళికి వందమంది పనివాళ్ళు హాజరయారు. వాళ్ళందరికీ భోజనం ఫలహారాలు లోటు లేకుండా పెట్టించి సుందరం చాల సహాయం చేశాడు. పొద్దున్న తొమ్మిది గంటలకు ముహూర్తం. సాయంకాలానికి పెళ్ళి ముగిసింది. వచ్చిన పనివాళ్ళు వెళ్ళిపోతామన్నారు. కాని పంతులు వాళ్ళను ఆపు చేశాడు. సాయంకాలం గాన సభ ఉందని, రాత్రి డిన్నరుందని వారిని ఆపు చేశాడు.

ఆ సాయంకాలం గాన సభ ఎనిమిదికి ముగిసింది. అపుడు నరసింహారావు హోప్లెస్‌గాడికి ఖద్దరు చాపు ఒకటిచ్చి, స్నానంచేసి దానిని కట్టుకోమన్నాడు. వీరాసామి వాడికి పంచకట్టించి, మరొకటి పింజెలుపెట్టి భుజం మీద వేసి, నుదుట కుంకుమ తిలకం దిద్దాడు.

దేవుడు ఎదుటనున్న మండపం ఖాళీచేయించి హోప్‌లెస్‌గాడిని అక్కడ నిలబెట్టారు. ఇంతలో నరసింహారావు భార్య ఖద్దరు చీర కట్టుకొని ఖద్దరు రవిక తొడుక్కున్న ఒక పడుచును పెళ్ళికూతురు ముస్తాబులో తీసుకొచ్చింది. ఆమెను తెచ్చి సుందరం పక్కను నిలబెట్టారు.

"నా పెళ్ళికి మీరందరూ అభిమానంతో వచ్చారు. మీ అందరికీ ధన్యవాదాలు. మీ అందరికి అభిమానియైన ఈ సుందరం, ఉరఫ్ హోప్లెస్‌గాడి పెళ్ళి మీరిప్పుడు జరిపించవలసింది. వధూవరులు దండలు మార్చుకొని ఒకరి నొకరు జీవితాంతం విడువమని దేవుడి ఎదుట ప్రమాణం చేస్తారు. మీరు ఈ వివాహాన్ని కళ్ళ వేడుకగా చూసి ఆశీర్వదించండి." అన్నాడు గురునాథం పంతులు.

దేవుడి ఎదుట సింహాచలం సుందరం మెడలో పూలదండ వేసి, వాడు వేసే దండకు తలవంచింది. చప్పట్లు తరువాత అక్షతలు- పూల రేకులు- వాటిలో మునిగిపోయారు సింహాచలం, సుందరాలు.

(అయిపోయింది)

శ్రీ యం. ఉపేందర్ శ్రీ యం. రవీందర్ రెడ్డి

పట్టణ కుటుంబాల ఆదాయ - వినియోగ వ్యయ సంబంధాలు

ప్రతిదేశము ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో వినియోగవ్యయం - పొదుపుల విశ్లేషణ కీలక పాత్ర వహించును. వినియోగ వ్యయస్థాయి, పొదుపుస్థాయిలు పట్టణ - గ్రామీణ ప్రాంతాలను బట్టి మారుతూ ఉంటుంది. ప్రతి కుటుంబ వినియోగ స్థాయిలు వారికి లభ్యమయ్యే ఆదాయ వనరులపై ఆధారపడును. సమకూరిన ఆదాయాలు ఏ విధంగా వ్యయమవుతున్నది. వ్యయ విభాగం తెలుపును. వినియోగ వ్యయాన్ని ఆహారవ్యయము — ఇతర వినియోగాల క్రింద విభజించ వచ్చును. ఆదాయానికి, వినియోగానికి ఉన్న తేడాను పొదుపు "సేవింగ్" అంటారు. వివిధ కుటుంబాలకు సంబంధించిన ఆదాయ-వ్యయాలను పరిశీలించినట్లు అయితే కుటుంబాలకు మిగులు "సర్ప్లస్", ఉందో లోటు "డెఫిసిట్" ఉందో తెలుసుకొనవచ్చును. ప్రస్తుత వ్యాసములో పట్టణ ప్రాంతములోని కుటుంబాలు తమకు లభ్యమయ్యే ఆదాయాలకు వినియోగ వ్యయమునకు పొదుపులకు మధ్యగల సంబంధమును అనుభావికముగా ఎంపిరికల్ "అధ్యయనము" చేయుటకు ప్రయత్నించడము జరిగినది.

అధ్యయన పద్ధతి:

ప్రస్తుత అధ్యయన పరిధి కేవలము పట్టణ ప్రాంతానికి చెందిన వివిధ కుటుంబాలకు సంబంధించిన ఆదాయాలను వినియోగ వ్యయమునకు పొదుపులకు మధ్యగల సంబంధమును చర్చించుటకు మాత్రమే పరిమితం చేయడము జరిగినది.

వివిధ ఆదాయస్థాయిల వద్ద వినియోగ వ్యయాలకు పొదుపులకు మధ్యగల సంబంధమును అధ్యయనము చేయుటకు గాను ఆరు ఆదాయవర్గాల ఇన్‌కమ్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి ప్రతి ఆదాయవర్గము నుండి 20 కుటుంబాల చొప్పున మొత్తం 120 పట్టణ కుటుంబాలను యాదృచ్ఛిక ప్రతిచయన ప్రాతిపదికపై (రాండమ్ శాంప్లింగ్ మెథడ్)మీద వరణం చేయబడిన కుటుంబ యజమానుల నుండి సంబంధిత భోగట్టాను (రిలేటెడ్ ఇన్ ఫర్మేషన్) సేకరించడము జరిగినది. ఈ కుటుంబ బడ్జెట్ విచారణ ఫామిలీ బడ్జెట్ ఎంక్వయిరీ 1984 — 85 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించినది. విచారణ నిమిత్తం వరంగల్ జిల్లాలోని హన్మకొండ పట్టణ ప్రాంతమును ఎంపిక చేసుకోవడము జరిగినది.

అధ్యయక్షేత్ర ఫలితాలు:-

ఒక నిర్దిష్ట ఆదాయ స్థాయి వద్ద వినియోగముపై ఖర్చు చేయబడిన మొత్తాన్ని వినియోగము అంటారు. వివిధ ఆదాయ స్థాయిల వద్ద వినియోగ వ్యయమును చూపెట్టె పట్టికనే వినియోగ ప్రవృత్తి "ప్రొపెన్ సిటివ్ టూ కన్స్యూమ్" లేదా వినియోగ ఫలభవము అంటారు. మధ్యచ్ఛేద దత్తాంశము "క్రాస్ సెక్షన్ డాటా"ఆధారితముగా వివిధ వర్గల వార్షిక ఆదాయము, కుటుంబ సభ్యుల సంఖ్య, కుటుంబపు సగటు నెలసరి ఆదాయము, సగటు కుటుంబ పరిమాణమునకు సంబంధించిన వివరాలను ఈ క్రింద పట్టిక — తెలియ చేయును.

పట్టిక — 1

రూ. లలో ఆదాయ వర్గం	ప్రతిచయన కుటుంబాల సంఖ్య	కుటుంబ సగటు నెలసరి ఆదాయము రూ. లలో	వార్షికాదాయము రూ. లలో	కుటుంబ సభ్యుల సంఖ్య	సగటు కుటుంబల పరిమాణము
500 కంటె తక్కువ	20	399	95, 760	126	6. 3
500 — 999	20	800	1, 92, 000	138	6. 9
1000 — 1449	20	1200	2, 88, 000	108	5. 4
1500 — 1999	20	1670	4, 00, 800	104	5. 2
2000 — 2449	20	2380	5, 71, 200	120	6. 0
2500 అంత కంటె ఎక్కువ.	20	2680	6, 43, 200	107	5. 3
మొత్తము	120	9129	21, 90, 960	703	5. 86

పై పట్టిక — 1 ని పరిశీలిస్తే ప్రతి వర్గానికి అనురూపకముగా వార్షిక ఆదాయము పెరుగుదల గణనీయముగా యున్నది. కాని కుటుంబసభ్యుల సంఖ్య పెరుగుదల ధోరణి ఒక క్రమములో లేదు. మొత్తం ప్రతిచయన కుటుంబాలను పరిశీలిస్తే సగటు కుటుంబ పరిమాణము 5. 86 ప్రతిచయన కుటుంబాల సంఖ్య ఒక విధముగా ఉన్నప్పటికి 20 ఆదాయ పంపిణీలోని వ్యత్యాసాలు తీవ్రముగా ఉన్నవని పై పట్టిక తెలియ జేయుచున్నది. వివిధ వార్షిక ఆదాయస్థాయిల వద్ద వినియోగ వ్యయము పొదుపుల ధోరణి ఏ విధముగా ఉన్నదో ఈ క్రింది పట్టిక తెలియజేయును.

పట్టిక — 2

రూ. లలో ఆదాయ వర్గం	వార్షికాదాయం రూ. లలో	వినియోగ వ్యయం రూ. లలో	సగటు వినియోగ ప్రవృత్తి	పొదుపు రూ. లలో	సగటు పొదుపు ప్రవృత్తి
500 కంటె తక్కువ	95, 760	84, 960	0. 89	10, 800	0. 11
500 — 999	1, 92, 000	1, 56, 000	0. 81	36, 000	0. 18
1000 — 1449	2, 88, 000	2, 28, 960	0. 79	59, 040	0. 20
1500 — 1999	4, 00, 800	3, 14, 640	0. 79	86, 160	0. 21
2000 — 2449	5, 71, 200	4, 41, 120	0. 77	1, 30, 080	0. 23
2500 అంతకంటె ఎక్కువ	6, 43, 200	4, 93, 200	0. 77	15, 0000	0. 23
మొత్తం	21, 90, 960	17, 18, 880	0. 78	4, 72, 080	0.21

ఆదాయస్థాయి పెరిగిన కొద్ది సగటు వినియోగ ప్రవృత్తి తగ్గదల

అణు కిరణం

అర్థరాతిరిలో మేల్కొంటే—
అంతా చిమ్మ చీకటి.
బయటున్న చీకటి
భయ పెడుతూ ఉంది
ఈ భయం; ఈ సమస్యల ఘెరావో
ఎక్కడినుండి పుట్టుకొచ్చాయి?
మనసులో పండి-మెదడులో నిండి.
లోపల, లోలోపలి నుండి!
బయటి చీకటికంటే—
లోపలి చీకటే—
భయంకర గుయ్యారం,
మరోమారు జడుసుకుంటాం.

ప్రకృతి కేనాడూ
భయమొంద పనిలేదు.
మనలో భయానికి బ్రహ్మ-వికృతి.
మనసుకల్పించిన భ్రాంతి.
ఇది గుర్తించినవేళ—
చైతన్య అణుకిరణం పుడుతుంది.
అజ్ఞానతిమిరపు తెరలు
మనసు పొరలువీడి
మటుమాయమౌతాయి

అపుడు మనభయాలకు-విప్పుడు కన్పిస్తుంది.
ఆదే జ్ఞానోదయం! అదే శుభోదయం
సమస్యలు మంచులా సమసిపోతాయి.

శ్రీ కాశిపాకం లింగన్న

ధోరణిని నగటు పొదుపు ప్రవృత్తి పెరుగుచున్న ధోరణిని తెలియజేయుచున్నది. ఆదాయ స్థాయి పెరిగినకొద్ది ప్రతి వర్గము వారు తమ ఆదాయములో పొదుపును అధికము చేసేందుకు ప్రయత్నించడము వలన ఆర్థిక వ్యవస్థలో "పొదుపు"కి గల ప్రాముఖ్యతను అర్థము చేసుకొన వచ్చును. అన్ని వర్గాల మొత్తం వార్షిక ఆదాయమును వినియోగ వ్యయం మొత్తమును పరిశీలించినట్లు మొత్తం ఆదాయములో వినియోగ వ్యయము 78. 45 శాతము కాగా పొదుపు 21. 55 శాతము మాత్రమే. కుటుంబ సభ్యుల సంఖ్యను పరిగణలోనికి తీసుకోవడము వలన సాలీన తలసరి ఆదాయము, తలసరి వినియోగ వ్యయము, తలసరి పొదుపుకి సంబంధించిన వివరాలను ఈ క్రింది పట్టిక - 3 తెలియజేయును.

ప ట్టి క — 3

రూ. లలో ఆదాయ వర్గం	తలసరి ఆదాయం	తలసరి వినియోగ వ్యయం	తలసరి పొదుపు
500 కంటె తక్కువ	760. 00	674. 28	85. 71
500 — 999	1, 391. 30	1, 130. 43	260. 86
1000 — 1449	2, 666. 66	2, 120. 00	546. 66
1500 — 1999	3, 853. 84	3, 025. 38	828. 46
2000 — 2449	4, 760. 00	3, 676. 00	1, 084. 00
2500 కంటె ఎక్కువ	6, 011. 21	4, 609. 34	1, 401. 86

పై పట్టిక ప్రకారం పట్టణ కుటుంబాలలో సాలీన తలసరి ఆదాయములు తలసరి వినియోగము, తలసరి పొదుపులు పెరుగుచున్నట్లు తెలియుచున్నది. వివిధ ఆదాయ వర్గాలకి సంబంధించి మొత్తం ఆదాయమును పరిగణలోనికి తీసికున్నట్లు అయితే సాలీన తలసరి ఆదాయము రూ. 31, 167. 59 కాగా తలసరి వినియోగము రూ. 2, 445. 06, తలసరి పొదుపు రూ. 671. 52 ఆదాయస్థాయి పెరిగేకొద్ది వినియోగ వ్యయము పెరుగుతున్నప్పటికి పొదుపు రేటు తగ్గకుండా క్రమముగా పెరుగుచున్నది.

ప ట్టి క — 4

వినియోగ వ్యయ శాతము			పొదుపు శాతము		
మొత్తం ఆదాయంలో	సంబంధిత కుటుంబాల వార్షిక ఆదాయంలో	మొత్తం వినియోగ వ్యయంలో	మొత్తం ఆదాయంలో	సంబంధిత కుటుంబాల వార్షిక ఆదాయంలో	మొత్తం పొదుపులో
3. 88	88. 72	4. 94	0. 49	11. 27	2. 29
7. 12	81. 25	9. 07	1. 64	18. 75	7. 62
10. 45	79. 5	13. 32	2. 69	20. 5	12. 51
14. 36	78. 50	18. 30	3. 93	21. 49	18. 25
20. 13	77. 23	25. 66	5. 93	22. 77	27. 55
22. 51	76. 68	28. 69	6. 84	23. 32	31. 77

మొత్తం ఆదాయములో సంబంధిత వర్గ వార్షికాదాయములో, మొత్తం వినియోగ వ్యయంలో, వినియోగ వ్యయశాతం ధోరణి అదే విధముగా మొత్తం ఆదాయములో సంబంధిత కుటుంబాల వార్షికాదాయములో, మొత్తం పొదుపులో పొదుపు శాతము ధోరణి పెరుగుదలను పై పట్టిక — 4 తెలియ చేయుచున్నది.

ముగింపు :— పై విశ్లేషణ ఫలితాలను బట్టి స్థాయి పెరిగే కొద్ది వినియోగ వ్యయము పెరుగుతున్నప్పటికి పొదుపు రేటు కూడా పట్టణ ప్రజల విషయములో పెరుగుచున్నదని తెలియుచున్నది. ప్రతి ఆదాయ వర్గంలోని కుటుంబాలు "పొదుపు"కి కీలకపాత్ర నిచ్చి సాధ్యమైనంతవరకు దానిని అధికము చేసేందుకు ప్రయత్నిస్తున్నారనేది సుస్పష్టమవుతున్నది. ప్రస్తుత ఫలితాలను బట్టి మొత్తం ఆదాయములో పొదుపు 21. 55 శాతము. అన్ని ఆదాయాల ప్రజల ఆదాయములో కొంత భాగము భవిష్యత్త అవసరాల నిమిత్తం "పొదుపు"ను చేసినప్పుడే పొదుపు రేటు పెరిగి మూలధన సంచయనము జరిగి పెట్టుబడి స్థాయి అధికమయి వ్యవసాయికముగా, పారిశ్రామికముగా త్వరితగతిని ఆర్థికాభివృద్ధి సాధించడములో సందేహము లేదు. (రచయితలు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం యొక్క ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందినవారు.)

ఆటవెలది

౧

ఆటలన్న చిన్ననాట నుప్పొంగితి
వెలది జవ్వనమున విరిసెమదిని;
ప్రౌఢమైన యట్టి వయసున నేడికి
కలిగె మమత ఆటవెలదిమీద?

౨

అశ్వహృదయ మెరుగు అశ్వికు చేతిలో
పరుగువారు వారువంబు పగిది
మనసులోన లేచి మధురానుభూతులు
పరిసరాలనరచు పరిమళాల

౩

శారదేందు బింబ సంపుల్లకాంతులు
నటనమాడ నామె నవ్వెనేని
ఉప్పరమునకెగసి ఉప్పొంగిపోవును
సంక్షుభిత మదాత్మ సాగరంబు

౪

మెల్లమెల్లవీచు పిల్లగాలులు సోక
ఆమె దరికి చేరినట్లు తోచు;
ఆమె నవ్వుచున్న యట్లనిపించును
చిక్కులాడుకొనెడి పల్కుల విన!

౫

నవవసంత శోభి నాట్యమొనర్చును
చైత్రరథ సుమ విలసనమునిండు
ఆమెమందగతుల నరిగిన దారిలో
మలయు మంద మలయ మారుతముల!

౬

ఆమె నెపమువెట్టి అలుకవహించెనా
గ్రీష్మతప్తమైన రీతి చెక్కు-
లెఱ్ఱవడును, కాని ఎంత యత్నించినా
కొంటెనగవు దాచుకొనగబడదు!

౭

స్నానమాడి కురుల సాంబ్రాణి ధూపాల
నారబెట్టి, నిద్రయందున్న
నన్నులేప వంగినన్ వర్షమేఘాల
యట్లుకమ్ము నన్ను నామె వేణి!

౮

నిర్మలమగు శరది నిశల నాకాశమ్ము
తారకాళితోడ తనరు, నామె
స్నాతయైధరించు జలతారు చుక్కల
జిలుగు తెలుపు నీలిచీర నాగ!

౯

హిమశిఖరి వీడి మహికి నేతెంచిన
గాఢమైన మంచుతెర దివము
కరిగిపోవు చెలి సఖంపద దృఢ పరి
ష్వంగ చుంబనముల సందడులను


౧౦

పర్ణహీన శిశిర పాదపమ్ములు, శుష్క
రహిత కర్మ లాంబరములు, పవన
ఖరితచర్మ శల్య పంజరంబులు కదా
శిధిల విధుర జీర్ణ జీవితములు!

౧౧

కవుల భావములకు కల్పించు వేగమ్ము
ముదిమి మెదలు మదుల ముదము పొదవ
కులుకు నడలయందు క్రొత్తందనాల స
య్యాటలన్ వెలార్చు నాటవెలది!

శ్రీ వజ్ఝల కాళిదాసు



(గత సంచిక తరువాయి)

9. తానొకటి తలఁచిన దైవ మొకటి తలఁచును.

కృష్ణా తీరమున నున్న మహారణ్యమున నొక పెద్ద మఱ్ఱిచెట్టు కలదు. అది విశాలమగు శాఖలతో దట్టముగ వ్యాపించియున్నది. అది జైనులేర్పఱచుకొన్న వధ్యస్థానము. వారు తమచేఁజిక్కిన ప్రతికూలురనర్ధరాత్ర మున నటకుఁదెచ్చి, చంపి, యా శవములను గృష్ణలోవిడిచి పెట్టుట యాచారము.

కాళరాత్రి నలుమూలలంఁజీకటిముద్దలను గ్రక్కు చున్నది. ప్రపంచ మంతయు నల్లని ముసుఁగు పెట్టుకొన్నట్లున్నది. ఆ గాఢ నిశీధి కన్నులున్న వారిని, లేనివారిని నొక్కటిగఁజేయుచున్నది. ఆ వనమున నక్షత్రల కాంతిని గూడ రానీయకుండ చెట్లడ్డుచున్నవి. మిణుగురు పురుగుల మిలమిలలు దప్ప వేఱొక కాంతిలేదు. కీచుఱాళ్ల ఝీంకారము తప్ప మఱొక ధ్వనిలేదు, చర ప్రకృతి యెల్ల నిబిడనిద్రాపరవశమై, నిశ్చలమై యుండెను.

ఆ వనమార్గమున నొక చిన్న జన సమూహము పోవుచున్నది. ఆ చీఁకటిలో నిదానించి చూచినచో వారొక పదిమంది గుంపు మాత్రమే యని తేలును, ఆ పదిమందిలో నిరువురు బంధితులైన యొక పురుఁషుఁడు గల మంచమును వహించి యుండిరి. కాగడాలుగల వారిరువురు తక్కిన యార్వురును విచ్చు కత్తులను ద్రిప్పుచుఁబోవు చుండిరి. త్రాగి మత్తెక్కిన వారెల్లరు వెఱ్ఱి వెఱ్ఱి కేకలను వేసికొనుచు నుత్సాహముగఁబ్రసంగించు కొనుచుఁబోవు చుండిరి. మధ్యమధ్య కొందఱు మంచముపైనున్న వ్యక్తిని వెక్కిరించు చుండిరి. ఈ పది మందియందును మంచము మోయుచున్నవారు మాత్రమే జైనులు. తక్కినవారు జైనులుకారు వారి పోషణలో నుండి యిట్టి ఘాతుక కృత్యములొనర్చుచున్న హిందూమత భ్రష్టులు. కాగడాలు పెద్దవిగ నున్నచోఁ బురుగులు మీఁదబడి చచ్చునని వారు వానిని చిన్నవిగనేయుంచిరి. ఆ దీప ములను మిన్కు మినుకు మనుచుండెను.

వారట్లు పోవుచుండగా నొకమూలనుండి "రంయ్" మని యొక బాణముల జంట వచ్చి కాగడాల వారిరువురకు నొక్కమారు గ్రుచ్చుకొనెను. వారిరువు రును హాహాకార మొనర్చుచు నేం గ్రాలిరి. ఆ చిన్న దీపములుగూడ నారి పోయెను. అంతట వారిలో కలవరపాటు హెచ్చెను. మానవ సంచారము లేని నిబిడనిశీథిలోఁగాగడాల వారికి వచ్చిన ముప్పు సదత్కారణము నూహించుటయే వారికి దుస్సాధముగ నున్నది. అంతలో బెడిదంపుటంపర జడివాన వారిపైఁబడజొచ్చెను. వారా మంచమును విడిచిపెట్టి, బెదిరి, పరు విడజొచ్చిరి. కాని కరకుటమ్ములు వారిని వెన్నంటుచునే యుండెను. ధనుర్జ్యావల్లీటంకృతులు వారి శ్రవణ కుహరములఁబడుచునే యుండెను. పై నున్న రాజకుమారునిఁబంపదలచు కొన్న పరలోకమునకు వారందరును నత్య ల్పకాలముననఁజేరుకొనిరి. తానొకటి దలఁచిన దైవమొకటి దలఁచునుగదా. అత్యల్పకాలములోఁగాకతీయరాచపట్టి బంధములు వీరభద్రునిచే నడలింపఁ బడినవి.

తెలతెలవారు చున్నది. పక్షులు తమ మనోజ్ఞ కంఠములెత్తి యా వీరుల విజయ గీతికలు పాడు చుండెను. మందవాత పోత సంఘట్టనల కించుక చలించు కొమ్మలనుండి వారిపై జలజలరాలు పూలు, దేవతలు పుష్పవృష్టిఁగురి యించుచున్నట్లుండెను. ఆ వీరత్రయము కృష్ణయొద్దునకుఁజని ప్రాతఃకాల కృత్యముల నిర్వర్తించు కొనుచుండిరి. అరుణుఁడు శత్రు సంహారమొనరించి, రక్తసిక్తాంగుఁడైన వీరునివలె తోఁచుచుండెను.

సంకేత స్థలములో గుప్తముగనుంచిన యశ్వములను వీరభద్రుఁడుగొని వచ్చెను. పిమ్మట నా కాకతీయ రాజేంద్రునిపట్టి " ఓ వీరమూర్తులారా ! నాపాలిట దైవమూర్తులై ప్రాణదాన మొనరించినారు. మీమేలు మరువఁజాలను. దక్షవధ నొనరించిన వీరభద్రునివలె శత్రునాశన మొసరించిన యీ వీర మూర్తి యెవడు? అపర శంకరునివలె నలరారు మీరెవరు? మీ చరిత్రల నించుక వినఁగోరుచున్నాను. మీ దివ్యనామ సంస్మరణ మొనరించుకొనుచు నా ఋణమును గొంతవఱకుఁదీర్చు కొనెదను. " అని పలుకనాయమాత్యుఁడు" రాజనందనా ! మా చరిత్రములకేమి? మెల్లగా దెలిసి కొనఁగలవు. కాలా తిక్రమణగాకుండ మనము విశ్వేశ్వరదేశికుని యాశ్రమమునకుఁబోవలెను '' అనెను.

వీరభద్రుడు " రాజకుమారా! మనమిరువురము నొకయశ్వము నెక్కు దము గురువర్యులు వారి యశ్వము నధిరోహించెదరు" అన నో నూతన వ్యక్తి యొకించుక సంశయించి " వలదు! వలదు! నా దారిని నేను బోయెదన "ని తప్పించుకొన నెంచెను. " శంకించెదవేల! యొంటరిగ నెందు పోయెదవు రమ్ము " ని వారు బలవంత పఱచిరి. మూఁడు దినముల నుండియుఁదిండి లేక నీరసముగనుండుటచేతను, వారిపట్టుదల యెక్కువగుటచేతను, గుఱ్ఱముపై నాతని వెనుకఁగూర్చుండక తప్పినదికాదు.

ఆయశ్వములు శరవేగమునఁబోవు చుండెను. దారిలో నొకచోనిమ్నోన్నత స్థలములో వీరభద్రునివారువ మొకసారి చౌకళించినది. ఆ కుదుపులో వెనుక నున్నవ్యక్తి యొక్కించుక వీరభద్రునిపై కొరిఁగెను. అయంగ స్పర్శయేలకో

గాని యా చాళుక్య రాజకుమారునకు నూత్న చైతన్యము గల్గించినది. స్త్రీ శరీరమువలె నది మృదువుగఁగూడ నుండెను. అతఁడొకసారి వెనుకకుఁ జూచెను. అంత వెనుకనున్న మూర్తి సిగ్గునఁతల వంచుకొని యుండెను. ఆ లజ్జావినమితముఖము. ఆ సౌందార్యాకృతి, పుగుషునకెట్లు చేకూరెనోయని యాతఁడాశ్చర్య పడెను. ఆ సౌందర్యమాకర్షముగ నుండి నిర్వచనోత్తర రామాయణమునఁగృతి భర్తను వర్ణించుఁదన గురువరులు చెప్పిన "చూచిమగ రైనఁజొక్కెడునట్టి సౌందర్య సంపద పెంపుదాల్చె" అనుపల్కులు స్మృతికి వచ్చెను. ఆ సౌందర్యరాశితో హెచ్చుముచ్చటించుట కారాజకిశోరముబలాట పడుచుండెను. అన్యోన్య కథా ప్రసంగములతో వారు దేశికుని మఠమును జేరుకొనిరి.

10. పన్నుగడ

మనమొకసారి యమరావతీ క్షేత్రమును దర్శించి వత్తము. అది కృష్ణకు దక్షిణపుటొడ్డున శ్రీశైలమున కీశాన్యమూలగానున్న పవిత్ర క్షేత్రము. ఇందమరేశ్వరుఁడను నామముతో శ్రీ శంకరుఁడువెలసి యుండుటచే దీనికాపేరు వచ్చినది. అంతేకాక కొంతకాలమిది యమరుల కావాసముగఁనుండెనని స్థల పురాణము చెప్పుచున్నది. ఇచ్చట బౌద్ధారామములనుండియు, జనులు వచ్చు చుండఁగా స్వదేశీయులమగు మనము మాత్రము పోవలదా!

కాని మనకాబౌద్ధారామములవంకఁబోవలసిన యవసరములేదు పోయినచో నందలి చిత్రకళా నైపుణ్యము మనలను జిత్తరువులవలెఁజేసి కదలనీయదు. అమరేశ్వరస్వామి దర్శనమునకుఁగూడ మనము వెళ్లవలసిన యవసరములేదు. ఆ దేవదేవుని దివ్యపాదార విందధ్యానములో మునిఁగిదేవతలే కొంతకాలము కదలలేక పోయిరఁట! మనము మాత్రము కదలఁగలమా! కావున నా వెనకుఁబోయినచో మన కథా గమనమున కాలస్యమగును.

మనమిప్పుడు తిన్నగా రాజ దుర్గములోనికిఁబోదము. ఆంధ్రశాతవాహనుల కాలమునుండియును పన్నెకెక్కిన దుర్గమది. అదియే ధరణికోట. ధాన్య కటకము, ధనదపురము మొదలగు నామములతో వ్యవహరింపఁబడు చున్నది. మన కథాకాలమున కాపురమును రాజధానిగ నొనర్చుకొని వెల నాఁటి సీమను గులోత్తుంగ రాజేంద్రచోడుఁడు పరిపాలించు చుండెను. ఆ రాజేంద్రుడా దుర్గ రక్షణమునకుఁదగిన సైనిక దళమును నియమించుటచేత నది యందఱకును బ్రవేశించుట కవకాశములేదు. ఐనను మనమా సైనికులను జూచి బెదరి వెనుకకు జంక వలసిన యవసరమేమియును లేదు. మన కావ్యము దివ్యాంజనము వంటిది. మనమితరులకంటఁబడకుండఁబోఁగలము. ఎన్నెన్ని రహస్యములైనను వినఁగలము!

అదిగో! అదే రాజేంద్రుని కొలువు. మనకన్న ముందే యెవరోయాతని దర్శనమునకు వచ్చియున్నారు. ఎవరో యననేల! ఆ మెలికలు దిరిగిన కోరమీసములు. ఆ కౌటిల్యముట్టిపడు ముఖము మనమిది వఱకుఁజూచినదే! జాగ్రత్తగ నిదానించినచో నాతఁడక్కనయని మనము పోల్చుకొనఁగలము. ఆతఁడేదియో యారాజుతో మంత్రాలోచన మొనర్చు చున్నాడు. పోయి విందము.

అక్కన :- రాజేంద్రా! మనమెన్ని విధములుగ నాలోచించినను సిద్ధిరాజును నాశన మొనరించి తీరవలయును. వారికిని మీకును ద్వేషము తరతరములనుండియు వచ్చు చున్నది. అతని తండ్రి తిక్క రాజేకదా మీ పూర్వుఁడగు పృథ్వీశ్వరునిఁబరిమార్చెను.

ఉ॥ కేశవసన్నిభుండు, పరిగీత యశోనిధి, చోళతిక్క ధా
త్రీశుఁడు కేవలుండె; నృపులెవ్వరికాచరితంబుగల్గునే?
శైశవలీల నాఁడుపటుశౌర్యము రంధర బాహుఁడైనపృథ్వీని
శనరేంద్రు మస్తకమునేడ్తెఱఁగందుక కేళిసల్పఁడే!

అని నిర్వచనోత్తర రామాయణమునఁదిక్కన వ్రాసిన పద్యము నెపుడైన జదివినపుఁడా భూపతి హృదయమెంత యలరునో నామనసంతకసరును. ఆ పద్యము విన్నపుడెల్ల బాకుతో నాగుండెఁబొడిచినట్లగును. ఏమిచేయఁగలను? నేనసమర్థుఁడను. ఈ పద్యమే మా కులోత్తుంగ రాజేంద్రుడు విన్నచో నా మనమ సిద్ధితలయుఁదిక్కన తలయు, మాత్రము కందుకములవలె నెగుర కుందునా?యని లోలోనయనుకొను చుందును. మిత్రమావింటివా? ఆ పద్య మొక్క నీకే కాదు రాజలోకమున కంతటికిని బరాభవహేతువే॥" చోళ తిక్కన ధాత్రీశుఁడు కేవలుండెనృపులెవ్వారికా చరితంబు గల్గునే? " అని కదా యున్నది. ఇది పౌరుషముగల యేరాజునూతి భరింపఁగలడు? ఎవరెట్లు పేక్షించినను మనము మాత్రమట్లు సహించరాదని నా మనవి.

రాజే:- మిత్రమా! నీ వన్నది నిజమేకాని స్వపరబలము లెఱుఁగక యుద్ధములకు సన్నద్ధులము కారాదు గదా! అపర కుమారస్వామి యనఁదగు ధైర్య సాహసములుగల వీరాగ్రణి ఖడ్గతిక్కన దండనాథుఁడు రెండవ బృహస్పతియేయన నొప్పుయుక్తి పరుఁడు తిక్కన కవీంద్రుఁడు మంత్రి ఆ రాజేంద్రుఁడు దేవేంద్రునివలె వేయికన్నులతో రాజకీయ విషయములను బరిశీలించు కొనుచుండునని చారుల వలన వినుచున్నాము. మనమాతని నెదిరించుట సాధ్యమగునా!

అక్కన :- రాజేంద్రా! భయపడిన, నంతయును నసాధ్యమె! ధైర్యము వహించిన, మానవ సాధ్యము కానిదేది గలదు? రాజ లోకమును గడగడలాడింపఁజాలు శక్తి సంపన్నుఁడు తిక్కరాజు. అతఁడు మొన్న మొన్నటి వరకుఁగుమారునకు నండగ నుండెడివాఁడు. మూడు సంవత్సరముల క్రిందటే యా ముసలి ప్రాణము కన్ను మూసినది. నీవు పల్కినట్లు ఖడ్గతిక్కన శూరుఁడేగాని యా శౌర్యము లెక్కింపఁదగ్గది కాదు, మీ వంటి చతురుల కావశు శౌర్యము సాధించుట కష్టముకాదు. ఇఁక నపరచాణుక్యుఁడైన తిక్కనామాత్యునకే మన మొక్కించుక జంకవలెను. అతనికిని రాజునకును నడుమ స్పర్థ కల్పించి భేదోపాయము పన్నినచో, మనకు జయము సిద్ధించుట తథ్యము దానికప్పుడే తగిన యత్నములన్నియు సిద్ధపఱచి రగుల్కొల్పితిని.

రాజే :- ఆ ప్రయత్నములేవియో వినవచ్చునా?

అక్కన :- (రాజేంద్రుని చెవిలో నేదియో చెప్పును).

రాజే :- ఓహో! అప్పుడే కొంత చతురంగపు బెత్తుఁబన్నితివన్నమాటే!

అక్కన :- పన్నక యూరకుండుటెట్లు. సిద్ధిరాజునణఁగద్రొక్కుట వలన శైవ మతమును బోషించినట్లగును. ఆ వైష్ణవ మతాభిమానిని తేలికఁగా విడిచిబెట్టఁదగునా.

రాజే :- ఏమి! సిద్ధిరాజు శైవుఁడు గాఁడా!

అక్కన :- ఐననీ పాట్లెందుకు? బాహ్యమునకు గోచరించు వైష్ణవ చిహ్నముల నాతఁడు పూనుకొన్నను, వైష్ణవమతముపై నతనికపరిమితాదరమున్నది. తిక్కరాజెన్నో వైష్ణవాలయములను బునరుద్ధరించిన విషయము నీ వెఱిఁగినదేగదా! ఇంక నీతని విషయముఁజూడుము ఇతఁడు గృతిపొందిన 'నిర్వచనోత్తర రామాయణము' వీని వైష్ణవ మతాదరణకు బ్రబలతార్కాణము గదా! అదియును గాక కేశవ సన్నిభుఁడని తండ్రినివర్ణింపగానే శైవుఁడూరకుండఁగలఁడు? ఇట్టి శైవమతముని నాశనము చేయుటముక్తి హేతువు గదా! మఱొక విషయము నీ వంటి శివభక్తి పరాయణుఁడున్న స్థలములో శైవులమీఁద యీగయైనను వ్రాలనేరదు. వైష్ణవులు వారినిఁగన్నెత్తి జూడఁజాలరు. ఒకవేళ శైవ నిందార్థకమగు పరుష వచనమేదైన వారి నోట వచ్చినచో నా క్షణముననే వారి నాలుకలు చీలికలగును. మా పురమునట్లుగాదు. శైవులను,

వైష్ణవులును, గలహించు మందబుద్ధులు బొమ్మలవలె నా కయ్యము లాకర్ణించెదరు. అట్లు వినివారు "మీకుఁదగవు లెందులకు? మీ మీ యాలయములఁకుఁబొండ"ని తీర్పు చెప్పెదరు. అదా న్యాయము? శివ దూషణచేసిన వాని శిరమొక యేటున నేలకుఁగూలవలదా?

రాజే :_ మిత్రమా! నీవు చెప్పినదెల్ల నాలోచింపఁదగిన విషయమే! అట్టి శత్రువు-అట్టి పరమతాభిమాని-క్షమార్హుఁడుకాఁడు మా పూర్వులొక



ప్పుడు బౌద్ధులు చెప్పు కొండెములు నమ్మి పండితారాధ్యుని కన్నులు తీయించిరఁట. అందులకాతఁడు కోపగించి వెలనాటి చోళవంశము క్షయమగునట్లు శపించెనఁట. ఆ కళంకముఁబోఁగొట్టుకొనుట కిట్టి శైవ మతద్రోహులను నాశన మొనరింప వలయును. కాని నీవు చేసిన పన్నుగడ కింకను బలము చాలదు. ఏల యందువా? ఆ వ్రతము కారణముగ మంత్రి రాజ దర్శనము మానిన మానవచ్చును. కాని యొకవేళ రాజే యాతనికి వర్తమాన మంపిన—?

అక్కన :- అతనిపైననుమానము రాజునకుఁగలుగునట్లు రుద్దుటకు మా బయ్యనను నియోగించితిని. అటు పిమ్మట నా యనుమానము వర్ధిల్లుటకు నీ సహాయము గూడఁగొంతవలుకుఁగావలెను.

రాజే :- ఏదది?

పిమ్మట వారిరువురికిని మధ్య గొంత సంభాషణ జరిగెను. ఈ విధముగ నా యిరువురును నేవియో మంతనములాడు కొనిరి. కుళోత్తుంగ రాజేంద్ర చోడఁడు శైవమతముపై నత్యాదరము కలవాఁడు అందుచేతనే యక్కన యా విధముగ రాజుయొక్క మత విషయముగూర్చిగూడఁబలికెను. నిజమునకు మనుమసిద్ధి శైవవైష్ణవ భేదములు కలవాఁడుకాఁడు. అతని దృష్టిలో శివ కేశవులు సమానులు తిక్కన దృష్టిలో వారివురు నభిన్నులే అక్కన బయ్యన లకు మత సంబంధమైన చింతయేలేదు. కార్యసాధనకై కపట శైవమతాభి మానము నతఁడిట్లు చూపుచుండెను. నిజమున కన్ని మతములకన్న నతనికిఁ జార్వాక మతమన్న నెక్కువ మక్కువ.

11. స్త్రీయా! పురుషుఁడా!

దుర్జన సంహార మొనరించి తిక్కనార్యాది వీరత్రయము విశ్వేశ్వర శంభుని మఠమునకేఁగిరి. తదాశ్రమ ప్రాంత వృక్షాగ్రముల కెక్కి యాతురతతోఁజూచుచున్న శిష్యబృందమువారి రాకను వెంటనే గురుపాదులకు నివేదించిరి. ఆ నూతనవ్యక్తి యొకించుక ముందుగనె గుఱ్ఱము దిగివచ్చి దేశికుని పాదమునఁ్వ్రాలి నమస్కరించెను. ఆగురుపుంగవుఁడత్యంత వాత్స ల్యమున "అమ్మాయీ! నీకు మేలుచేకూరుఁగాక"యని దీవించుచు లేవనెత్తెను. ఆ పల్కులు చెంతనున్న వీరభద్రుని చెవులఁబడినది. తద్విజయ వృత్తాంత సంగ్రహణాభిలాషతో నుండుటచే మఱెవ్వరును వినలేదు.

దేశికుఁడ"మ్మాయీ"! అని పిలువనేల? ఆతఁడు పిలుచుటలోఁదదఁబడెనా! లేక "అబ్బాయి" అని పిలువఁగా నేను వినుటలోనే పొరపడితినా?—కాక యీ సౌందర్యరాశి నిక్కముగ స్త్రీమూర్తియేనా? గణపతి దేవునకుఁబ్రథమ సంతానమే పుత్రిక యని వింటినే. ఈతఁడు రెండవ కాన్పట. అదియును గాక యీతఁడీ మధ్యనొక రాజకుమారికను వివాహముఁజేసికొన్నట్లు గూడ నిన్నటి ప్రసంగములోఁదెల్పెనే! స్త్రీమూర్తియేయైన వేఱొక స్త్రీని వివాహ మాడుటెట్లు? ఇదెంతయు వింతగానున్న దనుకొనుచు వీరభద్రుఁడు మఱొక్క సారి యా ముఖమును బరిశీలించి చూచెను. సంపూర్ణ సుధానిధి నదఃకరించు నా ముద్దుల ముఖమున నవయౌవన రేఖ నటించు చుండెను. గాని నూనూగు మీసములంకురించు పొడయేమియునుగాన రాలేదు. అవి వచ్చుటకుఁదగని పసితనమా! కాదు సుమారిరువది వత్సరములుండును. ఇవన్ని యుఁజూచిన నతనికేమియు నర్థము కాలేదు.

వాని యనుమానము వృద్ధిచేయు పరిస్థితి మరియొకటిగూడ వచ్చినది. తొలినాఁటిరేయి జైన భటులతోఁబెనఁగులాడుటలో నావ్యక్తికి హెచ్చుగా గాయ ములు తగిలినవి. వానికి వైద్య చికిత్స యత్యవసరమైనది. దేశికులీ విష యము నెఱిఁగి ప్రసూత్యాదులకు నిర్ణీతమైన స్త్రీ వైద్యశాలలో నావ్యక్తి నిను నిచి ప్రత్యేక చికిత్స నొనరించుటకు వైద్యశాస్త్ర ప్రవీణలగు కాంతలనియో గించిరి. పురుషుఁడేయైనచో నా విధముగఁజికిత్స బొందుట కవసరముగాని యవకాశముగాని లేదు. అందుచేత నా వ్యక్తి రుద్రమదేవియేఁగాని రుద్ర దేవుఁడు కాఁడను ననుమానము ప్రవృద్ధమైనది. కాని యీ సంశయముఁదీర్పఁ దగు వారెవ్వరును నాయాశ్రమమునలేరు. విశ్వేశ్వరాదుల నడుగుట మర్యాద గాదు. తోడి విద్యార్థులకీ విషయము తెలియునను నమ్మికలేదు. ఆనాఁటి గుఱ్ఱపుఁజౌకళింపు లోఁగలిఁగిన స్పర్శ యజ్ఞాతా పూర్వ భావములతోడిగగురు పాటు గలిఁగించినది.

కాకతీయ రాట్కిశోరము గాయములు మానిపోయినవి. ఆరోగ్యము చక్కఁబడినది. కవిపుంగవుని భారతమును సారస్వతోపన్యాసములును విను టకు వచ్చు చుండెను. క్రమక్రమముగ నీరసముగూడ నడఁగినది. ఈ విషయములు తెలియఁజేయుచు నారాణ్మణితన తండ్రికొక జాబు వ్రాయుచు నందు తానచటి యుపన్యాసములు వినుటకుఁగుతూహలము కలిగి యుండుటచేఁ గొలఁది కాలమచటనున్న పిదప వచ్చెదనని తెలియఁజేసెను. తనబిడ్డ విశ్వే శ్వర గురువర్యుల దగ్గఱ నున్నచోఁదనకద నున్నట్లే యని గణపతి దేవుఁడం దుల కంగీకరించుచుఁబ్రత్యుత్తర మిచ్చెను.

కాకతీయ చాళుక్య రాజపుత్రులయన్యోన్యమైత్రి దిన దిన వర్ధమాన మగు చుండును. తత్పురుషత్వమును గూర్చిన యనుమానమింకను దీరలేదు ఆ వ్యక్తి నడిగి తెలిసికొని తన శంకను బాపుకొనుట కాతఁడొకటి రెండుసార్లు ప్రయత్నించెను. ఇట్టి ప్రశ్న పరిహాసాస్పదమగునేమోయని తనకుఁదానే మ్రింగు కొనెను.

అంతలో నొకనాఁడు వీరభద్రుఁడు తన ధనుర్విద్యా పాండిత్యమును బ్రకటించుటకు గురులయాజ్ఞ వడసెను. విశాలమగు మైదానమొకటి రంగ స్థలముగ నేర్పఱుప బడినది. చుట్టును మండలాకృతిలోఁబ్రేక్షకులెల్లఁ గూర్చుండిరి. వారి మధ్య నాతఁడత్యద్భుతముగఁదన శరలాఘవమ్ముఁబ్రద ర్శించెను. నేలపైనున్న ఛాయను చూచుచుఁగాలిలో నెగురు పక్షిని గ్రొట్టెను. ఒకటి కాదు. రెండు కాదు. ఇట్టి వింత లెన్నియో ప్రదర్శించెను. "మేలు! రాజకుమారా! మేలు!" అను పలుకులా ఓరుగంటి మిత్రమునోటనప్రయత్న ముగ వెలువడినవి. పిమ్మట నచటి వారెల్లరును నీ శరనైపుణ్యమును గూడఁ బ్రదర్శింపు" మని యా పురుషమూర్తినిగోరిరి, ఆ వ్యక్తి మొల్కనగవుతో దేశికునిఁజూచినది. అతఁడు కను సన్నతోఁదన యంగీకారమును వెల్లడిఁ చెను. అంతనా కాకతీయ వంశభూషణము రంగ స్థలమధ్యమున నిల్చి వీర భద్రుఁడు చూపిన వింతలన్నియు బ్రదర్శించెను. అతఁడా నైపుణ్యమునఁ

కళ్యాశ్చర్య నిమగ్నుఁడయి శ్లాఘించెను. పిమ్మట నా యిరువురకు ఖడ్గ యుద్ధము పెట్టిన బాగుండునని యధర్వ్యాణుఁడు పలికెను. దేశికులందులకు మొదట సంకోచించిరి. కాని తిక్కనార్యుని ప్రోత్సాహమువలనను దన యభిప్రాయమును మార్చుకొని యంగీకృతి నొఁసగిరి. ఖడ్గయుద్ధము దారుణముగ జరిగినది. ఎవరికేమి యాపద వచ్చునోయని ప్రేక్షకులు తెప్పవాల్చక యాతురతతో జూచుచుండిరి. కానియొక్కరికిని చిన్నయెత్తునెత్తురు గంటయినను బడలేదు. ఎదుటివారి దెబ్బలను దప్పించుకొనుటలో వారు చూపించిన నేర్పట్టిది. రతీ మన్మధులు విలాసార్థముగ నాడు కొను చిగురుటాఁకుఁ గైదువుల యుద్ధమువలె నా కలహము ప్రమాద రహితముగ ప్రమోద సహితముగ జనరంజికముగ పరస్పరాను రాగ బద్ధముగ జరిగి తుదకు గురుని, నియోగము వలన ముగిసినది. తరువాత నా యధర్వ్యణుఁడు "బాలులారా! ఈ విధముగ మీ పరస్పర సామర్థ్యములు తెలిసికొనుట కవకాశమేర్పడినది. మీ ఖడ్గ యుద్ధ నైపుణ్యమద్వితీయము. ఒకరికొకరు తీసిపోరు. ఇఁక మల్లయుద్ధ పద్ధతిలో మీ సామర్థ్యముఁజూతముగాక" యనెను. అందులకా వీరభద్రుఁడు వెనుదీయక సాభిలాషముగ జూచెను. "కాకతీయ రా[illegible] సూనమునకది యగ్ని పరీక్షయైనది. ఆ రాచబిడ్డ యొకింత తడవు కనుమూసి నిలిచి పిమ్మట "ఏదో యుత్సాహ బలముచే నీ మాత్రము నైపుణ్యముఁ బ్రదర్శించితిని గాని జైనులవలన గలిగిన యలసటకుదగిన దిటవుచేకూరలేదే!' యని పలికెను. అంత విశ్వేశ్వరగురువరుఁడు "కాకతీయ రాజనందనా! నీ కింకను మల్లయుద్ధమునకుఁదగిన స్వస్థత చేకూరలేదు. కావున నింతటితో నీ దినమున నీ విద్యాప్రదర్శన మాపు" మని యజ్ఞాపించెను. ఆ విధముగ నాఁటి ప్రదర్శనము ముగిసినది.

వీర భద్రుని యనుమానము ప్రవృద్ధమగుటకుదగిన యవకాము మఱి యొకటి వచ్చినది. ఆ మఠవాసులెల్లరును బ్రతిదినమును ప్రాతఃకాలముననే లేచి కృష్ణలో స్నానమొనరించుకొని విశ్వేశ్వరాలయమున దేవుని సందర్శనము చేసుకొనుట యాచారము. క్రొత్తగా వచ్చిన తిక్కనార్యాదులుగూడ నాయాచారమునే యనుసరింతురు. అందుననాఁడు కార్తిక సోమవారమగుటచే మిక్కిలి పవిత్ర దినము.

గణపతి దేవునిబిడ్డ మాత్రమెన్నఁడునుగృష్ణలో స్నానమొనరింపలేదు. ఆ విశ్వేశ్వరాలయమునకు వెనుకప్రక్కనున్న తామరకొలనిలోనే జలకమాఁడుచుండును. అదియించుక మారుమూల నుండుటచే సాధారణముగ నావంకకెవరునుబోరు. ఆనాఁడా వ్యక్తి నిద్రలేచుట కొంత యాలస్యమైనది. స్నాన సమయమునకు సూర్యోదయమగు చుండెను. వీర భద్రుఁడప్పుడే స్నానాద్యనుష్ఠానములను నిర్వర్తించుకొని దైవార్చనమునకుఁ బుష్పములుఁ గోయుటకాదెనకే వచ్చెను. ఆ వ్యక్తియాతనివంకఁజూడలేదు. ఆ రాజకుమారుఁడు మాత్రమా సుందరమూర్తినిఁజూచెను విభ్రాంతుడయ్యెను. వసిడి నిగులనొప్పు నారూపసంపదయతనిఁబరవశునొనరించెను. ఆనాఁటి ప్రియాణమునందలి గుబ్బపుఁజొకళి వలనఁగల్గిన ఆ దివ్యమూర్తి మేనిస్పర్శ గుర్తునకు వచ్చెను. తాను గోయుచున్న యా సుగంధ కోమలపుష్ప స్పర్శయాతనికిఁబులకాంకురములను గలిగించెను. చూచిన పిమ్మట నావ్యక్తి నీటిలోనికిఁదన శరీరమంతయుముంచి తల మాత్రము బైటకుఁగనబడునట్లుంచెను. తరువాత వీర భద్రుఁడు పుష్పములను గోసికొని శివాలయమునుజొచ్చెను. ఆమె స్త్రీమూర్తియని యప్పటికి స్పష్టమయినది.

శివలింగమునకెదుట నారాజకుమారుడు కూర్చుండి కన్నులు ముకుళించి ధ్యానింప మొదలిడెను. అతని చిత్తమపుడు దైవముమీదలేదు. ఆ మత్తకాశినిపైనున్నది. ఆమె స్త్రీయను నమ్మిక హెచ్చయినది. ఆహా! అనన్యసామాన్య సౌంధర్య ఖనియైన యీ కాంతామణికి వరుఁడగునదృష్టమెవ్వనికిఁ గలదోయని యువ్విళ్ళూరు చుండెను. అప్పుదేవియోమధురతరమగు నూహలాతని మనమునఁ జెలరేగెను. అట్లా తఁడురుద్రదేవునకు మాఱుగ రుద్రమదేవిని ధ్యానించుచుండెను. ఇంతలో వెనుక నుండి యెవరో వచ్చుచునట్లు పదధ్వని యాతనికి వినవచ్చినది. ఆ వచ్చునామె తన హృదయమును జూరగొన్న రుద్రమాంబయేయగునని యాతఁడు గుర్తించెను.

పిమ్మట నాతఁడామె రాకనెఱుఁగనట్లు నటించుచుఁగన్నులు మూసికొని "ఓ రుద్ర దేవా! నీ వాస్తవ రూపమును దర్శించు భాగ్యమునాకొనఁగుము నీ నిజ రూపమేది? నీ యందు స్త్రీ లక్షణములును బురుష లక్షణములును గూడ గోచరించుచున్నవి, ఓ వీరమూర్తి! నీవు పురుష లక్షణములు కొన్ని గలిగియున్నను స్త్రీ మూర్తివేయైనచో నిన్ను దేవీయనియేపిలిచెదను. ఈ వీరభద్రుని నీ దాసునిగ గ్రహింపుము. అని తన హృదయస్థ మూర్తినుద్దేశించి పలికెను. కాని తన హృదయముననున్నది ప్రణయమూర్తియే కాని ప్రణవ మూర్తి మాత్రము కాదు.

అతని ప్రక్కనే నిలుచుండిన రుద్రదేవి ఆ పలుకులందలి భావము గ్రహించినది. అప్పుడామె హృదయము లజ్జతోఁ గృంగిపోయినది. అట నుండి వేగముగాఁబోవలయునని తలచిఁ తొందరగా నామె స్వామికి నమస్కరించినది. అదిచూచి యా రాజకుమారుఁడు "నృపాత్మజా! దేవునకు నమస్కరించినపుడు పేరు చెప్పుకొనవలెను. జుమా" అని పలికెను స్వామి సన్నిధినసత్యమాడరాదుగదా! ఆమెయెట్లు చెప్పునో వినవలెనని యాతఁడుత్సాహపడెను. అంతనామె "ఓ రుద్రదేవా! రుద్రాఖ్యాతో నొప్పుచున్ననే నిదే నమస్కరించుచున్నానని పలికెను. అతడును కొన్న టీఱునామె చెప్పలేదు. "నీకున్న వరవాంఛనుగూడ స్వామికి నివేదింపు"మని యాతడు మందహాసముతో బలికెను. నావరవాంఛ నాహృదయాధినాథుడైన రాజశేఖరునకే యెఱుకయని యా బాలిక చిఱు నవ్వుతోఁ బ్రత్యుత్తరమిచ్చి తన దారిని బోయెను.

12. భారత పఠనము

భారత పఠనమనర్గళముగఁ గొనసాగుచుండెను. తిక్కనార్యుని వ్యాఖ్యానమునందలి పదములపొంకమెల్లర హృదయములనాకర్షించుచుండెను. మూలములోనున్న ప్రతి పదమునకుఁ దుల్యమగునర్థమును మాత్రమే చెప్పియూరకుండుటలోఁగవికి సంతృప్తి యుండదు. రస పోషణమునకునుబదౌచిత్యమునకును మూలములోనున్న వానికంటె విశేషముగఁ గొన్ని విషయములను జెప్పుటగూడఁ గలదు. అక్కడక్కడ మూలమునందలి కొన్ని శ్లోకములను విడిచిపెట్టుటయుఁ గొన్నిటి భావమును గురించి చెప్పుటయుఁ గలదు. విద్యార్థులకుఁగావ్యరసమందఁజేయుటయే వ్యాఖ్యాత దృష్టికాని ప్రతి పదమునకు నిఘంటువు చదివి యర్థముఁ జెప్పుట కాదు. తాను జెప్పు వ్యాఖ్యానము సంస్కృతము పదాడంబరముగ దీర్ఘ సమాసభూయిష్ఠమయి యుండుటతని కిష్టములేదు. జాను తెలుఁగులో జాతీయ పద ప్రయోగములతోనుండువలెను. అతని వాఖ్యానమునందలి యేపదమయినను గంభీరార్థయుతముగ నుండును. వ్యర్థపదము పొరపాటుననైనను జొరదు.


అధర్వణుఁడంతకుఁబూర్వమేవిరాటోద్యోగ భీష్మపర్వములను దెలిగించియుండెను. తాను వ్రాసిన కొన్ని పద్యములను గూడనచటచదువనెంచెను. కాని తిక్కన వ్యాఖ్యానము విన్న తరువాతనది వినుట చెరకుతిన్న తరువాతఁ జొప్పకట్టు తిన్నట్లేయుండునని యాతఁడు తలంచెను. తిక్కన వ్యాఖ్యానములోనున్నరసపుష్టి పదసౌష్టవము అర్థ గాంభీర్యము తన కావ్యము నకెక్కడిది? తాను జైనమతమును గూడ నవలంబించుటచే వైదికులు తన వ్రాఁతను ముట్టరేమోయని యనుమానించెను. ఆ వైదిక గ్రంథము జైనులకవసరము లేదు. ఇట్టి జనాదరణకెక్కని కావ్యము వ్రాసినఁ బ్రయోజన మేమి? తాను గొప్ప వ్యాకరణ పండితుఁడే కాని కావ్య శిల్పమును జూపుటలో నైపుణ్యము తక్కువ "ఇట్టి మహాకావ్యమును గొనసాగించుటకుఁ దిక్కనవంటి దిట్టయే కావలెను". అని యాతఁడూహించెను.

రుద్రదేవికి భారత శ్రవణమునఁ గౌతుకము మెండుకొనుచుండెను.

శ్రీకృష్ణుని౯ బాండవులు రాయబారమంపుచున్న సందర్భమున రోషావేశ పరవశయై ద్రౌపదిపల్కిన పల్కులామెకు హృద్యమయ్యెను. కురులు విరయఁబోసికొనియాభారత వీరనారి ప్రళయకాళివోలె దన కన్నులయెదుటఁ దాండవించినట్లయినది. అంతనామె తమయాస్థానమునఁగూడ సమగ్రముగ భారతముఁజదివించిన బాగుండునని యుత్సాహపడినది. "కవివర్యా! మీరొక సారి మాయాస్థానమునకు వచ్చి మా తండ్రిగారి సమక్షమున భారతము పఠించి మెప్పుఁదరింపఁజేయరా! యునివినయ పూర్వకముగ వేడినది. అట్లామె కోరుటకెన్నెన్నో భావములు ప్రోద్బలము చేసినవి. వైదిక గ్రంథ శ్రవణా సక్తి తిక్కన వ్యాఖ్యానా కర్షన కౌతూహలము మాత్రమే యామెయభిలాషలు గావు. తనకుఁ బ్రాణదాన మొనరించిన మహామహులను దనయింటికిఁ గొంపోయి సత్కరింపవలెనను ప్రగాఢ వాంఛయు. తన హృదయాంతర్వర్తి యైన వీరభద్ర రాకుమారుఁడుగూడ తిక్కనార్యునితో విచ్చేయుననెడు మధుర భావమును మిళితమగుటచే నామెయట్లు కోరినది" భగవంతుఁడట్టి యవకాశ మిచ్చినపుడు తప్పక వచ్చెదలెమ్మని యా కవివరుఁడు యుక్తియుక్తముగ నుత్తరమిచ్చెను.

అంత విశ్వేశ్వరదేశికులు "మిత్రమా! వ్యాసుని హృదయమును నీవు పూర్తిగనర్థముఁజేసుకొంటివి. తద్రచనమువలన హైందవమతము చార్వాకాది క్షుద్ర మతములచేత సంక్షుభితము కాకుండనింతవఱకు రక్షితమైనది. నేడు జైన బౌద్ధమత ప్రాబల్యమున వైదిక కర్మలడుగంటు చున్నవి. ఆ మత ములచే హైందవ మతము పూర్తిగఁగబళింపఁబడకుండఁకనే మనము పునరుద్ధ రింపవలెను. వైదిక మతాభిమానియైన యాచాళుక్య రాజరత్నమది గుర్తించి యే భారతమును రచింప నన్నయ భట్టారకునిఁబ్రోత్సహించెను. మన దుర దృష్టవశమునఁనాగ్రంథము పూర్తిగ నాంధ్రీకృతము కాలేదు. ఆ కబ్బమును దెలుగొనరించి నీవేల భాషాసేవను జేయరాదు?" అని యడిగెను. అంతనా కవి "మిత్రమా! ఇది నాబోటి సామాన్యునకు సాధ్యమా!"యని వచించెను.

ఆ పలుకులు విని దేశికుఁడు చిఱునవ్వుతో "ఏలకాదు? నీకేమి లోపము? వ్యాస హృదయమర్థముకాలేదా? అర్థము కానిదే నీవిధముగ వ్యాఖ్యానముఁజేయనే లేవుగదా ఇంక పాండిత్యమునకు లోపమా! కాదు! కవిబ్రహ్మతోఁదుల్యుడఁగు పండితుఁడేఁడీ! లౌకికానుభవమా - రాజకీయ తంత్రములన్నియును జీర్ణించు కొని త్రేన్చిన మహామంత్రివి పదజాలమును నీవు వెదుకనవసరము లేదుగదా అవే "నన్నుఁబ్రయోగింపుము నన్నుఁబ్రయోగింపుము"అని సరస పదప్రవాహ ముగ నిన్ను వెతకికొనుచు వచ్చును. ఇఁకఁగావలసినదేది? రస పుష్టియు నర్థ గాంభీర్యమును నీ రచనలో నెన్నటికినిఁగొఱవడవు. అని ప్రశంసింపనా కవీంద్రుడు" ఆచార్యా! నాకును దత్కుతూహలముగలదు. కాని గంభీర మగు భారత భారతీ సముద్రమును సంపూర్ణముగా నీదఁజాలుదునా? యని



సంశయించుచున్నాను. ఏమో! ఏ మహత్తర భావతరంగ ఘట్టనకైనను జంకుపడినచోఁబరిహాస పాత్రుఁడనుగానా? యన సద్గురుమూర్తి "నీ శక్తి సామర్థ్యములను నేనెఱుఁగుదును. అద్వైత మత సారమంతయును గరత లామలకముగఁజేసికొన్న నీవే శంకించిననింక శక్తిపరులనఁదగు వారెవ్వరు? అద్వితీయ కార్యసాధకునకారంభమున నట్టి సంశయముండుట సహజమే.

ఈ విధముగ దేశికుఁడు తన మిత్రుని బ్రోత్సహించెను. అతనికడ రెండు మూఁడు భారత ప్రతులుగూడఁగలవు. వాని నాతఁడాకవి సత్తమున కొసఁగి "ఇంకను గాశీప్రతినిగూడఁదెప్పించెదను. వానినెల్లఁ బరిశీలింపుము. జనాదరణముఁబొందునట్లా మహాకావ్యముఁదెనిఁగింపుము ఇది నాయొక్క కోరిక మాత్రమే కాదు. యావదాంధ్రుల యభిలాషగా భావింపుము. శ్రీ విశ్వేశ్వర దేవుని యాజ్ఞగాఁదలఁదాల్పుము"అని రెట్టించిన పట్టుదలతోఁబలికెను. ఆ మిత్ర ద్వయమట్లు భారత ప్రశంసతో నాఁడు పెద్ద ప్రొద్దు పుచ్చిరి.

13. మా రా కు

ఆనాఁటితో దేశికుని మఠమున వార్షికోత్సవములు పూర్తియైనవి. మఱు నాఁడు తిక్కనాదులు తమ తమ గ్రామములకుఁబో నిశ్చయించుకొనిరి. వీరభద్రుఁడొకసారి తన ప్రణయమూర్తిని జూచి రావలయునను తలంపున రుద్రమదేవి బసకువచ్చెను. అప్పటికి రుద్రాంబవాతాయనము నుండి యుద్యాన వన సౌందర్యమును దిలకించుచుండెను.

పూర్ణసుధాంశుని యంశుజాలములు కృష్ణా తరంగిణిలోఁ బ్రతిబింబించు చున్నవి. ఆ చిఱుతరఁగల నుండి యరుదెంచుమంద వాతపోతము లుద్యాన వనమునందలి పూవుఁ దీవెలను మెల్లమెల్లగఁ గదలించుచున్నవి. ఆ కొమ్మల సందునుండి కనుపించుచున్న చందురుఁడామెతోఁ దోఁబూచులాడు చున్న ట్లుండెను. శివాలయము ముంగిటనున్న పంచలోహ నందీశ్వరుని మెడలోని చిఱుగంటలు గాలి తాకిడికి మెల్లమెల్లగా మ్రోగుచుండెను. ఆ మంజుల రవములు పాఠశాలలోని విద్యార్థులు నంతఁజెప్పుకొనుచున్న సామగానమునకుఁ దాళము వేయుచున్నట్లుండెను. ఆ ప్రకృతి దృశ్యములను జూచుచు నా రాజ కుమారి యబుసపోకకు విజయసేనమునందలి పద్యములను జదువుకొను చుండెను. ఆమె శ్రావ్య కంఠమునుండి వెలువడుచున్న యా పద్యము లెట్టి వారి చెవులనైన నమృత వృష్టి గురియించును. ఆమెపై సహజానురాగము గల్గిన వీరభద్రుని హృదయమున కవి యానందము గొల్పుటలో ననుమాన మేముకలది? అతఁడు వచ్చి యామె వెనుక నిలచెను. యామె యాతనిఁ జూడకయే—

ఉ:-

వల్లభుఁడేఁగు దుర్లభుఁడు! వాని దెసందగు లూదియిమ్మెయిన్
దల్లడమందె దేలయుచి! తస్థితికిన్నను౯ బాసఁజేసినన్
దల్లియు బంధులోకమును! దం!డియునే మనువారెఱింగిరే
నుల్లమ యిట్లు నీకుఁదగు! నో తగదో పరికించి చూడుమా!

అని గానము చేసెను. ఇంతలో నాతఁడు దగ్గరకువచ్చి "పాపమా రాజకుమారి యెంత వ్యధపడుచున్నదో గదా" యని పలికెను. ఆమె వెనుకకుఁ దిరిగి వీరభద్రుని జూచి చిఱునగవుతో "ఆ వ్యధ యనుభవైక వేద్యము. అతఁడా రాజకుమారి హృదయము నపహరించి తన దారినిఁ దాను బోవు చుండెను. ఆమె లజ్జాభియోగమునఁ దల్లిదండ్రులకీ విషయముఁ జెప్పలేదు, మఱేమి చేయును? ఆ ముగ్ధ హృదయమట్లు తల్లడమందినది" అని వచించెను. వీరభద్రుఁడు "నిజమే! మన మిరువురమును బురుషులమేయైనను మనకు నేఁటినుండి వియోగము కలుగునని విచారించుచున్నాము. అట్టియెడ నా రాజ పుత్రి తాను వలచిన వానినెట్లు విడిచిపెట్టగలదు. మిత్రమా! మనము మరల కలిసికొందుమో! కలిసికొనలేమో! మనసులోని మాటదాఁచుట మంచిది గాదు. అప్పుడప్పుడు నేను నా మనసులో మా రుద్రమదేవుఁడు రుద్రమదేవి

యైన నెంతఁ బాగుండును ? నా ప్రేమ సామ్రాజ్యమునకుఁ బట్టముఁ గట్టదా ? యని యువ్విళ్లూరుదును సుమా !

ఆ పలుకులకు లజ్జానురాగములు నిజమనంబున బెనిగొన రుద్రాంబ ప్రత్యుత్తర మీయఁదలఁచినది. కాని నోటమాట రాలేదు. హెచ్చు ప్రయత్నము జేయఁగా మందముగఁ బల్కులు వెల్వడినవి. ఆమె యించుక మోము వంచి "రాజకుమారా ! నేను కాంతనని యెఱింగియు నెఱుంగనట్లు నటింతువేల ? ఎఱుఁగనిచో నలనాఁడు జలకమాడు చుండగాఁ బరికించి నా దెసఁ జూఁడనేల ? విశ్వేశ్వరాలయమునఁ బేరుచెప్పుటకుఁ బ్రయత్నింపనేల ? వర వాంఛను వ్యక్తమొనరింపుమని శ్లేషోక్తిలోఁ బలుకనేల యని పలికెను. అంత నాతఁడు " కాంతామణీ ! అనవసరముగా నీ కోమల హృదయమును గాయపరచితిని, అన్యథాభావించక అనుగ్రహింపుము ? రాజకుమారీ ! చాపల్యము నన్ను మఱియొక్క ప్రశ్న నడిగించుచున్నది. మన మైత్రిని దూరము చేయక చెప్పదగునేని యీ ప్రశ్నకుఁ దగిన సమాధానమిచ్చి నన్ను గౌరవింపుము. ఈ మధ్య నీ దగ్గర నేర్పడిన చనువు బలిమిచేనట్లడుగ సాహసించుచున్నాను. నీ హృదయమున వరింపఁబడిన ధన్యుఁడెవఁడో వినగోరుచున్నాను. నా హితురాలికి భర్తగానున్న భాగ్యశాలి పేరువిని నన్నానందింప నిమ్మని కోరెను. అందులకా కాంతాలలామ "రాజనందనా ! ఆ ప్రశ్న నన్నడుగకుము. కోరిన వరుఁడు లభింపనిచో నీవంటి మిత్రులకదఁ దలవంపులు గదా ?" యన నతండు "సుందరాంగీ ! సిరిరామోకాలొడ్డు మందభాగ్యుఁడెవఁడుండును ? నీవు కోరివలచిన నొల్లని మూఢుఁడెవ్వడు ? గుణవిద్యాకుల రూపధైర్యభాగ్య లావణ్య తారుణ్యములలో నీకేది తక్కువ ? యని పలికెను. అంత నా రాజవ్వని మువ్వంపు చిఱునవ్వుతో "వీనికి అదృష్టముగూడ తోడ్పడవలెనుగదా ! నృపాత్మజా ! ఏ వీరమూర్తి యవలీలగా మేనుచెమర్చక జైనపోదులనణచెనో ! ఏ త్యాగమూర్తి యాపన్నయగు నీదీనురాలికయాచితముగఁ బ్రాణభిక్షపెట్టెనో యా చాళుక్య వంశరత్నమునా హృదయ సింహాసనమునలంకరించి ప్రభుఁడై పూజార్హుడైయున్నను పితృపాదుల కటాక్షరూపమున నా భాగ్యదేవత ప్రత్యక్షము కావలెను గదా" అని పలికెను.

ఆ పలుకులేమి ప్రత్యుత్తర మీయవలెనో యాతనికిఁ దెలియలేదు. నా చెవులను నేను నమ్మఁజాలకున్నాను రాజపుత్రీ ! ఇది నిజమా ! అను పలుకులు మాత్రమతని నోటవెల్వడినవి. దాని కామెయొక్క మందహాస మొనరించి తలవంచుకొనెను.

ఆ నవయువకుల ప్రణయ చరిత్రకా రేయి మధురాధ్యాయమైనది. వారి ప్రేమ సామ్రాజ్య సింహాసనమునకా సంఘటన తొలిమెట్టయినది. వారి పరస్పరాను రాగలతా వికాసమునకా సమయము వసంతాగమమైనది. వారి మధుర భావములెటీరు వారి యానందపు మేలు సహృదయుల హృదయములే స్ఫురింపగలవు.

[ఇంకా ఉంది]

కిస్మత్!

ఒకరోజు
మధ్యాహ్నం
షహరు చౌరస్తాలో
పౌజులు పౌజులుగా మనుష్యులు
జెండాలు పట్టుకొని
ఏవేవో ఉల్టాసీదా నినాదాలతో
గల్లా బడాయించి గలబరిస్తున్నారు!
పోలీసుల దండు వచ్చి ఘిరాయించింది!
బందూకుల్ని ఢగ్గుమనిపించింది!
చత్రాతిపై కొట్టిన కుండ పెంచికల్లా
సకల జనులు శికస్తయినారు!
దూరాన్నుంచి
ఈ తమాషానంతా
చుప్ చాప్‌గా
చూస్తూ నిలబడ్డ నా చేతిలో
కోన్‌కిస్కాగాడెవడో
జెండా నొకటిపెట్టి దౌడాయించాడు!
దంగైపోయి మొద్దులాగున్న
నా మీదకు
ఎకాయెకిన
ఉరుమని పిడుగులా
పోలీసుల గుంపు కూచీ చేసింది!
"సర్‌కార్‌కో ఐసీతైసే కర్‌తే దుశ్‌మన్"
చలోజావు బందీఖానాకని
హుకుం జారీ చేసింది!
నా గోడు తమాము వినకుండానే
ముకద్దమా బనాయించింది!
బందుబస్తులతో జైల్లో తోసింది!
కొన్నాళ్ళకి
ఏం గోలు జరిగిందో
ఏం కమాలు జరిగిందో - ఏమోగాని
వీనిదేం తప్పులేదు
వీడొట్టి కేడేగాంవ్‌వాలా అని వదిలేసింది!
అయ్యో! అన్యాయంగా
తక్సీరు ఏదీ లేకుండానే
'జైలు జుర్మానా పొందానే అని
ఫికరు చేశాను!
కాని
ఆ జైలు జుర్మానే
నా పాలిటి దౌలతయ్యింది!
అదే నా జీవితాన్ని పల్టాయింప జేసింది!
నాకు "స్వాతంత్ర్యయోధుడన్న కితాబును
చమ్కాయింప జేసింది!
నాటినుంచి గ్రామస్తులందరూ
నన్ను చూసి
ఖుర్నీశులు చేయసాగారు!
గోలీం కెమరుగా ఛాతీని నిలిపినవాడు
ఆజాదీ కోసం లడాయి చేసినవాడు అని
బచ్చాలకంతా
నా రాకతును గురించి
నమక్ మిర్చీ లగాయించి
కథలు కథలుగా చెప్పసాగారు!
నన్ను ఒక నజీబులాగా
పసందు చేయసాగారు!
నా మాటల్ని కిల్లాకులుగా మన్నించసాగారు!
ఊళ్ళోని
పంచాయతీ దఫ్తరు జాగాలో
ఓ శిలాస్తంభం మీద
స్వాతంత్ర్యవీరుడని
నా పేరుని లావాటి అక్షరాలతో
నాజూకుగా చెక్కించారు!
గవర్నమెంటు నన్ను
అలగా జనం నుంచి వచ్చిన
అల్లాయని పొగడి
ఉలుపాగా
ఓ తామ్ర పత్రాన్ని గుజరాయించింది!
నెలనెలా పించన్ను మంజూరు చేసింది!
ఒకప్పుడు
పూటకు టికాణా లేక
బికారినయి చక్కర్లు గొట్టిన నేను
ఈనాడు స్వాతంత్ర్య యోధుణ్ణయి
ఖుస్రూలాగా ఖుషిగా
మజా ఉడాయిస్తున్నాను!

"వగపు - వలపు"

టిక టిక పొడుస్తూ
జీవితపు వృక్షాన్ని
బెండు పడజేస్తుంటుంది
"వగపు - వడ్రంగి పిట్టలాగా!!
కమ్మనైన రాగాల్ని విన్పిస్తూ
జీవితపు రసాలాన్ని
విరబూయింప జేస్తుంటుంది
"వలపు" - కలకోకిలలాగా!!

శ్రీ కె. కిశోరుబాబు
శ్రీ కె. అశోకుబాబు

కలగూరగంప

ద్రావిడ : ఒక పామరుడి ఆలోచనలు

డా॥ బ్రహ్మానందగారు "ద్రావిడ"ని గురించి ఎంతో సమాచారం ఇస్తున్నారు. ఆయన రాబోయే వ్యాసాల కోసం ఎదురుచూస్తూ ఒక పామరుడిగా నాకు తోచినది రాస్తున్నాను.

ద్రావిడ - తమిళ

ఇవి రెండూ ఒకేమాట కాదేమో అనిపిస్తుంది. పాత సంప్రదాయాల ప్రకారం ద్రావిడ దేశం వేరు, తమిళదేశం వేరు. తర్వాత వాడుకలో కలిసిపోయి ఉండవచ్చు.

"కొందరికి పురాణాలే చరిత్ర" అంటూ వ్యంగ్యంగా రాశారు ప్రొ. నీలకంఠశాస్త్రిగారు. పురాణాలని గురించి రాసేవారు సాధారణంగా "ద్రవిడుడు" శ్రీకృష్ణుడు - జాంబవతుల కొడుకు అన్న సంగతి చెప్పరు.

శ్రీకృష్ణ – బలరాములకి ద్రమీడుడనే ఋషి తెలుసు. కంసుడి అసలు తండ్రి పేరు కూడా ఇదే. అష్టవసువులలో ఒకడి కొడుకికి ద్రవిడుడనే పేరు ఉంది. ద్రవిడా అనే రాజకుమార్తె ఉండేదిట. చాణక్యుడికి ద్రవిణుడనే పేరు ఉంది.

అనర్త, కుంతల, విదర్భ, అశ్మక మూలక దేశాలలాగే (ఇవన్నీ యదు వంశంతో సంబంధం కల పేరులే) ద్రావిడ దేశం ఎందుకు ఉండకూడదు?

తరువాతి తొండయిమండలమే ద్రావిడ దేశమన్న అభిప్రాయం లేక పోలేదు. బెంగాలులోని తామ్రలిప్తి (తామ్‌లుక్) మీదుగా వచ్చిన మధ్య ఆసియా వాళ్ళే తమిళులని మహామహోపాధ్యాయ హరప్రసాదశాస్త్రిగారు రాశారని ప్రొ. సునీతికుమార్ ఛటర్జీగారి బెంగాలీ భాష చరిత్రలో (ఒక అథోజ్ఞాపికలో) ఉంది!

మధ్యధరా సముద్రప్రాంతపు 'త్రిమ్మిలాయి' లేదా 'త్రమ్మిలాయి' తమిళులు అయితే ఈనాటికి మధ్య ఆసియాలో వున్న "తెర్మెజ్" అనే తురుష్క తెగ మాట ఏమిటి? అక్కడే "తలేషి" అనే తెగవాళ్ళు కూడా ఉన్నారే?

చూళిక

ఊహాకల్పనకి అంతు ఉండనక్కరలేదు! ప్రాకృతం సామర్కండ్ ప్రాంతంనుంచి వచ్చినదని ప్రొ. బాగ్చీగారు సూచించారు. అక్కడ చూలీ, పాండూ, చేలియా, కోలీ తెగలవారు ఉండేవారని ప్రాచీన చీనా చరిత్రకారులు రాశారుట.

వాళ్ళే చోళులు, చాళుక్యులు, పాండ్యులు, పల్లవులు - అంటే నాకు నమ్మేట్టు ఉంది. వీరంతా ఎక్కడినుంచో వచ్చి కావేరి తీరంవద్ద స్థిరపడ్డారని పురాణాలలో ఉంటుంది. నర్మదలో కలిసే కావేరి ఇంకొకటి ఉంది. దీనిని గురించి పార్జిటర్‌గారు రాశారు. వీళ్ళంతా మొదట ఈ కావేరి వద్దకే వచ్చారేమో!

పాండ్యులు, చోళులు, పల్లవులు మొదలయినవాళ్ళు "శకు" లని నా అనుమానం. మనం వాడే రెండు యుగాలూ వీళ్ళవే కదా? వీళ్ళు ఏమి మాట్లాడేవాళ్ళో కాని అశోకుడి శాసనాలలో చెప్పిన తెగలు సెన్‌దమిళ్ మాట్లాడేవాళ్ళంటే నమ్మటం (నాకు) కష్టంగానే ఉంటుంది. సిత్తన్నవాసల్ గుహ "శాసనా" లని మినహాయిస్తే (పీటి భాష ప్రారంభదశలో ఉన్న తమిళం అని ప్రొ. నీలకంఠశాస్త్రిగారు అంటే భాషకి ప్రారంభదశ అంటే ఏమిటని ప్రొ. మహాలింగంగారు అడిగారు) తమిళ శాసనాలు తెలుగువాటికంటే తరువాతివే! దీని అర్థం ఏమిటి? శ్రీలంక మహావంశలో తమిళుల ప్రసక్తి ఉంటే ఆ గ్రంథం అనుకున్నంత పాతది కాదని అనుకోవాలని కొందరి సూచన.

స్కితియన్‌లు

కాల్‌డ్వెల్‌గారు కూడా స్కితియన్‌లకి ద్రావిడులకి సంబంధం ఉన్నదన్నారు కాని ఆయన దృష్టిలో స్కితియన్‌లు ఇప్పుడు ఉరల్ - అల్టాయిక్ భాషలుగా వర్ణింపబడేవాటి తాలూకు భాషలని మాట్లాడేవారని తోస్తుంది. స్కితియన్‌లలో ఎందరో తెగలవారు కలిసి ఉండేవారని చెబుతారు. ఎందరు ఉన్నప్పటికీ స్కితియన్‌లు మొత్తం మీద ఆర్యభాషలు మాట్లాడే ఇరాన్ తెగలవారే అనవచ్చు.

భారత ఉపఖండంలోకి ఆర్యులు ఇరాన్ ఉత్తర భాగంనుంచి (రష్యా దక్షిణ భాగంనుంచి కూడా) వచ్చారంటారు కొందరు.

హెయిమెయిన్‌డోర్ఫ్‌గారి ప్రకారం భారత ఉపఖండం మీద కనపడే రాక్షసి బండల సమాధులు ద్రావిడులు నెలకొల్పినవే. ద్రావిడులు సముద్రం మీదుగా భారతదేశం, నైరృతి భాగం ద్వారా ప్రవేశించారని ఆయన సూచించారు. దక్షిణ భాగంలోని రాక్షసి బండల సమాధులు ఉత్తరభాగంలోని వాటికన్నా అర్వాచీనమయినవని పురావస్తు శాస్త్రజ్ఞులు (బెండపూడి సుబ్బారావు ఇతరులు) తేల్చిన తర్వాత ద్రావిడులు వచ్చి ఉంటే (ఆర్యులలాగే) ఉత్తరంనుంచే వచ్చి ఉండాలని భావించబడుతోంది (కొందరిచేత).

రాక్షసి బండల సమాధుల వరుస భారత ఉపఖండం నుంచి ఇరాన్ ఉత్తరాన వున్న సియాల్క్ దాకా కనపడుతుందని స్టీఫెన్ ఫుక్‌స్ అనే మానవ శాస్త్రజ్ఞుడు రాయగా నేను చదివాను. అక్కడే కనబడే ఆర్యుల సమాధుల కన్నా ఇవి తర్వాతివి అని కూడా నిర్ధారణ అయిందిట. చోళులు, పాండ్యులు, చేరులు మొదలయిన వాళ్ళ వలసలకి ఈ రాక్షసి బండల సమాధులే నిదర్శనాలని ఫుక్‌స్‌గారి అభిప్రాయం.

పాత తమిళ సాహిత్యంలో చనిపోయినవాళ్ళని పాతిపెట్టే వివరాలు రాక్షసి బండల సమాధులకి సరిపోతున్నాయని శ్రీనివాసన్‌గారు రాశారు.

క్రీ.శ. ప్రారంభదశ సందర్భంలో రాస్తూ ప్రొ. కోశాంబిగారు "ఈ కాలంలో దక్షిణ ప్రాంతం నాగరికత లోపించిన అర్వాచీన శిలాయుగపు దశలో ఉన్న" దని అన్నారు. (ఆయన, "ఎ స్టేట్ ఆఫ్ లేట్ స్టోన్ ఏజి సావే జరీ" అన్నారు ఇంగ్లీషులో. నాకు తోచిన అనువాదం ఇదే.) రాక్షసి బండల సమాధులు ఉత్తరాదిన కూడా కనపడగలవని ఆయనే ముందు చెప్పారని ప్రొ. సంకాలియాగారు అన్నారు. (కోశాంబిగారు పోయినప్పుడు టైమ్స్ ఆఫ్ ఇండియాకి రాసిన లేఖ). తమిళ ప్రాంతంలో రాతితో కట్టిన మొదటి గుడి కంచిలోని కైలాసనాథుడి ఆలయం అంటారు కదా? ఇది చాలా అర్వాచీనమయినది కదా? ఖీతర్‌గావ్ ఆలయం ఇంతకన్నా పాతది. విదిశలో ఇంకా పాతగుడుల అవశేషాలు దొరికాయిట. నాగర-ద్రావిడ శిఖరాలు ఒక మూల స్వరూపం నుంచి ఉత్పన్నమయినవే, భూభాగం మీదుగా బర్మా, థాయిలాండ్ వగయిరాలకి విస్తరించి సముద్రం మీదుగా దక్షిణ దేశానికి వచ్చినదే ద్రావిడ శిఖర స్వరూపం అని ప్రొ. మజుందార్‌గారు అన్నారు.

సంగం

సంగం సాహిత్యం క్రీ.పూ. కొన్ని వేల ఏళ్ళ కిందటి అని కొందరు అంటే అది క్రీ.శ. 10-12 శతాబ్దాలలో రాసినది అని ఒకరు (ఎవరో నేను చెప్పనక్కరలేదు!) అన్నారు. వయ్యాపురి పిళ్ళై - నీలకంఠశాస్త్రిగారల అంచనాలే నాకు నమ్మదగినవిగా తోస్తాయి. పి. టి. శ్రీనివాస అయ్యంగారు, బి.జి.ఎల్. స్వామిగారలు వీటిని ఇంకా ఇవతలకి లాగుతారు.

ఇంత ఇటీవలి భాషని మొహెంజదారో - హారప్పా ముద్రలలోకి చదవటం సరికాదని ద్రావిడ సిద్ధాంతాలని ప్రచారం చేసిన ప్రొ. సునీతీకుమార్ ఛటర్జీగారే ఫాదర్ హెరాస్‌గారిని మందలించారు. అయినా ద్రావిడ వాదుల ప్రయత్నాలు కొనసాగుతూనే వచ్చాయి.

ఎస్. ఆర్. రంగనాథరావుగారు ఈ ముద్రలు ఉత్తర సెమిటిక్ లిపిలో రాసి ఉన్న ఒక ఇండో-యూరోపియన్ భాష తాలూకువి అన్నారు. ఈయన ప్రయత్నాన్ని ప్రశంసిస్తూ ప్రొఫెసర్ చాడ్విక్ ఈ బొమ్మల లిపిలోకి ఆధునిక జపాన్ భాషని కూడా చదవవచ్చునన్నారు. (హిందుస్తాన్ టైమ్స్‌కి రాసిన ఒక లేఖలో).

హారప్పా - గుండెస్ట్రుప్

ఈ కింద బొమ్మలలో ఒకటి మొహెంజదారో ముద్ర మీదది; రెండవది డెన్మార్కులోని గుండెస్ట్రుప్‌లో దొరికిన ఒక అవశేషం మీదది. ఇదీ చాలా పాతదే అని చదివాను.



హారప్పా



గుండెస్ట్రుప్

ఫాదర్ హెరాస్ ప్రకారం ద్రావిడులు తెల్లజాతివాళ్ళు. "కెల్ట్" తెగకి చెందినవాళ్ళని ఆయన అభిప్రాయంగా నాకు అర్థం అయింది.

[1968 తమిళ మహాసభలలో "ద్రావిడులు ఏ రంగు వాళ్ళు?" అన్న ప్రశ్నని చర్చించి చివరికి వాళ్ళు "ఒక మంచి చామనచాయ" ("రిచ్ బ్రౌన్" అని తేల్చారు. ద్రా.ము.క. రంగులు నలుపు-ఎరుపు కాని వాళ్ళ సినిమా నటీనటులు మాత్రం సున్నం తెలుపు రంగులోనే తెరమీద కనిపిస్తారు].

కాలేజీలో చదువుతూ జర్మనీ భాష నేర్చుకుంటున్న నా స్నేహితుడు ఒకతనికి అప్పటిలోనే వేలూరి శివరామశాస్త్రిగారితో పరిచయం ఉండేది. ఒకసారి ధైర్యంచేసి ఆయనను ఇతను అడిగాడుట" కుర్‌డెస్, షోన్, కోనిగ్, డోర్ఫ్ లాంటి మాటలు అరవం, తెలుగులోనూ కనిపిస్తాయేమిటి?" అని.

"నాయనా, ఇలాంటి మాటలని చూసినకొద్దీ భాషా సిద్ధాంతాలమీద నమ్మకం తగ్గుతుంది!" అని ఆయన సమాధానం చెప్పారుట.

నాకు కీ. శే. ప్రొ. బి. జి. ఎల్. స్వామిగారితో పరిచయం ఉండేది. ఆయన ఒకసారి ఇలాగ అనగా విన్నాను: "ఏ భాషని తీసుకున్నా దానిలో 20 మాటలని పోలిన వాటిని ఇంకే భాషలోనయినా పట్టవచ్చు!"

ఈ మాటలన్నీ వింటున్న ఒక మలయాళీ మిత్రుడు అరవిందుడు వేదాల మీద రాసిన పుస్తకం మాకు చూపించాడు. అందులో ఒక వాక్యం ఉంది— లింగ్విస్టిక్స్ ఈస్ ఎ సూడో సయిన్స్.

కాల్డ్వెల్‌గారు ఏమన్నారు?

కాడెల్వెల్‌గారు తమ వ్యాకరణం పుస్తకంలో రాసిన కొన్ని మాటలని నాకు తోచినట్లు తెలుగు చేసి ఈ కింద రాస్తున్నాను:

"....ద్రావిడ భాషలలో కనపడే ఇండో-యూరోపియన్ లక్షణాలు మనని చరిత్ర, పురాణాల వెనక కాలానికి తీసుకు వెడతాయి; అంతేకాదు; ఇండో-యూరోపియన్ జాతుల పడమటి - తూర్పు శాఖలు విడిపోవటానికి ముందు కాలానికే కాకుండా తర్వాతి కాలంలో స్కితియన్‌గా వర్ణించబడిన భాగం ఉమ్మడి జాతినుంచి విడిపోవటానికి ముందు కాలానికి తీసుకు వెడతాయి...."

(1961 ప్రతి, పుట 74)

ఫిన్‌లాండులో బంగారు జుట్టు - నీలం కళ్ళు వున్నవాళ్ళ శాతం ఎక్కువ-వీళ్ళు మాత్రం ఆర్యభాష కానిదానినే మాట్లాడుతారు. హిట్లర్‌లాంటి భయంకర స్వభావం కలవాళ్ళు జాతి ద్వేషాలని పెంచే ప్రచారం చేస్తే ఎటువంటి అనూహ్యమయిన పరిణామాలు వచ్చాయో అందరికీ తెలుసు కదా? యూరోపులో 60 లక్షల మంది యూదులని హత్య చేశారు. దక్షిణ ఆఫ్రికాలో ఇంకా జాతి వివక్షణ ఆధారంగా కల విధానాలు అమలులో ఉన్నాయి. [వర్ణవ్యవస్థని సమర్థించే వాళ్ళు ఇతరులకి నీతులు చెప్పే పరిస్థితిలో వుండరు.] సంస్కృతం ఏదో భాషకి తల్లి అని ఎవరో కొందరు చాదస్తాలు కలవారు అంటే ద్రావిడ సిద్ధాంతాలని గుడ్డిగా నమ్మేవాళ్ళ మాటలని మాత్రం ఎందుకు నమ్మాలి?

సంస్కృతం శాసనాలు

అసలు క్రీ.పూ. సంస్కృతం శాసనాలే లేవు కదా? తక్కిన దేశాలతో పోల్చి చూస్తే ఇక్కడ అభివృద్ధి చెందిన నాగరికత ఎంత పాతది? లేదా నాగరికతలు ఎంత పాతవి? యూరోపు దేశాల వాళ్ళతో, పశ్చిమ ఆసియా దేశాల వాళ్ళతో పోల్చి చూసుకుని తక్కువ వాళ్ళమన్న భావం కలిగి "మాకు మీకన్నా పాత చరిత్ర ఉన్న" దన్న ప్రచారం కొందరు చెయ్యటంలో వింత లేదు. శాస్త్రజ్ఞులు కనీసం పరిశోధనలో ఈ రకం ప్రచారానికి దూరంగా ఉండాలని నా అభిప్రాయం. ద్రావిడ సిద్ధాంతాలు ప్రచారంచేసే వ్యక్తులు కొందరికి సంస్కృతం తాలూకు సంస్కృతికన్నా తమది తక్కువ రకం సంస్కృతి అన్న భావం కలగటం వల్లనే వాళ్ళు ఆశ్చర్యం కలిగించే సిద్ధాంతాలు వల్లిస్తారని నేను అనుకుంటూ ఉంటాను...

[గమనిక - ఇందులో చెప్పినవన్నీ మామూలుగా అందరూ చదివే పుస్తకాలలోనివే. కొన్ని మాత్రం పత్రికలలోనివి. అన్నిటి వివరాలూ ఇవ్వటం అనవసరం; టైమ్స్ ఆఫ్ ఇండియా హిందుస్తాన్ టైమ్స్ పత్రికల తేదీల వివరాలు ఇద్దామన్నా ఇవ్వలేను:]

గంటి రామలింగం

కవి కొండల వారి శివరాత్రి ప్రభ

పందొమ్మిదవ శతాబ్ది అంతమున ప్రభవించిన కవికొండల వెంకటరావు గారు ప్రముఖ సాహితీ వేత్తలలో ఒకరుగ పరిగణింపబడుతున్నారు. కవితా శక్తిని తన తపఃఫలముగ భావించిన కవికొండల తెలుగు సాహిత్య ప్రక్రియ లన్నిటిలో నిర్విరామముగ కృషి ఒనర్చి ధన్యతగాంచారు.

కవికొండల భావ కవిత్వపు శాఖ లన్నిటిలోను కవితలను వెల యించారు. వీరు రచించిన కొన్ని గేయములు విలక్షణములై ఒప్పుతున్నాయి. అట్టి వానిలో "శివరాత్రి ప్రభ" ప్రథమ స్థానము నాక్రమించు చున్నది. ఈ గేయము తెలుగు కవితాలోకముననే మణిపూసయై శాశ్వతముగ నిలచిపోయిన దనుట అతిశయోక్తి కాజాలదు.

తన రచనలన్నిటికి స్ఫురణలను పేర్కొనుట వీరికి అలవాటు. ఈ గేయమునకు పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆచంట దగ్గర కనుగోరు మిల్లిలో స్ఫురణ కలిగినదని తెలిపారు.

"నటరాజ నృత్యము చిత్రములందు భారతీయులు గని ముగ్ధులు గాని వారుండరు. ఆ నృత్యమే యీ గీతికకు మూలకందము. శివుని తాండవ ప్రబోధము శివరాత్రి ప్రభ".[1]

ఈ గేయము 28-2-1929 న రచింప బడి మొదట భారతి పత్రికలో అచ్చుపడింది. తరువాత ముద్దుకృష్ణగారి "వైతాళికులు"లో ప్రచురించబడింది. పిదప కవికొండలవారి "విశాలవిశ్వం" అను పద్య సంపుటిలో మొదటి గేయముగ ప్రచురితమైంది. ఆధ్యాత్మిక భావముతో ఒప్పిన ఈ గేయము నవ్య కవితా ధోరణులలోనే విశిష్టమైన దనవచ్చును.

ఈ గేయము శివుని ప్రళయతాండవమును వర్ణిస్తుంది. ఆ తాండవ సమయమున కాలకంఠుని నాగసర్పమును వర్ణించడంతో గేయము ప్రారంభ మవుతుంది. ఆపాము కుబుసమూడ్చి పడగ బుస్సుమంటున్నది. అట్లనుటలో దానిరెండు నాల్కలు గండు మీసాలవలె దూయబడ్డాయి. సమయము కారునల్లని కాళరాత్రి. శివరాత్రి పర్వదినమున భక్తులు రాత్రంతా జాగరము చేస్తారు.లయకారుడగు శివుడు ఆదినము ప్రళయతాండవము చేస్తాడు. దానికి ప్రతీకగ ఆరాత్రిని కవి'కాఱునల్లని కాళరాత్రి' అని ఆ భీకరత్వమునురిస్ఫురింప చేశాడు. ఇది శివునిలోని ప్రళయరూపమును,రౌద్ర స్వభావాన్ని ప్రకటిస్తుంది. ఇచ్చట'కాలకంఠుని నాగసర్పము—కుబుసమూడ్చి పడగ బుస్సంది'అని చదివిన వెంటనే భావుకుడైన పాఠకునకు ఆ బుస వినబడియేతీరును. 'నాగసౌర మూదేది ఎవరోయి? —రాగమొలికించేది ఎవరోయి? —రాగమొలికించేది ఎవరోయి?' అని ప్రశ్నించడంలో ఆ ఉగ్ర ప్రళయ తాండవమునకు ఎవడు తాళము వేయగలడు? దాని లయ నెవడు నిర్ణయింప గలడు! అను భావం స్ఫురిస్తుంది.

కవి శివుని త్రినేత్రమును "నొసట గొసరిన మూడోకన్ను" అనుటలో ఔచిత్యం కాన వస్తుంది. ఆ ఫాలాక్షము కోపమునకు, ప్రళయమునకు చిహ్నము "నిపుడు లూదిన కొలిమి దెగడి నెగడి దిర్రిప్పింది" అనుటలో ప్రజ్వరిల్లిన రౌద్రము, ఉగ్రరూపము మన కనులముందు నిలుస్తుంది. కొలిమి, కమ్మరి ప్రసక్తులువచ్చుట కవి అభ్యుదయధోరణికి సూచన. ఆ ప్రళయాగ్నిలో కమ్మరి కష్టించి ఇనుము కరగించుననుటలో శ్రామికుని కాయకష్టము చూడ వచ్చును. "సోమరయితే చలిని కాగ" అనుటలో భిన్న దృక్పథము గోచ రిస్తుంది. ప్రతి 'స్టేంజా' చివర 'కాఱు నల్లని కాళరాత్రి' పునరుక్తి ఆగుటచే మహారుద్రమూర్తి శివుని ఉన్మత్త తాండవము నందే విలయ తాళము మానవ బుద్ధికి అతీతమైతోచును.'కాఱునల్లని కాళరాత్రి' అనగనే ఒకమనిషి అర్ధరాత్రి కటిక చీకటిలో నిలబడిన అనుభూతి లభించును.కాళరాత్రి అనుచోట కాలము స్తంభించు నట్లుగా ఆగిపోవును. ఇది ఒక విలక్షణమైన అపూర్వమైన అనుభూతి.

పిదప శివుని అర్ధనారీశ్వర స్వరూపము సాక్షాత్కరించును. శివుడింత బీభత్స తాండవము చేయుచున్నను అర్ధభాగపు మహంకాళి నాధుని నాట్యము వద్దనదట. దానికి కారణము ఈ విలయమంతయు ఆమెకు అర్ధము కాక పోవుటయా లేక "పునుకులా గలగలలు వింటూ కునుకు గన్నదో' అని కవి కారణము చూపుతాడు.

అనంతరము శివస్వరూపము వర్ణితము తొడవు నెలవంక, ఉడుపు ముప్పన్నె చర్మము, ఒకచేత డమరుక, ఒకచేత బ్రహ్మ కపాలము, ఒక చేత అగ్నిజ్వాల, ఒకచేత లేడి. 'నాల్గుసేతుల నాడులౌతున్నాయి.' అని వర్ణన. దీనినిగూర్చి కవి కొండలవారు ఇట్లు చెప్పారు.[3]

"సగం శరీరం ఆడ. సగం శరీరం మృగ, ఈలా నేటి నిక్కారి రూపించి పరియావసానం ఏమో తెలువకుండా ఉంది. అయితే మనం బాధ పడవలసిన అవసరము లేదు. అదియొక ఆహ్వానం. ప్రళయరుద్రుని విలయతాండవం కాన మనం అప్రమత్తులమైయుంటే -'జాగరూకులమైయుంటే అదే సత్కళా విశ్వాసం కావచ్చు. ప్రతివ్యక్తి తనయొక్క విద్యుక్త ధర్మా న్ననుసరించి నెరవేర్చాడా మనం పాఠం అందుకోగలమని నా విశ్వాసం. ఇందుగల ధర్మప్రబోధం గ్రహించగలగాలి."

శివునిపొట్ట లోనికి పోవుటచే 'చక్కనీ ముప్పన్నె చర్మము అక్కళించి పొట్టపైని అంటియుండీ అంటకున్నదోయి' అని వర్ణిస్తాడు కవి. అయినను 'అకలా అని యనేదెవరు? సోకులా అని కనేదెవరు?' అని ప్రశ్నిస్తాడు. అన్ని ప్రశ్నలకు సమాధానము ఒక్కటే. "కాఱునల్లని కాళరాత్రి".

తరువాతది మహాదేవుని తాండవ వర్ణనము. 'అకడకు బడనొక్క యుంజ ఏకముగ జేయుచును - నడుమొక రేఖగా దావంచికొంచు' అనుటలో ఆ దేవుని నాట్యభంగిమ మన కనులముందు మూర్తీభవిస్తుంది. దీనికితోడు పునుకుల గలగలలు, వాసిముమ్మొనవాలు హతభుక్, అజకపాలం ఐక్కు డుబుడిక్. చివరగ అశ్మరభ! అశ్మరభలతో విలయతాండవపు ధ్వనులు మన చెవులకు వినిపించునట్లు చేయబడినది. ఇది అనుభవం కలిగించు రచన అని చెప్పవచ్చును. ఆధునిక కవి స్వంత దృష్టితో తన కనుభవమైన ఆనంద మును వర్ణిస్తాడు. ఊహించుటలో శివతాండవమును, తాను పొందిన బ్రహ్మా నందమును, వర్ణించుట ఇక్కడ చూడవచ్చును. అతడు అట్లు కృతకృత్యు డయి ఆ సన్నివేశమును మన కనులముందు ప్రత్యక్షము చేయడమే గాక ఆ మహానుభూతిని మనదిగ చేయగలుగును.

ఉపసంహారము ఆ మహాదేవుని శరణు కోరుట. ఉపక్రమము, ఉప సంహారము పరస్పరము పాశములా వేసికొన చీకటిచిందు త్రొక్కించును. 'అహంకారము లేదు నాలో' అనుటయేగాక 'మహాదేవా యభయమిడుమన అభినయానకు హస్తమేలేదూ' అని అభయము కోరెను.

ఈ గేయము చదివి ముగించిన పిదప శివతాండవము యొక్క విచిత్ర మైన అనుభూతి కలిగించును. 'రాగమొలికించేది ఎవరోయి'? అనిన పిదప 'ప్రభలలో ప్రభ నిలుప రెవరోయి' అనగనే కలిగిన మృదువైన అనుభూతి 'కాఱు నల్లని కాళరాత్రి' అనగానే భయంకరమైన అనుభూతిగ మిగులుతుంది. ఇదంతయు కవి ప్రతిభవలననే సాధ్యమయినది.

భావగమనమునకు అనువైన భాషా వేగము ఈ గేయమునకు జీవము.

భాషలో అవే పదములు, అవే మాటలు అయినను కవి పదముల కూర్పు, నేర్పు వలన వాక్యముల నిర్మాణమును బట్టి కవి విశిష్టత బయల్పడుతుంది. ఈ గేయమందంతట ఇది గోచరిస్తుంది. దీని వలననే కవియొక్క మనస్సులోని అనుభూతి పాఠకున కందుతుంది.

దీనినిగూర్చి శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు క్రింది అభిప్రాయములను వెల్లడించారు.

"మనకు అందని భావమును పదములతోను, వాక్యములతోను చూపుటకు ప్రయత్నించుటచే భావానుభూతి కలిగించును. ఇది సాహిత్యములో నూతన ప్రయోగము. కవి మనస్సులోని సమగ్రమైన భావమును చెప్పుటకు, సరియైన పదములయొక్క గాని, వాక్యములయొక్క గాని సామాగ్రి లేక పోయినను, విలక్షణమైన అనుభూతిని కలిగించుటయే ఈ గేయములోని విశిష్టత. ఇందు ప్రతిపదార్థ తాత్పర్యములు గోచరించవు. 'ఇంప్రెషనిజమ్'కు ఇది ఒక గొప్ప ఉదాహరణ. ఇంతవరకూ ఇటువంటి గేయమును ఎవరూ రాయలేదు".

ఇదంతయు ఈ గేయములో వాడిన ఛందస్సు, లయల మూలమున అధికముగా సాధింపబడవని చెప్పవచ్చును. ఇది ముత్యాలసరము. ఇందు స్టేంజా ఏర్పాటు కలదని శ్రీశ్రీ పేర్కొంటున్నారు.[4] ఇది నాలుగు కంటె హెచ్చు పాదములతో అక్కడక్కడ హ్రస్వ పాదములతో నడుస్తుంది. హ్రస్వ దీర్ఘ పాదములొక క్రమము ననుసరించక యథేచ్ఛగా వాడబడ్డాయి.

దీనినిగూర్చి శ్రీ పాటిబండ మాధవశర్మగారిట్లు చెప్పిరి.[5] "ఈ కావ్యము నందు లయ సమాంతరముగా నడక అనిశ్చితమై, కావ్యము నందెల్ల వెదజల్లబడి యున్నది. భావనా నేత్రము ముందు మహాశివుని ప్రళయ తాండవమును సాక్షాత్కరించు కొనగల పఠిత ఈకావ్యమునందలి పొట్టి పొడుగుల సాంకర్యమును గ్రహింపగలడు. అవాఙ్మానస గోచరమైన ఆ మహాలయను సూచించుటకే ఈ కావ్యమునందు పాదవైషమ్యము, పదవైషమ్యము నేర్పుగా కూర్పబడినవి. శివుని ప్రళయ నాట్యమును నియతచ్ఛందములో బిగించి సరళ పదములలో ఏముద్పుట అప్రౌఢ శిల్పముకాగలదు. వేంకటరావు ఈ కావ్యమునందు చూపిన శిల్పము, ప్రతిభ అద్భుతములు ఛందస్సంవరణమునకు మన భాషలో నింతకు మించిన కావ్యములేదు. ఈ కావ్యము నాకు మహా ప్రేమ పాత్రము".

ఇట్టి విలక్షణమైన గేయాన్నిగూర్చి పలువురు ప్రముఖులు వెలిబుచ్చిన అభిప్రాయాలు ఇందు పొందుపరచడం సమంజసమని తలుస్తున్నాను.

"హ్రస్వపాద విన్యాసమువలన గొప్పగొప్ప విసురులు చూపిరి. వెంకటరావుగారు శివరాత్రి ప్రభలో భావనలోనూ, గమనంలోనూ అవరించిన వైశాల్యం ఇంతట్లో ఎవరూ అందుకోలేరు. విశ్వనాథవారి కిన్నెరసాని, కవికొండలవారి శివరాత్రిప్రభ, కృష్ణశాస్త్రిగారి గేయాలన్నీ వారిని మహాకవులుగా చేశాయని శ్రీశ్రీ తెలిపారు.[6] శివరాత్రి ప్రభగేయము తనపై ప్రభావము చూపినట్లు శ్రీశ్రీ ఒకచోట పేర్కొన్నారు. మహాప్రస్థానం ఆవేశానికి ప్రోద్బలాలను గూర్చి వీరు ఇట్లా అన్నారు.[7]

"హరీంద్రకవి "మరూహై అహైజంగ్" అనేపాట నజ్రుల్ ఇస్లామ్ గీతాలు నా మనస్సులో ఏవో మారుమూలల్లో మారుమోగుతూ వుండాలి. అలాగే కవికొండల కంఠంకూడా".

"శ్రీ కవి కొండల వెంకటరావుగారు ఎన్నో కావ్యలు మంచివి వ్రాశారు. వాటిలో శివరాత్రిప్రభ తప్పక నిలుస్తుంది." అని నోరి నరసింహశాస్త్రిగారు తెలిపారు.[8]

"ఈయన కవిత్వాన్ని స్మరించినప్పుడు శివరాత్రి ప్రభ జ్ఞాపకం రాని వారుండరు. వారి ప్రతిభకు నిదర్శనం ఈ ఒక్కరచనయే చాలు—వారి పేరు చిరస్థాయినిచేయుటకు ఆధునిక పద్యసంపుటం ఏదీకూడా అది లేకుండా పూర్ణంకాదు." అని కొత్తపల్లి వీరభద్రరావుగారు తెలిపారు.[9]

"ఈ పాట ప్రళయ శివుడి తాండవ నృత్యాన్ని, అభినయాన్నే మించిపోయేది. రౌద్రి భీభత్సాలను చిత్రించడంలో దీనికదే సాటి. జగన్నాథుని రథచక్రాలు శ్రీశ్రీ సొంతాస్తే అనుకున్నా కవి కొండలవారి శివరాత్రి ప్రభకు ఎంత ఋణపడివుందో శ్రీశ్రీయే చెప్పాలి. చెప్పారు కూడా." అని కె. వి. రమణారెడ్డిగారు తెలిపారు.[10]

ఇంతగా విశిష్టతను సంతరించుకొన్న ఈ గేయమును కవికొండలవారు జీవించి యున్నపుడు స్వయముగా పాడగా శివరాత్రి సందర్భములలో ఆకాశవాణి కేంద్రమునుండి ప్రసారమయ్యేడిదట.

కవికొండలవారి కవిత్వమునకు మకుటాయమానమై వెలుగు ఈ గేయము వారి ప్రతిభను సహృదయులందరికీ చాటి చెప్పుచున్నది.

అధోజ్ఞాపికలు

1— నేను వ్రాసిన వేమిటంటే మహాగీతికలు—కవికొండల వెంకటరావు —దేశ సేవ.

2— విశాల విశ్వం— కవికొండల వెంకటరావు, పు. 1-4

3— స్వీయ కవిత—రక్తకుల్యగాథ, శివరాత్రిప్రభ, ఉయ్యాలాదంబాలా -కవికొండల వెంకటరావు-రేడియో ప్రసారము, మద్రాసు,19-10-45

4— ముత్యాలసరం ఒక కృషి— శ్రీశ్రీ, ఉదయిని, ఫిబ్రవరి, 1935.

5— ఆధునికాంధ్రభావ కవిత్వతత్త్వము— పాటిబండ మాధవశర్మ పు. 62.

6— ముత్యాలసరం ఒక కృషి— శ్రీశ్రీ, ఉదయిని, ఫిబ్రవరి, 1935.

7— ఆరంభం పెద్ద అవస్థ- శ్రీశ్రీ సాహిత్యం—రెండు—వచనవిభాగం. -శ్రీశ్రీ, పు. - 528.

8— అరవైయేండ్ల ఆంధ్రసాహిత్యంలో నిలిచేది —నోరి నరసింహశాస్త్రి —భారతి, ఫిబ్రవరి, 1974, పు. 14.

9— కవికొండల కవిత్వం— కొత్తపల్లి వీరభద్రరావు.

10— కవికొండల కారుచీకటి— కె. వి. రమణారెడ్డి. —ఆంధ్రప్రభ, 1981, ఫిబ్రవరి.

శ్రీ కొర్లపాటి శ్రీరామమూర్తి గారికి
శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారికి
శ్రీ కె. వి. రమణారెడ్డిగారికి

కృతజ్ఞతలతో

డా॥ జె. విజయలక్ష్మి

లేఖలు

అణు విన్యాసం

వసంతరావు వెంకటారావుగారు అణువిన్యాసంలో బ్రహ్మాండ విన్యాసంతో శివతాండవాన్ని మాత్రమే చూడమని ఎవరినీ ఆజ్ఞాపించ లేదు. దానినే వైష్ణవులు పాల సముద్రంలో పవ్వళించిన విష్ణు స్వరూపంగా భావించ వచ్చును. శాక్తులు మణి ద్వీపంలోని త్రిపుర సుందరిగా భావించ వచ్చును. మహాయాన బౌద్ధులు శూన్యంగా సున్నగా భావించవచ్చును. కాని ఉన్నది ఒక్కటే.

ఇవన్నీ ఉపాసన కొరకైన అలంకారిక రూపాలు. ఉపాసన అంటే ఒకే కలను ప్రతిరోజూ ఒకే సమయంలో కనగలగటం అన్నమాట.

ఈనాడు భౌతికశాస్త్రాలు విపరీతంగా అభివృద్ధి చెందుతున్నమాట నిజమే. కాని ఇవి కూడా అదే లక్ష్యాన్ని చేరబోతున్నాయి అన్న సత్యాన్ని ఇప్పటి శాస్త్రీయ పరిభాషలో చెప్పటం తప్పా ?

మనుష్యుడు మనస్సు ప్రధానంగా కలవాడు. మానసిక విద్యలకు ఈనాడు ఆనాడున్న ప్రాధాన్యం లేదు. ఈనాడుకూడా వివిధ భౌతిక శాస్త్ర సాంప్రదాయాలను సమన్వయంచేసి నిరక్షరాస్యులకుకూడా శాస్త్రీయ దృక్పధాన్ని అలవాటు చేయటానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి కదా? ఇది సైన్సు సృష్టించబోతున్న వేదాంతం కాక మరేమిటి? దానికి పూర్వీకులు మానసికోపాసనలద్వారా సాధించిన సత్యాలను ఆధారంగా తీసుకుంటే తప్పేమిటి ?

వేదాంతమన్న పేరంటే వారికి ఒక రకమైన ద్వేషం ఉన్నట్లు కనిపిస్తున్నది. కనుకనే వేదాంతాన్ని బొద్దెంకలతో సైన్సును ఆహారంతోపోల్చారు. ఇట్టి రాగద్వేషాలు శాస్త్రీయ దృక్పథం కలవారికి ఉండవచ్చునా?

"తి" గారి వ్యాసానికి ఇది సమాధానం.

ఏటెం శ్రీరాం . ఉయ్యూరు.

తిప్ప శబ్దము త్రిపురాంతక శబ్ద భవము

జనవరి '86 భారతి కలగూరగంప శీర్షికలో తిప్ప శబ్దోత్పత్తి క్రమమును గురించి రాసిన 'తి' గారి రచన చదివిన పిమ్మట ఈ మాటలు వ్రాయాలని పించింది.

'తిరుపము' శబ్దము 'తిప్పము' గా మారజాలదని వారు వ్రాస్తూ 'సంస్కృత శబ్దములు భ్రష్టమై కుదించుకుని తద్భవము లైనట్లు తెలుగు పదములు కావు,' అని వ్రాశారు. సంస్కృత శబ్దములంటే ఎందుకో వారికంత అసహ్యము. సంస్కృత శబ్దాలు పామరుల నోటిలో పడి భ్రష్టమై కుదించుకొని పోయాయి. దానివల్ల సంస్కృత భాషకు లాఘవమెలా కల్గుతుంది? ఇంగ్లీషు పదాలు కూడ గ్రామీణుల నోళ్ళలో పడి మార్పులు చెందినాయి కదా? ఇసుకూలు(స్కూలు), ఆసుపత్రి (హాస్పిటల్), మొదలైనవి అలాంటి అపభ్రంశ రూపాలే కదా? అంత మాత్రము చేత ఆంగ్ల భాషను భ్రష్టమైన భాష అనవచ్చునా? అన్నచో 'తి' గారు పెదవి మెదపక ఊరుకుందురా? శబ్దములు భ్రష్టములగుటకు మన అవిద్యయే హేతువు. అంతే కాని అందు భాషాదోషమీషత్తైనలేదు. తిప్ప శబ్దోత్పత్తి క్రమము చెప్పేపట్ల ఈవాక్యమెందుకు వ్రాయవలసి వచ్చిందో ఎంత ఆలోచించినా అవగాహన కావటం లేదు.

'తిప్ప'శబ్దమును 'తి' గారు అందు ఈ విధంగా నిష్పన్నం చేశారు తిరుపతి అనుపదము శ్రీపతి శబ్దభవమట 'తిరు' శ్రీకి తద్భవమట. తిరుమల అంటే శ్రీశైలమట. శ్రీశైలమన్న తిరుమల అట. శివుడుండు కొండ కూడ శ్రీశైలము (తిరుమల) అని ప్రసిద్ధి చెందినదట. అంచేత శివుడు కూడ తిరుపతి యేనట.

'తిరు' అను పదమునకు శ్రీ సమానార్థకమెట్లగునో? తిరుమణి, తిరుమంత్రము, తిరువారాధనము, తిరుపణ్యారము, తిరువిళక్కు మొదలైన చోట్ల 'తిరు' శబ్దమునకు శ్రీ అను అర్థము చెప్ప వచ్చునా? తిరుమణి అనగా శ్రేష్టమైన మన్ను అని అర్థం. (దీనితోనే శ్రీవైష్ణవులు ఫాలతలంలో ఊర్ధ్వ పుండ్రాలు దిద్దుకొనేది) అంతేగాని శ్రీమన్ను అని అర్థం కాదు. అలాగే తిరుపణ్యారమంటే శ్రేష్ఠమైన పిండివంట అనీ, తిరువిళక్కు అంటే శ్రేష్ఠమైన దీపమనీ అర్థము.

శ్రీశైలమునకు 'తిరుమల' అనే ప్రసిద్ధిలేదు. ఎవరైనా బస్సులో కూర్చొని తిరుమలకు టిక్కెట్టిమ్మని కండక్టరు నడిగితే అతడు శ్రీశైలానికి టిక్కెట్టివ్వడు. పిచ్చివాడిని చూసినట్లు చూసి తిరుమల టిక్కెట్టిస్తాడు. అలాంటప్పుడు శ్రీశైలానికి తిరుమల అనే పేరు ప్రసిద్ధమైనట్లు ఎలా చెప్పగలము ? అట్లే శ్రీశైల మల్లికార్జునునకు తిరుపతి అనేపేరు లేదు. అందువల్ల 'తి' చెప్పినట్లుగా "తురుపతి" శబ్దమునుండి తిప్ప శబ్దమును శివార్థకముగ ద్రిరివు చెయ్యలేము. అలాచేసి పండితుల శ్లాఘాశిరఃకంపాన్ని ఆర్జించవచ్చేమో కాని సత్యాన్ని చెప్పినట్లుకాదు.

తిప్ప శబ్దాన్ని త్రిపురాంతక శబ్దం నుండి నిష్పన్నం చేయవచ్చు. రావిపాటి త్రిపురాంతకుడు అనే ప్రాచీనకవికి రావిపాటి తిప్పన్న అనే వ్యవహార నామం ఉంది. అందువల్ల తిప్పశబ్దము త్రిపురాంతక శబ్దభవమని చెప్పటానికి చాలా ఆస్కారముంది. త్రిపురాంతక శబ్దము జనవ్యవహారములో ఆది రేఫాన్ని కోల్పోయి "త్రిపురాంతక, తిప్రాంతక, తిప్పాంతక, తిప్ప" అని అయి ఉంటుంది.

త్రిపురాంతకుడు > తిపురాంతకుడు > తిప్రాంతకుడు > తిప్పరాంతకుడు > తిప్పాంతకుడు > తిప్పన.

త్రిప - తిప్పగ మారడానికి భాషాశాస్త్రరీత్యా చాలా అవకాశముంది. ఇంకా ఇలాంటి కొన్ని పదాలను క్రింద ఇస్తున్నాను.

నిద్ర > నిద్దర; ముద్ర > ముద్దర; శుభ్రము > సుబ్బరము;

గృధ్ర > గ్రద్ద; శూద్రులు > సూద్దరలు; లోద్ర > లొద్దుర.

జనవ్యవహారములో పొడుగాటి పేర్లన్నీ ముచ్చటగా మూడక్షరాల్లోకి కుదింపబడటం సామాన్య విషయమే. మహాదేవ శబ్దమలానే మాదన్నగా మారింది. అట్లే 'త్రిపురాంతక' శబ్దము 'తిప్పన్న' గా మారింది తప్ప 'తిరుపతి' శబ్దము కాదు.

'తిప్పేరుద్ర' కు అర్థము చెప్పుచు అది శ్రీశైలరుద్రుని సూచించే పేరని "తి" గారు అన్నారు. శ్రీశైలంలోని శివుడు రుద్రుడు కాడు, మల్లికార్జునుడు. కనుక 'తిప్పేరుద్ర' శబ్దానికి శ్రీశైలరుద్రుడని అర్థముచెప్పుట పొసగదు. త్రిపురాంతకుడే నిజమైన రుద్రుడు (రౌద్ర స్వభావము కలవాడు). కనుక తిప్పేరుద్రుడనగా త్రిపురాంతక రుద్రుడనే అర్థము.

శంకరగంటి రమాకాంత్

అనంతపురం

గ్రంథ విమర్శలు

విరాళా సంస్కృతం నేర్చుకోండి!

రచన సాహిత్యవిద్యాప్రవీణ, భాషాప్రవీణ శ్రీ నిష్ఠల సుబ్రహ్మణ్యం, ఎం.ఏ. క్రౌన్.40 + 32 పుటలు వెల రూ 5లు ప్రతులు లభించుచోటు- శ్రీశంకర్ ఆర్ట్ ప్రింటర్సు, మెయిన్‌రోడ్, పొన్నూరు-522 124 (గుంటూరు జిల్లా)

భారతీయ భాషలలో సంస్కృతభాష అత్యుత్తమమయినది. చాలా భాషలు దానిపైనే ఆధారపడి ఏర్పడినవి దీనికి విదేశాలలోకూడా ఎక్కువ ప్రచారంవున్నది పాశ్చాత్యపండితులు దీనియందు నైపుణ్యం సంపాదించి, అమూల్యాలైన పెక్కు గ్రంథాలను గత శతాబ్దంలోనే దేవనాగరి లిపిలో తమ దేశాల్లో ముద్రించారు. మాక్స్ ముల్లర్‌వంటి విద్వాంసులు ఋగ్వేద భాష్యాదులను ప్రకటించిన సంగతి విద్వాంసుల కెరుకయే!

విదేశీయులు మనదేశాన్ని పరిపాలించిన కాలంలో దేశభాషలతోపాటు సంస్కృతంకూడా ఉపేక్షించబడింది. కాని భారతదేశం స్వతంత్రమైనపిదప దేశభాషలతోపాటు సంస్కృతానికికూడా ప్రాముఖ్యం ఇవ్వబడింది చాలారాష్ట్రాలలో సంస్కృతం నిర్బంధంగా బోధింపబడుతున్నది. దీనికి ప్రచారానికి భారత ప్రభుత్వంవారు తగిన శ్రద్ధ తీసుకుంటున్నారు. సంస్కృతంలో వార్తలు రేడియోలమూలంగా ప్రసారమవుతున్నాయి. అయినా సంస్కృతం నేర్చుకోవడం చాలా కష్టమని కొందరు భ్రాంతిపడుతున్నారు ఆసక్తివుంటే యితర భాషలవలెనే సులభంగానే దానిని అభ్యసించవచ్చును.

ఈ పుస్తకాన్ని రచించిన నిష్ఠల సుబ్రహ్మణ్యంగారు సంస్కృత భాషా ప్రచారానికి దీక్షపూనిన సమర్థులు. ఆయన యీ గ్రంథరచనకు పూనుకోవడం ప్రశంసనీయం సులభపద్ధతిలో అందరినీ ఆకర్షించేవిధంగా రచనసాగింది.

ఈ పుస్తకంలో రెండుభాగాలున్నవి మొదటిభాగంలో సంస్కృతభాషా ప్రాశస్త్యం, దాని చరిత్ర, దాని సౌలభ్యం, ఇతర భాషలకీ, దీనికీగల భేదం విషయ బాహుళ్యం. సంస్కృతంలోని పత్రికలు, పాటలు, ప్రౌఢత్వ పాండిత్యాలు ప్రశంసలు తెలియజేయబడినవి. తర్వాత ప్రథమాది విభక్తులు, పుం, స్త్రీ, నపుంసకలింగాల పదాలు, తెలుగులో వ్యవహారంలోఉన్న పదాలకు తగిన సంస్కృత పదాలు చూపబడినవి.

రెండవభాగంలో క్రియాపదాలకు వర్తమానాది కాలాలలోని పదాలు చూపబడినవి సమాపక క్రియలతోపాటు అసమాపకక్రియలుకూడా చెప్పబడినవి. కంఠస్థంచెయ్యవలసిన తవ్యప్రత్యాయాంతాలు తెలుగు అర్థాలతోకూడా ఈయబడినవి అలాగే మతుబంతాదులుకూడా ఇయ్యబడినవి

ఇందలి 3, 4 భాగాలు ఇంకా రావలసిఉన్నవి. అందులో సమాసాలు, తద్ధితాంతాలు మొదలైనవి ఉండవచ్చును. సమాసాలను గురించి చెప్పినపుడు శబ్దమంజరికి అనుబంధంగాఉన్న సమాస కుసుమావళిని ఆదర్శంగా తీసుకుంటే మంచిది.

ఇది వ్యాకరణానికి సంబంధించినది. వీలయినంతవరకూ కలగాపులగం కాకుండా ఉంటే మేలు రచనలో సిద్ధాంత కౌముది ననుసరించి సంధులు, విభక్తులు, సమాసాలు, తద్ధితలు, క్రియలు వరసగా చెప్పినట్లయితే అభ్యసించే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుంది

సంస్కృత భాషాప్రచారానికి రచయితచేస్తున్న ప్రయత్నం ప్రశంసించదగినది.

బులుసు వేంకటరమణయ్య

సంధ్యా బీభత్సం

సౌభాగ్య వెల: రు. 4/-లు ప్రతులకు: 1) పి. సౌభాగ్య, సిస్టమ్స్ ఆడిట్ డిపార్ట్‌మెంట్; హెచ్. ఎ. ఎల్. బాలానగర్ హైదరాబాద్-42. 2) కొల్లూరి; ఎక్సరే; కొల్లూరి హౌస్, అమలాపురం-533 202.

ఏదైనా ఒక సంకలనాన్ని చదివేటప్పుడు 'ఇది కవిత్వమే' అని అనిపించే సంకలనాలు చాలా అరుదుగా వస్తున్నాయి. అట్లాంటి అరుదైన కవితా సంకలనాల్లో సంధ్యాబీభత్సం అనే ఈ వచన కవితాసంకలనం ఒకటి. ఈ కవిత్వంలో ఆర్తిఉంది, అన్వేషణఉంది; తిరుగుబాటుతనం ఉంది; సమకాలీన సామాజిక బీభత్సం ఉంది. వీటన్నింటిని అత్యంత శక్తివంతంగా చెప్పే కవితాశక్తి ఉంది.

గుండె సంధించి విడిచిన మాటలు
గొంతునించి బయటకురాలేక
గద్గదంలో పడిపోతున్నాయి
నిస్సహాయంగా చెక్కిలిమీద జారుతున్న
కన్నీటి నక్షత్రాలు
ఒదిగించుకోలేక
మెలికలుతిరుగుతున్న అక్షరాలు
పలికించలేక
తంత్రులు తెగుతున్న వీణలు, సితార్లు
చిత్రించలేక
విరిగిపోతున్న కుంచెల అంచులు

ఇవన్ని గత వర్తమాన బీభత్సానికి సంకేతాలు, ఆగామ వ్యవస్థా స్వరూపానిక సందిగ్ధాలు, ఒకానొక అస్పష్ట సంధికాలంలో జీవిస్తున్న మానవజాతికి ప్రతిరూపాలు. ఈ కవికి సంఘంలో జరుగుతున్న అన్యాయాలమీద, ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండమీద తీవ్రమైన అసహ్యంఉంది. ఈ అసహ్యాన్ని చాల మంది కవిత్వంపేరుతో కసిత్వంగా కాగితాలను ఖరాబుచేస్తూ ప్రకటిస్తున్నారు. సౌభాగ్యగారు కవిత్వ స్పృహతో ప్రకటిస్తున్నారు ఇంద్రవెల్లి ఖండిక అందుకు ఉదాహరణ. పోలీసుల కాల్పుల్లో 60 మంది గిరిజనులు మృతి ఈ ఖండికకు ఇతివృత్తం.

'ఆ అరవయి కొండలు నేలకి
ఒరిగిపోయిన చోట
రక్తనదుల్ని నా ఒంటికి పులుముకుని,
కన్నీళ్ళతో కలుపుకుని
నా శరీరాన్ని సజీవరక్త పతాకంచేసి
ప్రతీకార జ్వాలాగీతమై
ప్రజ్వరిల్లినట్లు పట్టలేని ఆవేశం
ఛివిష్యత్ యుద్ధ ప్రకటనలో
అరవై అక్షరాల వాక్యం అంతమైంది
రైలు కూతవేసి కదిలింది
అరుణారుణ ఆలోచనలు
అరణ్యాలమీదుగా అల్లుకున్నాయి-"

ఈ పాదాలు కవి దృక్పథాన్ని వెల్లడించేవిలా ఉన్నాయి. అయితే ఈ

సంకలనం మొత్తం ఇటువంటి భావాలతోనే నిండిఉందని అనటానికి వీలులేదు. మొత్తంమీద కవి చూపు ముందుచూపే కాని వెనుకచూపుకాదు. కాని అక్కడక్కడ సబ్జెక్ట్ విజమ్‌లోకి, మెటాఫిజికల్ ప్రవృత్తిలోకి జారిన లక్షణాలు కనబడతాయి. వాటిని వొదిలించుకొని వెలుపలకువస్తే ఈ కవి ఇంకా శక్తివంతంగా కవిత్వం చెప్పగలరని ఇందులోని ఖండికలు, ఖండికలలో ఉపయోగించిన కవిత్వ భాష చెప్తున్నై. ఇప్పటి తరంలో కవిత్వం పలుకుతున్న వచన కవులలో ఈ కవి నిస్సందేహంగా ముందువరుసలో ఉంటారు.

విప్లవయాగం

[కేశబోయిన కాశీనాథ్, వెల రు. 6/-లు ప్రతులకు : కాశీబాయ్. కే. హెచ్. నెం. 2-8-118, వడ్డేపల్లి (పోస్టు) 506 3`0. వరంగల్ జిల్లా]

ఇది వచన కవితా సంకలనం కవి దృక్పథం విప్లవం. విప్లవం ఒక యాగంలాంటిది. సంపూర్ణ విప్లవానంతరం ఏర్పడే వ్యవస్థే యాగఫలం ఈకవికి తన కవిత్వంమీద ధాని పద్ధతిమీద గొప్ప విశ్వాసముంది. తన కవిత వింటే ఖగోళాలు కంపిస్తాయని, కంచు కంఠాలు కంగారెత్తుతాయని చెబుతూ-

"సమతా యజ్ఞపు అగ్నిశిఖలు
నా కవితలు
సనాతనపు కట్టుబాట్లను కాలరాచే
ఉక్కుబూట్లు-నా కవితలు
అవివేకపు తిమిరంలో
తిమ్మిరెక్కిన అరాచకంపై
కత్తిపోట్లు-నా కవితలు"

తన కవిత్వ తీవ్రతను, లక్ష్యాన్ని వివరిస్తున్నాడీ కవి.

ఈ సంఘంలో ఏ లోపమూకూడా ఉత్త సంస్కరణవాదంవల్ల, నైతిక బోధలవల్ల మారదని చాలామంది గ్రహించారు. ఈ కవీ అదే అంటున్నాడు. ఈ యుగపు పిడికెళ్ళు అనే గేయంలో రావలసిన సామాజిక సాయుధ విప్లవ పోరాటాన్ని ధ్వనింపచేశాడు

"నావి
పిచ్చిచూపులు కావు
సమాజపు సమగ్ర చిత్రాలకై ...
ఎక్స్‌రేలు తీస్తున్నాయి
ఇంతవరకూ అందిన రిపోర్టుల ప్రకారం
వినూత్న చికిత్స చెయ్యాలి
బాంబర్లు, బందూకులు, గ్రెనేడ్లు
సమకూర్చుకుంటున్నాను"

అనటంలో తన కవిత్వదృష్టి అర్థం అవుతోంది. క్రియ ప్రతిక్రియ అనేవి విజ్ఞాన శాస్త్ర పారిభాషిక పదాలు అట్లాగే హింస, ప్రతిహింస అనేవి జీవితానికిచెందిన పారిభాషిక పదాలు ఏకాలపు సీతైనా దుర్మార్గాన్ని, దౌర్జన్యాన్ని, దోపిడీని అణచటమేకదా! హింసను హింసతోనే ఎదుర్కోవాలనే వాదం భారతకాలం నాటి నుంచీ ఉన్నదే బలవంతుడు పెట్టే హింసకి ఆధునిక పెట్టుబడిదారి సమాజంలో సాక్ష్యంఉండదు బలహీనులు తిరగబడితే మాత్రం తుపాకీగొట్టాలు, ఉరికంబాలు నోళ్ళుతెరుస్తాయి ఇదీ మన వ్యవస్థ.

"ఎన్నితరాలు
ఈ రాక్షసుల కోరల్లో నలిగి
చితికిన ఎముకలుగ వెలికిరాలి
శిలాజాలై కాలపు పొరల్లో
ఖైదైనా ...
మూలుగుతున్నాయో చూడండి"

"నేస్తమా!
నీ గుండెపై చేయివేసి చెప్పు
రక్తం త్రాగే
క్రూరుల కుత్తుకల నుత్తరిస్తే
రక్తపాత మెలా అవుతుంది"

ఈ ప్రశ్నకు సమాధానం ఏ ప్రభుత్వం ఇస్తుంది. ఈ కవిలో సామాజికవేదన తను రాసిన ప్రతి గేయంలోనూ కనబడుతుంది. అది ఉత్త అరుపుగానో, ఒక పార్టీ నినాదంగానో ఒక మానిఫెస్టోగానో కాకుండా చెక్కిన కవిత్వంగా రూపం పొందింది.

కవిత్వ రంగంలో అడుగుపెట్టే ప్రతివాడిపైన ఎవరో ఒక కవి ప్రభావం ఉండకపోదు. ఉండటం తప్పుకాదుకూడా. అయితే ఆ ప్రభావం కవి ప్రతిభకు దారితియ్యాలిగాని ఉత్త ఇమిటేషన్‌గా మిగిలిపోకూడదు కవి తన సొంత కాళ్ళమీద బతకాలంటే ప్రభావం అనే ఊబిలోంచి బయటపడటం మంచిది. అవతలవాడు "ఎంత గొప్పకవి అయినా నువ్వు వాడివి కావటానికి ప్రయత్నించకు" అని వెనక ఎవరో పెద్దలన్నారు

"నా కళ్ళు
పెరికి-కైమాచేసి
ఒక్కొక్క
సూక్ష్మశకలాన్ని
ఇళ్ళలోకి, వీధుల్లోకి
ఆకాశంలోకి, అరణ్యంలోకి
అర్ణవంలోకి
విశ్వపు అంచుల్లోకి
విసిరేశాను"

లాంటి పాదాలు స్పష్టంగా శేషేంద్రశర్మగారికి ప్రతిధ్వనులని కవిత్వం చదివిన వాడు ఎవరైనా గ్రహిస్తారు ధ్వని ఉత్తమలక్షణం ప్రతిధ్వనిగా ఉండటం ఎదిగే కవికి ఎంతమాత్రం క్షేమంకాదు.

కావ్యమాల (స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత)

[సంపాదకుడు: దేవులపల్లి రామానుజారావు, వెల: రు. 25/-లు ప్రతులకు: సాహిత్య అకాడమీ, ప్రధానకార్యాలయం. రవీంద్రభవన్, న్యూఢిల్లీ-110 001.]

తరాలమధ్య అంతరాన్ని గుర్తిస్తూ, గుర్తింపచేస్తూ సంకలించిన గ్రంథం ఇది. సంప్రదాయక కవిత్వం, ఆధునిక కవిత్వంలోని రకరకాల ధోరణులకు ఈ సంకలనం ప్రతిబింబం. భావ, అభ్యుదయ, దిగంబర, విప్లవ కవితోద్యమాల స్వభావాలను ప్రదర్శించే భిన్న భిన్న కవితలు ఇందులో చోటుచేసుకున్నాయి. "కేంద్ర సాహిత్యఅకాడమీవారి కోరికననుసరించి చేసిన కవితాసంకలనంలో సాధ్యమైనంతవరకూ, అన్నిరీతులకు, మార్గములకు, ధోరణులకు సంబంధించిన కవులకు ప్రాతినిధ్యమిచ్చుటకు ప్రయత్నము జరిగినది." అని సంపాదకులు తొలి పలుకులలో పేర్కొన్నారు

కొంతమంది కవులు తమ కవిత్వాలను చేర్చుటకు అంగీకరించలేదని చెప్పారు. ఇట్లాంటి సంకలనాలు చేసేటప్పుడు సంకలనకర్తలు ముందుగా కవులను ఎంచుకొని తరువాత ఆ కవుల ఏ ఖండికలు వారిమార్గాన్ని శక్తివంతంగా ప్రతిబింబిస్తాయో వాటిని సంకలనంలో చేర్చాలి. ఉదాహరణకు శ్రీశ్రీ ఖడ్గసృష్టి శరచ్చంద్రిక గేయాలను తీసుకుంటే 1947 తరువాత 77 వరకూ శ్రీశ్రీ భావ ధోరణిలో వచ్చిన మార్పును తీవ్రంగా సూచించే ఖండికలు చాలా ఉన్నాయి. గుణదృష్ట్యా కూడా పై రెండుఖండికల కంటె అవి తీసిపోవు. అట్లాగే గుత్తికొండ సుబ్బారావుగారిని కవిగా గుర్తించిన కేంద్ర సాహిత్య అకాడమీ సంకలనం

అద్దేపల్లి రామమోహనరావును ఎందుకు వదిలేసిందో తెలియదు. ఇవన్నీ చిన్న చిన్న లోపాలు. ఏ సంకలనమైనా మనం ఆశించినంత పరిపూర్ణంగా రాదు. లోపాలువెతకటం తేలిక; పనిచెయ్యటం కష్టం. రామమోహనరావుగారు సంపాదకుడుగా ఈతరం ఆలోచనలను, ధోరణులను స్వీకరించి కొంతవరకైనా ఈ సంకలనానికి సమగ్రతను తెచ్చారు.

శ్రీశ్రీ వ్యాసాలు (1970-83)

[కూర్పు: చలసాని ప్రసాద్, వెల: రు. 15/-లు ప్రతులకు: 1) సి. ఎస్ ఆర్ ప్రసాద్: 108 శ్రీనగర్‌కాలనీ, గుంటూరు-522 006. 2) సృజన వరంగల్-506 001.]

"1980 దాకా తెలుగుకవిత్వం నన్ను నడిపింది. 1980 తరువాత తెలుగు కవిత్వాన్ని నేను నడిపాను. ఈ శతాబ్దం నాది" అని సాధికారంగా ప్రకటించాడు శ్రీశ్రీ మహాప్రస్థానం తరువాత శ్రీశ్రీ ఏం రాశాడు? అని చప్పరించేవాళ్ళు లేకపోలేదు. శ్రీశ్రీ అంటే ఒక్క మహాప్రస్థానమే కాదని అతని సాహిత్య సంపుటాలు ఋజువుచేశాయి. (1970లో వచ్చిన ఆరుసంపుటాలు) 1970 తెలుగు సాహిత్యరంగంలో ఒక ఒంతగుర్తు. వి.ర సం. ఏర్పడిన సంవత్సరంకూడా అదే. అ.ర.సం నుంచి శ్రీశ్రీ ప్రభృతులు వెలుపలకువచ్చి వి.ర.సం ఆవిర్భావానికి నైతికంగా మద్దతును ప్రకటించింది ఆ సంవత్సరమే. శ్రీశ్రీమీద సాటికవులు అభ్యుదయ సాహిత్యవాదుల విసుర్లు 1965లో వచ్చిన దిగంబరకవితోద్యమం నాటినుంచీ ఉన్నవే. "ఇప్పుడు జరుగుతున్న అసలు దాడి దిగంబర కవులమీదనే కాదు. వాళ్ళని వెనకేసుకొస్తున్న వాళ్ళ రచనలను ఇంగ్లీషులోకి తర్జుమాచేస్తున్న నామీద "కాని అసందర్భ ప్రలాపాలు కారుకూతలు, నాలో సామాజిక మర్యాదలు ఏనాడో ఇగిరిపోయాయి" శుభం ఇంకా మీరు పార్లమెంటరీ మర్యాదలనే పట్టుకు పాకులాడండి. కాంగ్రెస్‌ద్వారా సామ్యవాదం వస్తుందనే మీకు కత్తిద్వారానే కమ్యూనిజం వస్తుందనే నాకూ రాజీఅనేది కుదరదు" అని శ్రీశ్రీ అభ్యుదయ శకానంతరం 1970లో చెప్పాడు. శ్రీశ్రీ దిగంబరులను వెనకేసుకొచ్చినా వి ర.సం లో జేరినా అతనిపై ఎవరి దౌర్జన్యమూలేదు; ఆర్భాటమూ లేదు. శ్రీశ్రీ మానసికంగా బలహీనుడని, ఎవరు దబాయిస్తే వారివైపు మొగ్గుతాడని పసిగట్టు కొని ప్రచారంచేసినవాళ్ళున్నారు

ఈ వ్యాస సంకలనం శ్రీశ్రీ మనస్తత్వాన్ని మొత్తంగా మనముందుంచుతుంది కూర్పరియైన చలసాని ప్రసాద్‌గారు ఈ సంకలనం విషయంలో తీసుకొన్న శ్రద్ధ అట్లాంటిది. అయితే అయనవేసిన తప్పటడుగల్లా ఒక్కటే ఝుంఝుం మలికూర్పుని గురించి చలసాని ప్రసాద్‌గారు ఇచ్చిన వివరణ "వి.ర.సం ప్రచురించిన కవితా సంకలనం ఝుం ఝుం. సంపాదకుడు కె. వి. రమణా రెడ్డిగారు. 1970 అక్టోబరులో ఖమ్మంలో వి.ర.సం మొదటిమహాసభల నాటికి అచ్చయింది. కొన్ని నెలల్లోనే రెండోముద్రణకూడా వెలువడింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధించింది తెలుగుదేశం ప్రభుత్వం వచ్చినా ఇంకా నిషేధం తొలగించలేదు." ఇది ప్రసాద్‌గారి పెద్ద భ్రమ. కాంగ్రెస్ కంటె తెలుగుదేశం ఎట్లా భిన్నమైందో నాకర్థంకావటంలేదు.

ఈ పుస్తకంలో శ్రీశ్రీ వ్యాసాలు, ముందు మాటలు, ఉత్తరాలు, ఇంటర్వ్యూలు ఉన్నాయి. ఇవన్నీ చాలాభాగం 1970 నుంచీ రాసినవే. శ్రీశ్రీ వ్యక్తిత్వంలో కొంత విదూషకధోరణి ఉందని అయన్ను బాగా తెలిసినవారంటారు. శ్రీశ్రీయే తన్నుగురించి తను ఆమాట అనిఉన్నాడు. ఎమర్జెన్సీకాలంలో శ్రీశ్రీ తనుచేసిన పొరపాట్లకు తాను సంజాయిషీ ఇచ్చుకున్నరీతిలో ఒకనిజాయితీ ఉంది." అత్యవసరపరిస్థితి కాలంలో వి.ర సం సభ్యులుచూపిన ధైర్యసాహసాలను మనసారా అభినందిస్తూ ఆదేసమయంలో నా రాజకీయ అవగాహన లోపంవల్లే నేను చేసిన పొరపాట్లకు విచారిస్తున్నాను. నేను ఆరోజుల్లో ఇందిరా పాలనను వామపక్ష నియంతృత్వంగా భ్రమించాను. ఇదో గొప్ప పొరపాటని ఇప్పుడు ఏ మినహాయింపులు లేకుండా ఒప్పుకుంటున్నాను. ఆర్థిక కారణాలవల్ల 20 పాయింట్లమీద ఆకాశవాణికి సినిమాపాట రాసినట్టే రాశాను. 20 పాయింట్లవల్ల పీడితవర్గానికి మేలుజరుగుతుందనికూడా భ్రమించాను" అని ఆయన వివరణ ఇచ్చారు.

భావకవిత్వంనుంచి, అభ్యుదయ కవిత్వంనుంచి విప్లవ సాహిత్యందాకా శ్రీశ్రీ కాలంతోపాటు ఎదిగాడు. ముందుచూపేకాని వెనుకచూపు ఎరుగడు. అభిప్రాయభేదాలు వచ్చింతరువాత అంతకుముందు ఎవరైతే ఆయనను యుగకవి అని అన్నారో వారే అతీరాన్నుంచి ఆయనను తొలగించాలని ప్రయత్నం చేశారు శ్రీశ్రీ కంటె నారాయణబాబు గొప్ప కవి అని ఋజువుచెయ్యటానికి విఫలయత్నాలుచేశారు. శ్రీశ్రీలో ఉన్న లోపాలన్నీ ఒక్కసారిగా వారికప్పుడే గుర్తొచ్చాయి. ఈ తర్క వితర్కాలు ఈనాటికీ ఇంకా కొన్ని పత్రికల్లో జరుగుతూనేఉన్నై. సాహిత్యంలోనూ, రాజకీయంలోనూ తన దారిని శ్రీశ్రీ స్పష్టంగా చెప్తేఉన్నాడు రథం కాని జోకొట్టాలనీ, అలల్ని అరికట్టాలనీ, గాలిని ఉరితియ్యాలనీ ఇదివరకెన్నో ప్రయత్నాలు జరిగాయి ఇకముందుకూడా జరుగుతాయి. కాని అవి ఎన్నడూ ఫలించలేదు. ఇకముందు కూడా ఫలించబోవు. వి ర సానిది వచ్చేకాలం. వి ర.సం విరోధులది పోయేకాలం. వి.ర సం రేపటి సంగతులకు ఇవాళే ఆలోచించే సంస్థ ఇది భవిష్యత్తును తీర్చిదిద్దేబాట గ్రహచారం మీద ఆధారపడేదికాదు. ఇది మార్క్సిస్టు దర్శనానికి సిద్ధమై గతితార్కికపు భౌతిక వాదపు వెలుతురులో సామాజిక పరిణామాన్ని సందర్శిస్తుంది" అట్టి సామాజిక పరిణామానికే శ్రీశ్రీ రచనలు అన్నీ అంకితమైనై.

సంస్థ గొప్పదా? వ్యక్తి గొప్పవాడా-అంటే నిస్సందేహంగా వ్యక్తికంటె సంస్థలే గొప్పవి. అయితే యిక్కడ ఒకమాటచెప్పాలి. శ్రీశ్రీ ఉన్నా లేకపోయినా వి.ర.సం వి.ర.సమే అట్లాగే వి.ర.సం అనే సంస్థ ఎట్లాఉన్నా శ్రీశ్రీ శ్రీశ్రీయే.

నా శాశ్వత చిరునామా వి.ర సం అని శ్రీశ్రీయే చెప్పాడు. అది అతని దృక్పథం వి.ర.సం లో లేని అనేకమందికి శ్రీశ్రీ ఆరాధ్యుడయ్యాడు. శ్రీశ్రీ కవిత్వం, సాహిత్యం అందరిదీను. శ్రీశ్రీ కవిత్వం తదితర రచనలు తెలుగు ప్రపంచానికి మొత్తానికి చెందినవి. పెత్తనాలతోనూ, అసూయలతోనూ అంతమయ్యే ప్రాభవంకాదు శ్రీశ్రీది. ఈ పుస్తకాన్ని అందించి తెలుగు పాఠకులకు మహోపకారం చేసింది వి ర.సం. అందుకు సాహిత్యాభిమానులు, మార్పునుకోరేవారు అందరూ హర్షించవలసిందే.

టి. ఎల్. కాంతారావు

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd, by S. Radhakrishna at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna, Vijayawada. Phone: 75667 & 61247.